సంపుటి: 35
సంచిక: 2

ఫోన్ నెం.
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

సెప్టెంబరు, 1982

Kattukolu Subba Reddy
Home Library, Pedacgirala.

మేనేజింగ్ ఎడిటర్:
[illegible]య్య దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
నండూరి శైలజ

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
ఏ. వీ. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

అపరాధ పరిశోధన పోటీ-168

[ఫలితాలు]

జూలై '82 నెల "అపరాధ పరిశోధన పోటీ — 168"కి సరియైన సమాధానాలు:

1. పూలన్ దేవి 2. యు.డి.ఎఫ్ 3. తేలు 4. నగలు 5. మరణం.

ఆల్ కరెక్టుగా పంపిన పాఠకులు:

(1) శ్రీ డి. కృష్ణారావు క్లర్కు, ఆంధ్రా బ్యాంకు, విజయనగరం-531 202.

(2) శ్రీ వై. సూర్యనారాయణ మూర్తి, 9-6 సీతారాంపురం, మిర్యాలగూడెం (నల్లగొండజిల్లా).

(3) శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు, పోస్టు-గడ్డలుప్పి, తాలూకా-బొబ్బిలి (విజయనగరం జిల్లా).

(4) శ్రీ ఎమ్. హరినాథ్, సి-23, ఊకుల బస్తీ, బెల్లంపల్లి-504 251.

(5) శ్రీ ఎల్. మల్లేశ్వరరావు. 9-5-90, దేవునితోట వీధి, నర్సాపూర్-534 275 (ప.గో. జిల్లా).

(6) శ్రీ కె. రాంప్రసాద్, 49-37-15/బి, ఎన్జీఓల కాలనీ, అక్కయ్యపాలెం, విశాఖపట్టణం-530 016.

(7) శ్రీమతి వి. విజయలక్ష్మి, 1-10-122/ఏ/1/ఏ, అశోక్ నగర్, హైదరాబాదు-500 020.

(8) శ్రీమతి టి. సరస్వతీబాయి, c/o టి. ఎస్. శంకరరావు, జర్నలిస్టు, సౌకార్ పేట, పామిడి-515 775(అనంతపురం జిల్లా)

(9) శ్రీమతి వై. లలిత, c/o వై. ఆర్. స్వామి, ఆంధ్రా బ్యాంకు, ద్వారకా నగర్, విశాఖపట్టణం-530 016.

(10) కుమారి వి. మాధవి, c/o సూర్యనారాయణ, దక్షిణ వీధి, ఏలూరు-534 001.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. అన్నపూర్ణమ్మ హస్తం—జొన్నలగడ్డ రామలక్ష్మి
18. కుక్కల గొడుగుల్ని తినకు—అజీజ్
40. మాయమైన దేవత కళ్ళు—ఎమ్.వి.వి. సత్యనారాయణ
56. లాయరు సలహా—వసుంధర
69. మృత్యుతార—(సీరియల్)—గిరిజ శ్రీ భగవాన్
92. ఉరి పోసుకున్న మనిషి—తిప్పరాజు పద్మజ
106. ఆస్తి కోసం అడ్డదారి—సికిందర్
129. సర్వసౌభ్రాతృత్వం—బి. రాజేశ్వరి
138. అద్దుగీతా - భగవద్గీత—భమిడిపాటి భాస్కర రామారావు
157. నేరం ఒకరిది-శిక్ష ఒకరిది—ఎమ్ వి.వి సత్యనారాయణ
173. కాంచన గ్రహం—(సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. సితార న్యాయం—ఇమంది రామారావు
45. అర్థరాత్రి—టెంపోరావు
76. ఎంతో మంచి హంతకుడు—వసుంధర
115. నడిచిన పాదాలు నాలుగు—సికిందర్
165. రక్తపు ఉేర్లు—(సీరియల్)—వసుంధర.

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

జొన్నలగడ్డ రామలక్ష్మి

అన్నపూర్ణమ్మ హస్తం



ఏ చేతినైనా మరచిపోగలను కానీ ఆ చేతిని మరచిపోలేను నేను. అది అన్నపూర్ణమ్మ చేయి.

చిన్నప్పుడు నా తలిదండ్రులు అన్నపూర్ణమ్మ పక్కింట్లోనే వుండేవారు. నాకు పదేళ్ళప్పుడు అమ్మపోయింది. ఆర్నెల్లు తిరక్కుండా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు.

అప్పుడు నా కష్టాలు ప్రారంభమయ్యాయి. ఏ పూటా సరైన తిండి దొరికేది కాదు. వయసుకు మించిన పని చేయాల్సొచ్చేది.

తన యింటి గొడవలు మాత్రమే చూసుకుంటే అన్నపూర్ణమ్మ అన్నపూర్ణమ్మ ఎందుకవుతుంది? ఆవిడ నా కష్టాలు గమనించి ఏదో సమయంలో తన యింటికి పిలిచి యెవరికీ తెలియకుండా అన్నం పెట్టేది. కన్నబిడ్డలతో సమంగా లాలించేది.

పెళ్ళయిన ఏడాదికి నా కర్మానికి నన్ను వదిలిపెట్టి నాన్న, పిన్ని అదృశ్యమయ్యారు. అప్పుడు అన్నపూర్ణమ్మ నన్ను తన యింట వుంచుకుంది. నేను నలుగురిళ్ళలో పనిచేసి బ్రతుకుతానంటే "మా యింట్లో పని చాలా ఎక్కువ. అదంతా చేశాక తీరుబడుంటే వేరే ఇళ్ళలో కుదురుదువు గానిలే" అంది నవ్వుతూ.

నేను స్కూలుకు వెళ్ళి చదువుకున్నాను. ఆ యింట్లో ఒకరిలా మసిలాను. ఉత్సాహంగా జీవించాను. ఆఖరికావిడ చేతిచలువతోనే నా వివాహం కూడా జరిగిపోయింది. వివాహమైనపుడు—ఆ సంతోషం కంటె ఆవిణ్ణి విడిచి వెళ్ళాలన్న బాధ ఎక్కువగా కలిగింది నాకు.

అన్నపూర్ణమ్మ ఆగర్భశ్రీమంతురాలుకాదు. అయితే దాని గుణానికీ, డబ్బుకీ సంబంధం లేదని కర్ణుడేనాడో ఋజువు చేశాడు. తనకున్నదాంట్లో పదిమందిని ఆదరించగలగడానికీ, తనకున్నది పదిమందితో పంచుకునేందుకూ అవసరమైన విశాలహృదయం ఆవిడకుంది. అందుకే ఆవిడ యింట బీదా బిక్కా భోజనాలు చేయడం ప్రతిరోజూ జరుగుతూనే వుంటుంది. ధనరూపేణా, వస్త్రరూపేణా ఎందరో పేద విద్యార్థులకు సహాయం జరుగుతూంటుంది. ఈ కారణంగా

ఆవిడ సిరులు తగ్గిపోనూలేదు. కీర్తి పెరిగిపోనూలేదు.

వివాహమై వెళ్ళిపోతున్నప్పుడు ఆశీర్వదిస్తున్న ఆవిడ చేతివంకనే చూస్తున్నాను. పచ్చటి పసిమిఛాయలో కలిసిపోయిన పన్నెండు బంగారు గాజులు-దిష్టిచుక్క అనదగ్గ నల్లటి పొడవాటి పుట్టుమచ్చ-మూడువేళ్ళకి వుంగరాలు-ఓ ఉంగరానికి నీలపురాయి, మరో ఉంగరంమీద వెంకటేశ్వరుడు, మరో ఉంగరంమీద లక్ష్మీదేవి.

నేను చటుక్కున ఆ చేతిని పట్టుకుని "ఈ చేతిని వదలలేను" అన్నాను.

"పోనీ-పట్టుకుపో" అందావిడ.

"అయితే మీరు నాతో వస్తారా?" అన్నాను.

"నీతో వస్తే ఇక్కడిదంతా ఎలా? కావాలంటే ఆ చేయి పట్టుకుపో" అందావిడ నవ్వుతూ.

నా కేడుపు వచ్చేసింది—"ఇంత మాటంటారా? మీ శరీరం నుంచి భాగాలు వేరుచేసి పట్టుకుపోయేటంత దుర్మార్గురాలిననుకుంటున్నారా?" అన్నాను.

"పిచ్చిపిల్లా—ఎందుకే ఏడుస్తావు? నేనేం తప్పు అనలేదు. ఈ చేతికున్న బంగారుగాజులూ, ఉంగరాలూ—పట్టుకుపొమ్మని అంటున్నాను-అదీ నా మాటల కర్థం—" అందావిడ.

"పొరపాటున కూడా అలాంటి మాటలు అనవద్దు. మీ శరీరం నుంచి ఆ చేయి ఎలా విడిపోదో-అలాగే ఈ ఆభరణాలూ ఆ చేతిని విడిపోవు" అన్నాను.

అన్నపూర్ణమ్మ నవ్వుతూనే "సరేలే-నా వళ్ళెలాగూ లావెక్కింది. ఇప్పుడీ గాజులూ అవీ తీయాలన్నా ఏ కంసాలో రావాల్సిందే-నీ కోరికే తీరేలాగుంది. పోనీ ఈ గూటిలోంచి జీవుడెగిరిపోయాకనైనా ఈ చేయి నీ స్వంతం

చేసుకో. ఈ చేయి ఎంతమందికి సాయపడినా నీకులా ప్రత్యేకంగా దీనిమీదే మోజుపడ్డవాళ్ళు ఎందరో లేరు" అంది.

"అలాగనవద్దు. ఈ దేహాలు అశాశ్వతం కావచ్చు. కానీ కొన్ని నిజాల గురించి ఆలోచించడం నా కిష్ట ముండదు" అన్నాను.

నా భర్త పేరు సత్యం. పట్నంలో సంతలో కూరగాయ లమ్ముతాడు. వచ్చే డబ్బు కుటుంబం గడపడానికి సరి పోతుంది. అతడికి నేనంటే చాలా ఇష్టం. చాలాసార్లు "ఆ అన్నపూర్ణమ్మ చెయ్యి తేరాదూ-నేను కూరగాయల కొట్టును బట్టల కొట్టుగా మార్చి నిన్ను నగలలో ముంచెత్తేస్తాను" అనేవాడు.

"మనింట్లో వెలుతురుకోసం సూర్యుణ్ణి తెచ్చిపెట్టుకుంటే ప్రపంచమంతా చీకటైపోతుంది. ఇలాంటి పిచ్చి ఆలోచన్లు పెట్టుకోకు" అన్నానతడితో.

"ఈ సినిమా లొచ్చాక అందరికీ డైలాగులు చెప్పడం బాగా అలవాటయింది" అన్నాడు సత్యం నవ్వుతూ.

అయితే సత్యం వ్యాపారంలో పైకి రావడానికి కృషి చేస్తూనే వున్నాడు. అతడికి పట్టుదల వుంది. కృషి ఉంది. సామర్థ్యముంది.

ఓసారి వెయ్యిరూపాయలు అవసరపడితే నేనే వెళ్ళి అన్నపూర్ణమ్మ దగ్గర్నుంచి తెచ్చి-ఆ తర్వాత ఆవిడ వద్దంటున్నా ఆ బాకీ తీర్చేశాను.

ఆవిడ ఎంతగానో నొచ్చుకుని "నువ్వు పరాయిదాని వనుకుంటున్నావా-లేని పక్షంలో నా బిడ్డ నాకు అప్పు తీరుస్తుందా?" అంది.

"అది కాదమ్మా-మీ కున్న విశాలహృదయం నాకు

లేదు. ఈ డబ్బు మీ దగ్గరుంటే ఎందరో దీన జనుల కుపయోగపడుతుంది. నేను మీకు అప్పు తీర్చగలను కానీ నాకు నేనై ఈ డబ్బును ఇతరుల గురించి ఖర్చు చేయలేను" అన్నాను.

అయిష్టంగానే ఆవిడ డబ్బునందుకుంది. కానీ నేను గమనించేది ఆవిడ చేతినే! సృష్టికే మహాద్భుతమనిపించే ఆ చేయి నాలో ఎన్నో అమృతభావాలు కలిగిస్తూంటుంది.

2

మా వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మా మకాం హైదరాబాదుకు మారిపోయింది. నా కిప్పుడు ఇద్దరు పిల్లలు. వాళ్ళ నప్పుడే స్కూళ్ళలో వేయడం కూడా జరిగింది.

అన్నపూర్ణమ్మను తరచుగా కలుసుకోవడం కుదరడం లేదు. నా పిల్లలిద్దరికీ ఆ చల్లని చేతితో దీవెనలు సంపాదించాను.

నా కావిడ ఒక్కతే! కానీ ఆవిడకు నా లాగ ఎందరో- అనుకుని ఆవిడ ఉత్తరాలనాట్టే రాయదు. ఇప్పుడు ఏడాదికొకసారి కూడా ఆవిణ్ణి కలుసుకోవడం కుదరదు. అలాగని నేను ఎవర్నీ కలవడం లేదనడానికీ లేదు. వ్యాపారం రీత్యానూ, ఇతరత్రానూ నాకూ స్నేహాలు పెరిగాయి.

ఆ రోజు బస్సులో నేను చేస్తున్న ప్రయాణం కేవలం స్నేహరీత్యా చేస్తున్నదే-నా స్నేహితురాలి చెల్లెలి పెళ్ళి! వాళ్ళిద్దరూ నాకు బాగా పరిచయస్థులు. పెళ్ళికి వెళ్ళి తీరాలి. స్కూల్లో పిల్లలకు పరీక్షలు. సత్యానికి వ్యాపారం పనులు. వాళ్ళకెవ్వరికీ రావడానికి కుదరదు. తీరుబడిగా ఉన్నదాన్ని నేను మాత్రమే కనబడుతున్నాను.

అందుకని నేను బయల్దేరాను.

ఇటీవల దొంగతనాలు ఎక్కువైపోయాయి. ఉన్న బంగారం వేసుకుందుకు లేకపోతోంది. నేను చేతులకు రెండే రెండు బంగారుగాజు లుంచుకున్నాను. మెడలో మంగళ సూత్రాలు కాక ఒక్కటంటే ఒక్క గొలుసు వేసుకున్నాను. వెళ్ళేది పెళ్ళికి కాకపోతే ప్రయాణాల్లో ఆ మాత్రం కూడా వేసుకోకపోదును. మంచి చీరలు నాలుగు బ్యాగులో సర్దుకున్నాను. రైలెక్కాను.

ఈ ప్రయాణం అంత చిన్నదేం కాదు. రైల్లో బెజవాడ చేరుకుని-అక్కణ్ణించి బస్సులో ఆరుగంటలు ప్రయాణం చేయాలి. బెజవాడలో నాకు చుట్టాలెవరూ లేరు. కానీ ఇక్కడే బస్సెక్కి మరో రూట్లో వెడితే అన్నపూర్ణమ్మనూ చూడొచ్చు. కానీ మరో రెండ్రోజులు పిల్లల్ని వదిలి వుండాలంటే కుదిరేది కాదు.

బస్సు టైముకే బయల్దేరింది.

బస్సులో నా పక్కన ఓ ముసలాయన కూర్చున్నాడు. ఆయన నా గురించి ఆరాలన్నీ తీశాడు—"ప్రపంచం ముందుకు పోతోంది, ముందుకు పోతోంది అంటున్నారు కానీ-ఇంకా ఆడవాళ్ళు ఒంటరిగా ప్రయాణం చేసే స్థితికి మనుషులు ఎదగలేదు" అన్నాడాయన. నేనిలా ఒంటిరిగా బయల్దేరడం ఆయనకు బొత్తిగా నచ్చలేదు.

"స్నేహితురాలి కెలాగో నచ్చజెప్పుకోవచ్చు. ఈ రోజుల్లో అయినవాళ్ళ పెళ్ళిళ్ళకే వెళ్ళడంలేదు. నీ భర్తనీ, బిడ్డల్ని వదిలి ఇలా బయల్దేరడం నాకు నచ్చలేదు. పెళ్ళికి వెడితే ఏం చేస్తారు? అంతా హడావుడి. ఏదో మాటవరసకు పలకరింపులే కానీ మాట్లాడుకుందు కూడా వీలుండదు. ఇంతకంటే దగ్గర బంధువుల్నోసారి చూసిరావడం మంచిది. తీరుబడుంటే అలాంటి పనులకి ఉపయోగించుకోవాలి.

అందువల్ల బంధుత్వాలు స్థిరపడతాయి. మనకీ, వారికీ కూడా మనోల్లాసంగా వుంటుంది. మా తరం అయిపోయింది. మీ తరం కూడా మాకులాగే గడిచిపోవాలా?"

నాకు చెళ్ళున తగిలినట్లయింది. అవును-స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళి ఏం చేస్తాను. కొన్ని ప్రెజంటేషన్ వాళ్ళ చేతుల్లో పెట్టి ఆ హడావుడిలో కలిసిపోయి ఓ పూట భోజనం చేసి తిరుగు ప్రయాణం అవుతాను. అంతేగా!

కానీ అన్నపూర్ణమ్మను చూడ్డానికి నాకు తీరుబడి అవడంలేదు.

నా అవసరం తీరిపోయింది కాబట్టి ఆవిణ్ణి నిర్లక్ష్యం చేస్తున్నానా?

ఆవిడంటే నాకు గౌరవముంది. అది ఎన్నటికీ పోదు. అలాగని ఏడాదికో పదిసార్లు ఆవిడ ఇంటి చుట్టూ తిరిగితే అది అభిమానమనిపించుకుంటుందా?

నాకు ముసలాయనంటే చిరాకువేసింది. ఇంకా ఏదో ఆలోచిస్తూండగా ఎవరో నా భుజాల్ని తాకినట్లయింది. చాలా స్పష్టంగా ఆ స్పర్శ తెలిసింది. మెడకీ, భుజానికీ మధ్య ఏ ఆచ్ఛాదనా లేనిచోట రెండువేళ్ళు నిమిరినట్లయింది.

ఉలిక్కిపడ్డాను. అప్రయత్నంగా ముసలాయన్ని చూశాను. ఆయన సీటుపైన కమ్మీమీద చేయి చాచి ఉన్నాడు. ఆయన ముఖం చూస్తూంటే అలాంటి బుద్ధి ఉన్న వాడనిపించలేదు.

మరెవరై ఉంటారు?

కమ్మీకి, సీటుకూ మధ్య చిన్నకాళీ వుంది. ఆ కాళీ లోంచి వెనకసీట్లో వారెవరైనా....! సందేహం తీర్చు కుందుకు వెనక్కి చూశాను,

సరిగ్గా నాకు వెనకసీట్లో ఒకడున్నాడు. వాడు అప్పుడే బస్ టాప్‌కేసి చూస్తున్నాడు. నాకు వాడిమీద అనుమానం కలిగింది.

వెధవపని చేసినవాళ్ళే అలా హఠాత్తుగా చూపులు మార్చుతారు. ఈ అనుభవం నాకేమీ కొత్తకాదు. చాలా సంవత్సరాలుగా పట్నాల్లో అనుభవిస్తున్నదే.

మొదట్లో వళ్ళంతా కంపరమెత్తినట్లుండేది. అవతలి వాణ్ణి పట్టుకుని సాచి లెంపకాయ కొట్టాలనిపించేది. క్రమంగా అది మామూలై పోయింది. సాధ్యమైనంత వరకూ అలాంటివాళ్ళకు దూరంగా వుండడం, లేనిపక్షంలో పట్టించుకోకుండా ఊరుకోవడం.

ఒకోసారి ఇంకా నాలో ఆకర్షణ ఉందా అనిపిస్తూంటుంది. అయినా వళ్ళు బలిసిన వెధవలకు ఆకర్షణ ఏమిటీ అనీ అనిపిస్తుంది. మూడ్ బాగోలేనప్పుడు వాళ్ళను చంపాలన్నంత కసి వుంటుంది. మొత్తంమీద ఏమీ జరుగదు.

వాడిని ఎలాగైనా పట్టుకుని అల్లరి చేయాలని అనిపించింది. నేను వాడిని కొస్త పరీక్షించి చూశాను ఓరగా. చూడ్డానికి పెద్దమనిషిలాగే వున్నాడు. అయినా ముఖం చూసి మంచి చెడ్డలు బేరీజు వేయగలిగే పక్షంలో ఈ ప్రపంచంలో దొంగల్ని పట్టుకోవడం కష్టమెందుకవుతుంది.

భుజంమీద చర్మం కనబడే భాగాన్ని కొంత చీర కూడా కప్పుతోంది. అది కూడా కాస్త పక్కకు తప్పించాను. ఇందువల్ల రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి—వాడి ఆకర్షణ మరికాస్త పెరగడం. రెండు—వాడి చేష్ట నాకు నచ్చిందనుకుని వాడు భ్రమపడడం. ఈ రెండూ జరిగితే వాడికి నలుగురిలోనూ అవమానం తప్పదు.

బస్సు వేగంగా పోతోంది. బహుశా అరవై కిలో

మీటర్లుంటుంధేమో!

ఓ రెండు నిముషాల అనంతరం రెండు వేళ్ళు నా భుజాన్ని మళ్ళీ నిమురుతున్నాయి. సన్నగా, సుతారంగా!

ఎవరది?

"హుం" అన్నాను చిరాగ్గా.

వేళ్ళ స్పర్శ ఆగిపోయింది.

"ఏమయిందమ్మా ..." అన్నాడు ముసలాయన.

"ఎవరో భుజంమీద చేయి వేసినట్లయింది" అన్నాను వెనుకకు అనుమానంగా చూస్తూ.

ముసలాయన చటుక్కున "భుజంమీదంటే ఎక్కడ మెడకు దగ్గరగానా-లేక దిగువగానా లేక ...." అని ఆగిపోయాడు.

"ఎక్కడైతే మీకెందుకు?" అన్నాను కోపంగా.

"అది కాదమ్మా-ఎవరైనా ఆడాళ్ళ భుజాలమీద చేతులెందుకేస్తారో-వాళ్ళు తగిలిన ప్రదేశాన్నిబట్టి ఊహించవచ్చు. మెడకు దగ్గర్లో అంటే ఏ గొలుసో కాజేయడానికయుంటుంది. అందుకని అడిగాను ...." అన్నాడాయన.

"అందుకయుండదులెండి ...." అని మనసులో అనుకుని అప్రయత్నంగా మెడ తడుముకుని ఉలిక్కిపడ్డాను. మెడలో ఉండాల్సిన గొలుసులేదు. మంగళసూత్రాల నానుతాడు మాత్రం వుంది.

"నా గొలుసు పోయింది—" అన్నాను.

గొంతు మరీ పైకి లేవలేదేమో ఆ మాటలు ఒక్క ముసలాయనకే వినిపించాయి—"ఏమిటీ?" అన్నాడాయన.

"నా గొలుసుపోయింది—" అన్నాను. ఇప్పుడు నా గొంతుక లేస్తోంది. కానీ ఆయనకు వినబడేలాగున మాత్రమే అన్నాను.

"ఎప్పుడు?"

"ఇప్పుడే!"

"బాగా చూసుకున్నావా, అంతా గుర్తుందా?"

"ఏమీ సందేహంలేదు—ఇప్పుడే పోయింది. కొద్ది క్షణాల క్రితం వరకూ మెడలోనే ఉండాలి—" అన్నాను కంగారుగా.

ముసలాయన చటుక్కున లేచి నిలబడి—"కండక్టర్—బస్సు ఆపించు—" అని అరిచాడు. ఓ క్షణంతో పెద్ద కుదుపుతో బస్సు ఆగిపోయింది.

ముసలాయన సంగతి చెప్పాడు. ముందు కండక్టరు విసుక్కున్నాడు.

"దొంగ బస్సులోనే ఉన్నాడు. అందర్నీ సోదాచేయాలి" అని ముసలాయన పట్టుబట్టాడు.

"ఇంకో రెండుమైళ్ళు పోతే రాజయ్యపాలెం వస్తుంది సార్—అక్కడ పోలీసుస్టేషను దగ్గర బస్సు ఆపుతాం. వ్యవహారం పోలీసులు చూసుకుంటారు—" అన్నాడు కండక్టర్.

అప్పుడు ముసలాయన బస్సులోని ప్రయాణీకులందర్నీ వుద్దేశించి—"మీలో ఎవరికైనా పొరపాటునైనా ఆ గొలుసు కనబడితే ఇచ్చేయండి. అప్పుడు మనకు పోలీసుల బెడద వుండదు. లేనిపక్షంలో ప్రయాణం ఆలస్యమవుతుంది...." అన్నాడు.

బస్సులో దీని గురించి యెవ్వరూ మాట్లాడలేదు. ప్రయాణీకుల మధ్య గుసగుసలు ప్రారంభమయ్యాయి. నేనో సారి ఓరగా వెనకసీటు పెద్దమనిషిని చూశాను. అతడు కంగారుగానూ, అస్థిమితంగానూ కనబడ్డాడు. నా అనుమానం దొంగ అతడేనని.

బస్సు మరో అయిదు నిముషాల్లో పోలీసుస్టేషను చేరు కుని ఆగింది.

పోలీసులు నా కేసును జాలితో అర్థం చేసుకున్నారు. ప్రయాణీకు లొక్కొక్కరినే సోదా చేయడం జరుగు తోంది. నే నొక్కర్తినీ దిగులుగా బస్సులో కూర్చు న్నాను.

నా గొలుసు దొరుకుతుందా?....ఇలా ఎప్పుడూ జరగ లేదు.

ప్రయాణీకు లందర్నీ సోదా చేయడం జరిగింది. ఎవరి దగ్గరా గొలుసు దొరకలేదు. బస్సు లోపల వున్న చిల్లరా, చితకా బ్యాగుల్నీ, బ్రీఫ్ కేసుల్నీ వెతకడం మొద లయింది.

అక్కడ సోదా జరుగుతూంటే యిక్కడ నాకు జాకె ట్లోపల ఏమిటో కదులుతున్నట్లూ, దురదగానూ అని పించింది. తడిమిచూడగా నా గొలుసు!

నాకు గుండె ఆగినంత పనయింది. ఇప్పుడు నాకు గొలుసు దొరికిన ఆనందం కలగలేదు! దీని గురించి నే నెంత హడావుడి చేశాను? ఇదే గొలుసు నా దగ్గర కాక బస్సులోని ప్రయాణీకుల వద్ద దొరికితే ఎంత బాగుండేది? ఇంత హడావుడీ చేశాక యిప్పుడిది—పొరపాటున హుక్ ఊడి జాకెట్లో పడిపోయిందంటే ఎంత అసహ్యంగా వుంటుంది? అంతా నన్ను తిట్టిపోస్తారు. నా గురించి బస్సు ప్రయాణానికూడా ఆలస్యమై పోయింది.

ఈ సోదాను ఆపాలి. అయితే నిజం మాత్రం చెప్ప కూడదు.

నేను బస్సు దిగి పోలీస్ స్టేషన్లో అడుగుపెట్టాను.

అక్కడ పోలీసులు, నా వెనుకసీటు పెద్దమనిషి గొడవ

పడుతున్నారు. అతడి చేతిలో ఓ బ్రీఫ్‌కేసు వుంది. దాన్ని తెరచి చూడడడానికి వీల్లేదంటున్నా డతను. పోలీసులు పట్టుబడుతున్నారు.

"అందులో నా వ్యక్తిగతమైన రహస్య విషయా లున్నాయి. బంగారు గొలుసు లేకపోతే మీ అందరిమీదా పరువునష్టం దావా వేస్తాను. నాకు ప్రధానమంత్రి స్థాయి దాకా పలుకుబడి వుంది. మీ అందరి ఉద్యోగాలూ పోతాయి—"

ఇలా రకరకాలుగా బెదిరిస్తున్నా డతను.

పోలీసులు చలించడంలేదు.

ఆఖరికి బ్రీఫ్‌కేసు ఓపెన్ చేశారు.

ఒక్కసారిగా అక్కడ హాహాకారాలు వినిపించాయి.

"ఏమిటుంది అందులో!" అనడిగాను నేను.

ఎవరూ జవాబు చెప్పడంలేదు. తోసుకుని మరీ వెళ్ళి చూస్తున్నా రా విచిత్రాన్ని.

నాకు అవకాశం రావడానికి కాసెపు పట్టింది. అప్పుడు చూసి బ్రమాన్పడిపోయాను. ఆ బ్రీఫ్‌కేసులో ఓ మనిషి చెయ్యి ఉన్నది. ఆ చేతికి బంగారు గాజు లున్నాయి. ఆ వ్రేళ్ళకు ఉంగరా లున్నాయి. ఉంగరాలపై నీలపు రాయి....

కెవ్వుమని అరిచాను నేను.

3

ముసలాయన నా పక్కనే వున్నాడు—"ఇలాంటివి చూడకూడదమ్మా—ఆడవాళ్ళు. అనవసరంగా భయపడ తారు. నీ గొలుసు దొరక్కపోతే పోయింది కానీ నీ పేరు చెప్పి ఓ భయంకర హంతకుడు బయటపడ్డాడు" అన్నాడు.

నేను తేరుకున్నాను—"నేను అరిచింది భయంవల్ల

కాదు. ఆ చేయి ఎవరిదో నాకు తెలుసు....”

అంతా ఉలిక్కిపడ్డారు.

నేను చెప్పసాగాను—“ఆ గాజులు, ఆ ఉంగరాలు—ఆ చేతిమీద నల్లని పొడవాటి మచ్చ....నాకు బాగా గుర్తు....ఆ చెయ్యి అన్నపూర్ణమ్మది....”

పోలీసులు నా దగ్గరనుంచి సమాచారం సేకరిస్తున్నారు. నా మనసు వ్యథతో నిండిపోతోంది. ఆ చెయ్యి యెన్ని దానాలు చేసింది? ఎంతమందికి ఊతనిచ్చింది! ఈ రోజు నే నిలా వుండడానికి కారణం ఆ చేయి యిచ్చిన ఊతయే కదా!

నా వెనుక సీటు పెద్దమనిషిని కస్టడీలోకి తీసుకున్నారు.

“సార్ అన్నపూర్ణమ్మ గొప్పతనమంతా ఈ చేతిలో వుంది. ఈ చేయి లేకుండా నే నావిణ్ణి చూడలేను. ఈ చేతి నావిడ వద్దకు చేర్చాలి—” అన్నాను పోలీసు ఇన్‌స్పెక్టర్‌తో.

“అయితే యిప్పుడు మీరు మాతో వస్తారా?” అన్నాడు ఇన్‌స్పెక్టర్.

“ఊఁ” అన్నాను అప్రయత్నంగా.

ఆ వ్యక్తి నేమి అడిగినా చెప్పడం లేదు—“నేను హంతకుణ్ణి కాదు. నా కేమీ తెలియదు—” అంటున్నాడు.

పోలీసు ఇనస్పెక్టర్ అతడికి బేడీలు వేశాడు.

పెళ్ళికని బయల్దేరిన నేను పోలీసు జీపు ఎక్కాను. ఒక హంతకుడు, పోలీసులతో కలిసి అన్నపూర్ణమ్మ యింటికి బయల్దేరాను.

ఆ చేయిలేని అన్నపూర్ణమ్మను ఎలా చూసేది?—ఇదే నా బెంగ! అయితే నా బెంగకు అర్థం లేదని తెలియడానికి ఎంతోసేపు పట్టలేదు.

మేము వెళ్ళేసరికి అన్నపూర్ణమ్మ ఇంట్లో ఏడ్పులు విని పిస్తున్నాయి.

అతకు ముందురోజు రాత్రి అన్నపూర్ణమ్మ మరణించిందట. చేతి నున్న బంగారం రాకపోవడంతో కంసాలి వద్దకు వెళ్ళి వచ్చేలోగా ఎవడో చేయి నరుక్కుని పట్టుకుపోయాడట. నా సీటు వెనుక పెద్దమనిషిని వాళ్ళు గుర్తుపట్టారు. ఊళ్ళో అన్నపూర్ణ చేయూతవల్ల పైకి వచ్చిన ఆవిడ బంధువుల్లో అతడొకడట. చివర్లో ఎలా పుట్టిందో ఈ దుర్బుద్ధి పుట్టివుంటుంది.

ఆవిడను దహనం చేయడం కూడా అయిపోయింది.

ఎవరో అన్నారు—"ఆ అమ్మాయంటే ఆవిడకు ప్రత్యేకాభిమానం. చనిపోయే ముందు కూడా ఎలాగుందోనని ఓ సారి తలచుకుంది. తనని రప్పించడంకోసం ఆవిడే ఇతడికి ఈ దుర్బుద్ధి పుట్టించిందేమో!"

అప్పుడు నాకు గుర్తుకొచ్చింది. నా భుజంమీద రెండు వ్రేళ్ళ స్పర్శ! అన్నపూర్ణమ్మదైనా అయుండాలి. లేదా ఆవిడ అతడికా బుద్ధి పుట్టించి తన చేతి ఉనికి బయట పెట్టించి వుండాలి. యధాలాపంగా ఆవిడ అన్న మాటలు నా చెవుల్లో యింకా మెదుల్తూనే వున్నాయి.

"పోనీ ఈ గూటిలోంచి జీవు దెగిరిపోయాకనైనా ఈ చేయి నీ స్వంతం చేసుకో. ఈ చేయి ఎంతమందికి సాయ పడినా నీకులా ప్రత్యేకంగా దీనిమీదే మోజుపడ్డవాళ్ళు ఎందరో లేరు—"

ఈ మాటల నావిడ యధాలాపంగా అనలేదా? ఆవిడ ఆత్మశక్తి ఆ చేతిని నా దగ్గరకు చేర్చిందా? నాకు దుఃఖం ఆగింది కాదు. భోరున ఏడ్చేశాను. □

కుక్కగొడుగుల్ని తినకు

అజీజ్

"ఇది విన్నారా?" అడిగింది కాంతం నా కంచంలో గోంకూర పచ్చడి గిరాటేస్తూ.

"ఏమిటి?" అన్నంలో చారు కలుపుకుంటూ అడిగాను.

"ఖర్మ! ఊళ్ళో జనమంతా ఈ సోది గురించే ఊసు లాడుకుంటోంటే మీ చెవిలో యింకా ఈ సంగతి దూరనే

లేదన్నమాట. బావుంది. అస్తమానూ వంటింట్లో తగలడే నాకు తెలిసిన విషయం, బైట రాచకార్యాలు వెలగబెట్టు కొచ్చే మీకు తెలీకపోడం విడ్డూరం కాదూ?" అంది కాంతం ముక్కుమీద వేలేసుకుంటూ.

'మొదలెట్టావూ కిష్కింధ రామాయణం!' విసుక్కున్నాడు మనసులోనే. కారణం, పైకి విసుక్కునేపాటి ధైర్యసాహసాలు కాంతం మెడలో కాంతులీనే తాళి కట్టినప్పుడే నాలో హరించుకు పోయాయి గనక!

వసపిట్టలా వాగే ఈ దుర్బుద్ధి ఆమెకు పుట్టుకతో వచ్చిందో లేక, కాపరాని కొచ్చేటప్పుడు తల్లినించి అరువు తెచ్చుకుందో గానీ, ఆవిడగారి నోరు సూయింగ్ మెషీన్‌లా అవసర అనవసర విషయా లన్నీ అలుపూ సొలుపూ లేకుండా టకటక వాగుతూనే వుంటుంది.

నే నామె మాటలు ఆసక్తిగా వినకుంటే కొంప మునిగి నట్టే. చేతికందిన వస్తువునల్లా నేలకేసి బాదేస్తుంది. ఆ వస్తువు అంత సులభంగా విరిగేది కాకుండా ముందే జాగ్రత్తగా ఎంచుకుంటుందన్నది వేరే విషయం లెండి! ఆవిడ గారి విషయ సేకరణా, వాక్చాతుర్యంవల్ల ఇరుగు పొరుగు అమ్మలక్కలకి రోజూ ఖర్చు లేని కాలక్షేపం కాక మానదు!

నా మౌనంతో ఆమె వస్తువులమీద దాడి ప్రారంభించక ముందే లేని ఆసక్తి తెచ్చుకుని "అబ్బ, సంగతేమిటో చెప్పరాదూ?" అన్నాను కుతూహలం ఒలకబోస్తూ.

"అదేనండీ, మన జడ్జీ జగన్నాధంగారు లేరూ...."

"ఏ జగన్నాధంగారూ?" అడిగాను మధ్యలో.

"నా రాత! అందుకే అస్తమానూ యింట్లో ఆ కథలూ, కాకరకాయలూ రాస్తూ కూర్చోవద్దని చెబుతుంటాను మీకు.

అందుకే మీ జ్ఞాపకశక్తి రోజు రోజుకూ మందగిస్తోంది. మన ఊరి జడ్జీ జగన్నాధంగార్నే మర్చిపోయారా?"

"ఓ ఆయనా! మన ఊరివాడైనా యిన్నాళ్ళూ ఎక్కడెక్కడో ఉద్యోగం వెలగబెడుతూ, ఎప్పుడో గానీ ఈ ఛాయలకు రాడు కదా, అందుకే మర్చిపోయాను. ఊఁ, ఆయన కేమైందీ? పోయాడా?"

"రామ రామ! నన్ను చెప్పనివ్వకుండానే, నిక్షేపం లాంటి మనిషిని చంపేశారూ. సర్లెండి. ఆయన ఉద్యోగం నించి రిటైరై, యిక్కడే స్థిరపడదామని ఈ రోజే భార్యా సమేతంగా వచ్చేశారు."

"ఏమిటీ? భార్యా సమేతంగానా? ఆయన భార్య చనిపోయి చాలా రోజులయిందే?" అడిగాను ఈసారి నిసలైన కుతూహలంతో.

"భార్య చనిపోతే మాత్రం మీ మగాళ్ళు మడిగట్టుకు కూర్చుంటారా? లక్షణంగా మరో పెళ్ళి జేసుకున్నాడుట. అదీ తన వయసులో సగం వయసున్న పడుచుపిల్లని. ఆవిడగారికి పాతిక మించి వుండదు. బాగా చదువుకున్న అవతారంలా వుంది. అంత పెద్ద జడ్జీగారి భార్య కదా, ఒంటిమీద వీసమెత్తు నగా నట్రా వుంటేనా? ఒక్క తాళి గొలుసు తప్ప...."

'నీలా ఒంటినిండా వెండి నగలతో, గంగిరెద్దులా ఉండమంటావా?' అనుకుంటూ చెయ్యి కడుక్కొని లేచాను.

వరండాలో వాలుకుర్చీ వాల్చి, అందులో జారగిలబడి సిగరెట్ అంటించాను. జడ్జీ జగన్నాధంగారిది ఈ ఊరే. ఆ రోజుల్లో ఆయనొక్కడే ఈ ఊళ్ళో పెద్ద చదువులు చదివిన వ్యక్తి. నా చిన్నతనంలోనే ఆయన ఉద్యోగ నిమిత్తం

ఊరొదిలి వెళ్ళిపోయాడు. అడపా దడపా యిక్కడి ఆస్తి పాస్తులు చూసుకోడానికి వస్తుండేవాడు.

ఊరవతల నది ఒడ్డున మామిడితోటా, ఆ తోట మధ్య లంకంత మేడా, ఊరి చుట్టుపక్కల సుమారు ఇరవై ఎకరాల పొలం వుందాయనకు. ఇప్పుడు రిటైరై పల్లె వాతావరణంలో ప్రశాంతంగా గడుపుదా మని వచ్చుంటాడు.

నేను యిక్కడే పుట్టి, యిక్కడే పెరిగి, చదువుకున్న స్కూల్లోనే టీచర్‌గా చేరి, కాంతాన్ని కట్టుకుని కాలక్షేపం చేస్తున్నాను. పిల్లల్లేరు. సాయంత్రాలు ట్యూషన్ చెబుతూ, సెలవు రోజుల్లో కథలూ గట్రా రాస్తూ పుట్టబోయే పిల్లల కోసం నాలుగు రాళ్ళు వెనకేస్తున్నాను. ఆ ఊళ్ళో సగటు రచయితని నేనొక్కణ్నే కావడంవల్ల అక్కడి ప్రజల్లో నాకు రవంత ప్రత్యేక స్థానం వుంది.

2

జడ్జి జగన్నాధంగారు వచ్చి నెల రోజులు దాటినా, ఎవ్వరూ ఆయన్ని ఊళ్ళోకి రావడం చూళ్ళేదు. బహుశా వృత్తిరీత్యా ఆయనకు అలవడ్డ ఏకాంతవాస లక్షణాలు యింకా పోలేదు కాబోలు. ఐతే, ఆయనగారి పడుచు పెళ్ళాన్ని మాత్రం ఒకటి రెండుసార్లు బజార్లో ఏవో కొనడానికి రావడం చాలామంది చూశారట.

ఖర్మకొద్దీ ఆ సమయంలో నేను బళ్ళో తగలడుంటాను గనక, ఆవిణ్ణి చూడాలన్న కోరిక అలాగే వుండిపోయింది నాలో. కొత్తమనిషి కనిపిస్తే చాలు, పల్లెటూళ్ళలో జనం పనీపాటా వదిలి గుడ్లప్పగించి చూస్తూంటారు. అదీ అందమయిన స్త్రీ అయితే యిహ చెప్పనవసరం లేదు.

జడ్జీగారి భార్య చాలా అందంగా వుంటుందిట. ఒక్క

రిద్దరు కలుపుగోలు అమ్మలక్కలు ఆమెను పరిచయం చేసుకుందామని మాటలు కలిపితే, చాలా క్లుప్తంగా, ముభావంగా జవాబులిచ్చి దాటిపోయిందట.

ఆ రోజు రాత్రి నాకు భోజనం వడ్డిస్తూ కాంతం ఈ సంగతే ఎత్తి, "కాటికి కాళ్ళు చాపుకున్న ముసలాణ్ణి కట్టుకుని, ఓ యబ్బో, వెధవ బడాయి అదీను. ఆడదానికి మరీ అంత గర్వమా?" అంది దీర్ఘం తీస్తూ.

'లేకుంటే నీలా అలుపూ సొలుపూ లేకుండా వసపిట్టలా వాగుతూ కూర్చోమంటావా అందరితో?' అనుకుంటూ, "కొందరి తత్వం అంతేలే. కొత్తవాళ్ళతో మాట్లాడ్డానికి సిగ్గుపడతారు. అది చూసి అందరూ వాళ్ళను గర్విష్టులనుకుంటారు" అన్నాను.

"ఆమె తత్వం అదని మీకెలా తెలిసిందీ? కొంపదీసి ఆమెను కలుసుకుని మాట్లాడారా యేం?" నిలదీసినట్టు అడిగింది కాంతం.

"అహ....అబ్బే! మాట్లాడ్డం అటుంచి, ఆమె నింత వరకూ నేను చూణ్ణే లేదు."

"ఇకముందు చూడకూడదు కూడా!"

తలూపాను గంగిరెద్దులా! నా పెళ్ళయి పదేళ్ళు కావస్తోంది. ఈ పదేళ్ళలో నేను కన్నెత్తి మా కాంతాన్ని తప్ప మరో కాంతను చూడలేకపోయాను. అలా చూసే అవకాశం ఆమె నాకిస్తేగా?

సరే, ఆ తరవాత జడ్జీగారి భార్యను మళ్ళీ ఎవ్వరూ ఊళ్ళో చూడలేదు. బహుశా, వర్షాకాలం ప్రారంభమయినందువల్ల ఆమె బైటికి రావడం మానేసిందో, లేక జడ్జీగారే ఆమెను బైటి కెళ్ళొద్దని శాసించారో, లేదా యీ ఊళ్ళో ఆమెకు ఆసక్తికరమయిన విషయాలేమీ కనిపించ

లేదో తెలీదు మరి.

ఓ ఆదివారం పగలంతా యింట్లో కూర్చుని, ఓ కథానిక పూర్తిజేసి, సాయంత్రంవేళ అలసిపోయిన బుర్రకు విశ్రాంతి కలిగిద్దామని పచార్లుజేస్తూ నదివైపు బైలుదేరాను. గతరాత్రి కుండపోతగా వర్షం కురియడంవల్ల నేల ఇంకా ఆరలేదు. వాతావరణం చల్లగా, ఆహ్లాదంగా వుంది.

నది చేరువ కాగానే అనాలోచితంగా నా దృష్టి నది ఒడ్డునే వున్న జడ్జీగారి తోటవైపు మళ్ళింది. తోటలో మామిడిచెట్లతోబాటు యితర చెట్లూ, పూల మొక్కలూ ఏపుగా ఎదిగి పూలతో గుబాళిస్తున్నాయి. దూరాన తోట మధ్య వారి ఇల్లు కనిపిస్తోంది.

నా కాళ్ళు అప్రయత్నంగా అటు దారితీసాయి. పూల మొక్కల పక్కనించి నడుస్తూ, వాటి గుబాళింపును ఆస్వాదిస్తూ చిన్న చిన్న అడుగులతో ముందుకు సాగుతున్న నా కాళ్ళు మలయమారుతంలో మురళీరవం మిళితమైనట్టు కర్ణపుటాలకు సోకిన సన్నని కూనిరాగం విని చటుక్కున ఆగిపోయాయి.

ఎక్కడినించబ్బా, అనుకుంటూ చుట్టూ కలయజూశాను. అంతే! నా కనురెప్పలు తమ కర్తవ్యాన్ని మరచి ఆలాగే నిలిచిపోయాయి లిప్తపాటు. కొద్దిదూరంలో నేలమీద ఏదో ఏరుతూ కూనిరాగం తీస్తూ పరిసరాలను మైమరచి ఉన్న స్త్రీని రాతిబొమ్మలా చూస్తుండిపోయాను.

పాల నురుగులాటి తెల్లని దుస్తుల్లో దివినించి భువికి దిగివచ్చిన కిన్నెర కన్యలా, కవి హృదయంలోని కమ్మని కవితలా తోచింది నా కనుదోయికి ఆమె అందమైన ఆకృతి.

నా కళ్ళు ఆమె అందాన్ని ఇంకా తనివిదీరా ఆస్వా

దించకముందే ఆమె నిటారుగా నిల్చుని అనుకోకుండా నా వైపు తలతిప్పింది. అంతే! కనుబొమలు ముడివడ్డాయి. నా కాళ్ళు వణికాయి. ఆమెకు కోపం వచ్చుంటుంది. జడ్జీతో చెబుతుంది. ఆయన నా భార్యకు చెబుతాడు. ఆమె ఊరంతా చాటింపువేసి, మాటలతో నా తాట వలుస్తుంది! ఎంత త్వరగా అక్కణ్ణించి జారుకుంటే అంత మంచిదనుకుంటూ కదలబోయాను.

"ఎవరండీ?" అన్న ఆమె ప్రశ్న నా కాళ్ళ వణుకును ఇంకాస్త అధికం చేసింది.

"అబ్బే....మ్....మరీ....మీ అనుమతి లేకుండా మీ తోటలోకి ప్రవేశించాను క్షమించండి. నా పేరు తీర్థనాధ్! ఈ ఊరే...." అన్నాను తడబడుతూ.

"ఎవరూ, ఇక్కడ స్కూల్లో పనిచేస్తున్న పంతులు గారా?"

"ఔనండీ!" అన్నాను నా వృత్తి గురించి ఆమెకెలా తెలిసిందా అని అబ్బురపడ్తూ.

"మీరు రచయిత కదూ?" అన్న ఆమె రెండో ప్రశ్న నన్ను మరీ చకితుణ్ణి జేసింది.

"మీకెలా తెలిసిందండీ?" అడిగాను రవంత ధైర్యాన్ని కూడదీసుకుంటూ.

"నాకు పుస్తకాల పిచ్చి ఎక్కువ. పైగా, ఈ ఊళ్ళో పొద్దుపోడానికి మరో వ్యాపకం లేక ఆ పిచ్చి మరీ ముదిరి పోయింది. వెంట తెచ్చుకున్న పుస్తకా లన్నీ పూర్తి కావడంతో, ఇక్కడ అద్దె పుస్తకాల లైబ్రరీ ఏదైనా వుంటే, పుస్తకాలు తీసుకు రమ్మని నౌఖర్ని పంపాను.

ఊరంతటికీ ఒక్కగానొక్క లైబ్రరీ వుందిట. లైబ్రరీ అతను నౌఖరుకు ఓ నవల ఇచ్చి, ఆ నవలా రచయిత తీర్థ

నాథ్ ఈ ఊళ్ళోనే బడిపంతులుగా పనిజేస్తున్నారని చెప్పా డట....ఆ గోధుమరంగు కళ్ళు అనే నవల ఈరోజే పూర్తి చేశాను. చాలా బావుంది. మీవద్ద ఇంకేమైనా పుస్తకా లున్నాయా?"

ఓ అందమైన స్త్రీ నా నవలనలా పొగిడేస్తుంటే, నాలోని రచయిత ఉబ్బితబ్బిబ్బైపోయాడు. ఆ ధైర్యంతోనే నెమ్మ దిగా ఆమెను సమీపించి, "చాలా వున్నాయి. పంపిస్తాను. ఇంతకీ మీ రెవ్వరో చెప్పనేలేదు" అన్నాను.

ఆమె నవ్వి—"నా పేరు శిరీష! జడ్జీ జగన్నాధంగారి భార్యని. ఇందాక ఆయనకూడా నా వెంట ఇక్కడే వున్నారు. వర్షాకాలం కదా, తోటలో కుక్క గొడుగులు ఏరుతున్నాం! ఆయన అలసిపోయి ఇప్పుడే ఇంట్లోకెళ్ళారు. మీరిలా రావడం ఆయన చూసి వుంటే బహుశా...."

'ఆగ్రహించేవారేమో!' ఆమె పూర్తిచెయ్యని వాక్యాన్ని నేను ఊహించుకున్నాను మనసులో. "నేనిలా రావడం చూసి ఆయన ఆగ్రహించి ఉంటే, క్షమాపణలు చెప్పుకుని వెళ్ళిపోయేవాణ్ని లెండి....ఇంతకీ, కుక్కగొడుగులు ఏరి ఏం చేస్తారు?" అడిగాను కుతూహలంగా ఆమె చేతిలోని ప్లాస్టిక్ బుట్ట చూస్తూ.

"వండుకు తింటాం! వీటిలో ప్రోటీన్స్ శాతం చాలా అధికంగా వుంటుందని బహుశా మీకు తెలిసే వుంటుంది."

"తెలుసు. కొన్ని చోట్ల వాటిని కాయగూరలు పండించినట్టు ప్రత్యేకంగా పండిస్తారుకూడా! అఫ్‌కోర్స్, నేనింతవరకూ, తిన్లేదనుకోండి" అన్నాను నవ్వుతూ.

"వీటి కూర చాలా రుచిగా వుంటుంది. మా వంట వాడు వీటిని వండటంలో మంచిదిట్ట. అందుకే, వెరైటీ కోసం అప్పుడప్పుడూ వండుకు తింటాం!"

ఏదో అనబోతూ అనుకోకుండా ఆమె చేతిలోని బుట్ట లోకి తొంగి చూశాను. అంతే! ఆశ్చర్యంతో నా కళ్ళు పెద్దవయ్యాయి. "అరె, ఆ తెల్ల కుక్కగొడుగు లెందు కేరుకున్నారు? వాటిని తీసి అవతల పారెయ్యండి" అన్నాను ఆత్రుతగా.

"ఏం?" అడిగింది ఆమె ఆశ్చర్యంతో.

"అవి విషపూరితమైనవని నా అభిప్రాయం!"

"మీ అభిప్రాయం నిజంకాదు. కారణం, మావారు స్వయంగా వాటిని ఏరి బుట్టలో వేశారు!"

వృక్షశాస్త్రంలో నాకు పెద్దగా ప్రవేశం లేకున్నా, ఆ బుట్టలోని కుక్కగొడుగుల్లో కొన్ని విషపూరితమైనవేనని తోస్తున్నది నాకు. "బహుశా, ఆయనకు చూపు సరిగా ఆనదేమో, లేదా వాటి నాయన గుర్తుపట్టలేదేమో. ఎందుకైనా మంచిది, వాటిని తీసి పారెయ్యండి" అన్నాను సందిగ్ధంగా.

క్షణంపాటు ఆమె మొహంలోనూ అనుమానం పొడ సూపింది. నా సలహా పాటించడానిక్కాబోలు చెయ్యి బుట్టలోకి పోనిచ్చి, మళ్ళీ ఏమనుకుందో ఏమో, "ఉహుఁ! ఆయన బాగా చూసే ఏరారండీ, ఈ విషయంలో ఆయ నెప్పుడూ పొరబడరు. కారణం, వీటిగురించి ఆయన దగ్గర ఓ విదేశీ పుస్తకం కూడా ఉంది....సరే, నాకోసం ఆయన ఎదురుచూస్తుంటారు. వస్తా. అన్నట్టు పుస్తకాలు పంపడం మర్చిపోకండి" అంటూ నావద్ద సెలవు తీసుకుని ఇంటివైపు కదిలిందామె.

ఒక్క ఉదుటున వెళ్ళి ఆమె చేతిలోంచి ఆ బుట్ట లాక్కుని ఆ విషపూరిత కుక్క గొడుగుల్ని ఏరి అవతల పారెయ్యాలనీ, ఎలాగైనా ఆమెను వాటిని తీసికెళ్ళ

కుండా ఆపాలనీ తోచింది నాకు. మళ్ళీ, జడ్జీగారి వంటి పెద్దమనిషే స్వయంగా తినడానికి వాటిని ఏరుకున్నప్పుడు అవి నిజంగా మంచివే అయుంటామేయో, పైగా ఆయన వద్ద వాటికి సంబంధించిన పుస్తకం కూడా వుందంటోంది ఆమె.

అటువంటప్పుడు నేను అనవసరంగా అతి తెలివి చూపిస్తే ఆమె దృష్టిలో నగుబాటు అయిపోగల్ను.... పుస్తకం అనగానే చటుక్కున జ్ఞాపకం వచ్చింది. నేను ట్యూషన్ చెప్పే పదవ తరగతి విద్యార్థి చంద్రశేఖర్ వద్ద బాటనీ పుస్తకం వుంది. ఒకసారి దాన్ని తిరగేసి చూస్తే!

ఈ ఆలోచన రాగానే గబగబ ఊరివైపు బైలుదేరాను. ఇంకా తోట దాటక ముందే నేలమీద మొలిచి ఉన్న ఆ రకం కుక్కగొడుగుమీద పడింది నా దృష్టి. వెంటనే దాన్ని తెంపుకుని, పావు గంటలో ఆ విద్యార్థి ఇంటికెళ్ళి బాటనీ పుస్తకం తీసుకుని, ఇల్లుజేరి ఆదరాబాదరా పుస్తకం తిరిగేశాను.

నా అనుమానం నిజమే అయింది! పుస్తకంలో రకరకాల కుక్కగొడుగుల చిత్రాలతో బాటు, వాటి నిర్మాణమూ ఉపయోగాల వివరాలతో బాటు, ఏవి తినవచ్చో, ఏవి తినకూడదో స్పష్టంగా వివరించి వుంది. నేను జగన్నాథంగారి తోటలోంచి తెంపుకొచ్చిన కుక్కగొడుగు అక్షరాలా విషపూరితమైనదే!

దాని పేరు 'ఏమోనిటార్న్'. అది తిన్న ఎనిమిది గంటల తరవాత దాని విషప్రభావం ప్రారంభమౌతుందిట. ఆ తరవాత దానికి ఎటువంటి వైద్యమూ పనిచెయ్యదట! నా మస్తిష్కంలో తుపాను గాలులు వీస్తూ భయోత్పాతాన్ని కలిగించసాగాయి. కుక్కగొడుగుల గురించి ఎంతో పరి

జ్ఞానం వున్న జగన్నాథంగారు విషపూరితమైన వాటిని సేకరించి అవి మంచివని భార్యని ఎందుకు మభ్యపెట్టారు?

కొంపదీసి ఆ కూర ఆమెకు తినిపించి ఆమెను చంపాలనే ఉద్దేశంతో కాదు కదా? అటువంటి అందమైన, వయసులో వున్న భార్యను చంపాలనే ఆలోచన ఆయనకెందు కొచ్చింది?

నా మస్తిష్కం పరో కోణం నించి ఆలోచించ నారంభించింది. ఆయన ఏభై ఏళ్ళు దాటిన ముసలాడు. ఏదో వ్యామోహంలో పడి ఆమెను కట్టుకున్నాడు. శిరీష మయూరాన్ని మించే అందమైనదే గాక, పరవళ్ళు తొక్కే పరువంలో వున్నది. ఆ వయసు వుడిగిన వాడితో కాంక్షలూ, ఆకాంక్షలూ తీరక, దొడ్డి దారిన తన ముచ్చట్లు తీర్చుకుంటోందేమో, అది ఆయన కంటబడి ఈ విధంగా తన కక్ష తీర్చుకోడానికి పథకం వేశాడేమో? ఐతే, అమె కాంక్షలు తీరుస్తున్న వ్యక్తి ఎవరై వుంటారు?

ఏదిఏమైనా, ఆమె ఈ విధంగా చంపబడడం నా కిష్టం లేదు. కొందర్ని తొలిసారి చూడగానే ఎన్నో జన్మల సుపరిచితులుగా స్ఫురిస్తారు. ఆమెను మొదటిసారి చూడగానే ఆ అనుభూతి కలిగింది నాకు. ఆమె నమ్రతా, మృదుభాష్యం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది.

అటువంటి వ్యక్తి ఇలా చనిపోయిందని తెలిస్తే స్వతహాగా సుతిమెత్తనైన నా మనసు మళ్ళీ కోలుకోడానికి ఎన్నో యుగాలు పట్టవచ్చు. ఇప్పుడేం చెయ్యాలి? ఎలా ఈ ఉపద్రవాన్ని ఆపాలి? ఎవరికి చెప్పాలి?

జడ్జీ జగన్నాథం తన భార్యకు విషపూరిత కుక్కగొడుగులు తినిపించి చంపబోతున్నాడని ఎవరికి చెప్పినా,

ముందు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుతారు. తరవాత నా కాళ్ళూ, చేతులూ కట్టి పిచ్చాసుపత్రికి తరలిస్తారు. ఈ సంగతి నా భార్య చెవిన గనక పడిందంటే, ఎవరో పంపడం అటుంచి, నేనే స్వయంగా పిచ్చాసుపత్రిలో చేరి పోతాను.

అప్పటికే చీకటిపడింది. ఊళ్ళో దీపాలు వెలుగుతున్నాయి. అక్కడ జడ్జి ఇంట్లో ఆ కూర తయారవుతూ వుంటుంది. అది శిరీష నోటికి చేరకముందే నేను ఏదో ఒకటి చేసి తీరాలి! అనే దృఢనిర్ణయానికి వచ్చి, శర వేగంతో బైలుదేరాను పోలీస్ స్టేషన్ వైపు.

3

నా చేతిలో ఇంకా ఆ కుక్కగొడుగూ, చంకలో బాటనీ పుస్తకమూ అలాగే వున్నాయి. జీవితంలో ఎన్నడూ లేనిది నా నడకలో అంత వేగం ఎలా వచ్చిందా అని నాకే ఆశ్చర్యం వేసింది. నిమిషాల్లో చేరుకున్నాను పోలీస్ స్టేషన్.

వరండాలో ఓ కానిస్టేబుల్ తుపాకీ పట్టుకుని కాపలా కాస్తున్నాడు.

"ఇనస్పెక్టర్‌గారున్నారా?" అడిగానతన్ని.

"భోజనాని కెళ్ళారు ఇంటికి!" చెప్పాడు.

"హెడ్ కానిస్టేబుల్‌గారు?"

"ఆయన కూడా ఇందాకే వెళ్ళారు."

బాణంలా బయలుదేరాను ఇనస్పెక్టర్ ఇంటికి. ఆలోగా ఆకాశంలో దట్టమైన కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఆగి ఆగి మెరుపులు తళుక్కుమంటున్నాయి. ఏ క్షణంలోనైనా వర్షం రావచ్చు. ఇన్‌స్పెక్టర్ ఇంటి తలుపు మూసుంది. దబ దబ తట్టాను.

ఆయన భార్య వచ్చి తెరిచింది.

"అర్జంటుగా ఇనస్పెక్టర్‌గార్ని కలవాలండి" అన్నాను.

ఆమె మొహం చిట్లించి, "ఇప్పుడే వచ్చారు. భోజనం చేస్తున్నారు" అంది.

"చాలా అర్జంటండీ! అవతల ఓ అమాయకురాలు హత్య కాబోతోంది...." నా మాట ఇంకా పూర్తికాక ముందే ఇనస్పెక్టర్ యివతలికి వచ్చి, ఏమిటన్నట్టు కళ్ళెగ రేశాడు.

అతను చాలా కోపిష్టి అని విన్నాను. అందుకే గుబ గుబలాడుతున్న గుండెని కూడదీసుకుంటూ, "సార్ .... మ్.... మరే...." మాటరాక నాలిక నాలుగొంకర్లు తిరగ సాగింది.

"ఏం? భూకంపం రాబోతుందా? ఆకాశం నెత్తిన పడ బోతుందా?" గర్జించాడు ఇన్‌స్పెక్టర్.

"అబ్ ....బ్బే....లేదండీ...." అంటూ నా చేతిలో ఉన్న కుక్కగొడుగు ముందుకు చాపి, "దీన్ని చూశారా?" అన్నాను.

"ఏమిటి? కుక్కగొడుగా? ఇది చూపించడానికే ఇంత హడావుడి చేస్తున్నావా?"

"అబ్బే....అది కాదండీ! ఇది విషపూరితమైన కుక్క గొడుగు. దీన్ని తిన్న మనిషి ఎనిమిది గంటల్లో చనిపోతా డని ఈ బాటనీ పుస్తకంలో రాసుంది...."

కోపంతో ఇన్‌స్పెక్టర్ మొహం జేవురించింది. "ఈ బోడి పాఠం చెప్పడానికా నన్ను భోజనం మీంచి లేపింది? నీ కంటికి నేను స్కూలుపిల్లాడిలా కనిపిస్తున్నానా?"

"మ్....మన్నించండి. మీరపార్థం చేసుకుంటున్నారు. మన ఊరి వెలుపల జడ్జీ జగన్నాథంగారు లేరూ? ఆయన

తన భార్యకు ఈ రకం కుక్కగొడుగులు తినిపించి హత్య చెయ్యాలనుకుంటున్నాడు....''

"ఏం కూశావ్?'' ఇన్‌స్పెక్టర్ అరుపుతో నా కాళ్ళు అప్రయత్నంగా నేలమీంచి నాలుగంగుళాలు లేచిపడ్డాయి. "ఏ గాడిదవెధవ చెప్పాడు నీకీ సంగతి? న్యూసెన్స్ కేసు పెట్టి లోపలికి తొయ్యగల్ను జాగ్రత్త!''

"నా మాట నమ్మండి సార్! ఇది మానవత్వానికి సంబంధించిన విషయం సార్!'' అన్నాను రెండడుగులు వెనక్కి తగ్గి.

"నీలా నేనూ తెలివితక్కువ దద్దమ్మననుకున్నావా? నీ మాట నమ్మి, జడ్జీగారి ఇంటి తలుపు తట్టి, అయ్యా! మీరు మీ భార్యకు విషపూరిత కుక్కగొడుగులు తినిపించి చంప బోతున్నారని, ఓ మహాజ్ఞానిద్వారా తెలిసింది నాకు. నిజ మేనా? అని అడగమంటావా?

వెళ్ళు. వెంటనే వెళ్ళిక్కణ్ణించి. వేరొకరైతే ఈపాటికి పోలీస్‌స్టేషన్‌కి ఈడ్చుకెళ్ళి లాకప్‌లో తోసేవాణ్ణి. ఇంత వరకూ నీ రికార్డ్ నీట్‌గా వుంది గనుక వదిలిపెడు తున్నాను. త్వరగా తగలడు. అవతల వర్షం వచ్చేట్టుంది'' అంటూ దభీమని తలుపు మూసేశాడు ఇన్‌స్పెక్టర్.

నా నవనాడులూ కృంగిపోయాయి. రిస్టువాచీ చూసు కున్నాను. ఎనిమిదవుతోంది. ఈ పాటికి శిరీష భోజనంలో ఆ కూర తినివుంటుందేమో! సాధ్యమైంత త్వరగా అక్కడి కెళ్ళి, ఆమెకు ఈ బాటనీ పుస్తకం చూపి, నేను చెప్పింది అబద్ధం కాదని నమ్మించాలి. తరువాత తక్షణం ఆమెను డాక్టర్ మురళీధర్ ఇంటికి తీసికెళ్ళాలి. ఆయన వెంటనే ఆమె తిన్నదంతా బైటికి కక్కించి జీర్ణకోశాన్ని శుభ్రం చేస్తాడు. ఆ విధంగానైనా ఆమె ప్రాణాపాయం నించి

బైటపడుతుంది.

ఈ ఆలోచన రాగానే పరుగుతీశాను జడ్జీ ఇంటివైపు. అంతలో వర్షం ప్రారంభమైంది. సగం దూరం వెళ్లానో లేదో, తలనించీ కాళ్ళవరకూ పూర్తిగా తడిసిపోయాను. చంకలోని పుస్తకం కూడా ముద్దయింది. ఐనా, ఆగకుండా రొప్పుతూ రోజుతూ ఆ ఇల్లు చేరి దబదబ తలుపు తట్టాను.

చాలా సేపటికి తెరుచుకుంది తలుపు. గుమ్మంలో నిల్చున్న వ్యక్తి జడ్జీ కాదు. ముప్పై ఏళ్ళుంటాయతనికి; కండలు తిరిగిన ఒళ్ళు. చారడేసి కళ్ళు. విశాలమైన ఛాతీ. అవతారాన్నిబట్టి యింటి నౌఖరులా కనిపిస్తున్నాడు.

"ఎవరు? ఏం కావాలి?" అడిగాడు నన్ను ఎగాదిగా చూస్తూ.

"నా పేరు తీర్ధనాథ్! శిరీషగార్ని కలుసుకోడాని కొచ్చాను."

"ఏం పని?"

"ఆమె భోజనం చేశారా?"

"చేశారు! ఏం?" అడిగాడతను మొహం చిట్లించి.

"మైగాడ్! భోజనంలో ఆమె తెలియక విషపూరితమైన కుక్క గొడుగుల కూర తినేశారు. వెంటనే ఆమెను డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళాలి. లేకుంటే...."

"ఏం పేల్తున్నావయ్యా? పిచ్చాసుపత్రినించి పారిపో యొచ్చావా ఏం? వంట చేసినవాణ్ణి నేనే! కుక్క గొడుగుల మంచి చెడ్డలు నాకు బాగా తెలుసు. ఈ యింట్లో అలాటి కుక్కగొడుగులు యెప్పుడూ వండడం జరగలేదు. వెళ్ళు, వెళ్ళు!" అంటూ తలుపు ముయ్యబోయాడతను.

తలుపు మధ్య కాలడ్డం పెట్టి "నా మాట విను. జడ్జీగారు స్వయంగా అలాటి కుక్కగొడుగులు ఏరి, ఆమెను చంప

దానికి పథకం వేశారు...." నా మాట యింకా పూర్తికాక ముందే నైట్‌గౌన్‌లో వున్న జడ్జీ ఏగన్నాథం ఎదురుగా నిల్చుని కనిపించాడు.

నా గుండె గుభిల్లుమంది!

ఏదో చెప్పబోతున్న నౌఖర్ని ఆయన వారించి, "జగదీశ్! లోపలికెళ్ళు. అతనితో నేను మాట్లాడతాను" అన్నాడు.

నౌఖరు నన్ను ఎగాదిగా చూస్తూ వెళ్ళిపోయాడు.

జగన్నాథం నావైపు తిరిగి, "ఎవరు నువ్వు? ఊళ్ళో యెప్పుడో, యెక్కడో చూసినట్టే వుంది" అన్నాడు.

"ఔనండీ. నా పేరు తీర్థనాథ్! యిక్కడే పుట్టి పెరిగాను."

"ఏం పనిమీద వచ్చావ్?"

ఒంట్లోని శక్తినీ, ధైర్యాన్నీ కూడదీసుకుని, "సార్. మీరు మీ భార్యకు తెలిసో తెలియకో ఈ రోజు విషపూరితమైన కుక్కగొడుగులు తినిపించారు. సాయంత్రం తోటలో వాటిని ఏరుతూ అవి మంచివే అని ఆమెను నమ్మించారు మీరు.

అవి నూటికి నూరుపాళ్ళూ విషపూరితమైనవని నా వద్ద తిరుగులేని సాక్ష్యం వుంది. సమయం మించిపోక ముందే ఆమెను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళండి. లేకుంటే మీరు చాలా ఇబ్బందుల్లో పడిపోతారు" అన్న నా మాటలు విని ఆయన అగ్రహావేశంతో ఊగిపోతా డనుకున్నాను.

కానీ, చెక్కుచెదరని గాంభీర్యంతో రెండు నిమిషాలు నన్ను తదేకంగా చూసి, "నువ్వు పొరబడుతున్నావు. ఈ యింట్లో యెవ్వరూ అలాటి కుక్కగొడుగులు తినలేదు.

తినబోరు కూడా! సాయంత్రం నేనే స్వయంగా వంట కోసం మంచి కుక్కగొడుగుల్ని ఏరాను” అన్నాడు శాంతంగా.

“అబద్ధం! నేనొకసారి మీ భార్యను చూడాలనుకుంటు న్నాను.”

“నువ్వు చూడాల్సింది ఆమెను కాదు. పోలీస్ లాకప్‌ని” అన్న కంచుకంఠం విని ఉలిక్కిపడి వెనుదిరిగి చూశాను.

పోలీస్ ఇన్‌స్పెక్టర్! వర్షంలో అతని ఒళ్ళంతా తడిసి వున్నా, కళ్ళు మాత్రం నిప్పుకణాలు కురిపిస్తున్నాయి నా మీద.

“నా యింటినించి నువ్వు నీ ఇంటివైపు గాక, యీ వైపు పరుగుతియ్యడం నేను కిటికీలోంచి చూశాను. జడ్జీ గారి యింటికే వెళుతున్నావని ఊహించి, వెంటనే బైలు దేరి వచ్చాను. పద పోలీస్‌స్టేషన్‌కి?” అంటూ నా రెక్క పుచ్చుకుని జడ్జీవైపు చూశాడు ఇన్‌స్పెక్టర్.

“మీరు విశ్రాంతి తీసుకోండి సార్! ఇక ఈ మనిషి మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేడు. ఇతనికి మతిస్థిమతం తప్పి నట్టుంది. ఏదో పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు.”

“నా అభిప్రాయం కూడా అదే! రేపితన్ని సివిల్ హాస్పిటల్ తీసికెళ్ళి పరీక్ష చేయించండి” అన్నాడు జడ్జీ శాంతంగా.

నా ప్రయత్నమంతా బూడిదపాలవడంతో కింద పొర్లుతూ గావుకేకలు పెట్టాలనిపించింది. “నేను పిచ్చి వాణ్ణి కాను....నా మాట నమ్మండి” అంటూ గించుకో సాగాను.

ఇన్‌స్పెక్టర్ నా రెక్క ఇంకా స్త గట్టిగా పట్టుకుని

బైటికీడ్చుకెళ్ళి జీపులోకి తోశాడు. పోలీసుస్టేషన్ వెళ్ళగానే నన్ను లాకప్‌లోకి నెట్టి, "ఒక విధంగా నిన్నిలా రక్షించినందుకు సంతోషించు. ఈ సంగతి నీ భార్యకు తెలిస్తే ఏమౌతుందో నీకు బాగా తెలుసు. కనీసం యీ రాత్రైనా నువ్విక్కడ సుఖంగా నిద్ర పోగలవు" అన్నాడు.

"నా మాట వినండి సార్! కనీసం డాక్టర్ మురళీధర్ గారైనా యిక్కడికి పిలిపించండి. ఆయనకు ఈ పుస్తకం చూపి, జరిగిందంతా వివరిస్తాను. ఆయనైనా నా మాట నమ్ముతాడేమో!" అన్నాను చేతులు జోడిస్తూ.

"ఆ పుస్తకమేదో నువ్వే చదువుతూ కూర్చో. బహుశా, తెల్లారేలోగా నీ బుర్ర దారికి రావచ్చు" అంటూ తలుపుకు తాళంవేసి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్.

నీరసంతో నిట్టూర్చి గోడకు జారగిలబడ్డాను.

పాపం, శిరీషకు ఈ లోకంలో నూకలు చెల్లిపోయుంటాయి. అందుకే నా ప్రయత్నాలన్నీ వమ్మయ్యాయి. ఆమె ఎనిమిది గంటలకు భోజనం చేసివుంటే, తెల్లవారుజాము నాలుగ్గంటలకు ఆ విషప్రభావం ప్రారంభమౌతుంది. తరవాత అరగంటలోపల ఆమె చనిపోతుంది. ఇలాటి ఆలోచనలతో బాగా డస్సిపోయి, కూర్చున్నవాణ్ణి కూర్చున్న చోటె నిద్రలోకి జారిపోయాను.

4

హఠాత్తుగా ఎవ్వరో భుజం పట్టి ఊపినట్టు తృళ్ళిపడి లేచాను.

హెడ్‌కానిస్టేబుల్!

అప్పటికే బైట ఎండ కాస్తూ కనిపించింది.

"నిన్ను వెంటనే ఇన్‌స్పెక్టర్‌గారు తీసుకు రమ్మ

న్నారు....''

"ఎక్కడున్నారాయన?" అడిగాను ఆశ్చర్యంగా.

"జడ్జీగా రింట్లో!"

"ఏం జరిగిందక్కడ?" అడిగాను ఖంగారుగా.

"అక్కడే తెలుస్తుంది. త్వరగా పద!"

ఒక్క ఒదుటున లేచి అతని వెంట బైటికెళ్ళి, జీప్ యెక్కాను. అనుకున్నంతా అయిందన్నమాట. రాత్రే వీళ్ళు నా మాట విని వుంటే ఇప్పుడీ ఉపద్రవం వచ్చి వుండేదా? ధూర్తులు! మూర్ఖులు! పోలీసులపట్ల నాలో ఎక్కడలేని అసహ్యం పుట్టుకొచ్చింది. శిరీష అందమైన రూపం నా కళ్ళల్లో మెదులుతూ మనసును మెలికలు తిప్పి వేస్తోంది.

జీపులో తిన్నగా జడ్జీ ఇంటికి చేరుకున్నాం! హాల్లో పోలీస్ ఇనస్పెక్టర్‌తో బాటు డాక్టర్ మురళీధర్, మరి కొందరు నిల్చుని తమలో తాము ఏదో చర్చించుకుంటు న్నారు.

డాక్టర్ నన్ను చూడగానే ముందుకు వచ్చి, "రాత్రి మీరు నా దగ్గరికి వచ్చి విషయం వివరించి వుంటే ఇంత వరకూ రానిచ్చేవాణ్ని కాదు" అన్నాడు.

"ఇప్పుడిలా అంటున్నారు కానీ, అందరితోబాటు రాత్రి మీరుకూడా నన్ను పిచ్చివాడికింద జమకట్టి తిన్నగా పిచ్చాసుపత్రి చేర్చేవారు" అన్నాను విరక్తితో.

ఇనస్పెక్టర్ నా భుజంమీద చెయ్యివేసి, "అయామ్ సారీ, వెరీసారీ! మీ పట్ల చాలా అమానుషంగా ప్రవర్తిం చాను....ఐనా, రాత్రి మీరు చెప్పిన విషయం ఇంకా నన్ను తికమక పెడుతూనే వుంది. బహుశా, మీరు అవసరానికి మించి ఆందోళనకు గురై నాతో ఆలా చెప్పి వుంటారని

ఇప్పటికీ నా అనుమానం! సరే, జరిగిందేదో జరిగి పోయింది....ఈ కేసులో మాకు ప్రధానమైన సాక్షి మీరే! మీ వాఙ్మూలం తీసుకోడానికే ఇక్కడికి పిలిపించాం!" అన్నాడు.

"ఔను. ఈ కేసులో నేను తిరుగులేని సాక్షిని! తన సర్వీసులో ఎందరికో మరణశిక్షలు విధించిన ఆ జడ్జీగారిని నా సాక్ష్యంతో ఉరికంబం యెక్కించి తీరుతాను. కనీసం ఈ విధంగానైనా, అతని భార్య ఆత్మకు శాంతి చేకూరుతుంది. నా ప్రతీకారం చల్లారుతుంది......ఒక్కసారి ఆమె శవాన్ని నాకు చూపిస్తారా?" అన్నాను డగ్గుత్తికతో.

"రండి చూపిస్తాను!" అంటూ నన్ను పక్క గదిలోకి తీసికెళ్ళాడు ఇన్‌స్పెక్టర్. నేలమీద కార్పెట్‌పై పడుకో బెట్టి వుంది శవం! తలనించి కాళ్ళవరకూ తెల్లని బట్ట కప్పి వుంది పైన. ఇన్‌స్పెక్టర్ వంగి, మొహంమీంచి బట్ట తొలగించాడు. అంతే!

పక్కన పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాను.

అది ఆమె శవం కాదు!

జడ్జీ జగన్నాథరావు శవం!!

"మై గాడ్! ఏమిటిది?" అన్నాను దిగ్భ్రాంతితో.

ఇన్‌స్పెక్టర్ నవ్వి—"ఇప్పుడర్థమైందా? రాత్రి మీరు చెప్పింది నన్ను ఇప్పటికీ తికమక పెడుతోందని? పదండి. బైట మాట్లాడదాం!" అంటూ నన్ను హాల్లోకి తీసి కెళ్ళాడు.

అదే క్షణంలో, లోపలినించి పోలీసులు మరో శవాన్ని స్ట్రెచ్చర్‌మీద మోసుకుంటూ ఇవతలికి వచ్చారు. శవంమీద తెల్లగుడ్డ కప్పి వుంది. నా గుండె గుభిల్లుమంది.

"ఆ శవం ఎవరిది?" అడిగాను ఆతృతగా.

ఇన్‌స్పెక్టర్ ముందుకెళ్ళి శవం మొహంమీంచి బట్ట తొలగించాడు.

ఆశ్చర్యంతో నా నోరు తెరుచుకుంది.

అది ఇంటి నౌఖరు జగదీశ్ శవం!

"అర్ధరాత్రి నిద్రలో వున్న జడ్జీగారికి కడుపులో విపరీతమైన నొప్పి ప్రారంభమై వుంటుంది. పరిస్థితి విషమిస్తున్న కొద్దీ ఆయనకు మీ మాటల్లోని నిజం అర్థమై వుంటుంది. వంటవాడు తనకు విషపూరిత కుక్కగొడుగులు వండి తినిపించి వుంటాడని. వెంటనే ఆయన తన పిస్తోలందుకుని పడుతూ లేస్తూ వాడు పడుకున్న చోటికి వచ్చి షూట్ చేశారు....

ఇప్పుడు చెప్పండి. రాత్రి ఈ ఇంట్లో విషపూరితమైన కుక్కగొడుగులు వండబడుతున్నాయని ఎలా తెలిసింది మీకు? వాటిని ఎవరు, ఎక్కణ్నించి సేకరించారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ నోట్‌బుక్ తెరుస్తూ.

నేను చెప్పడానికి తలెత్తాను. అదే క్షణంలో నా దృష్టి లోపలినించి నెమ్మదిగా అక్కడికి వచ్చిన శిరీష మీద పడింది!

ఆమె కళ్ళు నామీదే నిలిచి వున్నాయి. ఆ కళ్ళల్లో 'నిజం' చెప్పకూడదన్న వేడుకోలు స్పష్టంగా కనిపిస్తోంది నాకు.

అప్పుడు తొలగసాగాయి అంతవరకూ నా కళ్ళముందు కమ్ముకున్న కారు మబ్బులు. ముసలి మొగుణ్ని అడ్డు తొలగించి, అతని యావదాస్తినీ కైంకర్యం చేసుకుని, భోగభాగ్యాలు అనుభవిద్దామని ఆమే స్వయంగా ఈ పథకం అల్లి వుంటుంది.

తోటలో ఆమెతోబాటు జడ్జీగారు మంచి కుక్కగొడుగులు ఏరుతూ అలసిపోయి ఇంట్లోకి వచ్చాక, ఆమె

ఒంటరిగా విషపూరిత కుక్కగొడుగులు ఏరసాగింది. అదే సమయంలో నే నక్కడికెళ్ళాను. అవి తన భర్త స్వయంగా ఏరినవని నన్ను తప్పుదోవ పట్టించింది....

ఈ పథకంలో నౌఖరు జగదీశ్ కూడా ఆమెకు యథోచితంగా సహకరించి వుంటాడు. కారణం....

ఈ ఆలోచన రాగానే అంతవరకూ అందంగా, అమాయకంగా, అపురూపంగా కనిపించిన ఆమె ఆకృతి నా కంటి కిప్పుడు వికృతంగా, భీకరంగా కనిపించసాగింది.

నే చెప్పిన వాఙ్మూలాన్ని రాసుకున్న ఇన్‌స్పెక్టర్, కాసేపు ఆశ్చర్యంతో ఆమెవైపు చూసి, హెడ్ కానిస్టేబుల్‌కు సైగచేశాడు.

మరుక్షణం అతని జేబులోంచి ఇనప సంకెళ్ళు బైటికి వచ్చి శిరీష చేతుల నలంకరించాయి. □

నటన ఖరీదు?

"ఏమండీ, ఆ హీరో చూడండీ హీరోయిన్‌తో ఎంత ప్రేమగా మాట్లాడుతున్నాడో - మీరొక్కసారైనా నాతో అలా మాట్లాడారా?"

"అది సినిమా జీవితమే. అలా నటించినందుకు ఆయనకు కొన్ని వేల రూపాయలిస్తారు- తెలుసా?"

"చాల్లెండి. మీరు నటించకపోయినా, మీకు మా నాన్నగారు పెండ్లిలో యాభై వేలు కట్నం యిచ్చారుగా!"

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల్.

ఎమ్.వి.వి. సత్యనారాయణ

మాయమైన దేవత కళ్ళు

కొండలమీద పరచుకున్న పట్నం పచ్చలూర్. కాడిలాక్ కారులో ప్రకృతి కనులపండుగగా కనిపిస్తోంది. వూళ్ళోకి ప్రవేశించింది కారు.

మెయిన్ రోడ్డుమీద కాడిలాక్ కారు దూసుకుపోతోంది. మాలిని నల్ల కళ్ళద్దాల్లోంచి వెనక్కి దూసుకుపోతోన్న దుకాణాలనూ, మనుషులనూ చూస్తోంది.

"శంకరప్ప జువెలరీస్" అంది మాలిని.

డ్రయివర్ దుకాణాలను చూసుకుంటూ కారును స్లో

చేశాడు.

శంకరప్ప జువెలరీస్ ముందు కారు ఆగింది. డ్రయివర్ చటుక్కున కారు దిగి వెనక డోర్ తెరిచాడు.

మాలిని హుందాగా కారు దిగింది. వానిటీబాగ్ భుజాన వ్రేలాడుతోంది. నిండుగా కట్టుకున్న చీరా, మాచింగ్ బ్లవుజూ, చెవులకు వూగుతోన్న తేలికపాటి ఆభరణాలూ, కళ్ళకు నల్లటి కళ్ళద్దాలూ, కాళ్ళకు పల్చటి తోలుచెప్పులూ. హుందాగా నడుస్తోంది మాలిని.

శంకరప్ప జువెలరీస్‌లో కలకలం రేగింది.

"సినీనటి మాలిని!"

"ఎంత అందంగా వుంది."

"మన అదృష్టం! మన షాపుకే!"

షాపులోని పనివాళ్ళు గుసగుసలాడుకుంటున్నారు.

శంకరప్ప వాళ్ళను కసిరాడు. పనివాళ్ళు సర్దుకున్నారు.

మాలిని హొయలు ఒలకబోసింది. షాపులో ప్రవేశించింది. నేరుగా శంకరప్ప ముందు ఆగింది.

"నమస్తే అమ్మగారూ!" అన్నాడు శంకరప్ప.

మాలిని సుతారంగా నవ్వి ప్రతి నమస్కారం చేసింది.

"తమరు వచ్చలూర్ వచ్చి ఒక ఏడాదవుతుంది!"

"అవును. ఏడాది క్రిందట మీరు రవ్వల నెక్లెస్ అమ్మారు" అంది మాలిని.

"ఏం చూపించమంటారు అమ్మగారూ!"

"మంచి వజ్రం పొదిగిన నెక్లెస్! హారం తేలికగా వుండాలి. వజ్రం విలువైనది కావాలి!"

శంకరప్ప తల గోక్కున్నాడు.

సేల్స్‌మాన్ వైపు సాభిప్రాయంగా చూశాడు.

సేల్స్‌మాన్ చకచక నగల కేసులు తెరిచి కొన్ని

పెట్టెలు తీసుకువచ్చాడు.

మాలిని వజ్రాలహారాలు పరిశీలించుతోంది.

"గఫార్!" పిలిచాడు శంకరప్ప.

సేల్స్‌మాన్ గఫార్ కదలి ముందుకు వచ్చాడు. "సార్!" అన్నాడు.

"నీలం పొదిగిన హారంకూడా చూపించు!"

గఫార్ క్షణకాలం పాటు తటపటాయించాడు. "ఎస్ సార్!" అన్నాడు. షోకేసు ప్రక్క అరలోంచి నీలం రంగు పెట్టె తీశాడు. కొక్కెం తప్పించి మూత తెరిచాడు.

మాలిని అటు చూచింది.

పల్చటి అల్లికతో వున్న బంగారు హారం. మధ్యలో కళావర్ చుక్కలాగా డిజైను వుంది. కుంకుడుగింజ ఆకారంలో డిజైనుకు మధ్యలో నీలంరాయి పొదిగి వుంది. దానికి అటూ యిటూ తెల్లటి పొదులు పొదిగి వున్నాయి. తెల్లటి రాళ్ళలోంచీ, నేరుగా విద్యుద్దీపాలలోంచి ప్రసరిస్తోన్న కాంతి నీలం రాతిని ధగధగలాడిస్తోంది.

హారం కదిలినప్పుడు నీలం కాంతికిరణాలు పదునుగా షాపులో పరచుకుంటున్నాయి.

మాలిని చూపు త్రిప్పుకోలేకపోయింది. తాను యింత కాలం వజ్రాల గురించే విన్నది. నీలం, పచ్చలూ, వైడూర్యాలూ.... వేటికవే! వేటి తళతళలు వాటివే!

"హారం ఎంత శంకరప్పగారూ!" అడిగింది మాలిని.

"హారం విలువ తక్కువే అమ్మగారూ....పాతిక వేలు. నీలం రాయి పదివేలు! మొత్తం ముప్ఫయి అయిదు!"

మాలిని ఆశ్చర్యపోయింది. నీలం రాతికి అంత విలువ వుందా? శంకరప్ప తనని లాభసాటిగా వాడుకుంటున్నాడా? సినిమా మనుషులకు డబ్బు అంటే లెక్క వుండదని అంత

హెచ్చరిక చెబుతున్నాడా?

పేరుకే కళాసేవ కాని తను నానా గడ్డీ కరచీ ఈ డబ్బు సంపాదిస్తోంది. నగ అందుకుంది మాలిని.

"అమ్మగారూ!" అన్నాడు శంకరప్ప. "రాయి బహు విలువయినది. కొన్ని రాళ్ళు కొంతమందికి సిరి తీసుకు వస్తాయి. మీకు తర్వాతనయినా తేడాగా తోస్తే తిరిగి యివ్వవచ్చును."

మాలిని తలూపింది.

"పాక్ చెయ్యండి!" అంది.

గఫార్ బొమ్మలాగా వింటున్నాడు.

శంకరప్ప ఆమె చేతిలోని నీలంరాయి వున్న నగను అందుకున్నాడు. గఫార్‌కి అందించి, "పాక్ చేయించు" అన్నాడు.

గఫార్ వులిక్కిపడి నగపెట్టె అందుకున్నాడు.

"బిల్లు రాసెయ్యండి!" అంది మాలిని.

శంకరప్ప తలూపి బిల్లు రాసి ఆమె చేతిలో పెట్టాడు.

ఆమె వానిటీ బాగ్ తెరచి డబ్బు చెల్లించింది.

గఫార్ అయిష్టంగానే నగపాకెట్ ఆమెకు అందించాడు.

మాలిని కృతజ్ఞతలు చెప్పుకుని బయటకు నడిచింది.

2

"మమ్మీలను గురించి నీకేం తెలుసు?" అడిగాడు క్రయిమ్ బ్రాంచ్ ఇనిస్పెక్టర్ కుమార్.

"ఈజిప్షియన్ రాజుల శవాలు! భద్రపరచిన శవాలు!" నవ్వాడు శిరీష్.

కుమార్ నవ్వి, "నీ డిటెక్టివ్ బుద్ధికి ఈ మాత్రమే తెలుసునన్న మాట!" అన్నాడు.

"మమ్మీలను పట్టించావు. శవం మాయమయిందా?"

"కాదు. శవం సంపాదించిన నీలం రాళ్ళు మాయ మయాయి."

"అంటే, రెండు వేల సంవత్సరాల క్రితం నాటి రాళ్ళు అన్నమాట."

"అవును. గెరియస్_7 అనే రాజు ఈజిప్టులో కొంత భాగాన్ని పరిపాలించాడు. క్రీ.పూ. 80 లో రాజ్యం పతన మయింది. అతడి శవాన్ని నమ్మకస్తులు కొందరు భద్ర పరచి వుంచారు.

అతడు బతికివున్న రోజులలో రెండు నీలాలు సంపా దించాడు. అతడి చివరి కోరిక ప్రకారంగా ఎడారి దేవతకు రెండు కళ్ళుగా వాటిని అమర్చారు. ఇప్పుడు దేవతకళ్ళు మాయమయాయి."

"విలువయిన నీలాలా అవి?"

"అవును, ఒకో నీలంరాయి లక్షకు తక్కువచేయదు!"

"రెండు నీలాలూ రెండులక్షలన్న మాట!"

"కాని....శిరీష్! నీకు ఎడారి ప్రజల నమ్మకాలు తెలి యదా?"

"తెలుసు. వాళ్ళకు వాళ్ళ దేవత కళ్ళు లక్షలకంటె ఎక్కువ విలువయినవి!"

"అవును. మమ్మీలకు శక్తులుంటాయనీ, ఆ నీలం రాళ్ళు తెచ్చి దేవతకు అమర్చకపోతే వాళ్ళ జాతిని మమ్మీ నాశనం చేస్తుందనీ వాళ్ళ నమ్మకం!"

శిరీష్ నిట్టూర్చాడు.

"నాగరికత పెరిగేకొద్దీ విశ్వాసాలు తగ్గుతాయి. హేతువు కోసం నాగరికులు వెంపర్లాడతారు. ఎడారి ప్రజలకు ఎవరు తెలియచెబుతారు?"

"నీలం రాళ్ళు ఇండియా వచ్చాయి. ఎడారి ప్రజల్లో

మెరికల్లాంటి వాళ్ళు కొందరు మన దేశంలోకి దొంగ తనంగా వచ్చారని గూఢచారి వార్తలు వచ్చాయి."

"ఈజిట్?" శిరీష్ నుదురు చిట్లించాడు.

"అవును....కొంత కాలం క్రితం 'కుక్కలగోల' అనే కేసు జరిగింది. కర్ణాటక రాష్ట్రంలో పచ్చలూర్. గుర్తు వచ్చిందా?"

"అవును. శంకరప్పా జువెలరీస్‌లో దొంగలు పడ్డారు. పచ్చలూర్ నిండా వూరకుక్కలు. అవే దొంగలను విచిత్రంగా పట్టించాయి."

కుమార్ కుర్చీలో వెనక్కి వాలాడు.

"శంకరప్ప జువెలరీస్‌లో పనిచేసే గఫార్ అనేవాడిని ఎవరో చంపేశారు."

"గఫార్‌ని ఎక్కడ చంపేశారు?"

"హైదరాబాద్‌లో."

శిరీష్ తల విదిలించాడు.

"ఎక్కడి పచ్చలూరు? ఎక్కడి హైదరాబాదు?"

"అవును. కర్నాటక పోలీసులూ మనమూ కలసి నీలం రాళ్ళు వెతకవలసిన పనిలో పడ్డాం."

శిరీష్ నవ్వలేక నవ్వి, "గఫార్ చావుకూ, నీలంరాళ్ళకూ సంబంధం వున్నట్టు ఎలా తెలిసింది?" అన్నాడు.

కుమార్ బల్ల సొరుగులోంచి కాగితాలు తీశాడు.

"ప్రసిద్ధ సినీనటి మాలిని హైదరాబాదులో వుంటోంది. ఆమె యిటీవల మైసూర్‌లో అవుట్‌డోర్ షూటింగులో పాల్గొన్నది. షూటింగ్ యింకా రెండు రోజులలో ముగుస్తోంది అనగా మాలిని పచ్చలూర్ వెళ్ళింది."

"ఒక్కర్తే వెళ్ళిందా?"

"తన కాడిలాక్‌లో వెళ్ళింది. ఆమెవెంట డ్రయివర్

వున్నాడు."

శిరీష్ తలూపాడు.

"శంకరప్ప జువెలరీస్‌లో గఫార్ అనేవాడు పనిచేస్తో న్నాడు. మాలినికి నీలం రాయి పొదిగిన బంగారు హారం పాక్ చేసి యిచ్చాడు. దాని వెల ముప్ఫయి అయిదువేల రూపాయలు చెల్లించి మాలిని షూటింగుకు తిరిగివచ్చింది."

"షూటింగ్ ఎక్కడ జరిగింది?"

"కోలార్ గనికి యివతల."

"తర్వాత."

"గనికి దగ్గరలోనే గెస్ట్‌హౌస్ వుంది. సినిమా సిబ్బం దికి గెస్ట్‌హౌస్ యిచ్చారు."

"మాలిని నగ కొన్న తర్వాత షూటింగులో పాల్గొ న్నదా?"

"పాల్గొన్నది. ఆమెమీద సోలో చిత్రీకరించారు. చిత్రీ కరణలో మాలిని కొత్తగా కొన్న నగ ధరించింది."

"తరువాత?"

"గఫార్ ఆమెను నగకొన్న సాయంకాలం కలిశాడు."

"గఫార్ ఆమెను ఎందుకు కలిశాడు."

"మాలిని కథనం ప్రకారంగా ఆమె కొన్న నగకు ముప్ఫయి అయిదువేల రూపాయిలు తీసుకుని నగను తిరిగి యివ్వమని గఫార్ కోరాడు. మాలిని ఒప్పుకోలేదు."

"గఫార్ ఏమన్నాడు?"

"కనీసం 'నీలం రాతి'ని యిచ్చెయ్యమన్నాడట. ప్రతిగా తాను మరో నీలం రాతిని తీసుకువచ్చినట్టు చెప్పా డట!"

"అంటే నగలో మొదట పొదిగివున్న నీలంరాయి దేవతా కళ్ళలో ఒక కన్ను అన్నమాట!"

"అవును. గఫార్‌ని తిరస్కరించి మాలిని హైదరాబాద్ తిరిగి వచ్చింది. గఫార్ ఆమెను వెంబడించుకు వచ్చాడట."

శిరీష్ కళ్ళు మూసుకున్నాడు.

"శంకరప్ప జువెలరీస్‌కి ఆ నీలంరాయి యెలా వచ్చింది?"

"సౌదీ అరేబియా నుంచి వచ్చిన ఒకతను దానిని అమ్మాడట!"

శిరీష్ నవ్వి, "నిన్ను హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ చేశారు. మొదటి కేసుగా దీన్ని ఒప్పచెప్పారు. నువ్వు నన్ను పిలిచి రప్పించావు" అన్నాడు.

కుమార్ తలూపాడు. "ఈ కేసులో కర్నాటక పోలీసులకు ఎంత తెలుసో నీకు చెప్పాను."

"గఫార్ ఎలా చనిపోయాడు?"

"గఫార్‌ను తీవ్రంగా హింసించారు. కాళ్ళూ చేతులూ కట్టి మూసీ నదిలో పారవేశారు. శవం బాగా పాడయి పోయింది."

"హింసలకు తట్టుకోలేక గఫార్ నీలంరాయి మాలిని దగ్గర వున్నట్టు హంతకులకు చెబుతాడు."

కుమార్ తల విదిలించాడు. కాగితాలు బల్లమీద పెట్టి బరువుగా నిట్టూర్చాడు. "మాలిని ఇంటిమీద గఫార్ దాడి చేశాడు. నీలంరాతిని దొరకబుచ్చుకున్నాడు."

"మాలిని పోలీసులకు రిపోర్ట్ యిచ్చిందా?"

"అవును. ఈ కాగితాలు చదువు. మాలినివద్ద గఫార్ నీలం దొంగిలించాడు. ఆ విషయం శత్రువులు గ్రహించారు. గఫార్‌ను వెంటాడారు. మాలిని పోలీసు రక్షణ కోరింది."

"అయితే ఎడారి మనుషులకు ఒక నీలం రాయి దొరికింది. రెండో నీలం రాయి కూడా వాళ్ళకు దొరికిందా? లేదా? దొరికివుంటే ఈ పాటికి దేశం విడిచిపెట్టి పోతూంటారు."

"అందుకే యిప్పుడు మనం ఏం చేయాలో తోచడం లేదు."

3

మాలిని మంచం దిగింది. మెడ తడుముకుంది. అద్దం వైపు నడిచింది.

అద్దంలో తన మెడను చూచుకుంది.

మెడ చుట్టూ ఎర్రటి చారవుంది. మాలినికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అమ్మగారూ!"

అద్దంలోంచి గుమ్మంలోకి చూచింది మాలిని.

పనిమనిషి గుమ్మంలో నిలబడివుంది.

"ఏం?" అడిగింది మాలిని.

"మీ కోసం పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గారూ మరొకాయనా వచ్చారు. హాలులో కూర్చోబెట్టాను."

"వస్తున్నాను" స్కార్ఫ్ అందుకుంది మాలిని. మెడ చుట్టూ సున్నితంగా అదుముకుంది.

గదిలోంచి బయటకు నడిచింది.

హాలులో క్రయిమ్‌బ్రాంచ్ ఇనస్పెక్టరూ, డిటెక్టివ్ శిరీషా కూర్చున్నారు.

"నమస్తే!" అంది మాలిని చేతులు జోడించి.

అపరాధ పరిశోధకులు ప్రతినమస్కారం చేశారు.

"గఫార్ మీ మీద దాడి చేశాడనీ పోలీస్ రక్షణ కావాలని మీరు పెట్టుకున్న దరఖాస్తునుబట్టి వచ్చాం!" అన్నాడు

ఇనస్పెక్టర్ కుమార్.

మాలిని భయంగా మొహం పెట్టింది.

"గఫార్ పరమ దరిద్రుడు. నేను నగను కొన్నదగ్గర నుండి నా వెంటపడి నాకు సుఖశాంతులు లేకుండా చేశాడు" అంది కసిగా.

"ఏం? అతను ఆ నగను షాపులోనే దొంగిలించవచ్చుగా మీ వెంట ఎందుకుపడ్డాడు?"

"నేను అదే అడిగాను. సాయంకాలం షాపు మూసే ముందు శంకరప్ప పనివాళ్ళను తణిఖీచేసి పంపిస్తాడట! అందువల్ల వీలుకాలేదట. ఆ నీలంరాయి షాపుకు వచ్చి రెండు రోజులు కూడా కాలేదట. శంకరప్ప దానిని వెంటనే నగలో పొదిగించాడు. ఆ వెంటనే నగను నేను కొనటమైంది. అందువల్ల గఫార్‌కు అవకాశం చిక్కలేదట. నా వెంటపడ్డాడు—"

ఆమె నగ చూపించింది. నగ బోసిగా వుంది. దానిలో నీలం రాయి లేదు.

"గఫార్ మీ మీద దాడిచేసి నీలం రాతిని ఎలా అపహరించాడు?"

"ఆ రోజు ఆగస్టు 5. నా పుట్టిన రోజు. కొత్తగా కొన్న నగను ధరించాను. పుట్టిన రోజు పార్టీ అయిపోయింది. నేను పది గంటలవుతోనే తేలికగా భోజనం చేశాను. గదిలోకి నడిచాను. గఫార్ ఎక్కడి నుండి వూడిపడ్డాడో నా గదిలో ప్రత్యక్షమయ్యాడు.

నేను అదిరిపడ్డాను.

"మాలినీ! నగ యిస్తావా? ప్రాణాలు తీయమన్నావా?"

అరిచాడు గఫార్.

నాకు నోట మాట రాలేదు. నగ యింకా నా మెడలోనే వుంది. నగమీద మోజు నా ప్రాణాలకు తెచ్చింది.

గఫార్‌ను బతిమాలాను.

నా మీదకు దూకాడు, మెడలోని నగను గుంజుకున్నాడు. చాల సులువుగా నీలం రాయిని ఒలిచాడు. నగను నేలమీద కొట్టాడు. నేను అరవబోయాను. నా నోరు నొక్కిపెట్టాడు.

"అరిచావా! చంపిపారేస్తాను!" అన్నాడు గఫార్.

తర్వాత పకపక నవ్వి, "రెండు నీలం రాళ్ళు!" అని మరో నీలం రాయి కూడా తీసి చూపించాడు.

రెండు నీలంరాళ్ళూ తన చొక్కాజేబులో దాచుకున్నాడు. తలుపు తెరుచుకుని పారిపోబోయాడు. అతడి చొక్కా అంచు తలుపు కొక్కెంలో యిరుక్కుంది.

చొక్కా చిరిగింది. పీలిక కొక్కెంలో వుండిపోయింది. గఫార్ పారిపోయాడు.

నేను పీలిక ఆధారంగానూ, గాయపడిన కంఠం ఆధారంగానూ పోలీస్ కంప్లయింట్ యిచ్చాను."

మాలిని ఆగింది. బరువుగా వూపిరి పీల్చుకుంది.

"కాని పోలీసులు వెతికేటప్పటికి గఫార్ శవం మూసీ నదిలో దొరికింది. అతడిని ఎవరో కొట్టి చంపారు. అతడి వద్ద నీలంరాళ్ళు దొరకలేదు!" అంది మాలిని.

అపరాధ పరిశోధకులు మౌనంగా వినసాగారు.

మాలిని మెడమీద స్కార్ఫ్ తొలగించింది. మెడ చుట్టూ ఎర్రటి చార! చారకి అటూ ఇటూ చర్మం కంది పోయి వుంది. కంఠంమీద ఎర్రని మరక మాసినట్టుగా చర్మంమీద అట్టకట్టింది.

"నీలంరాళ్ళు మీ వద్ద లేవు. అందువలన మీకు వచ్చిన ప్రమాదంలేదు" అన్నాడు శిరీష్.

మాలిని నిట్టూర్చింది. "గఫార్‌ను వెంటాడుతోన్న శత్రువులే నీలంరాళ్ళను సంగ్రహించివుంటే నాకు ప్రమాదంలేదు."

శిరీష్ తలత్రిప్పి, "కుమార్! మనం వెళ్దాం!" అన్నాడు.

కుమార్ లేచాడు.

మాలినివద్ద ఇద్దరూ సెలవు తీసుకున్నారు.

కుమార్ జీపు స్టార్ట్ చేశాడు. శిరీష్ జీపులో కూర్చున్న తరువాత జీపు కదిలింది.

"పచ్చలూర్‌లో గఫార్ శత్రువులు హైదరాబాద్ వచ్చారంటావా?"

"మనం పచ్చలూర్ వెళ్ళి వచ్చాం. గ్రామం అంతా దర్యాప్తు చేశాం. పచ్చలూర్‌లో కొత్తవాళ్ళు ప్రవేశించలేదు."

"కొత్త వాళ్ళను చూచి వూరకుక్కలు మొరుగుతాయి. పచ్చలూర్‌లో కుక్కలు అలాకాదు. అవి ఎప్పుడూ మొరుగుతూనే వుంటాయి. కొత్తవాళ్ళను చూచి మొరగడం మానేస్తాయి.

"పచ్చలూర్ కుక్కలు రాత్రివేళల్లోనే నిర్విరామంగా మొరుగుతాయి. కొత్తవాళ్ళను చూచి మొరగడం ఆపుతాయి."

"గఫార్ శత్రువులు చీకటి మనుషులు. గఫార్ పగలంతా శంకరప్ప జువెలరీస్‌లో వుంటాడు. నీలంరాళ్ళు గఫార్ దగ్గర వుండివుంటే అతడి శత్రువులు అతడిని రాత్రి

వేళలో ఎదుర్కొంటారు. కాని రాత్రివేళల్లో పచ్చలూర్ కుక్కలు కొత్త మనుషులు గ్రామంలో ప్రవేశించినట్టు సూచన ఇవ్వలేదు. అంటే గఫార్‌ను వెంటాడేది కొత్త మనుషులు కాదన్న మాట! పచ్చలూర్‌కి పరిచయమైన మనుషులేనన్న మాట?''

"కాని అతడి భార్యను మనం కలుసుకోలేదు. హైదరాబాద్ వచ్చింది. పోస్ట్‌మార్టం చేసిన భర్త శవంకోసం పడిగాపులు కాస్తోంది.''

"పద! పోస్ట్‌మార్టం రిపోర్ట్ చూద్దాం!''

"ఎందుకు? కాపీ నా దగ్గరే వుంది!'' కుమార్ రిపోర్ట్ అందించాడు.

శిరీష్ రిపోర్ట్ చదివాను.

"ఆగస్ట్ 6వ తేదీన గఫార్ శవం మూసీనదిలో దొరికింది. కాళ్ళకూ చేతులకూ కట్లు కట్టివున్నాయి'' అన్నాడు శిరీష్.

4

మాలిని కంగారుగా స్టూడియోలోంచి బయటపడింది. కాడిలాక్ కారును బయలుదేరతీసింది.

కారుకి అడ్డంగా జీపు ఆగింది.

కాడిలాక్ కారుకు సడెన్ బ్రేకు వేసింది మాలిని.

జీపులోంచి కుమార్ దిగాడు.

మాలిని అతడివైపు విడ్డూరంగా చూసింది.

కారు డోర్ తెరచి డ్రయివింగ్ సీట్లో కూర్చున్నాడు. మాలిని ప్రక్కకు జరిగింది.

"ఎక్కడికి?'' తడబడుతోంది మాలిని

"మార్చ్యురీకి!'' కారు కదిలింది.

"ఎందుకు?"

"డిటెక్టివ్ శిరీష్ తీసుకురమ్మన్నారు."

మాలిని అరచేతులతో మొహం కప్పుకుంది.

కాడిలాక్ కారు మార్చ్యురీ ముందు ఆగింది.

మాలినిపనిమనిషితో శిరీష్ మాట్లాడుతూ కనిపించాడు.

కుమార్ మాలినిని అటు నడిపాడు.

బల్లమీద శవం వుంది. శవంమీద తెల్లటిబట్ట కప్పి వుంది. డిటెక్టివ్ శిరీష్ మాటలు ఆపాడు.

చటుక్కున శవం మొహంమీది గుడ్డ తొలగించాడు.

గఫార్ మొహం మంచుమీద వుండీ వుండీ పాలిపోయి వుంది. గదిలో చల్లటిగాలీ, సహించలేని వాసనా. వాతావరణంలో సుఖంలేదు.

మాలినీ, పనిమనిషీ మొహాలు చూసుకున్నారు.

"మాలినీ! నువ్వు ఆగస్ట్ మూడో తారీకు రాత్రి హైదరాబాద్ తిరిగి వచ్చావు. నాలుగో తారీకూ, అయిదో తారీకున నీకు ఇన్‌డోర్ షూటింగ్ వుంది. అయినప్పటికీ కాల్‌షీటు రద్దుచేసుకున్నావు. ఎందుకు?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"పచ్చలూర్, కోలార్ ప్రయాణాలతో విసిగిపోయాను. అందుకే విశ్రాంతి తీసుకున్నాను."

మాలిని అనుమానంగా పనిమనిషి వైపు చూచింది.

"అబద్ధం! నీ వెంటపడి గఫార్ హైదరాబాద్ వచ్చాడు. గెస్ట్‌హవుస్‌లో గఫార్ నిన్ను కలిశాడు. అతడు తిరిగి పచ్చలూర్ వెళ్ళలేదు. గఫార్ నీలంరాయి ఒకటి సంపాదించాడు. రెండో నీలంరాయి వున్న నగ నీ వశం అయింది. అందుకే గఫార్ నిన్ను వెంబడించాడు. గెస్ట్ హవుస్‌లో నువ్వు గఫార్‌చేత విషయం చెప్పించుకుని

నీలంరాళ్ళు విలువైనవని గ్రహించావు. గఫార్ నీ వద్ద లాక్కుండే ప్రయత్నం చేస్తే అక్కడే చేసేవాడు. కాని అతడిని ఏం చెప్పి ఒప్పించావో హైదరాబాద్ రప్పించావు" ప్రశ్నార్థకంగా చూశాడు శిరీష్.

మాలిని పనిమనిషి చెప్పసాగింది.

"గఫార్ మొండి మనిషి. మాలిని అతడిని కాళ్ళూ చేతులూ బంధించి వుంచింది. అతడిని హింసించింది. హింసపెట్టే కొద్దీ అతడు మొండిగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. మాలిని అతడిని ఇనుపరాడ్‌తో కొట్టింది. గఫార్‌కి స్పృహ తప్పింది. ఆ స్థితిలో అతడు మరణించాడని మాకు తోచి భయపడ్డాం. ఆ కారులో గఫార్‌ను మూసీనది వరకు తీసుకువెళ్ళాం. నదిలో పారవేసే ముందు గఫార్‌కి స్పృహ వచ్చింది. మా యిద్దరి గురించీ అతడు చెప్పడానికి వీలు యివ్వకూడదనిపించి అతడిని కట్లతో నదిలోకి దొర్లించాం.

మాలిని నాకు బంగారు భవిష్యత్తుమీద ఆశలు రేపింది. గఫార్ లేకపోతే ఈ నీలంరాళ్ళ గురించి గొడవలు రేపే వాళ్ళు వుండరు. అందుకే గఫార్ దౌర్జన్యంగా మాలిని నుండి నీలంరాయి ఎత్తుకుపోయినట్టు నాటకమాడాం" అంది మాలిని పనిమనిషి.

శిరీష్ పోలీసుల వైపు తిరిగాడు.

"నాటకం విషయం నాకు తెలిసింది. మాలిని మెడ లోంచి నగను లాక్కునివుంటే గఫార్ ఎలా లాగుతాడు? నగ కొక్కెం మెడ వెనుక వుంటుంది. మెడముందు చెయ్యివేసి నీలంరాయి తన చేతిలో వుండేలాగా పట్టుకుని లాగుతాడు. ఆ భంగిమలో మాలిని మెడ వెనుకభాగంలో

అర్ధ చంద్రాకారంగా గాయమవుతుంది. తప్పితే గొంతు మీద కూడా గాయం కాదు. మాలిన గొంతుమీద గాయం వుంది. మెడచుట్టూ కూడా గాయం వుంది. పరిశీలించి చూస్తే అది గాయంకాదు. సినిమాకు పనికివచ్చే మేకప్. తలుపు కొక్కానికి గఫార్ చొక్కాలో కొంత భాగం ఇరుక్కోవడం ఏమిటి? చొక్కాలో భాగం కత్తిరించి కొక్కానికి తగిలించారన్న మాట. మాలిని చెప్పిన అంశాల్లో అసంబద్ధమైన విషయాలు గ్రహించాను.

అందుకే ఆమె ఎలిబీలను పరీక్షించమని ఇనస్పెక్టర్‌కి చెప్పాను.

గఫార్ వద్ద రెండు నీలంరాళ్ళు వున్నట్టు నిరూపించాలని ఆమె తహతహలాడింది. ఎందుకు? గఫార్‌ను ఎవరో చంపి అతడివద్ద వున్న నీలంరాళ్ళు ఎవరో అపహరించినట్టు ప్రపంచం భావించాలి" అన్నాడు శిరీష్, పోలీసుల మధ్య వున్న కుమార్‌ను చూచి.

"మరి నీలంరాళ్ళ వెంట పడిన ఎడారి మనుషులు...." ఆగాడు కుమార్.

"వాళ్ళు పచ్చలూర్ కానీ హైదరాబాద్ కానీ చేరుకోలేదనుకోవచ్చు."

"మాలినీ! నీలంరాళ్ళు ఎక్కడ దాచావు?" గద్దించాడు కుమార్.

మాలిని తన జడ కొప్పులోంచి రెండు నీలంరాళ్ళు తీసింది. నీలంరాళ్ళు తళతళలాడాయి. నీలం నేత్రాలు! నేత్రాల కాంతి గఫార్ మొహంమీద తాత్కాలికంగా కదలాడింది.

నీలంరాళ్ళు కుమార్ చేతిలో పెట్టింది మాలిని. □

వసుంధర

రాయరు సలహా

అతడు గదిలో దూరి ఏదో వెతుకుతూండగా ఎవరో వస్తున్న అలికిడయింది. అతను చటుక్కున మంచం కిందకు దూరాడు.

అప్పుడు గదిలోకి పద్మ ప్రవేశించింది. ఆమెకు వయసు పదహారే—కానీ వయసు పొంగులు—ఇరవై ఏళ్ళదా

అనిపించేలా వుంటాయి. పద్మ గదిలోకి వస్తూనే తలుపులు వేసింది. తిన్నగా డ్రస్సింగు టేబుల్ వద్దకు వెళ్ళింది.

వళ్ళెప్పుడూ ఘుమ ఘుమ లాడుతూండడం పద్మకు యిష్టం. అయితే చదువుకుంటున్న కారణంగా రోజూ తీరు బడి చిక్కదు.

ఈ రోజు పద్మకు స్కూలు లేదు. తండ్రి ఊళ్ళో లేడు. అన్న ఇంటర్ కాలేజీ పోటీలకు వెళ్ళాడు. తల్లి మూన్‌షోకి వెళ్ళింది. యింట్లో ఆమె ఒక్కతే వుంది.

పద్మకూ యింట్లో ఉండే ఆసక్తి లేదు. ఆమె తన స్నేహితురాలింటికి వెడదామనుకుంటోంది. ఘుమ ఘుమ లాడేలా తయారయి వెళ్ళాలని ఆమె ఈ గదిలో అడుగు పెట్టింది. ఇలాంటి అవకాశం ఆమె కెప్పుడోగానీ రాదు.

పద్మకు వళ్ళంతా పౌడరు రాసుకోవడం ఎంతో ఇష్టం. నిలువు టద్దం ఈ ఒక్క గదిలోనే వుంది. ఈ గదిలో ఎక్కువసేపుంటా నంటే తల్లి ఊరుకోదు. ఇప్పుడు తన నడిగేవాళ్ళు లేరు.

స్నేహితురా లింటికి తను ఏ బట్టలు వేసుకుని వెళ్ళాలో పద్మ ముందే నిర్ణయించుకుంది. బీరువా తాళాలు బీరువానే వున్నాయి. ఆమె బీరువాలోంచి బట్టలు తీసి మంచంమీద పెట్టింది. ఆమె మంచం సమీపిస్తూంటే అతడు మంచం క్రింద ఊపిరి బిగబట్టాడు.

ఆమె మళ్ళీ డ్రస్సింగు టేబిలు సమీపించింది. వంటి మీంచి ఒకటొక్కటిగా బట్టలు తీసేసింది. అద్దంలో ప్రతి బింబాన్ని చూసి—"ఎంత బాగున్నాను?" అనుకుంది.

ఆమె నిజంగా అప్పుడు అజంతా శిల్పంలాగుంది. ఇలా తనను అద్దంలో ఎక్కువసేపు చూసుకునే అవకాశం ఆమెకు అస్తమానూ రాదు.

పద్మ పౌడరుడబ్బా తీసింది. చేతిలో పౌడరు వేసుకుంది.

మంచం కింద అతడికి ఊపిరి వేడెక్కింది. అతడు కోరుకోని దృశ్యమిది. ఏ రోజు ఏ దేవతలను మెప్పించాడో యీ రోజీ దేవతా స్వరూపం యిలా కనికరించింది.

ఆమె వళ్ళంతా పౌడరు రాసుకుంటోంది.

అతడు చూస్తున్నాడు. తళతళ మెరిసే ఆమె శరీరాన్నీ, ఆమె శరీరంలోని సొగసైన వంపుల్నీ, అందమైన కదలికల్నీ.........

పద్మకు పౌడరు చాలలేదు. ఆమె మళ్ళీ పౌడరుడబ్బా అందుకుంది. చటుక్కున చేయి జారిందది. కొద్దిగా పౌడరు నేలమీద పడింది.

గుండ్రటి డబ్బా అది. నేలమీద పడగానే అది దొర్లుకుంటూ మంచం కిందకు వెళ్ళింది. అతడు కంగారుగా మరింత లోపలకు జరిగాడు.

పద్మ మంచం దగ్గరకు వచ్చింది. వంగుని చూసింది. అంతా చీకటిగా వుంది. కానీ అతడికామె కనబడుతోంది. కనబడి ఆవేశాన్ని కలిగిస్తోంది. కానీ....

ఆమె చేయి జాపింది. డబ్బా తగల్లేదు.

అప్పుమె మంచం కిందకు దూరింది.......

* * *

"ఛీ—యీ కథ నే నింక చదవను...." అంది రాధ.

"ఏం?" అన్నాడు గౌరీనాథం.

"ఇలాంటి కథ రాశారేమిటీ?" అంది రాధ.

"అంటే?" అన్నాడు గౌరీనాథం.

"అంతా పాడు సెక్సు!"

గౌరీనాథం ముఖం గంభీరంగా అయిపోయింది.— "ఇందులోని సెక్సు పాడుగా వున్నదనా—లేక అసలు

సెక్సే పాడు అనా నీ అభిప్రాయం-ఆలోచించి మరీచెప్పు!"

సెక్సు పాడు అనాలంటే పెళ్ళి గురించి అడుగుతాడు భర్త. తమ యిద్దరి సంబంధం గురించీ నిలదీస్తాడు. అందుకని—"ఇందులోని సెక్సే పాడుగా వున్నదని నా అభిప్రాయం—" అంది రాధ.

"పాడు అంటే నేను అసభ్యంగా రాశానా?" అన్నాడు గౌరీనాధం.

"ఊఁ" అంది రాధ.

"స్నానాల గదిలో బట్టలు లేకుండా స్నానం చేస్తాం. ఆ విషయం రాస్తే అది అసభ్యమవుతుందా? నే నేమీ అంగాంగ వర్ణన చేయలేదే—సృష్టి కార్యాన్ని వివరించ లేదే!" అన్నాడు గౌరీనాధం.

"అది కాదు...." సాలోచనగా అంది రాధ.

"మరి బట్టలు విప్పుకుని పౌడరు రాసుకోవడం-అసహజ మంటావా? స్నానం చేయగానే నువ్వేం చేస్తావుట?"

"అది కాదండీ—అవన్నీ రాయడంవల్ల ప్రయోజన మేమిటి?"

"రాయకూడదని ఎందుకంటున్నావో ముందు చెప్పు నాకు—"

"ఈ కథ మీరు మీ చెల్లెలికి చదివి వినిపించగలరా? ఈ కథ మీ చెల్లెలు చదువుతోందని తెలిస్తే మీ కేమనిపి స్తుంది?" అంది రాధ సూటిగా.

గౌరీనాధం తమాషాగా నవ్వాడు—"చాలా ఏళ్ళు నేనూ నా చెల్లెలూ ఒకే మంచంమీద పడుకునేవాళ్ళం. ఇప్పుడలా చేయగలనా? దానికింకా పెళ్ళి కాలేదు. నువ్వూ నేనూ ఒకే గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుని పడుకుంటాం. దాని గురించి అదేమనుకుంటుందో ఆలోచిస్తావా? లేకపోతే

వివరించి దానికి చెబుతానా? ఆలోచించి చెప్పు...."

"మీతో వాదించడం కష్టం...." అంది రాధ.

"వాదించడం కష్టం కాదు. నీ ఆలోచనల్లో లోతు లేదు. లోతుగా ఆలోచించడం నీ కిష్టముండదు. ఒక అమ్మాయికీ, అబ్బాయికీ మధ్య కొత్త ప్రణయ సన్నివేశం సృష్టించి వ్రాయగానే ఏదో తప్పు జరిగిపోయినట్లు భావించే తప్పు—నువ్వే కాదు—చాలామంది చేస్తున్నారు...." అన్నాడు గౌరీనాథం.

"పోనీ మీరలా వ్రాయడం వల్ల యేం ప్రయోజన మాశిస్తున్నారో చెప్పండి" అంది రాధ సవాలు చేస్తున్నట్లు.

"అలా అడిగావు బాగుంది—" అన్నాడు గౌరీనాథం.

మన కుటుంబాల్లో పరిచితుల మధ్య, అపరిచితుల మధ్య సెక్సు సంబంధాలు ఏర్పడడానికి ఎన్నో రకాల కారణాలు, అవకాశాలు వుంటాయి. ఏ విధమైన దురుద్దేశ్యమూ లేని మనిషి క్షణాలమీద యెందుకు మారిపోతాడు? మనిషి మారి పోవడంలో ఎంతవరకూ న్యాయముంటుంది? తప్పు పరిస్థితులదా? బలహీనతదా?—ఈ విషయాన్ని రచయిత సమగ్రంగా చర్చించ గలగాలంటే ముందు ఆ పరిస్థిని వీలయినంత సభ్యంగా వర్ణించాలి. అలా వర్ణించేక ఆ పరిస్థితి బలా బలాలను పాఠకులే అంచనా వేసుకుంటారు.

"ఈ కథలోని అతడు పద్మకు బావ. ఏదో భావావేశంలో ఆమెకు ప్రేమలేఖలు వ్రాసి ఆ పడకగదిలో పద్మ తరచుగా వాడే ఓ ప్రదేశంలో వుంచాడు. అయితే ఆ తర్వాత అతడికి భయం వేసింది. విషయం తలిదండ్రుల దాకా వెడితే కొంపలు మునిగిపోతాయని భయపడి ఆ ఉత్తరం వెనక్కు తీసుకుందామని రహస్యంగా ఇంట్లో ప్రవేశించి గదిలో దూరాడు.

అయితే పరిస్థితులు తారుమారయాయి. ఇద్దరూ ఒక టయ్యారు. కుర్రాడు తన కూతుర్ని మోసం చేశాడని పద్మ తండ్రి అంటాడు. పద్మ అతడిని వలలో వేసుకోవా అని చూసిందని అతడి తలిదండ్రులు అంటారు. ఈ గొడవల మధ్య ఆనాడు జరిగిన ఆ కథ మరుగున పడిపోతుంది.

ఆ క్షణంలోని హృదయస్పందన వెనుక ఏ మోసాలూ, కుతంత్రాలూ లేవు. అది రెండు హృదయాల పరస్పర స్పందన ఫలితంగా జరిగిన సమాగమం. ఆ క్షణానికే పరిమితం. దీనికి సమాజం ఎన్ని ఆంక్షలు విధించింది? ఆ ఆంక్షలలోని న్యాయాన్యాయాల సంగతేమిటి? యువక హృదయాలకు సమాజపు శాసనాలు మేలు చేస్తున్నవా? యివన్నీ చర్చించాలంటే ఆ పరిస్థితిని ఆ మాత్రం వర్ణించక తప్పదు...."

"ఏమో బాబూ—మీకు తోచినట్లు రాసుకోండి. ఈ కథ ప్రచురణ జరిగేక అందరూ మీ మీద నాలుగు రాళ్ళు వేస్తే అప్పటికి మేలుకుంటారు. ఇంక నేనేం చెప్పను? ఏదో వంకపెట్టి కథల్లో సెక్సు జొప్పించడం చాలామంది చేస్తున్నారు. ఈ పని మీరూ మొదలెట్టారని సరిపెట్టుకుంటాను........" రాధ చిరాగ్గా అంది.

గౌరీనాథం బాధగా—"నువ్వా అలాగే అంటే నాకు బాధగా వుంటుంది. ఈ కథను పంపడం మానేస్తాను—" అన్నాడు.

రాధ అతడివంక అదోలా చూసి—"కథ మీకు మంచిదనిపిస్తే పంపుకోండి. మీకంటే నాకు ఎక్కువేం తెలుసు?" అంది.

"అది కాదు రాధా! నా కథలు చదివేవాళ్ళకి నా నుంచి ఓ ప్రత్యేకమైన ఎక్స్పెక్టేషన్ వుంటుంది. నా కథను

అందరి కథల్లా కాక ప్రత్యేక దృష్టితో చదువుతారు నా పాఠకులు. అందువల్ల నేనేం రాసినా తప్పు పట్టడానికి చూడరు. అందులో ఏదో వుందని భావించి చదువుతారు. ఇంతవరకూ నా పాఠకులను నేను నిరుత్సాహ పరచలేదు. ఈ కథ కూడా అలాంటిదే—కానీ నువ్వు వద్దంటే మాత్రం పంపను....'' అన్నాడు గౌరీనాథం.

రాధ క్షణం ఆలోచించి—''అబద్ధమెందుకూ—ఈ కథ నాకు చీప్‌గా అనిపించింది. కానీ ఈ కథను మీరు పంపండి. నా అభిప్రాయం ప్రకారం మీ అభిమాన పాఠకులు కొందరయినా మిమిల్ని తిడుతూ వుత్తరం వ్రాస్తారు. అలా జరిగిన పక్షంలో మీరు మళ్ళీ యిలాంటి కథలు రాయకూడదు. అలాకాక యీ కథ పడిన రెండు మాసాలవరకూ మీకు ఎలాంటి ఉత్తరాలూ రాకపోతే యిలాంటి కథలు కూడా మీరు వ్రాయవచ్చు—సరేనా?'' అంది.

గౌరీనాథానికి ఇది సవాలుగా తోచింది. సరే నన్నాడు.

* * *

అతడు కథను పంపించాడు. పంపిన రెండు మాసాల్లో ప్రచురణ జరిగింది. కథ ప్రచురణ జరిగిన పది రోజుల్లో గౌరీనాథానికి పదిహేను ఉత్తరాలు వచ్చాయి.

అన్నీ కథను పొగుడుతూ రాసినవే!

సెక్సు గురించి మాట్లాడడమే అపరాధమనుకునే మా ఆలోచనల్లో గొప్ప మార్పు వచ్చిందని కొందరూ, చీకటి తప్పులోని హ్యూమన్ ఫాక్టర్ని చక్కగా ఎనలైజ్ చేశారని కొందరూ, ఆరంభం చూసి మా అభిమాన రచయిత యిలా యెందుకు రాశాడా అని తిట్టుకున్నామనీ కథ పూర్తిచేశాక పొరపాటు తెలిసివచ్చిందని కొందరూ—యిలా అందరూ ఆ కథను అభినందిస్తూనే రాశారు.

గౌరీనాథం భార్యదగ్గర గర్వాన్ని ప్రకటించాడు. అయితే రాధ రెండు మాసాల గడువుకోసం ఎదురుచూస్తోంది. అయితే ఆమె గడువు పూర్తయ్యేవరకూ ఆగనవసరం లేకుండానే రాధ కోరిన ఉత్తరం రానేవచ్చింది. ఉత్తరం కూడా మామూలు పాఠకుడు రాసినది కాదు. ఒక రచయిత. ఆ పేరు గౌరీనాథానికి మరీ అపరిచితమూ కాదు.

అతడి పేరు జయకిషోర్.

"ఆర్యా!

నేను మీ అభిమానిని. మీ రచనల్లోని వైవిధ్యం, కొత్తదనం, శైలి వగైరాలన్నీ నాకు నచ్చుతాయి. అందుకని సాధారణంగా మీ కథ లేపయినా సరే ప్రత్యేక శ్రద్ధతో చదువుతాను. ఉత్తరం చదివేముందు నాకై నేనూ ఒక రచయితననీ—ఈ ఉత్తరం మీ పైని అభిమానంతో మాత్రమే రాస్తున్నాననీ గుర్తించగలరు.

ఇటీవల మీరు రాసిన—"అదీ సంగతి!" కథ చదివాను. కథ చదువుకుందుకు చాలాబాగుంది. చదువుతూంటే వళ్ళు వేడెక్కింది. జయమాలిని నృత్యం చూస్తున్నట్లుగా అనిపించింది. ఇలాంటి కథల గురించి మీ కలం శ్రమించడం మాత్రం నాకు యెంతో విచారాన్ని కలిగించింది.

ఈ ఉత్తరం వ్రాసేముందు ఎంతగానో ఆలోచించాను. మీ కథలో ఏదైనా సందేశం వున్నదేమోనని వెతికి వెతికి చూశాను. కథలో సందేశమున్నా అది వట్టి సాకు అనిపించింది. సెక్సు దృశ్యాలను అంత విపులంగా వర్ణించడానికి మీ మానసిక బలహీనత, వ్యాపార దృష్టి తప్ప వేరే కారణం కాదని అనిపించింది.

మానసిక బలహీనతలకూ, వ్యాపార దృష్టికీ అతీతంగా మీ రచనలుండడానికి ముందు ముందైనా ఈ ఉత్తరం

సహకరించకగలిగితే-ఈ ఉత్తరానికి మీరు జవాబు ఇవ్వక పోయినా నేను బాధపడను.

మీ అభిమాని
జయకిషోర్ —"

ఈ ఉత్తరం చదివేక గౌరీనాథం ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్క లేదు. అతడు దెబ్బతిన్నట్లే కనబడ్డాడు.

"పాఠకులు రచయితలకు తమ నిజమైన అభిప్రాయాలు తెలియజేయరు. రచయితలనుండి బదులు పొందడమే ఒక విశేషంగా భావించి — పొగుడుతూ ఉత్తరాలు రాస్తారు. సాటి రచయిత మీ గురించి — అదీ అభిమానంతో రాసిన వాక్యాలు చదువుకోండి. వ్యాపారదృష్టిని వదిలిపెట్టండి. నాకూ మీ రచనల గురించి ఇదే బాధ" అంది రాధ.

"ఇలా ఎన్నడూ జరుగలేదు" అన్నాడు గౌరీనాథం. ఉన్నట్లుండి అతడికింకో అనుమానం వచ్చింది—."నా కెవరైనా ఇలాంటి ఉత్తరాలు రాస్తే నువ్వు సహించలేవు. కానీ ఈ రోజు నీ ముఖంలో సంతోషం కనబడుతోంది. ఈ ఉత్తరం జయకిషోర్ రాసి వుండడు. నువ్వే పోస్టుచేసి వుంటావు—"

రాధ నవ్వింది "సరే-మీ ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు కొత్త ఎత్తులు వేస్తున్నారన్న మాట. నేనంత సులభంగా లొంగను. దస్తూరీని పరిశీలించండి. ఆపైన కవరుమీద పోస్టల్ స్టాంపుకూడా గమనించండి...."

గౌరీనాథం రెండూ పరిశీలించాడు. దస్తూరీ రాధది కాదు, పోస్టల్ స్టాంపు చాలా స్పష్టంగా వుంది. జయకిషోర్ ఉత్తరంలో తన అడ్రసు ఏమైతే ఇచ్చాడో — ఆ ఊరిపేరే ఆ స్టాంపులో వుంది.

"నీకా ఊళ్ళో ఎవరో తెలిసినవారుండి వుంటారు."

అన్నాడతను.

"పోనీ ఈ అడ్రసుకో ఉత్తరం రాసి చూడండి" అంది రాధ.

"ఈ అడ్రసు జయకిషోర్‌ది కాదనీ నీ మిత్రులదనీ నా నమ్మకం" అన్నాడు గౌరీనాథం ఆలోచిస్తూ.

"అయితే అతడి అడ్రసుకోసం పత్రికల వాళ్ళకు రాయండి" అంది రాధ వస్తున్న నవ్వు నాపుకుంటూ.

"ప్రతిదానికీ ఠక్కున సమాధాన మిస్తున్నావు. ఇవన్నీ నే నడుగుతానని నీకు ముందే తెలిసినట్లుంది...." అన్నాడు గౌరీనాథం.

"మీతో రెండేళ్ళుగా కాపురం చేస్తున్నాను. ఆ మాత్రం తెలుసుకోలేనూ—ఎటొచ్చీ పత్రికల వాళ్ళందరూ కూడా నా స్నేహితులని మాత్రం అనకండి" అంది రాధ.

గౌరీనాథానికి ఆ ఉత్తరం చదువుతూంటే ఆవేశం వస్తోంది. దానికి వెంటనే బదులు రాయాలనిపిస్తోంది. అతడు కూర్చుని రెండు పేజీల ఉత్తరం తయారుచేశాడు. ఆ ఉత్తరాన్ని ఓసారి భార్యకు చదివి వినిపించాడు.

"అబ్బా—ఎంత గొప్పగా రాశారండీ—మీరు రచయిత కంటే లాయరుగా బాగా రాణించి వుండేవారు"అంది రాధ.

"మూసరచనలు కాకుండా వివాదాత్మక సమస్యలు తీసుకుని రాసే నాలాంటివాడికి లాయరు లక్షణాలుండడం అవసరమని జయకిషోర్ ఉత్తరం నిరూపిస్తే—లాయరు లక్షణాలున్నాయని నా జవాబు ఋజువు చేస్తుంది" అని అతడా ఉత్తరాన్ని ఆ రోజే పోస్టుచేశాడు.

ఆ తర్వాత అతడు జయకిషోర్ రచనలగురించి తెలుసు

కుందుకు ప్రయత్నించాడు. అంతవరకూ జయకిషోర్ పేరు మాత్రమే తెలుసు గౌరీనాథానికి. ఇప్పుడిప్పుడే రచనల గురించి తెలుసుకున్నాడు.

*　　　*　　　*

జయకిషోర్ రచనలు కూడా చాలా పత్రికల్లో వచ్చాయి. అతడి కథల్లో వాస్తవ దృక్పథం బాగానే కనబడుతుంది. కానీ పచ్చి శృంగారం ప్రతికథలోనూ వుంటుంది. ఆ శృంగారం కూడా కథకు బొత్తిగా అవసరం లేనిది. కావాలని వ్యాపారదృష్టితో అందులోనికి జొప్పించబడిన సన్నివేశాలు అతడి కథల్లో చాలా వున్నాయి.

గౌరీనాథం రాధకు ఆ కథలు చదివి వినిపించాడు. ఆమె సగంలోనే అతణ్ని ఆపి—"ఛీ-ఇంక చదవొద్దు" అంది.

"నీ అభిమాన రచయిత జయకిషోర్ చేసిన రచనలివన్నీ" అన్నాడు గౌరీనాథం కసిగా.

"జయకిషోర్ నా అభిమాన రచయిత అని ఎప్పుడన్నాను?"

"నా కథను గురించి మీ ఇద్దరి అభిప్రాయాలూ కలిశాయిగా—అందుకు నువ్వెంతో సంతోషించావుగా...."

"బాగుందండీ—మీ కథమీద అతడి అభిప్రాయం నచ్చినంత మాత్రాన అతడి రచనలు నాకు నచ్చాలని ఎక్కడుంది?" అని ఎదురుప్రశ్న వేసిందామె. తర్వాత నెమ్మదిగా—"ఇలాంటి కథలు రాసే జయకిషోర్‌కే మీ కథలో అసభ్యకరమైన సెక్సు కనబడిందంటే—రామరామ! మీ కథ ఎంత అసభ్యంగా వుండి వుంటుందో ఊహించండి" అంది మళ్ళీ ప్లేటు అతడి మీదకు తిప్పుతూ.

ఈ అభియోగానికి గౌరీనాథం తట్టుకోలేకపోయాడు. తనకు తోచినది తోచినట్లుగా నిర్భయంగా రాయడం అతడి

అలవాటు. ఈ మధ్య భార్య కలగజేసుకునేవరకూ అతడి అలవాటుకు అడ్డులేకపోయింది.

అతడివద్ద మరి రెండు కథలున్నాయి. అవి పాఠకులకు ప్రయోజనకారులనే అతడి ఉద్దేశ్యం. అయితే—"అదీ సంగతి!" కథకంటే కాస్త హెచ్చు పాళ్ళలో శృంగారం వుంటుంది—వాటిలో! అది అసభ్యమని అతడు భావించడం లేదు. కానీ కట్టుకున్న పెళ్ళామే కన్విన్సు కానినాడు—బయటి పాఠకులకు తనేం సమాధానం చెప్పుకుంటాడు?

అయితే ఇంక ఉపేక్షించరాదు. ఈ జయకిషోర్ అసలు సంగతి తెలుసుకోవాలి. తనలాంటి రచనలు చేస్తూ తనకి లాంటి ఉత్తరాలు రాసి తన స్థాయి పెంచుకోవాలనుకుంటు న్నాడా?

కొంతమంది వుంటారు. శ్రీశ్రీలో తప్పుపట్టి సాహిత్య పరుడిగానూ, నెహ్రూలో తప్పుపట్టి రాజకీయవాదిగానూ, గాంధీలో తప్పుపట్టి తత్వవేత్తగానూ పేరు తెచ్చుకోవాలను కుంటారు. ఈ జయకిషోర్ కూడా అలాంటి ప్రయత్నమే చేశాడా?

గౌరీనాథం తను చదివిన జయకిషోర్ రచనలన్నీ క్షుణ్ణంగా సమీక్షించాడు. అందులోని అసభ్యశృంగార సన్నివేశాలెందుకు అనవసరమో వివరించాడు. అతడి రచన లను ఘాటుగా విమర్శిస్తూ—అది ఒక రచయితను సంస్క రించడం కోసమే తప్ప వ్యక్తిగతం కాదన్నాడు. ఇలాంటి రచనలు చేసే రచయిత తన రచనలోని అవసరపు సభ్య శృంగాన్ని విమర్శించడం ఆశ్చర్యమన్నాడు.

ఉత్తరం వెంటనే జయకిషోర్‌కు పోస్టుచేశాడు గౌరీనాథం.

ఈ ఉత్తరానికి వెంటనే జవాబు వచ్చింది. అది చదివేక గౌరీనాథానికీ, రాధకూ కలిగిన ఆశ్చర్య మింతా అంతాకాదు.

"పూజ్యులైన గౌరీనాథంగారికి!

నమస్కారాలు.

మీ ఉత్తరం అందింది. మీ మనసు కష్టపెట్టినందుకు మన్నించాలి. నేను రచయితగా ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న వాణ్ణి. నా కథలు పాఠకులను ఆకర్షించడానికి కారణం వాటిలోని సెక్సేనని ఒకరిద్దరు సంపాదకులు ప్రత్యక్షంగానూ, మరికొందరు పరోక్షంగానూ చెప్పారు. నా కథలు వారు ప్రచురిస్తున్నారు కాబట్టి వారి ప్రోత్సాహం నాకున్నట్లే భావించాను.

అయితే నా కథల్లోని సెక్సును విమర్శిస్తూ ఉత్తరాలు వస్తున్నాయి. కొన్ని తీవ్రంగా వుంటున్నాయి. సంపాదకులు వాటిని పత్రికాముఖంగా ప్రచురిస్తున్నారు. వాటికి సంజాయిషీ ఏమివ్వాలో తెలియక కొందరు ప్రముఖ రచయితలకు నా రచనలు వినిపించాను. వాళ్ళవి విని ఇలాంటి రచనలు చేసి పాఠకులను చెడగొట్టనద్దని తిట్టారు.

అప్పుడు నాకు ఒక్కటే ఉపాయం తట్టింది. నా కథల్లో సెక్సుకు సంజాయిషీ ఎలా చెప్పుకోవాలో సలహా అడిగే బదులు-ఓ ప్రముఖ రచయిత రచనలోని అసభ్య శృంగారానికి నేనే సంజాయిషీ అడిగితే!

అప్పుడే నాకు కథల్లో శృంగారం ఎంతవరకు వుండవచ్చునో, ఏది అసభ్యత అనిపించుకోదో, ఎందుకు అనిజీంచుకోదో వగైరా వివరాలన్నీ మీ నుంచి లభించాయి. నాకు కావలసినదదే!

మీ ఉత్తరం నా ఉత్తరంగా అతి త్వరలో "సువాహిని" పత్రికలో రాగలదు. మీ సహాయానికి నా ధన్యవాదాలు...."

గౌరీనాథానికి తను కథ రాయడంకంటే - దాన్ని సమర్థించుకుని పెద్దతప్పు చేసినట్లు ఇప్పుడే అనిపించింది. □

గిరిజ శ్రీభగవాన్ సీరియల్

మృత్యుతార

(గత సంచిక తరువాయి)

16

“విహారు పక్కన వుండి కూడా ఇలాంటి మతిలేని నిర్ణయాన్ని ఎందుకు ఆమోదించారు? ఇన్నేళ్ళ మీ అను

భవం, సామర్థ్యం ఏ గంగలో కలిసిపోయింది?" మండిపడు తున్నాడు రాయ్.

"గ్రహాంతరయానానికి అందుబాట్లో అంతరిక్ష ప్రయాణ వాహనం ఏదైనా వుంటే వెంటనే ఏర్పాటు చేస్తారా?" అసహనంతో అరుస్తున్నాడు కృపాల్.

"మాతో మాటమాత్రమైనా ముందుగా చెప్పివుంటే ఇంత ఘోరం జరగనిచ్చేవాళ్ళం కాము. నర్సన్‌గారు ప్రయాణమై వెళ్ళిపోయేంతవరకూ పరిస్థితి తెలియ పర్చకుండా యీయనే వ్యవహారాన్ని దాటవేశాడు" బాధ్యత దులిపేసుకుంటున్నాడు హోం మంత్రి.

మరో గ్రహ ప్రయాణానికై నర్సన్ వెళ్ళిపోయి అప్పుడే ముప్పయ్యారు గంటలు గడిచిపోయాయి. ఇంత వరకూ అతనివద్ద నించి ఏ విధమైన కమ్యూనికేషనూ లేదు. ఏమయ్యాడో, ఎక్కడున్నాడో, అసలు బ్రతి కున్నాడో లేదో....? నలభై ఎనిమిది గంటల్లోగా ఏ మాత్రం అవకాశం వున్నా భూమికి తిరిగి వస్తానని అన్యాపదేశంగా అతడు సూచించాడు. ఆ వ్యవధికి ఇంకా పన్నెండు గంటల గడువు మాత్రమే వుంది. గడువులోగా అతను రాకపోతే. ఇహ, ఎప్పటికే అతను....?

ఆ వార్త అందిన వెంటనే నర్సన్ అసిస్టెంట్లు కృపాల్, రాయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో ఢిల్లీ వచ్చారు. గడువు దగ్గిర పడుతూంటటంవల్ల ఎవ్వరూ ఏమీ ఆలోచించలేకపోతున్నారు. తమ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోడానికి బరువు బాధ్యతనంతటినీ యస్.బి. డైరెక్టర్ రావ్ నెత్తిమీదకి నెట్టేసి అతన్ని నిందితుణ్ణి చేసేస్తున్నారు.

ఇప్పుడు ఆ వ్యవహారాన్ని పర్యవేక్షించే కార్యాలయం స్పెషల్ బ్రాంచి ఆఫీసు నించి రాష్ట్రపతిగారి రాజభవన్‌కి

మారింది. ప్రధాని, కేంద్రమంత్రులు, త్రివిధ బలాధిపతులూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులూ, ఇంకా ఆ వ్యవహారంతో సంబంధం వున్న వాళ్ళందరితోనూ ఆ పెద్ద హాలు కిటకిటలాడిపోతోంది. యావన్మందీ ఎస్.బి. డైరెక్టర్ రావ్‌ని నేరస్థుడిలా చూస్తున్నారు.

"ఎవ్వరూ మాట్లాడరేం? అంతరిక్ష ప్రయాణానికి ఏదైనా వాహనం వుందా?" అసహనంతో అడిగాడు కృపాల్. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తల అడ్డంగా తిప్పుతూ "సారీ! యస్.బి. డైరెక్టర్ సూచన ప్రాయంగా తెలియపర్చి వున్నా ఫ్రావ్దాని కాంటాక్ట్ చేసి ఏదైనా ఏర్పాటు చేసేవాళ్ళం" అని చెప్పాడు.

"ఎందుకు చెప్తాడండీ? ఎందుకు చెప్తాడు? అసలా స్పెషల్‌బ్రాంచే పరమ అధ్వాన్నంగా తయారైంది! ప్రతి వ్యవహారాన్నీ అజాగ్రత్తతో పీకలమీదికి తెచ్చినప్పుడు ఏ డిటెక్టివ్‌నో సహాయం కోరటం వాళ్ళకి బాగా అలవాటైపోయింది. ఇప్పుడూ అలాగే ప్రవర్తించాడు. ఇంకేం చెప్తాడు?" అన్నాడో మంత్రి.

"అయితే ఇంకేం? ఈయనగారు సహాయం కోరిన పర్సన్ ఇప్పుడెటూ లేడు: ఇంకేం చేస్తాడో సమస్యని ఎలా సాల్వ్ చేస్తాడో ఆయన్నే అడగండి" అన్నాడింకో మంత్రి కోపంగా.

"ఇంకా ఆయనేం సాల్వ్ చేస్తాడూ! తేలుకుట్టిన దొంగలా ఆ వాలకం కన్పించడంలా? ఏదైనా అవాంతరం విరుచుకుపడితే మన చావు మనం చావాల్సిందే."

"అలా అనుకుని వూరుకోడానికి మనం మామూలు మనుషులమా? ప్రజాప్రతినిధులుగా పార్లమెంటుకి ఎన్నిక అయి మంత్రి పదవులు నిర్వహిస్తున్నవాళ్ళం. ఇలాంటి

ముఖ్య విషయాల్లో కూడా మంత్రిమండలికి తెలియపర్చ కుండా నిర్ణయాలు చేసే అధికారం యీాయన కెక్కడిది? ఏవండీ ప్రధానిగారూ! ముందు యీ విషయం తేల్చండి. ఈయనకి అలాంటి ప్రత్యేక అధికారాలేవైనా మీరు దానం చేశారా? మాట్లాడరేవండీ...."

"అవును. ఆ విషయం తేల్చండి....యీాయనకున్న అధికారాలేమిటో చెప్పండి...." పెద్దపెట్టున గొడవ, గందరగోళంగా చెలరేగింది. ఆ గోలలో ఎవరేం అంటు న్నారో కూడా అర్థం కావడం లేదు.

"అయ్యా... అమ్మా...." బిగ్గరగా ఎలుగెత్తి అరిచాడు యస్.బి. డైరెక్టర్ రావ్. గోల గోలగా అరుస్తున్నవాళ్ళం దరూ అతనివైపు తిరిగారు. అతను రెండుచేతులు జోడిస్తూ "ఇలాంటి మాటలతో నన్ను కాకుల్లా పొడిచినందువల్ల ఏమీ ప్రయోజనం లేదు, దయచేసి నేను చెప్పే మాటలు శాంతంగా వినండి. కాదనుకుంటే మీ కసిదీరా నన్ను చిత్ర వధ చేసి చంపెయ్యండి. మీ బాధ, మీకు రానున్న ప్రమాదం తప్పిపోయేటట్లుంటే మీ చేతుల్లో చావడానికి నేను సిద్ధంగా వున్నాను" అన్నాడు బిగ్గరగా.

అందరూ సైలెంట్ అయిపోయారు. ప్రధాని అప్పుడు జోక్యం చేసుకుంటూ "అనవసరంగా అరిచి గోల చేసి నందువల్ల సమస్య పరిష్కారం కాదు. కాకుల్లా గోల చెయ్యడానికి మనం ప్రతిపక్ష సభ్యులం కాము. ఆయనేం చెప్తారో విందాం" అన్నారు సహజమైన రాజకీయ చాతు ర్యాన్ని కూడా జోడిస్తూ.

రావ్ ఓసారి గొంతు సవరించుకుని "అయ్యా! అమ్మా! బాధ్యత గల ప్రభుత్వోద్యోగినైన నేను యిప్పటి వరకూ ఏ విషయంలోనూ పొరపాటు చెయ్యలేదనే అనుకుంటు

న్నాను. నర్సన్‌గారి పోలికల్లో వున్న మరో లోకపు మనిషి మాకు దొరకడంవల్ల, ఆయన తప్ప మరెవ్వరూ అక్కడికి వెళ్ళలేరని నిశ్చయించుకుని పరిస్థితి వివరంగా చెప్పి ఆయన్నే సలహా అడిగాను. అటు తర్వాత నా అభిప్రాయా లతో నిమిత్తం లేకుండా స్వయం నిర్ణయాలు తీసుకుంటూ, స్వబుద్ధితో, స్వతంత్ర బాధ్యతతో, వారించడాని క్కూడా వ్యవధి లేనంత వేగంగా ఆయన ఆ ప్రయాణం చేశారు. నలభై ఎనిమిది గంటల్లోగా తిరిగి రాగలనని ఆయన సూచిం చారు.

ఆ గడువులో అప్పుడే 36 గంటలు గడిచిపోయాయి. మరో పన్నెండు గంటలు మాత్రమే మిలిగివుంది. నిజమే! ఆ లోగా ఏం జరుగుతుందో, ఆయన ఎక్కడ ఏం చేస్తు న్నారో మనం వూహించలేక పోతున్నాము. అందువల్ల ముమ్ముందు ఏమవుతుందోనని భయపడుతున్నాం. అదీ నిజమే!

అయితే మనకి యింకా పన్నెండు గంటల వ్యవధి వుంది. ఏదయినా చెయ్యడానికీ ఆలోచించడానికీ తగినంత వ్యవధి వుంది! అదీగాక శత్రువుల మధ్యకు వెళ్ళినవాడు మామూలు మనిషి కాడు! నర్సన్! మహామేధావి, అసా ధారణ సమర్థ సాహసి నర్సన్! యీ ఒక్క పాయింట్ చాలు మనం ధైర్యంగా వుండటానికీ, ఏదైనా ఆలోచించి నిర్ణయించడానికి'' అని చెప్పాడు గంభీరంగా.

నర్సన్ పేరు ప్రస్తావనకి రాగానే మళ్ళీ అందరికీ ధైర్యం కలగసాగింది. అందరి మొహాలూ విప్పారడం గమనించిన ప్రధాని "అయితే మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి'' అన్నారు.

"మనవి చేస్తాను. యీ కేసులో యిట్నించి ప్రయ

త్నాలు చెయ్యడానికి మనకి రెండు సూచన లున్నాయి. మొదటిది. డాక్టర్ స్నేత్నా కారుకి యాక్సిడెంట్ చేశారు. అంటే శత్రువులు యీ ఢిల్లీ నగరంలో కూడా వున్నారన్న మాట! ఆ యాక్సిడెంట్ చేసినవాళ్ళెవరో కనిపెట్టి పట్టుకోగలిగితే శత్రువుల రహస్యాలు మనకి చాలావరకు తెలుస్తాయి. ఏదైనా మార్గం దొరుకుతుంది. ఆ దుండగులను పట్టుకోడానికి ఏజెంట్లు ప్రయత్నిస్తున్నారు. తొందర్లో ఆ దుర్మార్గులు దొరికిపోతారనే నమ్మకం నాకుంది'' అని ఓ క్షణం ఆగి, అందరి మొహాల్లోకీ చూసి—

"ఇహ, రెండోది. ఇదే అతి ముఖ్యమైనది! నర్సన్ నాకు రాసిన ఉత్తరంలో పారా సైకాలజీ టెలిపతీ గురించి ప్రస్తావించారు. దానికి నన్ను గురిచేశారు. అందువల్ల ఏ నిమిషంలోనయినా నర్సన్ టెలిపతీ ద్వారా వార్తా ప్రసారాలు పంపవచ్చు! ఆయన యెక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ మనకి తెలియపర్చవచ్చు! యీ ప్రయోగం ఆయన నామీదే జరుపుతారని నేను నిశ్చయంగా చెప్పగలను. అయితే, ఇందులో చిన్న తిరకాసు వుంది. ఆయన వార్తా ప్రసారాలను రిసీవ్ చేసుకునే సమయంలో నేను అనూహ్యమైన అచేతనావస్థలో వుంటాను. కనుక, ఆ సమయంలో నా భావతరంగాలను, మస్తిష్క పరిభ్రమణాన్ని గ్రహిస్తూ వివరాలను తెల్సుకోగలిగిన పారా సైకాలజిస్ట్ ఒకరు మనకి అత్యవసరంగా కావాలి! నా భావతరంగాలను పసిగట్టి డీకోడ్ చెయ్యగలిగిన మేధావి కావాలి'' అని చెప్పాడు రావ్.

మళ్ళీ అందరి మనసుల్లోనూ ఆలోచనలు. అలాంటి మేధావి ఎవరున్నారు? ఎక్కడున్నారు? ఒకవేళ వున్నా యింత అవ్యవధిలో అక్కడికి చేర్చడం ఎట్లా?

కేంద్ర హోంమంత్రి పొడిగా దగ్గి "ప్రముఖ రష్యన్ పేరా సైకాలజిస్ట్ గోమాగో యిప్పుడు ఢిల్లీలో వున్నాడు. యీ సాయంత్రం ఆరున్నరకి ఆయన యిచ్చే ప్రదర్శనకి నేను ఛీఫ్ గెస్ట్‌గా విజ్ఞానభవన్‌కి వెళ్ళవల్సి వుంది. యీ గొడవ కారణంగా వెళ్ళలేకపోయాను" అంటూ టైం చూసుకుని "ఈ పాటికే ప్రోగ్రాం ప్రారంభమై వుంటుంది. ప్రదర్శన మధ్యలో ఆయన్ని తీసుకొస్తే ప్రేక్షకులు చాలా గొడవ చేస్తారు. నానా అల్లరీ అవుతుంది" అన్నాడు.

"ప్రధానిగారూ! ఒక్క నిమిషం! దయచేసి మీరంతా నన్ను క్షమించాలి. నా అధికార హోదాని, పరిమితిని మీ అంగీకారం లేకుండా పెంచుకుంటున్నాను" అని చెప్పి తన అసిస్టెంట్‌వైపు తిరిగి,

"అవసరమైన సిబ్బందినీ, పోలీసు ఫోర్సునీ వెంట బెట్టుకు వెళ్ళి ప్రదర్శన నిలిపించి ప్రొఫెసర్ గోమాగోని యిక్కడికి తీసుకురండి. ప్రస్తుతం ఎవ్వరికీ వివరాలు చెప్పేంత వ్యవధీ, తీరుబడీ మనకు లేదు. ప్రేక్షకులు యెదురుతిరుగుతా రనుకుంటే యావన్మందినీ జాతీయ భద్రతా చట్టం క్రింద కస్టడీలోకి తీసుకుని జైల్లోకి తరలించండి. పొద్దుటే అందర్నీ విడుదల చెయ్యవచ్చు! బట్, ఎట్ ఎనీకాస్ట్, ఐ వాంట్ ప్రొఫెసర్ గోమాగో యిమీడియట్లీ" అని ఆదేశించి, ప్రధానివైపు తిరిగి "ప్రస్తుత తరుణంలో యింతకంటే వేరే మార్గం లేదు. రేపు పేరు పేరునా ప్రతి ఒక్కరికీ స్వయంగా క్షమాపణలు చెప్పుకుంటాను. యింకా ఏదైనా తీవ్రపరిణామం సంభవిస్తే మీ యెవ్వరి మీదకీ యేమీ రాకుండా బాధ్యతంతా నా నెత్తిన వేసుకుంటాను" అని చెప్పాడు రావ్.

ప్రధాని మెచ్చుకోలుగా అతనివైపు చూశారు. అతని

అసిస్టెంట్ బయటికి పరుగెత్తాడు.

కృపాల్, రాయ్‌లు మొహాలు చూసుకున్నారు. వాళ్ళకి పరిస్థితి క్రమేపీ అర్థమవుతోంది. ఆవేశ పడటంవల్ల నర్సన్ జాడలు తెల్సుకోలేమని గ్రహించి ఆలోచనల్లో పడ్డారు. నిమిష నిమిషానికీ యస్.బి. డైరెక్టర్ రావ్ ఇమేజ్ పెరిగిపోతోంది. మొదట్నించీ ఆ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నదీ, చివరివరకూ నర్సన్ పక్కనే వుండి ఆయన అభిప్రాయాలనూ, భావాలనూ సేకరించినదీ అతనొక్కడే! అందువల్ల ఏ సమస్యని డీల్ చెయ్యాలన్నా అతనొక్కడే ఆలోచించాల్సి వస్తోంది. మిగతావాళ్ళెవరి సహాయాన్నయినా తీసుకోవాలంటే మొత్తం కథంతా చెప్పాలి. కథ చెప్పేంతటి వ్యవధి ఎక్కడుంది?

స్పెషల్ బ్రాంచి డెప్యూటీ డైరెక్టర్ లోపలికి పరిగెత్తు కొచ్చాడు. అందరూ అతనివైపు ఆతృతగా చూశారు. అతని మొహంలో విజయచిహ్నాలు గోచరిస్తున్నాయి.

"ప్రొఫెసర్ స్నేత్నా పొత్తికడుపుని ఎక్స్‌రేలో చూస్తే చిన్నప్రేవులకీ, పెద్దప్రేవులకీ మధ్య ఏదో కాగితపు వుండ యిరుక్కుపోయి వున్నట్లు కన్పించింది సార్! వెంటనే శవాన్ని కోయించి ఆ కాగితపు వుండని బైటికి తీయించాను. యాక్సిడెంట్ జరిగినప్పుడు స్పృహపోయే ముందు స్నేత్నా ఆ కాగితాన్ని మింగివుండాలి. కొన్ని అక్షరాలు కరిగి ఆవిరైపోయాయి. మిగతా అక్షరాలు చెదిరి పోకుండా కాగితాన్ని కెమికల్ టెస్టుకి యిచ్చి మిగిలిన అక్షరాలని ఫోటోస్టాట్ తీయించాను. ఇదిగో ఫోటోస్టాట్ కాపీ."

డెప్యూటీ డైరెక్టర్ ఇచ్చిన ఫోటోస్టాట్ కాపీని రావ్, కృపాల్, రాయ్‌లు ముగ్గురూ నిశితంగా పరీక్షించారు. తడికి

కరిగి ఆవిరై పోగా మిగిలిన అక్షరాల పదసమూహమది! అందులో కొన్ని ఇంగ్లీషు, లాటిన్ అక్షరాలతోపాటు కొన్ని అంకెలు కూడా వున్నాయి. ఖగోళ శాస్త్ర అధ్యయనంలో వుపయోగించే సింబల్స్ కూడా వున్నాయి. చెరిగి పోగా మిగిలిన అక్షరాలే అంత గజిబిజిగా వుంటే మొత్తం సమాచారం యావత్తూ యింకెంత యిదిగా వుంటుంది?

"లాభంలేదు. దీన్ని డీకోడ్ చెయ్యడం మనవల్ల కాదు. మన బుర్రలు చాలవు. ఎవరైనా ఖగోళ శాస్త్రజ్ఞుడిని పట్టుకుని అతడి మతి చెడగొట్టాల్సిందే" అన్నాడు రావ్ నిరాశగా.

"ఆ ఫోటోస్టాట్ కాపీ నాకివ్వండి. నే వెళ్ళి దీన్ని డీకోడ్ చేయించే ప్రయత్నం చేస్తాను" అంటూ ఫోటో స్టాట్ కాపీ తీసుకుని వెళ్ళిపోయాడు రాయ్.

"సౌరకుటుంబంలోని గ్రహాలకి సంబంధించిన వివరాలూ, లెక్కలూ వేసివున్న ఓ కాగితాన్ని స్నేత్నా మింగాడంటే, శత్రువులకి దొరక్కుండా దాన్ని కడుపులో దాచుకున్నాడంటే — ప్రాణం పోయేముందు అతడు బయట పెట్టిన 'మృత్యుతార' ఇన్ఫర్మేషన్ ఆ కాగితాన్ని డీకోడ్ చేస్తే తెలియవచ్చు! ఆ మృత్యుతారకే నర్సన్ ప్రయాణం చేసి వుండవచ్చు! అయితే ఆ వివరాలు అంత సులభంగా తెలియపర్చే మేధావి వున్నారా, అని నా అనుమానం" అన్నాడు యస్.బి. డైరెక్టర్ రావ్ సాలోచనగా. అందరికీ అదే అనుమానం కలిగింది.

కృపాల్ తల వూపి "ఉన్నారు. మీ ఆదుర్దాలో మీరు గుర్తించలేకపోతున్నారు గానీ ఖగోళశాస్త్ర విజ్ఞానాన్ని కూలంకషంగా అర్థం చేసుకున్న మేధావులు మనలోనూ

వున్నారు. 'ఆర్యభట్' ఉపగ్రహానికి కాగితంమీద మొట్ట మొదటిసారిగా లే అవుట్ రూపొందించిన ప్రొఫెసర్ భాస్కరాచార్య ఖగోళశాస్త్ర విజ్ఞానంలో నిష్ణాతుడు. రాయ్ అతన్ని కల్సుకోడానికే పరిగెత్తాడు.'' అని చెప్పాడు దృఢంగా.

ప్రొఫెసర్ భాస్కరాచార్య అప్పుడు అందరికీ గుర్తొచ్చాడు? ఆర్యభట్ ఉపగ్రహానికి వ్యూహ రూపాన్ని కల్పించిన మేధావి ఆయన. అయితే తెలుగువాడు కావడంవల్ల ఆయన ప్రతిభకి తగిన గుర్తింపును ప్రభుత్వం యివ్వలేదు. అందుకు కినుక వహించి ఆయన పదవికి రాజినామా యిచ్చాడు. ఆంధ్రకి చెందిన పార్లమెంట్ సభ్యులుగానీ, రాష్ట్రమంత్రివర్గ సభ్యులుగానీ, యితర నాయకులుగానీ భాస్కరాచార్యకి జరిగిన అన్యాయానికి నోరెత్తక పోవడానికి కారణం ఆయన బ్రాహ్మణుడు కావడమే!

అదీగాక ఆంధ్రరాష్ట్రంపట్ల కేంద్రం ఆదినుంచీ సవితి తల్లి ప్రేమనే ప్రదర్శిస్తున్నా మెదలకుండా, ఎరగనట్లు వూరుకోవడం ఆంధ్ర నాయకులకి బాగా అలవాటై పోయింది. రాష్ట్రం ఎలా నాశనమైపోయినా కేంద్రానికీ, పార్టీ అధిష్టాన వర్గానికీ విధేయతను చూపాలనే 'బాంచన్ కాల్మొక్తా....' బానిస మనస్తత్వం నేటి ఆంధ్ర నాయకుల్లో పాతుకుపోవడం ఆంధ్రులు చేసుకున్న పాపం! తెలుగువాడి దురదృష్టం! అందుకే ఆంధ్రుడు ఏ రంగంలోనూ అభివృద్ధిని పొందలేక పోతున్నాడు! ఆంధ్రుణ్ణి అణచి వుంచడానికే ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. అందులో భాగంగానే భాస్కరాచార్యకి అన్యాయం జరిగింది!

'తెలుగువారు నిస్వార్థపరులు' అన్న పొగడ్తతో యే

ఆంధ్రుడూ, ఏ ఆంధ్రనాయకుడూ నోరెత్తలేదు? ఎవ్వరికీ దక్కని ఖ్యాతి, గౌరవం తనకే దక్కిందని సంబరపడి పోయే తెలుగువాడు ఆ పొగడ్త వెనుక తనకి జరుగుతున్న అన్యాయాన్ని చూసీ చూడనట్టు వూరుకుంటాడు.

అక్కడ అలుముకున్న నిశ్శబ్ద వాతావరణాన్ని కదిలించడానిగ్గాను కృపాల్ ఓసారి పొడిగా దగ్గి, అందరి దృష్టి తనవైపు ఆకర్షించుకొని "నాదో సందేహం! యీ కేసులో యింతవరకూ ఇతర గ్రహాల గురించీ, అక్కడ నివశించే మానవుల గురించే మనం ఆలోచించాం! అయితే ఇక్కడే డాక్టరు స్నేత్నా కారు యాక్సిడెంట్ చెయ్యబడింది. ఇంకో లోకంవాళ్ళు యిక్కడికొచ్చి అలాంటి పని చెయ్యాల్సిన అవసరం వాళ్ళకి లేదు. ఎందుకంటే వాళ్ళ గురించి నిజం చెప్పాలంటే యింతవరకూ మనకేమీ తెలియదు. పోనీ, మరో లోకం మనుషులే యీ పని చేశారని సరిపెట్టుకుందామన్నా, నర్సన్ని పోలిన మనిషి తప్ప ఆ లోకంనించి మరో మనిషి యిక్కడకు వచ్చినట్లు సూచనలేవీ లేవు. కనుక, ఇక్కడివాళ్ళే స్నేత్నా కారు యాక్సిడెంట్ చేశారని ప్రస్తుతానికి మనం నిర్ధారణ చేసుకోవచ్చు! దాన్నిబట్టి మీ కేమనిపిస్తోంది?" అన్నాడు.

"ఇటీజ్ ఏ గుడ్ పాయింట్" అంటూ రావ్ తల పంకించి "కారణం ఎటువంటిదైనప్పటికీ యిక్కడివాళ్ళే కొందరు శత్రువులతో చేతులు కలిపి వుంటారని నాకూ అనుమానంగానే వుంది. మంచికో, చెడ్డకోగానీ యీ వ్యవహారంతో సంబంధం వున్నవాళ్ళల్లో ఒకరో, యిద్దరో శత్రువుల ఏజెంట్లు వుంటారని ఒక సందర్భంలో నర్సన్ బాహాటంగానే విమర్శించాడు. మాలో చాలామందికి ఆ మాట వినేప్పటికి కోపం వచ్చింది కూడా" అని చెప్పాడు.

"కరెక్ట్! ఆ మనిషెవరో మనం తెల్సుకోగలిగితే...." అంటున్నాడు కృపాల్. అంతలో యస్.బి. డైరెక్టర్ పి.ఏ. హడావిడిగా లోపలికి వస్తూ "ప్రొఫెసర్ గోమాగోని తీసుకొచ్చాను" అని చెప్పి, "విజ్ఞానభవన్‌లో ప్రేక్షకులు గొడవ చేస్తుంటే గత్యంతరం లేక అందర్నీ...." అని మాట పూర్తిచెయ్యకుండా నసిగాడు.

"లెట్ దెమ్ గో టు హెల్" అన్నాడు రావ్ విసుగ్గా. అదే సమయంలో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన పారా సైకాలజిస్ట్ ప్రొఫెసర్ గోమాగో లోపలికి వచ్చాడు. బక్కపల్చగా, పొడుగ్గా, గట్టిగా గాలి వీస్తే పడిపోయేలా వున్నాడతను. కానీ విశాలమైన ఫాలభాగంమీద ప్రస్ఫుటంగా కన్పిస్తున్న వర్చస్సూ, సూదంటురాయి వంటి తీక్షణమైన చూపులూ అతని మేధాసంపత్తిని చాటుతున్నాయి.

గోమాగో అక్కడికి వస్తూనే "జరిగిన విషయమంతా మన మిత్రుడు కార్లో వస్తున్నప్పుడు చెప్పాడు. ఇలాంటి ఘటన జరగడం వైజ్ఞానిక ప్రపంచానికే ఒక షాక్ ట్రీట్‌మెంట్! ఘటనా ఘటన చర్చనీయాంశాల జోలికి ఇప్పుడు నేను వెళ్ళదల్చుకోలేదు. నా సహకారాన్ని అందించడానికి సిద్ధంగా వున్నాను. చెప్పండి వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" అన్నాడు గంభీరంగా.

"థాంక్ యూ ప్రొఫెసర్ గోమాగో" అంటూ రావ్ ఒక్క క్షణం వూరుకుని "నర్సన్ మన వూహకి అందని మరోచోటు నించి పారా-టెలిపతీ ద్వారా కమ్యూనికేషన్ పంపిస్తాడని మేము విశ్వసిస్తున్నాం. ఆ భావ తరంగాలు ప్రసారమవుతున్న సమయంలో నేను అచేతనంగా వుంటాను. అలాంటి సమయంలో అతను పంపే కమ్యూని

కేషన్స్‌ని అర్థం చేసుకుని, అతని ప్రశ్నలకి ఇక్కడ్నించి జవాబులు యివ్వడానికీ, అతన్ని కొన్ని ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టడానికి ఏదైనా అవకాశం వుందా? అంటే, నా మస్తిష్కం మీదకి ప్రసారమవుతున్న వేవ్స్‌ని మరో మనిషి గ్రహించి, నా భావతరంగాలద్వారానే అతనికి జవాబులు యిప్పించాలి। అదేపద్ధతిలో ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టాలి...."

అని చెబుతుండగా, గోమాగో జోక్యం చేసుకుంటూ "యూమీన్ .... డబుల్ క్రాస్ టెలిపతీ! ఒకే మనిషి మస్తిష్కం మీదకి ఇద్దరు పారాసైకాలజిస్టులు టెలీపతీ సంకేతాలు పంపించి మాట్లాడుకోవడం! స్థూలంగా చెప్పాలంటే పారాసైకాలాజీకి గురవుతున్న ఆ మనిషి ఇద్దరు సైకాలజిస్టుల మధ్య బ్రాడ్‌కాస్టింగ్ ట్రాన్స్‌మిషన్ వంటివాడు! అంతేనా?" అని అడిగాడు. అవునన్నట్లు తల పంకించాడు రావ్.

"ఓహ్.... ఫెంటాస్టిక్ థాట్...." అంటూ రెండు చేతుల్తో తల పట్టుకున్నాడు గోమాగో. అరనిముషంపాటు తీవ్రంగా ఆలోచించి "అందుకాట్లో ఏదైనా మైక్రో కంప్యూటర్—'సిలికాన్‌చిస్' వీడియో టెర్మినల్ టైప్‌ది వున్నదా?" అని అడిగాడు.

"ఉంది. ఇది మా రాష్ట్రపతిగారి రాజభవన్! దేశ, విదేశాల్లోని వార్తా విశేషాలని ఎప్పటికప్పుడు తెల్సుకునేందుగ్గాను ఇటీవలే 'యాపిల్' పరీవాహక శక్తితో పనిచేసే మైక్రో—వీడియో టెర్మినల్ కంప్యూటర్ని ఇక్కడ నెలకొల్పాం" ఠక్కున జవాబిచ్చాడు రావ్.

ఆ జవాబు వింటూ విస్తుబోయాడు గోమాగో! భారత

దేశం అణు విజ్ఞానంలో ముందంజ వేస్తోందంటే ఏమిటో అనుకున్నాడు గానీ అంత ప్రగతి సాధించిందని ఆయన కలలో కూడా వూహించలేదు! మరోక్షణం తర్వాత ఆయన తేరుకుంటూ "అయితే నేనూ ఒక ఎక్స్‌పరిమెంట్ చేస్తాను. ఇలాంటిది చెయ్యడం నాకూ ఇదే మొదటిసారి! ప్రపంచంలో ఎవ్వరూ ఇలాంటిది యింతవరకూ చెయ్యలేదుకూడా! రిజల్ట్ యెలా వుంటుందో నేనూ చెప్పలేను. ప్రయత్నం చేస్తాను. మీలో పారాసైకాలజీకి గురి కాబోతున్న మనిషి యెవరు?" అని అడిగాడు.

"నేను...." అంటూ ఒక్క అడుగు ముందుకు వేశాడు రావ్.

"అయితే, మీరు, నేను, నాకు ప్రశ్నలు అందించదల్చుకున్న మరో ఇద్దరు. లేదా ముగ్గురు—మొత్తం అయిదుగురికి మించి ఎక్కువ మంది అక్కడ వుండటానికి వీల్లేదు. మనం కాక, మిగతా ముగ్గురెవరో నిర్ణయించండి. మైక్రోకంప్యూటర్ రూం ఎక్కడున్నదో చూపించండి" అన్నాడు ప్రొఫెసర్ గోమాగో. అరనిమిషంలో నిర్ణయం జరిగిపోయింది. సర్పన్‌కి అప్పుడైన కృపాల్, ప్రధాన మంత్రి, ప్రొఫెసర్ డోగ్రే-ఆ మిగతా ముగ్గురూ! అయిదుగురూ చకచకా మైక్రో కంప్యూటర్ రూం వైపు నడిచారు.

ఎయిర్ కండీషన్డ్ కంప్యూటర్ గదిలోకి అడుగు పెట్టగానే అక్కడ వున్న ఆపరేటర్స్‌ని అవతలికి వెళ్ళిపొమ్మని ఆదేశించారు ప్రధాని. గది తలుపులు దగ్గరగా మూసివెయ్యబడ్డాయి.

"మిస్టర్ రావ్! కంప్యూటర్ ఎదురుగ్గా వున్న కుర్చీలో మీరు రిలాక్స్‌గా కూర్చోండి. మిగతావాళ్ళు నాకు అందుబాట్లో వుండేలా, కంప్యూటర్‌కి ఎడంగానూ కుర్చీలు

జరుపుకోండి! మీ ముగ్గురికీ ఒక మనవి! టెలిపతీ తరం గాలు ప్రసారమవుతున్నప్పుడు ఎవ్వరూ మాట్లాడకూడదు. కనీసం దగ్గకూడదు. చిన్నశబ్దం కూడా చెయ్యకూడదు. అంతా సైలెంట్‌గా వుండాలి. మీ ప్రశ్నలు లేదా జవాబులు కాగితం మీద రాసి నాకు అందజేస్తుంటే వాటినిబట్టి వివ రాలు సేకరిస్తాను'' అని చెబుతూ కంప్యూటర్ ముందుకు వెళ్ళాడు గోమాగో. అందరూ తమ సీట్లు జరుపుకుని విడి విడిగా కూర్చున్నారు.

ఎలక్ట్రాన్ విజ్ఞాన శాస్త్రప్రయోగంలో ఆధునిక రూప కల్పన మైక్రోకంప్యూటర్; పెద్దటేబిల్‌లాంటి దాని పై భాగాన కుడివైపున అద్దంలాంటి డిస్‌ప్లే స్క్రీన్ వుంటుంది. కంప్యూటర్‌లోంచి వచ్చే సంకేతాలు, అక్షరాలు, పదాలు ఆ డిస్‌ప్లే స్క్రీన్‌మీద టెలివిజన్ తెరమీది బొమ్మల్లా కన్పి స్తాయి. దానికి ఎడమవైపున వీడియో టెర్మినల్-ఎలక్ట్రానిక్ కీ బోర్డు వుంటుంది. కీ బోర్డుమీద టైప్‌రైటర్ మాదిరిగా అక్షరాలు, సంకేతిక పదాలు వుంటాయి. మైక్రో సిలికాన్ చిప్ సిస్టమ్‌వల్ల ఆ కీ బోర్డు దానంతటదే ఆటోమాటిక్ సిస్టమ్‌లో పదాలను డిస్‌ప్లే స్క్రీన్‌మీదకి ప్రసారం చేస్తూం టుంది. అంటే సుదూరప్రదేశాల నించి పంపే వార్తల్ని సైతం మనిషి సహాయం లేకుండా దానంతటదే రికార్డు చేసే ఆధునిక వార్తాప్రసారసాధనం యీ మైక్రో కంప్యూ టర్!

భారతదేశంలో తొలిసారిగా ఏర్పాటు చెయ్యబడిన ఈ కంప్యూటర్‌కి భారత ఉపగ్రహం ఆపిల్ వాయుతరంగా ల్లోంచి వార్తల్ని శబ్దతరంగాల ద్వారా అందజేస్తుంటుంది! వార్తాప్రసార ప్రపంచంలో అది సరికొత్త ప్రయోగం! విదేశాల్లో మైక్రోకంప్యూటర్ గత నాలుగైదేళ్ళ నించీ

వాడుకలో వున్నప్పటికీ ఇండియాలో ఇటీవలే ఒక్క రాష్ట్రపతి భవన్లో మాత్రమే పరిశీలనార్థం ఈ కంప్యూటర్ని ఏర్పాటు చేశారు.

ఇప్పుడా మైక్రోకంప్యూటర్ మీదనే మరో సరికొత్త ప్రయోగం జరపబోతున్నాడు ప్రొఫెసర్ గోమాగో. అతడా ప్రసారసాధనాన్ని కొన్ని క్షణాలపాటు నిశితంగా పరిశీలించి తన భుజానికి వున్న హాండ్ బాగ్లోంచి హెల్మెట్ లాంటి శిరస్త్రాణాన్ని బయటికి తీశాడు. దానికి రెండువైపులా టెలిఫోన్ ఆపరేటర్ తగిలించుకునే రిసీవర్స్లాంటివి వున్నాయి. పైభాగంలో పొడుగాటి సన్నటి వైరు వేలాడుతోంది.

ఆ శిరస్త్రాణాన్ని కుర్చీలో కూర్చుని వున్న రావ్ నెత్తి మీద టోపీలా పెట్టి రిసీవర్స్కి వున్న స్క్రూలు బిగిస్తూ "తల వూపవద్దు. కదలవద్దు. నోటితో జవాబు చెప్పండి. తల పోటులాంటి నెప్పి ఏదైనా అనిపిస్తోందా?" అడిగాడు గోమాగో.

"లేదు. మామూలుగానే వుంది" నెమ్మదిగా జవాబిచ్చాడు రావ్.

"గుడ్" అంటూ శిరస్త్రాణం పైనించి వేలాడుతున్న కంప్యూటర్ రేడియో టెర్మినల్ ప్లాంట్ వైర్స్కి కనెక్షన్ యిచ్చి "ఇప్పుడు?" అడిగాడు గోమాగో.

"మెదడంతా టకటక శబ్దాలతో కదిలిపోతోంది. తలలో నరాలని మీటి సైపు చేస్తున్నట్లు అనిపిస్తోంది" చెప్పాడు రావ్.

"ఆ శబ్దాలు మరికొద్ది సేపు మాత్రమే మీకు వినిపిస్తాయి. ఆ తర్వాత అంతా మామూలుగానే వుంటుంది. నా నుంచి వెలువడే టెలిపతీ భావతరంగాల కదలిక తప్ప

మరేమీ మీకు వినిపించదు. రిలాక్స్‌గా కూర్చోండి" అంటూ అతని ముందుకు వెళ్ళాడు గోమాగో.

"ఇలా, నా మొహంలోకి, నా కళ్ళల్లోకి సూటిగా చూడండి రావ్....నా కళ్ళు తప్ప ఇంకేదీ మీకు కనిపించదు....కనిపించడంలేదు....అలాగే నా కళ్ళల్లోకి చూడండి. సూటిగా చూడండి....మీ కనురెప్పలు బరువెక్కుతున్నాయి. కళ్ళు మూతలు పడిపోతున్నాయి....మీకు నిద్రపోవాలనిపిస్తోంది...." ప్రొఫెసర్ గోమాగో స్వరం జడివాన కురుస్తున్నట్లు విచిత్రంగా ధ్వనిస్తోంది. అతను పారాసైకాలజీని ప్రయోగిస్తున్నాడు. మిగతా ముగ్గురూ వూపిరి బిగబట్టి చూస్తున్నారు.

"మీకు నిద్రవస్తోంది....హాయిగా నిద్రలోకి జారుకోవాలనిపిస్తోంది....నిద్రపోవాలనుకుంటున్నారు...." గోమాగో స్వర ప్రభావం రావ్ మస్తిష్కంమీద చాపకింద నీరులా ప్రసరిస్తోంది....విస్తరిస్తోంది ...

"మీకు నిద్ర ముంచుకు వచ్చేసింది....మీరు నిద్రపోవాలి....నిద్రపోవాలి...."

డిస్‌ప్లే స్క్రీన్‌మీద "నిద్రపోవాలి....నిద్ర ముంచుకొస్తోంది...." అన్న అక్షరాలు ప్రత్యక్షమయ్యాయి. రావ్ మస్తిష్కంలోని భావతరంగాలకి ప్రతిరూపాలవి! అందరూ నిర్ఘాంతపోయారు. అతని మెదడులో కదులుతున్న భావపరంపరలని తెరమీద బొమ్మలా డిస్‌ప్లే స్క్రీన్‌మీద చూపించగలిగాడు ప్రొఫెసర్ గోమాగో! వైజ్ఞానిక ప్రకరణంలో అది సరికొత్త అధ్యాయం! అణుయుగంలో నూతన శకానికి అది శుభారంభం!!

రావ్ నిద్రలోకి జారుకున్నాడు. అంతలోనే గోమాగో

మేఘ గంభీర కంఠస్వరం—"మీది నిద్రకాదు....మీ మస్తిష్కం మేల్కొనే వుంది....భావతరంగాలు సంచరిస్తూనే వున్నాయి....మీ మనస్సు నర్సన్‌కోసం ఆరాటపడుతోంది. మీలోని జ్ఞానతరంగాలు నర్సన్ కోసం వెతుకుతున్నాయి. భూమిని దాటి....మేఘాలు....ఆకాశం....వాయుమండలం .... మహాశూన్యమండలం .... దాటి గాలిస్తున్నాయి .... నర్సన్ తప్ప మీ కళ్ళకి మరెవ్వరూ కన్పించడంలేదు.... నర్సన్ తప్ప ఎవ్వరూ కన్పించడం లేదు .... నర్సన్ మాత్రమే కన్పిస్తున్నాడు నర్సన్ .... కనిపిస్తున్నాడు .... కనిపిస్తున్నాడు....కన్పిస్తున్నాడు...."

రావ్ మొహంలో జేవురింతతోపాటు అనూహ్యమైన తేజస్సు ఏర్పడింది. డిస్‌ప్లే స్క్రీన్‌మీద "నర్సన్....కనిపిస్తున్నాడు...." అక్షరాలు ప్రత్యక్షమయ్యాయి. ముగ్గురూ అనూహ్యమైన విభ్రాంతితో విస్తుబోయారు.

గోమాగో మళ్ళీ—"యస్....నర్సన్ కనిపిస్తున్నాడు. ఒక్కడే కనిపిస్తున్నాడు....మీ ఎదురుగా వున్నాడు....మీతో ఏదో చెప్పాలనుకుంటున్నాడు....మాట్లాడండి...మనస్సుతో మాట్లాడండి....భావతరంగాలతో సంభాషించండి....మాట్లాడండి....మాట్లాడండి...."

"హల్లో .... నర్సన్....ఎలా వున్నారు? ...." డిస్‌ప్లే స్క్రీన్‌మీద అక్షరాలు ప్రత్యమయ్యాయి. ముగ్గురూ నిర్ఘాంతపోయారు. స్క్రీన్‌ద్వారా సంభాషణ ఆరంభమైంది.

17

"చెప్పండి. నావల్ల మీకు కావాల్సిన సహాయం ఏమిటి?" అన్నాడు భాస్కరాచార్య ప్రశాంత హృదయంతో, సిన్సియర్‌గా.

ఫోటోస్టాట్ కాపీని చేతికిచ్చాడు రాయ్.

"దీని ఒరిజనల్ని ప్రొఫెసర్ స్నేత్నా మింగేశాడు. ఆయన్ని శత్రువులు చంపేశారు. ఆ తర్వాత ఆయన కడుపు లోంచి ఆ కాగితాన్ని బయటకు తీయించి యథాతథంగా ఫొటోస్టాట్ తీయించాము. మరో మానవలోకపు రహస్యాన్ని వివరించే సాంకేతిక భాష ఇది! నర్సన్ ఇప్పుడు ఆ లోకా నికి వెళ్ళాడు...." అంటూ జరిగిందంతా క్లుప్తంగా చెప్పి, "యీ వివరణలో కొన్ని పదాలు, అక్షరాలు చెరిగి పోయాయి. మిగిలిన విషయాన్ని కూలంకషంగా పరిశీలించి మాయమైపోయిన అక్షరాల్ని వూహించి ఇందులో వున్న రహస్యాన్ని విడమర్చి చెప్పాలి! యీ వివరాలు తెల్సుకోడా నికి కావల్సినంత వ్యవధిలేదు. అరగంటలో—ఒక్క అరగంటలో మీరు దీన్ని డీకోడ్ చెయ్యాలి" అని చెప్పాడు రాయ్.

భాస్కరాచార్య అరనిమిషం పాటు ఫొటోస్టాట్ కాపీని నిశితంగా పరిశీలించి "ఇదేమీ బ్రహ్మ విద్యకాదు! అర గంట లోపలే మీకు వివరాలు అందజేస్తాను. మొత్తం చరిత్రనంతా మీ ముందుంచుతాను"అని చెప్పాడు గర్వంగా. మరుక్షణం—

"ఒద్దు! అలాంటి పిచ్చి పని చెయ్యవద్దు ఆచార్యా...." అన్న హెచ్చరికతోపాటు ఢాంమ్మని పిస్తోలు పేలింది.

రాయ్ ఒక్క ఉదుట్న భాస్కరాచార్యని సోఫాలోంచి క్రిందికి నెట్టిస్తూ టీపాయ్‌ని ఎత్తి మెరుపు వేగంతో ట్యూబ్ లైట్ మీదకి విసిరాడు. భళుక్కుమంటూ ట్యూబు పగిలి పోయింది. చిమ్మచీకటి వ్యాపిస్తుండగా టీపాయ్ క్రింద పడిన చప్పుడు వినిపించింది. క్షణంలో భాస్కరాచార్య

ప్రాణం దక్కింది. అయితే ఆయన నేలమీద బోర్లా పడుకుని భయంతో ఒణికిపోతున్నాడు.

"గదిలో లైట్ బద్దలు కొట్టినంత మాత్రాన భాస్కరాచార్య ప్రాణాలు కాపాడటం నీ తరం కాదు మిస్టర్ రాయ్! అండ పిండ బ్రహ్మాండాల రహస్యాలను పుక్కిట పట్టిన ఆచార్య వల్ల మా సంకల్పానికి విఘాతం కలుగుతుంటే చూస్తూ వూరుకోలేము...."

గుమ్మం అవతల వుండి మాట్లాడుతున్నాడా మనిషి. లోపల్నించి అతన్ని షూట్ చెయ్యడానికి ప్రయత్నించినా గోడ అడ్డుగా వుండటంవల్ల బుల్లెట్ అతనికి తగలదు! పైగా చీకటి! ఆ మనిషికి మాత్రం గుమ్మం పక్కనించి శబ్దాన్ని బట్టి లోపలి వాళ్ళని షూట్ చేసే ఛాన్స్ వుంది! అందుకే అంత ధీమాగా, నిర్భయంగా వున్నాడా మనిషి.

అయితే, రాయ్ నిరాశపడలేదు. సోఫా క్రింద వున్న భాస్కరాచార్యకి ప్రస్తుతం ప్రమాదం లేదు! ఆ మనిషి ఎంత ధైర్యస్థుడైనా తెగించి లోపలికి రాలేడు! కనుక, అతన్ని సజీవంగా పట్టుకోలేకపోయినా, అవసరమైతే హత మార్చి అడ్డంకి తొలగించుకోవచ్చు! క్షణాలు యుగాలుగా గడుస్తున్న యీ తరుణంలో కరుణ, జాలి, మానవత్వం, ధర్మాధర్మాల ప్రసక్తి లేదు!

దృఢనిశ్చయంతో జేబులోంచి పిస్తోలు తీసి గుమ్మం వైపు గురిపెట్టాడు రాయ్! మరుక్షణం బయట్నించి ధాంమ్మని పిస్తోలు పేలి అతని పిస్తోలు ఎగిరిపోయింది. అరచేతుల్లోంచి రక్తం కారసాగింది. బాధతో నరాలు జివ్వున లాగుతూండగా పకపక నవ్వు వినిపించింది.

"చీకట్లో ఏం జరుగుతున్నదో కూడా చూడగల శక్తి

మా నేత్రాలకి వున్నది మిస్టర్ రాయ్! మేము యీ లోకం వాళ్ళం కాము! మా కళ్ళకి చీకటీ వెలుతురూ ఒక్కటే! మీ రిద్దరూ యీ చీకట్లో ఏ మూల దాక్కున్నా కనిపెట్టగలం'' నవ్వుతున్నాడా మనిషి.

''నాన్సెన్స్! మరో లోకం కాదూ, మట్టిగడ్డా కాదు! పర్వెర్టెడ్ కేటరాక్ట్ లెన్సెస్ కనుపాపలకి అతికించుకుని వుంటారు'' అనుకున్నాడు రాయ్. పర్వర్టెడ్ లెన్సెస్ ధరిస్తే చీకట్లోని వస్తువులు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. అలాంటి ఏర్పాట్లను కూడా చేసుకున్న శత్రువుల్ని తక్కువగా అంచనా వేసుకోకూడదు! చిన్న పామునైనా పెద్ద కర్రతో కట్టాలనే పాలసీ అమలు పర్చాల్సిందే!

కాళ్ళకి వున్న బూట్లని నిశబ్దంగా విప్పుతున్నాడు రాయ్. చేతులు వుపయోగించకుండానే మడమలతో నొక్కుతూ పాదాలకి వున్న బూట్స్ వదులు చేస్తున్నాడు.

భాస్కరాచార్యకి అదంతా అయోమయంగా వుంది. శాస్త్ర విషయాల్లో వాదోపవాదాలతో, వాగ్ధాటితో ప్రత్యర్థులమాడు వాయగొట్టగలడు గానీ ఇలాంటి ముఖాముఖీ పోరాటాలూ, ప్రతిఘటనలూ ఆయనకి తెలియవు. అందుకే సోఫాక్రింద నక్కి భయంతో గడగడ వొణికిపోతున్నాడు. సరిగ్గా సమయానికి పిలిచినట్లుగా శత్రువులెలా వచ్చారో ఆయనకి ఏమాత్రం అంతుబట్టడంలేదు.

అయితే రాయ్ ఆ విషయం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తాను భాస్కరాచార్య దగ్గరకి వస్తున్నట్లు వూహించగలిగిన వాడు కృపాల్ ఒక్కడే! బుద్ధిపూర్వకంగా అతనా విషయాన్ని శత్రువులకి తెలియజెయ్యడు. కానీ, తాను వచ్చేశాక, మిగతా వాళ్ళకి సందేహ నివృత్తి చెయ్యడానికి

అందర్తోనూ భాస్కరాచార్య గురించి చెప్పివుంటాడు. అప్పుడు వాళ్ళల్లో ఎవరో అవకాశం చూసుకుని శత్రువు లకి కబురు చేసివుంటారు.

అంటే, అక్కడున్న వాళ్ళల్లో ఎవరో శత్రువుల తర పున పని చేస్తున్నారన్న మాట! వాళ్ళద్వారా ఎప్పటి విషయాలప్పుడు శత్రువులకి అందుతున్నాయన్న మాట!

ఎవరు వాళ్ళు? యీ మనిషిని పట్టుకోవడంకంటే వాళ్ళె వరో తెల్సుకోవడం అవసరం! వాళ్ళ చర్యలను అరికట్టక పోతే తాము ఏం చేసినా ప్రయోజనం వుండదు! అసలు వాళ్ళవల్ల ఎక్కడో వున్న నర్సన్‌కేగాక, ఇక్కడ రాజ భవన్లో వున్నవాళ్ళందరికీ ప్రమాదం వుంది! ఆ సంగతి రాజభవన్లోని వాళ్ళని హెచ్చరించాలి! ఆ పనిషెవరో కని పెట్టి పట్టుకోమని కృపాల్ని హెచ్చరిచాలి! ఎలా? టెలి ఫోన్ చేసేందుకు వీలున్నదా?

"పది అంకెలు లెక్కపెడతాను ఆచార్యా! అంకెలు పూర్తి అయ్యేలోగా మీరా సోఫా క్రింది నించి ఇవతలికి వచ్చి గుమ్మంలోకి రావాలి! లేదా, అంకెలు పూర్తి కాగానే శక్తివంతమైన హాండ్ బాంబ్ లోపలికి విసిరేసి నేను తప్పుకుంటాను. మరుక్షణం బాంబు పేలి, భవనం కూలి మీ ఇద్దరూ చస్తారు! మిమల్ని రక్షించగలవాణ్ని నేనొక్క డినే! బయటికి వస్తే మిమ్మల్ని సురక్షితంగా మా స్థావ రానికి తీసుకెళ్ళి అందలం ఎక్కిస్తాను! మీ ప్రతిభకి తగిన గుర్తింపు లభించేటట్లు చేస్తాను! ఆలోచించుకోండి! లెక్క పెడుతున్నాను....ఒకటి...."

గుమ్మం అవతల్నించి లెక్కింపు ప్రారంభమైంది! భాస్కరాచార్య ఏ కళనున్నాడోగానీ, కిక్కురుమనలేదు! అయితే రాయ్ గుండెలు దడదడలాడాయి!

"అయిదు....ఆరు....ఏడు...." అంకెలు లెక్కింపు పూర్తి కావస్తోంది. వ్యవధి క్షణాల్లోకి వచ్చేసింది.

రాయ్ కాలినించి ఓ బూటు వూడింది. కిందపడి చప్పుడు కాకుండా వేళ్ళతో బూటును పట్టుకుని అదే కాలి మడమతో రెండో కాలిబూటుని క్రింది నొక్కుతున్నాడు. ఒళ్ళంతా చెమటలు పట్టేస్తున్నాయి. రక్తం గడ్డ కట్టేస్తోంది.

"ఎనిమిది....తొమ్మిది...." లెక్కింపు పూర్తి కాబోతోంది.

"ఆగు! వస్తున్నాను" సోఫా క్రిందనించి అరిచాడు భాస్కరాచార్య. సోఫా క్రిందనించి మనిషి బయటికి వస్తున్న చప్పుడు వినిపిస్తోంది చీకట్లోంచి!

"గుడ్! మీరు మా దారికి వస్తారని తెలుసు! ఆ ఫోటో స్టాట్ కాపీ కూడా పట్టుకుని యిలా యీ గుమ్మంలోకి రండి" అంటున్నాడా మనిషి వుత్సాహంగా. భాస్కరాచార్య లొంగిపోతున్నాడనే ఆనందంలో ఒక్కక్షణం ఏమరుపాటు వహించాడు! అది చాలు!

రెండు కాళ్ళతోనూ రెండు బూట్సనీ మరోవైపుకి విసిరాడు రాయ్! ఎవరో అవతలకి దూకినట్లు బూట్లు చప్పుడు చేశాయి! ఆ శబ్దం వింటూనే "యూ డెవిల్....యూ కాంట్...." గర్జిస్తూ గోడ అవతల్నించి గుమ్మంలోకి వచ్చాడా మనిషి. మరుక్షణం పొదమాటున దాక్కున్న బెబ్బులిలా ఒక్క వుదుట్న లేచి అతనిమీదకి లంఘిస్తున్నాడు రాయ్.

అదే సమయంలో థామ్సని పిస్తోలు పేలింది!

(ఇంకా వుంది)

మొదటి నుండి సర్వోత్తమరావుది అదో రకం మనస్తత్వం. అడ్వెంచర్లు చెయ్యటం మహా సరదా. నలుగురిని గాభరాపెట్టి, ఏడిపించి కంగారు పెట్టటంలో అతనికి కలిగే ఆనందం మరి దేనిలోను కలగదు.

అతని ఫ్రెండ్ ఒకతను బాంకులో మేనేజరుగా పని

చేస్తున్నాడు. అతన్ని ఏడిపిద్దామని ఒకసారి అతని బాంకు తాళాలు దాచేసాడు. ఆ మేనేజరు పాపం కష్టమర్లకి తాళాలు పోయాయి అని చెప్పలేక గాభరా పడిపోతూ, లోపల లోపల, బాంకు తాళాలు పారేసుకుంటే తన వుద్యోగం పోతుందేమో అని ఆదుర్దా పడుతుంటే, అతన్ని చూసి తెగ ఆనందపడిపోయాడు. చివ్వరికి నవ్వుతూ నేనే దాచాను అని అరగంటకి తీసి యిచ్చాడు.

సరదాకి అయినా ఒక హద్దు ఉంటుంది అని పాపం ఆ మేనేజరు విసుక్కున్నాడు. అతని ఈ వింత స్వభావానికి చాలామంది మిత్రులు అతనికి దూరమయ్యారు.

అతని భార్య ఈ మధ్యనే రెండేళ్ళ క్రితం పోయింది. ఆవిడ బ్రతికున్నన్నాళ్ళు ఆవిడని ఇలాగే ఏడిపించుకు తినే వాడు. మీ నాన్నకు వంట్లో బాగాలేదని వుత్తరం వచ్చిందనో, మీ తమ్ముడికి ఏక్సిడెంట్ అయిందనో. ఆ వార్త విన్న ఆవిడ లబో దిబోయని ఏడుస్తుంటే కాసేపు చూసి, ఆనందించి అప్పుడు అంతా వట్టిదేనోయ్ నిన్నేడిపించా లని అలా అన్నాను. అందరూ ఏప్రెల్ ఫస్ట్ మాత్రం అంద రిని ఏడిపించి, ఫూల్ చేసి, ఆనందిస్తారు, కాని నాకు మటుకు ప్రతిరోజు ఏప్రెల్ ఫస్ట్ అని అనేవాడు. ఆవిడ కూడా ఈయన విచిత్ర స్వభావానికి చికాకు పడేది.

ఇక నౌకర్లని చెప్పనే అక్కర్లేదు. వంటవాడు అందరూ భోజనం చేసాక తను భోంచేద్దామని కూర్చోగానే యేదో పని వున్నట్లు పిలిచేవాడు. వాడు పాపం మధ్యలో లేచి ఏంటండి పిలిచారు అని ఆయన దగ్గరకి వచ్చేలోపల వంటింట్లోకి కుక్కని తోలేవాడు. అది వాడి భోజనాన్ని ముట్టుకునేది. అది చూసిన ఆ వంటవాడి ముఖంలో కలిగే బాధ ఈయనకి ఆనందం కలిగించేది.

భార్య పోయాక సర్వోత్తమరా వింట్లో అతని బావ మరిది ముకుందం, అతని సవతి చెల్లెలు సుందరమ్మ, అతని మేనమామ నాగభూషణం, ఆయన కొడుకు రాంబాబు తిష్ఠ వేసారు. వాళ్ళందరు అతని ఆస్థికోసం కాపుకాచి వున్నారు. వాళ్ళని కూడా ఎప్పుడూ ఏదో ఒక రకంగా ఏడిపిస్తూ కాలక్షేపం చేసేవాడు. వాళ్ళు అతని ఆస్థి కోసం అన్ని భరిస్తున్నారు. సర్వోత్తమరావుకి రోజూ చెస్ ఆడటం సరదా.

సర్వోత్తమరావు స్వభావం తెలిసి అతనికి దగ్గర కాగలిగిన వ్యక్తులు యిద్దరు. ఒకరు ఇన్‌స్పెక్టర్ రామనాథం. ఇంకొకరు డాక్టర్ రాజారాం.

బహుశ, వాళ్ళు యింతకంటే విచిత్ర వ్యక్తులను వాళ్ళ వృత్తిరీత్యా చూసి వుండవచ్చు. అందుకనే వాళ్ళకి ఈయన స్వభావం చికాకు కలిగించలేదు.

ఇన్‌స్పెక్టర్ రామనాథం వారంలో దాదాపు 2, 3 సార్లు సర్వోత్తమరా వింటికి వచ్చి చెస్ ఆడేవాడు. డాక్టర్‌గారు వచ్చేవారు కాని ఈమధ్య 6 నెలలగా సర్వోత్తమరావు డాక్టర్‌ని కలవటానికి అత వింటికో, క్లినిక్కో వెళ్ళేవాడు.

ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఇన్‌స్పెక్టర్ రామనాథం, సర్వోత్తరావింటికి వచ్చేడు.

"ఏంటోయ్! రామనాథం, ఈ మధ్య రావటమే లేదు" అని అడిగాడు సర్వోత్తమరావు.

"ఏం చేయనోయ్! తీరిక వుండటంలేదు. ఈమధ్య ఒక మర్డరుకేసు వచ్చింది. ఎవరు హంతకులో తేలటం లేదు. అఫ్‌కోర్స్! ఇవాళ కాకపోతే రేపయినా హంతకుడు పట్టుబడక మానడు. ఆ నమ్మకం నాకుంది" అని రామ

నాధం అన్నాడు.

"హంతకులు ఏ గుర్తు వదలకుండా, నేర్పుగా హత్య చేస్తే మీరెట్లా పట్టుకోగలరు," అని సర్వోత్తమరావడిగాడు.

"హంతకుడు బయట ఎక్కడో హత్యచేస్తే చెప్పలేను కాని, యింట్లో చేసే హత్యలో తొందరగా పట్టుబడతాడు. కారణం అతను పరిమిత స్థలంలో హత్యచేసి, తన గుర్తులేమి వదలకుండా, పరిమిత సమయంలో పారిపోవాలి. కాబట్టి ఎవరయినా చూస్తారేమో అనే హడావుడిలో ఏదో ఒక చిన్న ఆచూకైనా మాకు వదిలేస్తాడు" అని రామనాధం అన్నాడు.

అవి, యివి కాసేపు మాట్లాడాక రామనాధం వెళ్ళిపోయాడు.

సర్వోత్తమరావుకి ఈ మధ్య అసలు వంట్లో బాగుండటం లేదు. ముఖం రోజు రోజుకీ పాలిపోతోంది. రేపు డాక్టర్ దగ్గరికి వెళ్ళాలి అనుకున్నాడు.

2

మరునాడు సాయంత్రం నాలుగు గంటలకి డాక్టర్‌ని కలవటానికి బయలుదేరాడు సర్వోత్తమరావు. రాజారాంని కలిసిన అతని మొహం మరి కాస్త పాలిపోయింది. నీరసంగా యింట్లోకి అడుగుపెట్టిన అతని కాళ్ళు వరండాలోనే ఆగిపోయాయి.

అతని చెల్లెలు సుందరమ్మ, నాగభూషణం, ముకుందం ముగ్గురూ మాట్లాడుకుంటున్నారు. వీడు ఎప్పుడు పోతాడో, పీడా విరగడ అవుతుంది, వీడి ఆస్థి ఎలాగయినా మనకే దక్కేట్లు చేసుకోవాలి అని సుందరమ్మ అంటోంది.

"మన పేరున ఏమిటి? ఈ ఆస్థి అంతా నాకే దక్కేది.

నేను వాడికి తండ్రిలాంటివాడిని" అని నాగభూషణం అన్నాడు.

"మా అక్క అంటే మా బావకి ప్రాణం. మా అక్కే బ్రతికి వుంటె ఈ ఆస్థి అంతా నేనే అనుభవించేవాడిని. ఏమయినా సరే, సామ, దాన, భేద, దండోపాయాలతో ఈ ఆస్థి నా సొంతం చేసుకుంటా"నని ముకుందం అన్నాడు.

వీళ్ళందరి వాదనలు విన్న సర్వోత్తమరావుకి వీళ్ళందరిని తక్షణం తరిమేద్దామని కక్ష కలిగింది. వీళ్ళ ప్రేమంతా నామీద కాదు, నా ఆస్థిమీద అనుకున్నాడు.

డబ్బుకోసం మనుష్యులు ఎంతకయినా తగుదురు. ఏ పని చేయటానికి అయినా వెనకాడరు. బంధుత్వాలు అసలే నశిస్తాయి అనిపించిందతనికి. అతనికి డాక్టరుగారు తను ఎక్కువ రోజులు బ్రతకననటం గుర్తుకు వచ్చింది.

హఠాత్తుగా అతని మెదడులో ఒక మెరుపు మెరిసింది. మెరిసిందే తడవుగా అతని పెదవులపై చిరునవ్వు విరిసింది. అతను తిరిగి బయటకి వెళ్ళిపోయాడు. వెళ్ళిన అతను తిరిగి గంటకి తిరిగి వచ్చాడు.

"ఏమిటో ఇంతదాకా ఎక్కడికి వెళ్ళావు?" అని అడిగాడు నాగభూషణం.

"ఏం లేదు మామయ్యా! బ్యాంకు నుండి 4 లక్షలు డబ్బు డ్రాచేసి వస్తున్నాను. నాకు బ్లడ్ కాన్సర్ అని తెలిసింది. రేపు ఒక అమెరికన్ డాక్టర్ వస్తున్నాడు. నాకు Blood transfusion చేస్తే తగ్గుతుందని మన డాక్టరు చెప్పేడు. ఎంత ఖర్చు అయినా సరే అతనిని కలుద్దామని అనుకుంటున్నాను" అని అన్నాడు.

రోగం అని తెలియగానే అందరికి ఆనందం వేసింది, త్వరలో ఆస్థి ఇక మాకే దక్కేది అని. ఎవరి గదుల్లోకి

వాళ్ళు వెళ్ళిపోయారు.

ముకుందం అనుకున్నాడు ఇదే సమయం, బావగారితో నాలుగు మాటలు చెప్పి డబ్బు గుంజటానికి. బావ ఎలాగో ఎక్కువ రోజులు బ్రతకడు, దానికి 4 లక్షలు ఖర్చు పెట్టటం అనవసరం. అనుకున్నదే తడవుగా బయలుదేరాడు సిగరెట్టు వెలిగించుకుంటూ సర్వోత్తమరావు గదిలోకి.

"ఏంటోయ్! ముకుందం ఇలా వచ్చావు" అని అడిగాడు సర్వోత్తమరావు.

"ఏం లేదు బావా, మీకింత జబ్బుచేసింది అని తెలిసి చాలా బాధ అనిపించింది" అన్నాడు ముకుందం.

"ఏం చేస్తామోయ్! బాధపడి మాత్రం చేసేదేముంది?"

"ఆఁ బావా నేను అక్క జ్ఞాపకార్థంగా ఒక ఇండస్ట్రీ స్టార్ట్ చేద్దామనుకుంటున్నాను. దానికి మీరు కనీసం 3 లక్షలు ఫైనాన్స్ చేయాలి" అని తేలికగా అన్నాడు.

"అలాగే. రేపు ఆలోచించి చెపుతాలే" అని అన్నాడు సర్వోత్తమరావు.

బావ మంచిగా వింటే సరి, లేదా ఈ రాత్రికి ఆ 4 లక్షలు తీసుకొని పారిపోవాలి. దొరికిందే దక్కుడు అని నిశ్చయించుకున్నాడు ముకుందం.

నాగభూషణం తోటలో పచార్లు చేయసాగాడు. ఇది వరకు ఆస్థి మొత్తం కాజేద్దాం అనుకున్నాడు కాని యెప్పుడయితే సర్వోత్తమరావు నాలుగు లక్షలు మాయం చేసేదని తెలిసిందో అతని ఉద్దేశం మారింది. 4 లక్షలంటే తక్కువ కాదు. ఆస్థి మొత్తం కలిపితే 10 లక్షలుంటుంది. అది తనకి దక్కుతుంది అని నమ్మకం లేదు. ఈ 4 లక్షలు నా సొంతం చేసుకుంటాను. ఇది నాకు సదవకాశం అని

నిర్ణయించుకున్నాడు.

అయితే ఆ నాలుగు లక్షలు వాడు బ్రతికుండగా కాజేయటం కుదరదు. వాడిని చంపాలి. మనుష్యుల్ని పెట్టి చంపిస్తే అదో దండగ. తనే నేర్పుగా వాడిని చంపాలి. ఎలా? కత్తితో పొడిచా, విషంతోనా? ఎలా?

ఇంతలో 'నాన్నా! నాన్నా' అంటూ నాగభూషణం కొడుకు రాంబాబు హడావుడిగా వచ్చాడు.

"ఏంటో ఇంత రాత్రిదాకా తిరుగుళ్ళు, ఎక్కడికి వెళ్ళావు" అని మందలింపుగా అడిగాడు నాగభూషణం కొడుకుని.

"ఏం చేయను నాన్న! పాపం మా ఫ్రెండ్ తమ్ముడు ఇంటర్ ఫెయిలయ్యాడట. అందుకని ఉరిపోసుకున్నాడు. వాడింటినుండే వస్తున్నాను" అని అన్నాడు.

ఉరి అనగానే నాగభూషణం, బుర్రలో చటుక్కున మెరపు మెరిసింది. మెరసిందే తడవుగా తన కొడుకుకి వినిపించాడు. రాంబాబు ఆనందంతో చిందులేసాడు.

సుందరమ్మ భోంచేస్తోందన్న మాటే కాని ఆవిడ మనసులో మధ్యాహ్నం రుక్మిణమ్మగారు పేపరులో చదివిన విషయాలే గుర్తుకొస్తున్నాయి. అన్నయ్యని తమ్ముడు, హత్యచేసాడట ఆస్థికోసం. ఆస్థికోసం సొంత అన్నయ్యని తమ్ముడు చంపడమేమిటి, కలికాలం కాకపోతే అని అంది రుక్మిణమ్మగారు.

తను మాత్రం తన అన్నయ్యని చంపితే ఎలా వుంటుంది! వాడేమి తన సొంత అన్నయ్యకాదు. ఎప్పుడు పీడించుకు తినేవాడు తప్ప ప్రేమగా చూసింది లేదు. ఈ నాలుగు లక్షలు—వాడి గదిలోకి వెళ్ళి నాలుగు మాయ మాటలు చెప్పి గుంజటమో, ఒక్క పోటు పొడిచి డబ్బు

తీసుకోవటమో చేయాలి. డబ్బు కొట్టేస్తూ వుండగా వాడు చూస్తే ఆలోచించకుండా చంపేయటమే అని అనుకుంది.

ఈ లోపల 'సుందరం!' అని సర్వోత్తమరావు కేక వినిపించింది.

ఏంటన్నయ్యా, అని అడిగింది.

కాసిని పాలు తీసుకుని రా అని అన్నాడు.

పాలు తీసుకెళ్ళి ఇచ్చింది.

అదిగో ఆ అలమారలో ఒక నిద్రమాత్ర వుంది తీసి ఇవ్వు అన్నాడు.

నిద్రమాత్రలు తీస్తున్న సుందరమ్మ ఒక్క-క్షణం ఏదో ఆలోచనలో పడింది.

"సుందరం! ఆ పాలు కాస్త గొంతులో పొయ్యవే" లేవలేక పోతున్నాను అని అన్నాడు.

అలాగే లే అని విసుక్కు-ంటూ పాలు తాగిపించింది

ఇంక వెళ్ళు. అని అన్నాడు సర్వోత్తమరావు.

సుందరమ్మ అలమారలో డబ్బు సంగతి మర్చిపో లేదు.

3

అర్ధరాత్రి షుమారు రెండు గంటల ప్రాంతంలో నాగ భూషణం, అతని కొడుకు రాంబాబు మెల్లగా సర్వోత్తమ రావు గదిలో అడుగుపెట్టారు.

చేతులకి గ్లౌజులు తొడుక్కు-న్నారు. కళ్ళకి గంతలు కట్టుకున్నారు. సర్వోత్తమరావు మంచి నిద్దర్లో వున్నాడు. ముందుగా అనుకున్న ప్రకారం అతడిని చంపటానికి నిర్ణ యించుకున్నారు.

వాళ్ళు తమతో తెచ్చుకున్న బలమైన తాడుని సర్వోత్తమ రావు మెడకి గట్టిగా ముడివేసి అతన్ని పైన సీలింగ్‌కు

వేలాడదీసారు. కింద స్టూల్ కిందకి తన్నేసినట్టుగా పెట్టారు. చూసే వాళ్ళకి అతను ఆత్మహత్య చేసుకున్నట్లుగా కనబడుతోంది.

ఆ తర్వాత గది అంతా వెతకగా కేవలం లక్షరూపాయలు మాత్రమే దొరికింది. ఎంత వెతికినా అంతకు మించి దొరక లేదు. అంగుళం వొదలకుండా వెదికారు.

"నాన్నా! బావని ఉరి తీసినా, కుయ్! కయ్! మనదే" అని రాంబాబు అన్నాడు.

"వాడికి నిద్దురపోయేటప్పుడు నిద్దరమాత్ర వేసుకోవటం అలవాటు. అందుకే స్తబ్దుగా వున్నాడు. ఇది మన మంచికే అయింది" అని నాగభూషణం అన్నాడు.

తర్వాత ఇద్దరు బయటకి వచ్చి తలుపు దగ్గరికి లాగి తలుపు ఎదురుగా వున్న కిటికీగుండా ఒక కర్ర దూర్చి లోపలకి గడియపెట్టేసారు. చూసేవాళ్ళకి సర్వోత్తమరావు తలుపేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

"పద ఎవరయినా చూస్తారు!" అని ఇద్దరు బయటకి వచ్చి తమ గదుల్లోకి వెళ్ళిపోయారు.

4

తెల్లవారింది.

ఆరు గంటలకి అందరూ లేచారు.

ముకుందం "ఏంటి 7 గంటలయినా బావ లేవలేదు" అని అతని గదిలోకి వెళ్ళాడు.

తలుపు వేసి వుంది. కిటికీలో నుండి లోపలకి చూసిన ముకుందం 'కెవ్వు'న కేకవేసాడు. అందరూ ఏమిటి, ఏమిటి అంటూ గుమికూడారు.

"అమ్మో! బావ ఆత్మహత్య చేసుకొన్నాడు" అని

ముకుందం అన్నాడు. అన్న వెంటనే పోలీస్‌కి ఫోన్ చేశాడు.

ఇన్స్‌పెక్టరు రామనాథం వెంటనే బయలుదేరి అక్కడికి చేరుకున్నాడు.

ఇనస్పెక్టరు చాలా బాధపడ్డాడు తన స్నేహితుడిని ఆ దశలో చూసి. తలుపులు లోపల నుండి గడియవేసి ఉన్నాయి కాబట్టి తలుపులు పగలగొట్టాల్సి వచ్చింది.

ఇనస్పెక్టరు ముందుగా లోపలకి వెళ్ళి తర్వాత శవాన్ని కిందికి దించాల్సిందిగా ఆదేశించాడు. శవాన్ని పరిశీలనగా చూస్తున్న ఇనస్పెక్టరు కనుబొమ్మలు ముడుచుకొన్నాయి. ఉరిపోసుకొన్న మనిషి నాలుక బయటకి వచ్చి, మెడనరాలు ఉబ్బి, కంటిగుడ్లు బయటకి వచ్చి వికృతంగా వుంటాయి. మరి ఇతని కిదేమి లేదే మామూలుగా వున్నాడు అని.

అతని కళ్ళు మంచం కిందగా పడిన సిగరెట్టు పీకమీద పడ్డాయి. ఆరాతీయగా ముకుందం కాల్చే సిగరెట్టు బ్రాండు ఇది ఒకటే అని తేలింది. అతని బుర్ర చురుకుగా పని చేయసాగింది. ఇది ఆత్మహత్య కాదు, హత్య అని తెలుసు కొన్నాడు.

తక్షణం పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి ఫోటోగ్రాఫర్‌ని, వేలిముద్రల నిపుణులని పంపించాల్సిందిగా కోరాడు. గంటలో అందరు వచ్చి అక్కడి తతంగం ముగించారు.

రిపోర్టు ప్రకారం సర్వోత్తమరావు అర్ధరాత్రి షుమారు రెండు గంటల ప్రాంతంలో మరణించాడని, అతని మరణం ఉరివల్ల కాక, ఎక్కువగా నిద్దర మాత్రలు తీసుకోవటంవల్ల సంభవించిందని తేలింది.

గ్లాసుమీద వేలిముద్రలు సుందరమ్మవి అని తేలాయి. గ్లాసులో మిగిలిన పాలచుక్కను పరీక్షించగా అందులో

నిద్దర మాత్రలు కలిపినట్లు తెలింది.

ఇనస్పెక్టరు రామనాధం అందరి గదులు సోదా చేయ దలచుకొన్నాడు. ముందుగా సుందరమ్మ గది వెదికాడు. బట్టల పెట్టెలో అడుగున లక్షరూపాయలు దొరికాయి. నాకేం తెలీదు అని అవిడ ఎంత అరిచినా ఆవిడని, వేలి ముద్రలు గ్లాసుమీద వున్న నేరానా, లక్షరూపాయలు ఆవిడ పెట్టిలో దొరికిన నేరాన అరెస్ట్ చేశారు.

ఇక నాగభూషణం గది సోదా చేయగా ఒక మూల చెత్త పారేసే బుట్టలో ఒక లక్ష రూపాయల నోట్ల కట్టలు, ఒక నిద్ర మాత్రల సీసా దొరికింది. నాగభూషణం ముఖం పెంకయింది. ఇదేమిటి దొంగతనం చేసిన డబ్బు రాత్రి రాంబాబు జాగ్రత్తగా పరుపుగలీబులో పెట్టేయరా అంటే ఇందులో దాచేదేమిటి తెలివితక్కువ వెధవ, అని అను కున్నాడు.

"ఈ నిద్ర మాత్రల సీసా ఏమిటి" అని రామనాధం నాగభూషణాన్ని అడిగాడు.

"నే నే రోజూ పడుకునే ముందర వేసుకుంటాను" అని అన్నాడు.

ముకుందం గది సోదా చేయగా ఏమి దొరకలేదు. కాని ఇనస్పెక్టరు ముకుందం సిగరెట్టు పీక సర్వోత్తమరావు రూములో దొరికిన విషయం మరువలేదు. దాంతో ఆ ఇద్దరినికూడా అరెస్ట్ చేసి జైల్లో పెట్టాడు రామనాధం.

5

ఇన్స్పెక్టరు మనసులో ఒక అనుమానం తొలుస్తూనే వుంది.

సర్వోత్తమరావుని ఉరిపోసుకొన్న ఫోజులో నిలబెట్టే అవసరం యెవరికి కలిగింది. అయితే ముకుందంది కావాలి,

లేదా నాగభూషణానిది కావాలి. అంటె అతనిని హత్యచేసి ఆత్మహత్యగా నిరూపించాలని హంతకుడు ప్రయత్నించి వుండాలి. అందుకే తలుపులు లోపల నుండి తెలివిగా గడియ వేసాడు. బయటనుండి లోపల గడియ వేయటానికి హతుడు కర్ర ఉపయోగించి వుండాలి.

సర్వోత్తమరావు రెండు గంటలకి పోయాడని డాక్టరు సర్టిఫికేటు ఇచ్చాడు. రెండు గంటలకే హతుడు ప్రవేశించి వుంటాడు. పోయిన వెంటనే శవం దేహం ఇంకా వేడి గానే వుండి వుంటుంది కాబట్టి హంతకుడి దృష్టిలోకి ఇది రాలేదు. తన పని ముగించుకుని వెళ్ళిపోయాడు. అయితే పోయినవాడిని ఉరితీయటం జరిగింది కాబట్టి అతని నాలుక, కంటిగుడ్లు వికృతంగా పైకి రాలేదు.

కోర్టులో కేసు నడుస్తూనే వుంది. అందరూ సుంద రమ్మకు ఉరిశిక్ష పడుతుందనే అనుకున్నారు.

అంతలో రామనాధానికి ఒక లెటర్ వచ్చింది. అందులో యిలా వుంది:

డియర్ రామనాధం,

నమస్తే, బహుశ నువ్వు హంతకుడు ఎవరా అని ఆలో చిస్తూ బిజీగా ఉండి వుంటావు. హంతకుడిని పట్టుకున్నావని తలుస్తాను.

నా స్వభావం నీకు చిన్నప్పటి నుండి తెలుసు. నలు గురిని ఏడిపించి, కంగారుపెట్టి, ఆనందించేవాడిని.

నాకు ఆరు నెలల క్రితం తెలిసంది బ్లడ్ కాన్సరు అని. నిన్ననే నేను డాక్టరు దగ్గరికి వెళితే ఇంకో 15 రోజులు కన్నా బ్రతకడం కష్టం అని అన్నాడు.

పాలిపోయిన మొహంతో ఇంటికి వచ్చిన నేను వరం డాలో మాటలు వినబడి ఆగిపోయాను. నా వాళ్ళందరూ నా

గురించి మాట్లాడుకుంటున్నారు. అందరి కళ్ళు నా ఆస్థి మీదే. బెదిరించో, నయానో, నా ఆస్థి వాళ్ళు కాజేద్దామని అనుకుంటున్నారు.

నా బుర్రలో ఒక ఆలోచన మెరిపింది. ఎలాగో పోతాను. పోతూ, పోతూ, వీళ్ళందరిని ఒక ఆటపట్టిస్తే? ఎలా వుంటుంది అవి అనుకున్నాను. అనుకున్నదే తడ తడవుగా నాకు వెర్రి ఆనందం వేసింది.

వెంటనే బ్యాంకుకి వెళ్ళి 4 లక్షలు డ్రా చేసాను. నిద్ర మాత్రల సీసా కొన్నాను. డబ్బుకోసం నన్ను వాళ్ళు హత్య చేసినట్లుగా మీ పోలీస్ వాళ్ళకి అనుమానం కలిగేట్టుగా కొంత డబ్బు నాగభూషణం గదిలో కొంత డబ్బు సుందరమ్మ గదిలో నేనే పెట్టాను. మిగతాది నా గదిలో కొంత అటకమీద, కొంత అలమారలో వుంది.

సుందరమ్మ మీద అనుమానం కలిగేట్టుగా పాలగ్లాసు తెమ్మని, ఆమె తెస్తుంటే చటుక్కున నా దగ్గరున్న మాత్రలు కలిపేసాను. పాపం ఆమె ఏ పాపం ఎరగదు.

ఇక నాగభూషణం మీద అనుమానం రావాలని నా నిద్రమాత్రల సీసా, డబ్బు అతని గదిలో పెట్టేసాను.

ఇకపోతే ముకుందం పిగరెట్టు నా మంచం కింద చూసే వుంటావు. అది చాలు వాడిని నువ్వు అనుమానిస్తావు.

ఇలా ఒకళ్ళమీద ఒకళ్ళకి అనుమానం కలుగుతూ, వాళ్ళమీద నీకు అనుమానం కలుగుతూ వుంటే జరిగే తమాషా నేను చూడలేను, కాని ఊహించగలను.

బ్లడ్ కాన్సరుకు ట్రీట్‌మెంట్ లేదని తెలుసు, ఎలాగో 15 రోజులలో పోతానని తెలుసు. ఆ పోయేది ముందే పోయి, మిమ్మల్ని తికమక పెట్టాలని అనుకున్నాను.

అయితే రామనాధం ఈ నా సరదా తాత్కాలికమే సుమా!

తర్వాత లెటర్ రాస్తున్నాను. నా వాళ్ళని ఈ పాటికి అరెస్ట్ చేసివుంటే విడుదల చేయి. వాళ్ళందరికి నా నాలుగు లక్షలు సమంగా పంచి ఇవ్వు. మిగలిన నా ఆస్థి అంతా అనాథ ఆశ్రమానికి చెందేట్లుగా లాయరుగారికి వీలునామా రాసి యిచ్చాను.

నా వాళ్ళందరూ, నన్ను ఎంత చంపే ప్రయత్నం చేసినా, వాళ్ళు నా రక్తసంబంధీకులు. వాళ్ళని క్షమించి కొంత ఆస్థి ఇస్తున్నాను. పాపం వాళ్ళు చాలా యిబ్బంది టెన్షన్ పడివుంటారు. ఆఖరుగా నన్ను క్షమించమని అడుగుతున్నాను.

ఇక వుంటాను.

సీ

సర్వోత్తమరావు."

రామనాథం ఈ ఉత్తరం చదివి నిర్విణ్ణుడయినాడు. ఇలాంటి వాళ్ళని ఏమంటారు. సాడిస్ట్ అనా. ఇలాంటి డర్టిగేమ్ ఆడటం వాడికే చెల్లింది అని అనుకున్నాడు. □

మర్డర్స్ రచయిత

ఒక రచయిత తను వ్రాసిన కథలన్నీ పంపినవి పంపినట్టుగా తిరిగొస్తున్నాయి. ఇక ఆ రచయిత ఆవేశం అణచుకోలేక ఎడిటరుకు ఓ ఉత్తరం వ్రాశాడు ఇలా—

"ఆ సారి నేను పంపే కథ తిరిగొస్తే పోస్ట్‌మన్‌ను మర్డర్ చేస్తాను!"

—యన్. శివానంద్, బెల్లంపల్లి.

నీకోసం అడ్డదారి

సికిందర్

ఆమె చదువుతున్న పుస్తకం మధ్యలో మూసేసి, గాఢంగా ఆవులిస్తూ కళ్ళు మూసుకుని నిద్రలోకి జారుకుంది.

కాని తెల్లారి చూస్తే ఆమె తీరు ఈ లోకంతో అవసరం తీరిపోయినట్లు కన్పించింది....

కంగారుపడి యింకా చావని ఏదో ఆశతో, వెంటనే డాక్టర్‌కి కబురుపెట్టారు, ఆమె అక్కా బావగార్లు.

డాక్టర్ వచ్చి చూసి, ఇక చేయగల్గిందేమీలేదని విచారం వెలిబుచ్చుతూ, తక్షణం తెలియజేయమన్నాడు పోలీసులకి.

వార్త నందుకొని ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్, డిటెక్టివ్‌లతో సహా వచ్చి వాలాడు నిమిషాలమీద.

అప్పుడింకా హడావుడి పెరిగింది. ఒకవైపు మృతురాలి సోదరి రోదన మరోవైపు ఇరుగు పొరుగు వారి ఓదార్పులు. విధి నిర్వహణలో పోలీసుల సందడి.

సత్యాన్వేషణలో డిటెక్టివ్‌ల ఆరాటం.

డిటెక్టివ్‌ల దృష్టికి అందినంతమేరకు ఆ గదిలో కిటికీ వారగా ఒక నవారు మంచమూ, తలుపు ప్రక్కగా చిన్న మేజాబల్లా, గోడలో అమర్చబడ్డ చిన్న బీరువా, గోడకి రెండు పటాలూ, మధ్యలో సీలింగ్ నుంచి వ్రేలాడుతూ ఎలక్ట్రిక్ బల్బు వున్నాయి.

మంచం పక్కన చిన్న స్టూలుపైన ఒక గాజుగ్లాసు వుంది. అది పూర్తిగా ఖాళీగా వుంది. దాని ప్రక్కన చిన్న ప్లాస్టిక్ కంటెయినర్. అందులో సగం వరకు నిద్ర మాత్రలు. దాని క్రింద మడతపెట్టని ఒక తెల్లకాగితం, కలం. కాగితంమీద ముత్యాల్లాంటి అక్షరాలు. వీటన్నిటినీ డామినేట్ చేస్తూ మంచం పైన పాతిక నిండని పడతీ, ఆమె తలగడప్రక్కన మధ్యలో పేజీ మడతపెట్టిన ఠాగూర్ పుస్తకమూ.

ఆమె పేరు సువర్చలాదేవి. రోదిస్తున్నది ఆమె సోదరి శ్యామలాదేవి. వాళ్ళిద్దరు రూపంలో రవంత భేదంలేని కవలలు.

శ్యామల అక్కగా వ్యవహరింపబడుతోంది. ఆమె బీద

రికంలో మగ్గుతోంటే, ఆమె చెల్లెలు సువర్చల సకల ఐశ్వర్యా లనుభవిస్తూ చిత్రకారిణిగా పేరు తెచ్చుకుంటోంది....

ఆమె బావగారు శ్యామలాదేవి భర్త, ప్రకాశరావు పనీ పాటాలేని, పేరూ పలుకుబడీ లేని వ్యర్థజీవి. అతను డిటెక్టివ్‌లతో ఇలా చెప్పాడు:

"సువర్చల నిన్ననే వచ్చింది సర్, తాడేపల్లిగూడెం నుంచి, ఇక్కడ మమ్మల్ని చూడ్డానికి. మేం చూసుకొని చాలా కాలమైంది. ఆమెవద్దకి మేము వెళ్ళేస్థితిలో లేము. వారం క్రితం తానిక్కడి కొస్తున్నట్లు ఉత్తరం వ్రాసింది. నిన్న ఉదయం నేనే నాంపల్లి స్టేషన్‌లో ఆమెను రిసీవ్ చేసుకొని ఇంటికి తెచ్చాను, టాక్సీలో.

"సంవత్సరం పైనే అయివుంటుంది సర్, మేమంతా కలసుకొని. నిన్న సువర్చలని గుర్తుపట్టలేక పోయాం. ఆమె చాలా మారిపోయింది. మారిపోవడమేమిటీ, చిక్కిపోయింది. కొంచెం నల్లబడింది. భర్త పోయినప్పట్నుంచీ అమె జీవచ్ఛవంలా వుంటోంది సర్.

"ఆమెను చూసి మేం చాలా బాధపడ్డాం. విధి ఆమె పట్ల ఎందుకిలా చేసిందో తెలియదు. పదిహేడో ఏటనే సాహసించి ఏమీలేని, ఎవరూలేని ఒక అనామకుడ్ని చేసుకుంది! ఈమె తెచ్చిన అదృష్టం వల్లనే ఆ అనామకుడు చిన్నసైజు కంట్రాక్టరు నుంచి హఠాత్తుగా పైకెదిగిపోయాడు. కేవలం అయిదారేళ్ళ కాలంలో లెక్కలేనంత ఆస్థి—భవనాలూ భూములూ సంపాయించుకున్నాడు. కానీ విధి ఇంతలో ఆమెపట్ల చిన్నచూపు చూసింది సర్. అతను కారు యాక్సిడెంట్‌లో పోయాడు, రెండేళ్ళ క్రితం.

"అప్పట్నుంచీ ఆమె ఏకాకి. ఆమెకు ఊరట పొంద

డానికి పిల్లలు కలగలేదు. అలాగే ఆశలు చంపుకుని, ఈ రెండేళ్ళూ భర్త యిచ్చివెళ్ళిన ఆస్తుల్ని నిర్వహిస్తోంది. కొబ్బరితోటలూ, వ్యవసాయమూ చూసుకుంటూ గడుపు కొస్తోంది. జీవితంలో ఏర్పడ్డ లోటుని-కోర్కెల్ని చంపుకో డానికి దృష్టిని కళలపైకి మళ్ళించింది. ఆ లోకంలో చాలా వరకు గాయాన్ని మర్చిపోగల్గింది....మంచి చిత్రకారిణిగా పేరు తెచ్చుకుంటోంది....

"కానీ సర్, ఆమె ఇక్కడ మాకు రాసే ఉత్తరాల్లో ఆమె వేదన తెలుస్తోనే వుంది. అది తన గురించి కాదు, మా పరిస్థితికి! మా కిక్కడ—మా దురదృష్ట మేమిటో నే నేది చేపట్టినా నష్టపోతున్నాను. మా రోజులు మంచివి కావు. మా పరిస్థితి చూసి సువర్చల చాలా తల్లడిల్లి పోయేది....

"ఆమె శ్యామలకు రాసే ఉత్తరాల్లో దేవుడెందు కీ తేడాలు సృష్టించాడనేది. జన్మతః ఒకే నక్షత్రం, ఒకే రూపం కలిగివున్న తామిద్దరి మధ్యగా ఎందుకీ తారతమ్యా లనేది. తనకు అన్ని ఐశ్వర్యాలిచ్చి, అక్కని ఎందుకు దారిద్ర్యంలో నెట్టాడనేది ఆ దేవుడు. ఆమె మమ్మల్ని తన దగ్గరకి వచ్చేయమనేది. కాని శ్యామల ఒప్పుకోలేదు. దేవు డెవరికేదిస్తే అదే అనుభవించాలన్నది ఆమె వాదం. అక్కడ చెల్లెలు అక్క దరిద్ర్యానికి తల్లడిల్లితే, ఇక్కడ అక్క చెల్లెలి వైధవ్యానికి వేదన చెందేది....

"ఈ మధ్యనే సర్, ఆమె రెండుత్తరాలు మరీ విపరీత మన్పించాయి. తన కిప్పుడు జీవితంమీద ఆసక్తి నశిస్తోం దట! కళా జగత్తులోపడి ఇంకెంత కాలమూ తనని తాను మభ్యపెట్టుకోలేనంది! తన జీవితానికి అర్థం ఇది కాదనీ, మరో ప్రయోజనం, బాధ్యత వుండాలనీ, వాస్తవ పరి

స్థితుల్ని, తన చుట్టూ వున్న వాళ్ళనీ పట్టించుకునే అవసరం ఎంతైనా వుందనీ వ్రాసింది—

"ఆమె నుంచి మేము ఎటువంటి సహాయాన్నీ పొందే ప్రశ్నే లేదంటున్నాం కనుక, ఇలా మా జీవితాల్ని చూస్తూ తానుండలేకపోతోంది గనుకా, ఎంత త్వరగా తను పోతే అంత మంచి జరుగుతుందని చెప్పింది. నీ కిదేం బుద్ధులే చెల్లీ అని శ్యామల మందిలిస్తూ రాసింది. అయినా విన్పించుకోలేదు. ఆమె ఆ స్తంతా అక్క పేర్న వ్రాసేపింది: ఇక తను చావుకోసమే నిరీక్షిస్తున్నానంది—

"ఇది జరిగి రెండు నెలలైంది, సర్. ఈ పిచ్చిపనికి శ్యామల కోపం తెచ్చుకుని చాలా రాసింది. అయినా ఆమె విన్లేదు. తను పోతే తన ఆస్థి అంతా ఇంకెవరిదౌతుంది? అందుకని ఎప్పుడో జరగాల్సిన పని ముందే చేసేశానంది. ఆస్తి రాయడం తన చేతిలో వున్నా, తన చావు మాత్రం దేవుడి చేతిలోనే వుందంది. ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్ళిపోతానంది. అప్పుడీ ఐశ్వర్యం స్వీకరించి మేము సుఖంగా వుంటే తన ఆత్మకు శాంతిట!...." ప్రకాశరావు ఆ తర్వాత చెప్పలేక, ముఖం చేతుల్లో కప్పుకొని సన్నగా ఏడ్వసాగాడు.

డాక్టర్ రఘునాథ్ డిటెక్టివ్‌ల దగ్గరకొచ్చి, పక్కకు తీసుకెళ్ళాడు.

"లాల్, ఇది ఆత్మహత్య అవునో కాదో యిప్పుడే చెప్పలేను. ఆమె కొన్ని గంటల క్రితమే—తెల్లవారు జామున అయిదూ ఆరు గంటల మధ్య మరణించివుండాలి. శవం వేలిముద్రలతోపాటు ఆ గ్లాసుమీద, పిల్స్ కంటెయినర్ మీదా తీసుకోమని కృష్ణన్‌కి చెప్పాను. నేను పోతున్నాను."

అతను వెళ్ళిపోయాడు.

డిటెక్టివ్‌లు అయోమయంగా చూసి, ప్రకాశరావు దగ్గరకి తిరిగి వచ్చారు.

"తేరుకోండి, మిస్టర్ ప్రకాశరావు. సువర్చల గురించి మీరు చాలా సంగతులు చెప్తున్నారు. తర్వాత ఏమైంది?" అన్నాడు లాల్.

అతను కళ్ళు తుడుచుకుని చూశాడు:

"శ్యామల ఆమె మాటలు నమ్మలేదు. ఎప్పుడో యేదో అఘాయిత్యం చేస్తుందని భయపడింది. ఆమె అలా ఎప్పటికీ చేయదని నేను నచ్చజెప్పేవాడ్ని. ఇంతలో నిన్న సువర్చలే ఇక్కడికి కొచ్చింది. ఆమె....ఆమె ఇలా చేస్తుందని కలలో కూడా అనుకోలేదు! శ్యామల అన్నది నిజమే అయింది!"

"నిన్న ఏదైనా సంఘటన జరిగిందా?"

"నిన్న మేం ముగ్గురం చాలా ఆనందంగా గడిపాం సర్. నిన్నేం జరగలేదు. తన తర్వాత ఆస్తి మాకే చెందుతుందనీ, తన మోడుబారిన జీవితానికి ఈ ఆస్తి పెద్ద బరువుగా వుందనీ, తీసుకొని మా జీవితాల్ని వికసింపజేసుకోమనీ, ఈలోగా తానే అఘాయిత్యానికి పాల్పడి మమ్మల్ని బాధించననీ వేడుకుంది సర్. అయితే అలాగే చేసింది! అలాగే చేసింది ఇప్పుడు! ఏ దుర్బలక్షణాన యిలా చేసిందో....ఆమె రాసిన ఉత్తరం చూశారా సర్?"

"చూస్తాను. ఎప్పుడామె నిద్రపోయింది, తెలుసా?"

"తొమ్మిది గంటలకి గదిలో కెళ్ళింది. అప్పుడే శ్యామల గ్లాసులో పాలు తీసుకెళ్ళిచ్చింది. ఏదైనా పుస్తకం కూడా ఇమ్మంటే ఇచ్చిందట. అంతే మాకు తెలుసు, ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు."

"పాలు తీసుకెళ్ళగానే తాగిందా?"

"లేదట, స్టూలుమీద పెట్టమందట"

"ఆమెకు నిద్రమాత్రలు అలవాటున్నట్లు మీకు తెలుసా?"

"మాకు తెలీదు" అన్నాడు ప్రకాశరావు.

కృష్ణన్ వచ్చి, లాల్‌ని పక్కకు పిల్చాడు:

"గాజుగ్లాసు మీద రెండు రకాల వేలిముద్ర లున్నాయి, లాల్. పిల్స్ కంటెయినర్ మీద శవం వేలిముద్రలు మాత్రమే వున్నాయి. గ్లాసుమీద నాలుగు ముద్రలు శవం కుడిచేతివి, మిగతా మూడు ముద్రలు—"

"ఆమె అక్క శ్యామలవి అయివుంటాయి" అన్నాడు లాల్, "పాలు ఆమె తీసుకొచ్చిచ్చింది. మీ రామె వేలి ముద్రలు కూడా తీసుకోండి."

"అలాగే, ఇప్పుడీ ఉత్తరం చూడండి."

అందుకొని చూశాడు లాల్.

ఆ ఉత్తరం అక్క నుద్దేశించి సువర్చల వ్రాసింది. ఇక్కడామె దైన్యాన్ని చూసీ, ఆ ముఖంమీద తెచ్చుకోలు నవ్వుని చూసీ తన గుండె చెదిరిపోతోందనీ; అందుకే వుండలేక తానీ పని చేస్తున్నాననీ; తనకోసం దుఃఖించక, బెంగలుపెట్టుకోక, ఈ క్షణంలో ఆమె హక్కు కింద కొచ్చే తన ఆస్తిని అక్కడ తన లాయర్ సహాయంతో స్వాధీనం చేసుకోమనీ, ఈ బీదరికం నుంచి బయటపడి కళకళలాడుతూ ఆపైన తన ఆత్మకు శాంతి చేకూర్చమనీ ప్రాధేయపడుతూ ముగించింది.

లాల్ ఆమె ఇదివరకు వ్రాసిన ఉత్తరాలు కూడా తెప్పించి పరిశీలించాడు. కళ్ళు రెపరెప లాడిస్తూ వాటిని జాన్ కిచ్చి, శ్యామల వున్న గది దగ్గరికి నడిచాడు.

ఆమె లోపల మంచంమీద కూర్చుని విలపిస్తోంది. ఆమె చుట్టూ నల్గురుచేరి ఓదారుస్తున్నారు. లాల్ ఆమెని ఎక్కువసేపు చూడలేకపోయాడు. ఆమె పైట తలమీదుగా కప్పుకుని వుంది.

లాల్ వెనక్కి తిరిగి వచ్చాడు.

శవం అంబులెన్స్‌లో తరలించబడింది.

2

"వెల్ పార్ట్నర్, నీకేమనిపిస్తోంది?" అన్నాడు లాల్ ఆఫీసుకి తిరిగి వచ్చాక, "నీ కిందులో అసహజమన్పించడం లేదూ, నాకన్పిస్తోంది. డాక్టర్ విషయం సరిగా చెప్పకుండా జారుకున్నాడు. అది ఆత్మహత్య అవునో కాదో అప్పుడే చెప్పలే నన్నాడు. ఎందుకు? ఆ నిద్రమాత్రలూ పాలగ్లాసూ వుత్తరం చూసి ఎవరైనా ఆత్మహత్యే నంటారు. డాక్టర్ ఎందుకలా అనుకోలేక పోయాడు? అతని కింకేం తెలిసింది—మన దృష్టికి అందనిది—మనం గమనించనిది?"

"అతనికి తెలిస్తే ఎందుకు చెప్పడు?" అన్నాడు జాన్, గోళ్ళు చూసుకుంటూ.

"ఇదమిత్థంగా తెలీక! లేక అక్కడ చెప్పలేక! ఇప్పుడదేమిటో తెలుసుకుందాం—"

లాల్ ఫోనెత్తి నెంబర్ తిప్పాడు.

డాక్టర్ వెంటనే రెస్పాన్స్ యిచ్చాడు.

అప్పుడు లాల్ అన్నాడు: "డాక్టర్, నేనిలా అడుగుతున్నందుకు కోపం తెచ్చుకోకండి. మీ రిందాక అక్కడ చెప్పలేకపోయిన విషయం ఏమిటి? అది ఆత్మహత్య కాదని ఎందుకనుకుంటున్నారు?"

"అనుకోవలసి వచ్చింది, లాల్" డాక్టర్ అన్నాడు బల

హీనంగా నవ్వి, "పోస్టుమార్టమ్ వరకూ అవసరంలేదు. అందులో నిద్రమాత్రలు తీసుకున్నట్లు ఆత్మహత్యకు అనుకూలంగానే తెలుతుంది. కానీ బయట మెటీరియల్ ఎవిడెన్స్—మీరు గమనించారో లేదో—అక్కడున్న నిద్రమాత్రల కంటెయినర్ సరికొత్తది."

"అలాగా?"

"అవును. అది సరికొత్తది. మీరు డేటాఫ్ మ్యాను ఫేక్చర్ చూడండి, క్రిందటి నెలలోనిదే. మార్కెట్‌లోకి ఇటీవలే వచ్చింది. ఇవాల్టికి సరిగ్గా యిరవై రెండురోజులు. కాబట్టి ఆమెకు నిద్రమాత్రలు అలవాటుంటే దాన్ని యిటీవలే, అంటే యీ పదిహేను యిరవై రోజుల్లోనే ఖరీదు చేసివుండాలి.

"కానీ అందులో సగానికి పైగా మాత్రలు లేవు యిప్పుడు. అందులో రెండొందలు మాత్రలుంటాయి. ఈ పది పదిహేను రోజుల్లో ఆమె అన్ని మాత్రలు వాడే అవకాశం ఏ రకంగా చూసినా లేదు!

"కాబట్టి మిస్టర్ లాల్, ఆమెకు స్లీపింగ్‌పిల్స్ అలవాటుంటే ఇన్నిరోజుల్లో మహా అంటే పదిహేను—ఇరవై మాత్రలు వాడివుండాలి. కాని ఆ కంటెయినర్ సగం ఖాళీగా వుంది. అంటే ఆమె రోజువారీ వాడకం ఓ యిరవైపోగా, మిగిలిన ఎనభై మాత్రలు ఆమె నిన్నరాత్రి ఒకేసారి తీసుకుందా? అసంభవం. ఆమె చనిపోదలిస్తే అన్ని అవసరం లేదు. పది పన్నెండు చాలు. ఆ సంగతి ఆమెకు తెలియక పోలేదు.

"బార్బిటోన్స్ చాలా శక్తివంతమైనవి. మరిప్పుడు మిగిలిన దెభై మాత్రల సంగతేమిటి? అవి కచ్చితంగా ఆమె శరీరంలో చేరలేదు! బార్బిటోన్స్ లాంగ్ ఏక్టింగ్ కిందికి

వస్తాయి. అంటే తీసుకున్న ఎనిమిది—పది గంటల్లో ప్రాణం తీస్తాయి. దీనికి మోతాదు మూడు నుంచి అయిదు మాత్రలు వరకు చాలు. అంతేగాక, ఆమె రాత్రి తొమ్మిదీ పది గంటల మధ్య పాలు తీసుకుందమకుంటున్నాం గనుక—అప్పట్నుంచీ ప్రాణం పోయేవరకూ గడచిన సమయం ఏడెనిమిది గంటలు—ఆమె మరీ యెక్కువ మోతాదు తీసుకోలేదని స్పష్టం జేస్తోంది....

"అంతే కాదు, మిస్టర్ లాల్. ఆమె దైహిక స్థితి కూడా దీన్ని నిర్ధారిస్తోంది. విషప్రయోగం జరిగిన దేహం త్వరగా కుళ్ళదు. కుళ్ళబెట్టే బాక్టీరియాలని ఆ విషం నిరోధిస్తుంది. ఈ కేసులో శవంలో ఎక్కువ నిరోధక శక్తి లేనందువల్లనే శవం అప్పుడే కుళ్ళిపోతోంది...."

"వెరీవెల్!"

"లేకపోతే మరణించే ముందువరకూ ఎలాంటి భావోద్రేకాలకి లోనుగాకుండా, మనసుపెట్టి ఏకబిగిన యాభై పేజీలు పుస్తకం చదివిన మనిషి, అంతలోనే అలా ప్రవర్తించడం విచిత్రంగా లేదూ?"

"గుడ్ పాయింట్."

"దట్సాల్, లాల్. ఈ పాయింట్స్ చాలు, ముందుకు సాగండి. అది ఆత్మహత్య కాదన్నది నిస్సందేహం!"

"అలాగే, థాంక్యూ."

ఫోన్ పెట్టేశాడు లాల్.

జాన్ అతన్నుంచి వివరాలు తీసుకున్నాడు.

అప్పుడన్నాడు లాల్: "కానీ జాన్, ఇప్పుడొక చిక్కు వచ్చిపడింది...."

"ఏమిటది చెప్పు, విప్పేస్తాను ముడి."

"అది ఆత్మహత్య కాదనుకుందాం—హత్య చేయబడిం

దనుకుందాం. ఎవరు చేస్తారు? అఫ్‌కోర్స్, ఆ స్త్రీకి ఆశపడి —త్వరపడి ఆమె అక్కా బావగార్లు, లేక అక్కకి తెలియకుండా బావ ఒక్కడే చేయాలి. బాగానే వుంది. మనం ఈ వుత్తరం—దాన్ని ఫోర్జ్ చేయడం ఎలా సాధ్యం అక్షరం పొల్లుపోకుండా? మరొకటి, నిండు మాత్రలున్న ఆ సరికొత్త కంటెయినర్‌ని కొనుక్కురావడం ఎలా సాధ్యపడింది—డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా? ఏ డాక్టరూ అన్ని మాత్రలు వ్రాసివ్వడు కూడా...."

"పలుకుబడి వుపయోగించవచ్చు."

"ప్రకాశరావుకి అదిలేదు."

"డబ్బూ, హోదా...."

"అవికూడా అతనికి లేవు."

"అతని కెందుకుండాలి? అతని భాగస్వామి కుండవచ్చుగా—"

"భాగస్వామికా? అంటే భార్యకా? నువ్వేమంటున్నావో తెలుసా?"

"తెలుసు. పార్ట్‌నర్. జీవితంలో భాగస్వామి కాదు. పథకంలో భాగస్వామి. అతని మరదలు సువర్చల. ఆమెకు డబ్బూ పలుకుబడీ చాలా వున్నాయి—"

"ఏమిటీ....జాన్, ఏమిటి నువ్వనేది?"

"ఆమె కూడా అతని భార్యలాగే వుంటుంది, కవలలు కదా?"

"అయితే?"

"స్థానాలు మారవచ్చు. యూసీ పార్ట్‌నర్, శ్యామలకి చెల్లెలి ఆ స్త్రీమీద ఆశలేదు. ఆమె భర్తకి చాలా వుంది. సువర్చలకి మగతోడు లేదు. ఆమె తపిస్తోంది. అప్పుడు చూడు వాళ్ళేం చేస్తారో—బావా మరదళ్ళు కూడబలు

కున్నంటారు. ఏయ్ సువర్చలా! నువ్వు శ్యామల స్థానంలో కొచ్చేయ్. నాకు నీ ఆస్తి నిచ్చేయ్. నువ్వు సుఖపడతావ్. నేను బాగుపడతాను. మరి అక్కయ్య? పిచ్చిపిల్లా! మన మధ్య ఆమె ఎందుకు? ఆమెకేదీ అవసరం లేదు. మన మధ్య యెందుకు అనవసరంగా....ఓహ్, అర్థమైంది బావా, కానీయ్....అలాగే కానీయ్...."

జాన్ ఇంకా చెప్పుకుపోతున్నాడు.

లాల్ ముఖం ఎర్రబడుతోంది. "ఆగు" అనరిచా డతను, "అయితే ఆ శవం సువర్చలది కాదంటావా— సువర్చలది?"

"ముమ్మాటికీ కాదు."

"నీకు మతి చెడింది! ఆ శవం సువర్చలది. రూపా లొకటి కావచ్చు. కానీ ఫిజికల్ ఎప్పియరెన్స్‌ని ఎలా టాంపరింగ్ చేస్తారు? ఒకరు బీదరికంలో సరైన పోషణ లేక వుంటే మరొకరు మంచి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఆ తేడా వాళ్ళ ఒడ్డూ పొడుగూ చూస్తే తెలిసిపోతుంది—"

"నువ్వనుకునే శ్యామలని పరీక్షగా చూశావా?"

"లేదు. కానీ ఆమె చుట్టూ వున్నవాళ్ళు పసిగట్టరా?"

"ఎందుకు పసిగడతారు? మనుషులు తామెప్పుడూ చూస్తూన్నదాన్ని వున్నది వున్నట్లుగానే తీసుకుంటారు. అది కాదన్నప్పుడే వాళ్ళకి అనుమానాలొస్తాయి."

"కానీ జాన్—"

"కాదు లాల్, నువ్వు మాట్లాడకు. ఆ ఉత్తరంలో దస్తూరీ కలవడానికిదే కారణం. నిండు కంటెయినర్ రావ డానికిదే కారణం. ఎంత సులభమో నువ్వే చూడు! సువర్చల ముందే ప్రకాశరావుకి ఉత్తరం వ్రాస్తుంది, తను

ఫలానా రోజున వస్తున్నట్లు. వస్తూ తన పలుకుబడితో తనూశ్రీ ఆ నిండు కంటెయినర్ సంపాదించుకుంటుంది. అందులో కొన్ని మాత్రలు పారేస్తుంది.

"ఇక్కడకొచ్చి బావ సహాయంతో అక్కకి పాలలో కలిపి తాగిస్తుంది. ఆ చేత్తోనే ఓ ఉత్తరం రాసిపెడుతుంది. అద్దవలసిన వేలిముద్రలు అద్దుతుంది. అంతే, అక్క చని పోయాక చీరలు మార్చేస్తుంది. తను శ్యామలాదేవి అయి పోతుంది. తన వీలునామా ప్రకారం ఆస్తిని శ్యామలగా వెళ్ళి స్వాధీనం చేసుకుంటోంది. దాన్నమ్ముకుని ప్రకాశ రావుతో మరోచోటికి ఎగిరిపోతుంది. హాయిగా జీవితం గడిపేస్తుంది...."

"ఓహ్, ఇటీజ్ టూ అబ్సర్డ్!" అన్నాడు లాల్ అసహ నంగా, "అసలు శ్యామల అంత రాత్రి పాలు తాగే అవసర మేమిటంటావు?"

"ఆమె కలవాటుండవచ్చు."

"కానీ ఆ గది సువర్చలకి కెటాయించబడిందను కుంటాను?"

"అప్పుడామె భర్తతో పాటే తమ గదిలో వుండొచ్చు. ఆ పాలు ఆమెకోసం ఎవరోగాక, ఆమే భర్తకోసం తెచ్చి వుంటుంది. ఇది కన్విన్సింగ్‌గా వుంటుందికదూ? అప్పుడా భర్త ఎందుకో తాగనని చెప్పేసి, ఆమె చూడకుండా మందు కలిపి, ఆమెనే తాగమని వుంటాడు. ఆమె తాగేసింది. భర్త సరసన శయనించింది. సౌభాగ్యవతిగా చని పోయింది. దట్సాల్, ఆ తర్వాత సువర్చల గదిలోకి తర లించబడింది. సువర్చల అతని భార్య స్థానంలోకి మారింది. ఇటీజ్ దట్ సింపుల్, లాల్."

లాల్ ఆందోళనగా చూశాడు.

జాన్ తలూపాడు, "అవును. వేలిముద్రలు అక్కా చెల్లెళ్ళని నిర్ణయించడాని కుపయోగపడతాయి. శ్యామల వేలిముద్రలు ఇంట్లో ఆమెకు మాత్రమే తెలిసిన చోట్లలో- ఆమె వ్యక్తిగత వస్తువులపై కనుక్కుంటే—హతురాలి వేలిముద్రలతో అవి కలుస్తాయి కాబట్టి—సువర్చల సంజాయిషీ చెప్పుకోలేని వివరణ ఇవ్వలేని స్థితిలో పడుతుంది! ఇదొక్కటే మనకు ఆయుధం, లాల్!"

3

కృష్ణన్ ఫోన్ చేశాడు ఉద్వేకంగా, "అర్జంట్ మిస్టర్ లాల్, అర్జంట్!"

"ఏమిటి?"

"డాక్టర్ వెంటనే మీకు చెప్పమన్నారు. ఆయన మార్గ్‌లో వున్నారు. డెడ్ బాడీ అక్కడే వుంది. శవం గురించి, శవం మీద దుస్తుల గురించి విచిత్రం బైటపడింది!"

"ఏమిటది?"

"శవంమీద జాకెట్ దానికి సరిపోయేది కాదట! చేతుల దగ్గరా, నడుము దగ్గరా వదులుగా వుందట! లోపల బ్రాసరీ ఇప్పుడందరూ వాడుతున్నటు వంటిది కాదట! పూర్వం వాడే 'బాడీ' అట! మామూలు గుడ్డతో ఇంట్లో కుట్టుకున్నది. ఇక చీర బాగా ఖరీదయినదే అయినా—లోపల—లోపల పావడా ముతకగుడ్డదట! వింటున్నారా, మిస్టరు లాల్?"

"నేను మెలకువగానే వున్నాను...."

"సువర్చల ధనవంతురాలు! డబ్బుగలది! మురిపైన మెరుగులులోన ఈ కరువు ఏమిటా? ఆమెకేం తక్కువ? ఆమె సూట్‌కేసులో ఖరీదైన సిల్కు పావడాలూ, బ్రాసరీలూ వున్నాయి! ఈ నాసి గుడ్డలు ఎక్కడ్నుంచి వచ్చాయి? ఎందుకు కట్టుకుంది? ఈ గుడ్డలు బీదరికాన్ని చాటుతున్నాయి.

కానీ బీదరికం ఆమెకు వర్తించదు! వాటిమీద చాకలి గుర్తులతో నేను ఇంటికి పరుగుపెట్టాను. అక్కడ శ్యామల బట్టలపైన ఇవే గుర్తులున్నాయి!"

"వెల్, వెల్, వెల్!"

"ఆ బాడీ, పావడా శ్యామలవి, మిస్టర్ లాల్!"

"అవేం ఖర్మ, అసలు డెడ్‌బాడీయే శ్యామలది!"

"అదీ! అదీ! అలా చెప్పండి. బావా మరదళ్ళు కుట్ర పన్ని, శ్యామలని చంపేసి, పైబట్టలు వొలిచేసి, సువర్చల బట్టలు చుట్టబెట్టారంతే!"

"అంతే!"

"నే నింటికెళ్తే ఆ శ్యామల అనబడే సువర్చల బైటికి రావడం లేదు. ప్రకాశరావు గదిలో పెట్టి తలుపుమూశాడు. ఆమె చాలా అప్‌సెటయి వుందట. ఆమెను డిస్టర్బ్ చేయ వద్దన్నాడట ఉదయం పిలిపించిన డాక్టర్. బూటకం! అంతా నాటకం!"

లాల్ దీర్ఘంగా నిట్టూర్చాడు. ఆ తర్వాత అన్నాడు: "ఆమెను కలుసుకునే ప్రయత్నం నేను చేస్తాను. కృష్ణన్, మీరు అక్కా చెల్లెళ్ళ మధ్య అంతస్తుల తారతమ్యం ఆధారంగా వాళ్ళ ఫిజికల్ ఎప్పియరెన్స్‌ని వూహించి అక్కెవరో, చెల్లెలెవరో తేల్చాలనుకుంటున్నారనుకుంటాను. అది తప్పు."

"ఉదయం ప్రకాశరావు మాతో మాట్లాడుతూ ఒక విషయం చెప్పాడు. సంవత్సరం తర్వాత వాళ్ళు నిన్న సువర్చలని చూశారు. ఆమెను చూసి వాళ్ళు చాలా బాధ పడ్డారట. మనిషి చిక్కిపోయి, నల్లబడి ఎలాగో వుందట.

"ఇప్పుడు తెలుస్తోందా మీకు, ఆమె చిక్కిపోవడానికి కారణమేమిటో? వ్యథలా? కాదు. ఈ పథకంలో అదొక

భాగం. చాలా ముఖ్యమైన ఘట్టం. దానిమీదే ఆధారపడి వుంది. ఆమె అచ్చం అక్కలాగే కనపడాలి. అందుకు శరీరంలో ఆకర్షణ పోగొట్టుకొని, బరువు తగ్గించుకుని, అక్కలా బలహీనంగా తయారై ఇక్కడ దిగింది.

"ఉదయం నేనామెని సరిగ్గా చూడలేకపోయినా ఆమె ఎలా వుంటుందో ఇప్పుడూహించగలను. నో ఎప్పియరెన్స్‌తో ఆమె శ్యామల కాదని నిరూపించడం కష్టం. ఆమె చాలా జాగ్రత్తలు తీసుకుని వుంటుంది. ఇది మామూలు వ్యవహారం కాదు. దీనికి మరో మార్గం చూడాలి...."

"ఏమిటది?"

"వేలిముద్రలు—సువర్చల అక్క అవతారం ఎత్తింది గనుక, అమె ఇప్పుడు శ్యామలలా వ్యవహరింపబడుతోంది గనుక, ఆ శ్యామలాదేవిగా సంజాయిషీ ఇచ్చుకోలేని, వివరణ చెప్పకోలేని చోట ఆమె వేలిముద్రలు పట్టుకోవాలి— అంటే ఆమె నిన్న ప్రయాణించి వచ్చిన టాక్సీలో!"

"ఓహ్—ఓహ్"

"కాబట్టి వెంటనే మీరు వెళ్ళండి! శవం ఫోటో తీసుకుని బయల్దేరండి. నాంపల్లి స్టేషన్ ముందు టాక్సీలుంటాయి. ఫోటో చూపించి వాళ్ళ నడగండి—నిన్న ఉదయం పదిన్నరకు ఆమే, ఆమెతోపాటు మరో పురుషుడూ ఎవరి టాక్సీలో ఎక్కి రాంనగర్ వెళ్ళారో ఆరాతీయండి, అంగుళం అంగుళం వేలిముద్రలు గాలించండి. ఇది నా ఆలోచన కాదు. ఒక్క వేలిముద్ర దొరికిందా—దాంతో ఆమెని బీట్ చేయవచ్చు! మీరు శ్యామలాదేవి అయితే, నిన్న మీ చెల్లెలు ప్రయాణించి వచ్చిన టాక్సీలో మీ వేలిముద్రలెలా వచ్చాయని! కమాన్, డూయిట్ ఫాస్ట్!"

లాల్ ఫోన్ పెట్టేసి జాన్‌వైపు తిరిగాడు.

"అంత సులభం కాదు" అన్నాడు జాన్.

"ఎందుక్కాదు?"

"అప్పుడామె చెల్లెలి సామాను సాయం పట్టడానికి టాక్సీ దగ్గరకి వెళ్ళానంటుంది—"

"కానీ టాక్సీవాలా ఆమెకు విరుద్ధంగా అనవచ్చు—అసలామె టాక్సీ దగ్గరికి రాలేదనీ—వాళ్ళిద్దరే దిగి ఇంట్లోకి వెళ్ళిపోయారనీ! అవసరమైతే తాడేపల్లి గూడెం వెళ్ళి సువర్చల వేలిముద్రలు తీసుకొస్తాను!"

జాన్ మాట్లాడలేదు. గోళ్ళు చూసుకున్నాడు.

4

చీకటి పడుతోండగా కృష్ణన్ ఇంకా ఉద్రేకంగా ఫోన్‌చేశాడు, "లాల్, మరో సర్‌ప్రైజ్!"

"షూట్!"

"ఆ టాక్సీ దొరికింది! కానీ ఎక్కడికెళ్ళిందను కున్నారు?"

"ఎక్కడికి?"

"రాం నగర్‌లో ప్రకాశరావు ఇంటికి కాదు, మలక్ పేటలో ఓల్డు మునిసిపల్ కాలనీకి! వాళ్ళిద్దరు అక్కడొక యింటి ముందు దిగి పంపేశారు. సువర్చలా, ప్రకాశరావు ఆ యింట్లో కెళ్ళి తలుపేసుకున్నారు. కాస్సేపట్లోనే ప్రకాశ రావు గబగబా బయటకొచ్చి, తలుపుకు తాళం వేసి, సూట్ కేసు పట్టుకొని వెళ్ళిపోయాడు—"

"వెల్, వెల్, అయితే అక్కడ సువర్చల వేలిముద్రలు బోలెడు వుండాలి!"

"ఉండొచ్చు, ఇంకా చూడలేదు. ఆ యింటి గురించి అడిగితే ప్రకాశరావు కంగారుపడ్డాడు. అది కొన్ని రోజుల

క్రితమే అద్దెకి తీసుకున్నాడట. ఇప్పుడున్న యిల్లు మార్చాలనుకున్నాడట...."

"అయితే నిన్న సువర్చలని ఆ యింట్లో పెట్టి తాళం ఎందుకు వేశాట్ట?" అంటూ లాల్ చిన్నగా ఉలికిపడి వెంటనే అడిగాడు, "ఆ యిల్లు తెరచి చూశారా మీరు?"

"చూశాం...."

"ఏముందక్కడ?"

"ఏమీ లేదు, ఖాళీ?"

"ఎందుకు—ర క్తం లేదా అక్కడ, ర క్తం?"

"ఏమిటీ!"

లాల్ తటపటాయించాడు. తర్వాత మాట మార్చేస్తూ అన్నాడు, "ఏమీలేదు, నెవర్ మైండ్. ఆ టాక్సీలో వేలిముద్రలేమయ్యాయి?"

"శుభ్రంగా కడిగివేయబడ్డాయి."

"అంటే?"

"నిన్న సాయంత్రమే సర్వీసింగ్‌కి ఇచ్చాడట."

"ఓహ్, బాడ్ లక్! అయితే ఆ యింట్లో వేలిముద్రలు చూడండి—"

లాల్ ఫోన్ పెట్టేసి దిగ్గునలేచాడు, "జాన్ మనం వెంటనే అక్కడికి వెళ్ళాలి, క్విక్!"

"ఎక్కడికి?"

"దార్లో చెప్తాను. కమాన్, మరో హత్య జరిగిపోయింది...."

5

ప్రకాశరావు తలుపుతీసి కంగారుగా చూశాడు, "మీరా!"

"మేమే. మీ శ్రీమతితో మాట్లాడాలి, యెలా

వుందామె?"

"ఇవ్వాళ మీతో మాట్లాడదు, నన్నడగండి!"

"వెల్, నిన్న మీరు సువర్చలని మలక్ పేటలో ఇంటికి ఎందుకు తీసుకెళ్ళారు?" అడిగాడు లాల్.

అతని ముఖం కందిపోయింది, కోపంగా అన్నాడు: "మీరు పోలీసులు. పోలీసు లెలాటి పనులు చేస్తారో నాకు తెలుసు. ఎంత కావాలి మీకు డబ్బు? తీసుకుని ఆ టాక్సీ వాడితో అబద్ధపు సాక్ష్యాలు బనాయించడం మానేస్తారా?"

లాల్ కుతూహలంగా చూశాడు: "డబ్బు....అవును డబ్బు. మేం ఆలోచించనేలేదు, ఫీజెవరిస్తారు మాకీ కేసులో? మనమెందుకింత ఉదారంగా అయిపోతున్నాం, పార్ట్‌నర్? ఎందుకు బుర్రలు బద్దలు చేసుకుంటున్నాం?"

"అవును, మనం డబ్బు సంపాదనే మర్చిపోతున్నాం!"

"సారీ, మిస్టర్ ప్రకాశరావు. మీ నుంచి మేము ఫీజు తీసుకోలేం. మీరు మా క్లయింట్ కాలేదు. ఇప్పుడు కాలేరు కూడా. మీరు ఇన్స్‌పెక్టర్‌ని ప్రయత్నించండి....మంచి ఫలితముంటుంది."

"వెంటనే వెళ్ళిపోండి మీరు!"

జాన్ మూసివున్న గది తలుపు వైపు చూశాడు.

"ఆమె లోపల నుంచి గడియ పెట్టుకుందా?"

"లే—లేదు. ఎందుకు?"

"ఒక్కసారి ఆమెని చూసిపోతాం."

"వీలుపడదు—డాక్టర్ ఎవర్నీ చూడనివ్వొద్దన్నాడు."

లాల్ నవ్వాడు, "డాక్టర్ కేం తెలుసు? మీ డాక్టర్ ఓ ఫూల్! పేషంట్ ఎవరో, ఫేక్ ఎవరో తెలుసుకోలేని డాక్టర్ నా దృష్టిలో డాక్టర్ కాడు."

"వాట్ నాన్సెన్స్ ఇది? ఏమిటి మీ ఉద్దేశ్యం?" అరి

చాడు ప్రకాశరావు.

"ఒక్కసారి—ఒక్కసారి నేనా గదిలోకి పోతాను—" ప్రకాశరావు అడ్డురాకముందే జాన్ విసురుగా వెళ్ళి తలుపుని ఢీకొని, అది తెరచుకోవడంతో లోపలికి జొరబడి పోయాడు.

మంచంమీద ఆమె కెవ్వున అరిచి లేచిపోయింది.

జాన్ ఒక్క ఉదుటున ఆమెమీదికి దూకి, ముఖంమీద మాస్కు ఊడబీకేశాడు.

ఆమె పెద్దగా కేకపెడుతూ బయటకు పరుగెత్తింది.

లాల్ ఆమె బుజాలు పట్టుకొని కుర్చీలోకి తోశాడు—

6

కృష్ణన్ అడిగాడామెని "నీ పేరేమిటి?"

"పద్మిని" చెప్పిందామె మెల్లిగా.

"మంచి పేరే. ఏం చేస్తుంటావూ?"

"ఇదివరకు నాటకాలేసేదాన్ని. ఇప్పుడు గజానంద్ క్లబ్బులో నాట్యకత్తెని."

"మంచి పనే. ఇప్పుడు నువ్వేమేం చెప్తావో గబగబా చెప్పెయ్యి...." కృష్ణన్ గర్జించాడు.

పక్కన డిటెక్టివ్‌లు తాపీగా చూస్తూ కూర్చున్నారు. ఆమె ముఖంలో రోషం, అవమానం, ప్రకాశరావు మీద ఉక్రోషం పెల్లుబుకుతున్నాయి.

ప్రకాశరావు తల వంచుకుని మౌనంగా కూర్చున్నాడు.

ఆమె చెప్పసాగింది మామూలు స్థితికొచ్చి, "ఇతనే నాకు ఆశలు కల్పించాడు. లేకపోతే క్లబ్బులో నా పనేదో చేసుకుంటూ నీళ్ళో గంజో తాగుతూ బ్రతికేదాన్ని-అతని మాటను నమ్మి నేను గాలిమేడలు కట్టాను. నాకా ఘ్వాశ

ర్యమూ ఆ సుఖాలూ లభించితీరాలని పట్టుదలా కోరికా కలిగాయి. ఆ మత్తులో ఇతని సమర్థత తెలుసుకోక చెప్పిం దానికల్లా గుడ్డిగా ఆచరించాను ....

"అతనికి సువర్చల ఆస్తిమీద కన్నుపడింది. నా సహాయం కోరాడు. అక్కా చెల్లెళ్ళిద్దర్నీ చంపేసి ఆస్తి హస్తగతం చేసుకుని జల్సాగా బ్రతుకుదామన్నాడు. అత నికి భార్యమీదకంటే నా మీదే ఇష్టం ఎక్కువ. పైగా ఆమె అతని ఆలోచనలకి వ్యతిరేకి. చెల్లెలి నిర్ణయాన్ని ఆమె తిరస్కరించింది.

"సువర్చల శ్యామలమీద ఆస్తి వ్రాసేసింది. తను చని పోతే బాగుంటుదన్న కోరిక వెలిబుచ్చింది ఉత్తరాల్లో. ఆ ఉత్తరాలు సాక్ష్యంగా నిలుస్తాయి. ఆమెను ఉపాయంగా ఇక్కడికి రప్పించి అంతం చేస్తే ఆమె స్థానంలో నేను సువర్చలగా వెళ్ళి శ్యామలని నమ్మిస్తే, అప్పుడు శ్యామలనీ అంతంచేసి ఆమెను సువర్చలగా మార్చేస్తే, ఆ శ్యామల స్థానం నేను తీసుకుంటే తాత్కాలికంగా—అప్పుడంతా సులభమవుతుంది—సువర్చల అక్క శ్యామలగా నేనామె ఆస్తికి వారసురాల్నవుతాను. అది స్వాధీనపర్చుకుని మే మెక్కడికైనా వెళ్ళిపోవాలనుకున్నాం."

"అప్పుడేం చేశారు?"

"నేను సువర్చలని ఇమిటేట్ చేయడం ప్రారంభిం చాను. ఆమె నడకా, మానరిజమ్స్ అతను దగ్గరుండి నేర్పే వాడు. ఆమె ఉత్తరాల సహాయంతో దస్తూరీ కూడా నేర్చు కున్నాను. ఇదంతా అయ్యాక కలకత్తా వెళ్ళి అక్కడొక మాస్కుల ఏజెంట్ కపాడియాని కలిసి సువర్చల రూపాన్ని సృష్టించుకొచ్చాం. అంతా అతికినట్టు—అచ్చుగుద్దినట్టు నేను

సువర్చలలా తయారయ్యాను.

"నేను డైట్ చేసి శరీరాన్నింకా తగ్గించుకున్నాను. ఒక రోజుకోసం శ్యామలను నమ్మించడం కష్టం కాదు. కానీ తర్వాత నన్ను శ్యామలగా యిరుగు పొరుగువారిని నమ్మించడం కష్టం. అందుకని ఆమెకు సరిపోయేలా నన్ను నేను మలచుకున్నాను.

"ఇక అప్పుడు అసలు రంగంలో దిగాం. ప్రకాశరావు భార్యచేత సువర్చలని యిక్కడికి రమ్మని వుత్తరం వ్రాయించాడు. ఆమె అలాగే వస్తున్నానని పై వుత్తరం వచ్చింది వారం క్రితం. మేం సిద్ధమయ్యాం. ప్రకాశరావు నిన్న స్టేషనులో ఆమెను రిసీవ్ చేసుకుని తెచ్చాడు టాక్సీలో మలక్ పేట ఇంటికి. ఆమె అంతకుముందెప్పుడూ రాలేదు కాబట్టి యిల్లు అనుమానించలేదు. ఆ యింట్లోకి తీసుకెళ్ళి రాయితో తల పగులగొట్టి ఆమెను చంపేశాడు....ఆ యింటిని యీ పని కోసమే తీసుకున్నాం.

"అక్కడామెను అలాగే వదిలేసి, ఆమె సూట్ కేసులతో నా దగ్గర కొచ్చేశాడు. నేనామె బట్టలు కట్టుకుని సూట్ కేసుతో అతనితో బయల్దేరాను టాక్సీలో ఇంటికి. ఇక్కడ శ్యామల నన్నుమానించకుండా రిసీవ్ చేసుకోవడంతో గట్టెక్కాం....నిన్నంతా నేను అలసటగా వుందని చాలా తక్కువగా మాట్లాడి గదిలోనే గడిపాను.

"అప్పుడు రాత్రి ఆమె పని పట్టాం. ఆమె భర్తకోసం పాలు తీసుకెళ్తే అతను టేబులుమీద వుంచమని చెప్పి, ఆమె చూడకుండా నిద్రమాత్రల పొడిని కలిపాడు. ఆ మాత్రలు నేనే తెచ్చాను, ఒక డాక్టర్ దగ్గర. అతను నా

క్లయింట్ ఒకప్పుడు. అందులో సగం మాత్రాలు తీసి పారేశాం.

"శ్యామల మళ్ళీ పాలు గుర్తుచేస్తే అతను తాగడని ఏదో కారణం చెప్పి, ఆమెనే తాగేయమన్నాడు. ఆమె తాగేసింది. మేం తేలికపడ్డాం. ఆమె అక్కడే భర్తపక్కనే పడుకుంది. నిమిషాల్లోనే గాఢనిద్రలో కెళ్ళిపోయింది. అప్పుడు గబగబా ఆమె వంటిమీద బట్టలు తీసేసి నావి కట్టాను. ఆమెవి నేను కట్టుకున్నాను. గాజులూ, మెళ్ళో గొలుసులు కూడా మార్చేశాను. ఆ స్థితిలో ఆమెను తీసు కెళ్ళి నా గదిలో పడుకోబెట్టాం. ఇంకా కావల్సిన ఆధారాలు అక్కడ సృష్టించాం. అంతే....ఆ తర్వాత ఏం జరిగిందో మీకు తెలుసు. కానీ యింత త్వరలో యిలా జరుగుతుం దనుకోలేదు........" అందామె చేతులు నిస్సహాయంగా లేపి.

లాల్ అడిగాడు, "మరి సువర్చల శవాన్నేం చేశారు?...."

ఆమె చెప్పలేదు. ప్రకాశరావుని చెప్పమన్నట్టు చూపింది.

అతడన్నాడు బలహీనంగా, "రాత్రి ఆ యింట్లోనే పెరట్లో గొయ్యితీసి పూడ్చేశాను. మేం ఆ యింట్లోకి మారాలనుకున్నాం. పూడ్చిన స్థలం పాతబడిపోయేవరకూ అక్కడుండా లనుకున్నాం...."

"వెల్, మనం యెప్పుడు యెక్కడుండాలో పైవాడు నిర్ణయిస్తాడు. ఆస్తి రావలసినదైతే మీ కాళ్ళ దగ్గరికే వస్తుంది. దానికోసం అడ్డదారులు తొక్కితే అధోగతే ప్రాప్తిస్తుంది" అన్నాడు లాల్ లేస్తూ. □

బి. రాజేశ్వరి

సర్కసౌభ్రాతృత్వం

"సూర్యం మీరే కదా!"

"అవును, నేనే! యెవరో తెలీకుండానే యిక్కడికి వచ్చావా?"

ఏకవచన ప్రయోగానికి కొంత గతుక్కుమన్నాడు సుబ్బారావు.

APANA 9

"అదే, తెలుసుకోవటం మంచిదికదా అని!"

"తెలుసుకున్నావు కదా, నేనేం పని చేస్తుంటానో, నా సత్తా ఏమిటో అది కూడా తెలుసుకునే వచ్చావు కదా! లేక నేనే వివరించి చెప్పాలా?"

"అబ్బెబ్బె,అంత మాటనకండి. మీ సత్తా తెలీకుండా మీ దగ్గరికొస్తానా?ఎలా మొదలుపెట్టాలా అని ఆలోచిస్తున్నాను."

"ఆలోచన దేనికి? లేనిపోని విషయాలు చెప్తే నేను వినను సరికదా, అబద్ధాలు చెపితే చెప్పిన వాళ్ళకే ముప్పు!"

"అంత మాటనెయ్యకండి, అర్భకుడ్ని. విషయాని కొస్తున్నాను. నా పేరు సుబ్బారావు. నాకో శత్రువున్నాడు. వాడి పేరు సుధాకర్! వాడి పేరులోనే అమృతముంది గాని, వాడి నిలువెల్లా విషమే! ఆ విషపురుగు నా మేనకోడల్ని కాటు వేశాడు. నా మేనకోడల్ని నాకు కాకుండా చేశాడు.

ఒకనాడు కాలేజి నుండి ఒంటరిగా వస్తున్న రజనిని ఎత్తుకెళ్ళి బలవంతంగా అనుభవించాడు. ఆ పర్నాడే రజని శవం వాళ్ళ పెరట్లోని నుయ్యిలో తేలింది. మా అక్కకు, నాకు తీరని శోకాన్ని రగిలించి రజని వెళ్ళిపోయింది. ఇప్పుడా సుధాకర్‌గాడు లక్షలు కట్నం తెచ్చిన అమ్మాయిని చేసుకుని కులుకుతున్నాడు. వాడ్ని సుఖంగా బతకనియ్యకూడదు. నా మేనకోడలి చావుకు కారణమైన ఆ దుర్మార్గుడ్ని చిత్రవధ చెయ్యాలి. వాడ్ని యీ లోకం నుంచే పంపించెయ్యాలి!

"ఇప్పుడు చెప్పండి యీ కేసు మీరు ఒప్పుకుంటారా లేదా?" సుబ్బరావు మాటల్లో కసి పెల్లుబికింది.

సూర్యం అతను చెప్పినదంతా విన్నాడు. తర్వాత సాలోచనగా తలూపాడు.

"ఇప్పుడు నువ్వు చెప్పిన ప్రతివిషయమూ నిజమేనా?"

"ముమ్మాటికీ నిజమండి. అబద్ధాలు నే నెందుకు చెప్పాలి?"

"ఏమో, రజని కథ అల్లి చెపుతున్నావేమో? అసలు నీకు వాడిమీద మరెందుకో కక్ష వుండి వుండచ్చు కదా!"

"లేదు సార్, నా మాట నమ్మండి. వాడు నా రజనికి ద్రోహం చేశాడు. అందుకే వాడ్ని ప్రాణాలతో వదలకూడదని తమకి చెప్పటాని కొచ్చాను."

"నువ్వు చెప్పిన విషయాల్లో ఏ మాత్రం తేడా పాడా లొచ్చినా నేను క్షమించను. ఆ విషయిం నీకు తెలుసో, లేదో?...."

"మీరు చాలా కరెక్టు మనిషని, ఎదటివాడికి అన్యాయం జరిగిందని మీకు పూర్తిగా నమ్మకం కలిగితేనే, అన్యాయం చేసినవాడిని సంహరిస్తారనీ, అబద్ధం చెపితే పార్టీనే ముప్పు తిప్పలు పెడతారనీ-మీ అంత నిజాయితీపరులైన వ్యక్తులు అరుదనీ మీ గురించి అంతా తెలుసుకునే వచ్చానండి?"

"తెలుసుకదా! నేను కిరాయికి హత్యలుచేసే వాడినైనా నాకూ మానవత్వముంది. ఎవడికైనా అన్యాయం జరిగితే సహించలేను. అందునా అమాయకురాలైన ఆడపిల్లని వంచించి, ఆమె జీవితాన్ని నాశనంచేసే మగపురుగుని అసలు క్షమించను. వాడ్ని ఒక్కసారిగా చంపను. ఖండ ఖండాలుగా కోసి, గాయాలమీద కారం చల్లి వాడు నరక యాతన పడ్తుంటే కళ్ళారా చూసి, కసిగా నవ్వుకుంటాను. నా పార్టీ కష్టనష్టాలు నావిగా భావిస్తాను. ఇదంతా ఎప్పుడు జరుగుతుందో తెలుసా? పార్టీ కేసు నిజంగా నిజమయి నప్పుడు!"

"మీ సర్వసౌభ్రాతృత్వం గురించి నేను బాగా విన్నానండి. నా కేసు తప్పక స్వీకరించాలి."

"అలాగే, అయితే పూర్తిగా అంగీకరిస్తున్నానని అనుకోవద్దు. నువ్వు చెప్పిన ప్రతి అక్షరం నిజమని ముందు నేను నిర్ధారణ చేసుకోవాలి. అప్పుడే టేకప్ చేస్తాను."

"అలాగే సార్! మీ ఫీజు విషయం....?"

"అలా నాన్చడం దేనికి? ఫీజు యిరవై వేల రూపాయలు. అందులో పైసా తగ్గదు."

"మరీ అంత ఎక్కువా?"

"ఆ మాట నువ్వనకూడదు, నేను వినకూడదు. ఈ యిరవై వేలు నా ఒక్కడికే ననుకున్నావా? నేను చేసిన హత్యని మాపు చెయ్యటానికి పై నుంచి కిందవరకు ఎంత మందికి యీ డబ్బు మేపుతానో నీకు తెలియదు—"

"పదిహేనుకి ఫిక్స్ చేస్తే...."

"చూడు బాబూ, నువు బొత్తిగా కొత్తాడిలా వున్నావు. నా జీవితానికి పదిహేనువేలు వేల్యూయేషన్ కట్టిన నీ అవివేకాన్ని ఏమనుకోవాలో నా కర్థం కావటం లేదు. నీ కిష్టమయితే యిరవై వెంటనే కట్టు, లేకుంటే నీదారి నీది నా దారి నాది. నువ్విప్పుడు చెప్పిన విషయాలన్నీ నువ్వీగడప దాటగానే మర్చిపోతాను. సరేనా, వెళ్ళిరా!"

"మరీ అంత విరిచేసి మాట్టాడకండి సార్! మీమీద పెద్ద హోప్ పెట్టుకుని వచ్చాను....ఇంద, యీ యిరవై వేలు తీసుకోండి! నాకు వెంటనే పని జరగాలి."

"డబ్బు మొత్తం తీసుకొచ్చే బేరాలాడుతున్నావా బాబూ! ఘటికుడివే. అయితే డబ్బు తీసుకున్నాను కదా, నీ పని పూర్తయిపోయిందనుకోకు—నువు చెప్పిన విషయాలన్నీ నిజమని నేను ముందు రుజువు చేసుకోవాలి! అంటే ప్రిలిమినరీ యిన్వెస్టిగేషన్ అన్నమాట! ఆ ఎంక్వయిరీలో సంగతులన్నీ నిర్ధారణయ్యాక కేసు టేకప్ చేస్తాను. అబద్ధ

మని తేలిందనుకో, యీ యిరవై వేలు నీకు వాపసివ్వను సరికదా, నీ ప్రాణాలు అరువు తీసుకుంటాను. ముందే హెచ్చరిస్తున్నాను."

"అమ్మమ్మమ్మ, యిందులో చిన్నమెత్తుకూడా అబద్ధం లేదండి. నా ప్రాణాలంటే నాకు ప్రాణం సార్! వాటిని ఎవరికీ సరదాగానైనా యివ్వలేను."

"ఓ.కే. సుధాకర్ వివరాలు చెప్పండి. ఎక్కడ వుంటు న్నాడు, అతని అలవాట్లు, అతను చేసే ఉద్యోగం, మొద లైన వివరాలు బ్రీఫ్‌గా చెప్పండి. తర్వాత ఎలాగూ నేను అతన్ని ఫాలో అయి తెల్సుకుంటాను."

"అతను యీ పక్కనే వుంటున్న చింతలపూడిలో వుంటున్నాడు సార్! అతని ఫోటో నాతో తెచ్చాను. ఇదిగో, వుంచండి. ఇక అలవాట్లు. పొద్దున్నే చద్దన్నం తిని పొలానికి పోతాడు. అక్కడ పనులు చేయించి మధ్యాహ్నం పొలంలోనే వున్న తోట బంగళాలో విశ్రాంతి తీసుకుం టాడు. మధ్యాహ్నం భోజనం అక్కడే చేస్తాడు.

"అది ఓ విలాస మందిరం. పని పిల్లల్ని తన విలాస వస్తువులుగా ఆ మందిరంలోనే వినోదిస్తాడు. రాత్రి పది గంటలవరకు కొంప చేరడు. పొలం పనులున్నా లేకున్నా అది అతని దినచర్య. అక్కడే కొంత సురాపానంకూడా చేస్తుంటాడు. ఇదీ అతని గురించిన సంగతులు. మరి పని ఎప్పుడు మొదలెడతారు!"

"పని మొదలుపెట్టడం, పెండింగ్‌లో వుంచటం నాకు నచ్చని పనులు. మొదలుపెట్టి వెంటనే పూర్తి చెయ్యటం నా అలవాటు. ఇప్పటివరకు అందుకు భిన్నంగా జరగలేదు. ఇకముందు జరగదు. నీ విషయాలు నిజమని నిర్ధారణ జరిగిన వెంటనే పని ప్రారంభించి యిరవైనాలుగ్గంటల్లో

పూర్తి చేస్తాను. అవసరమైతే నువ్వుకూడా నాతో రావచ్చును."

"అబ్బే, దేనికండీ! మీమీద నమ్మకం లేకనా?"

"అని కాదు. శత్రుసంహారం కళ్ళారా చూసుకోవాలని కొందరికి మహా కోరికగా వుంటుంది. నువ్వు ఆ కోరికకి అతీతుడవని నేననుకోను."

"నిజమే ననుకోండి. అలాగే వస్తాను! ఎప్పుడు రమ్మంటారు?"

"నేను మళ్ళీ చెపుతాను. ఎల్లుండి ఓసారి వచ్చిపోండి."

సుబ్బారావు వెళ్ళిపోయాడు.

* * *

"ఏం సార్, రమ్మన్నారు కదూ!"

"ఆఁ! ప్రిలిమినరీ యిన్వెస్టిగేషన్ పూర్తయింది. నువు చెప్పిన విషయాలు నిజమని నిర్ధారణయింది. ఈ కేసు నేను టేకప్ చేస్తున్నాను."

"చాలా సంతోషమండి.ముహూర్తం ఎప్పుడుపెట్టారు?"

"నేను చెప్పానుగా, ఆలస్యం వుండదని. రేపు రాత్రికే ముహూర్తం. రేపురాత్రి పదిన్నర గంటలవరకు మీ సుధాకరుడు తోట బంగళాలో విహరిస్తుంటాడు. అదే వాడి పరలోక యాత్రకు ముహూర్తం!"

"మంచిది. నేను రావాలా?"

"వస్తే శత్రుసంహారం ఎలా జరుగుతున్నదో కళ్ళారా చూపి ఆనందించవచ్చును."

"అలాగే. ఏ టైంలో రావాలి, ఎక్కడికి రావాలి."

"చెపుతాను."

* * *

"అదే సుధాకర్ తోట బంగళా" చూపించాడు సుబ్బా

రావు.

"నాకు తెలుసు. ఇదివరకు ఎన్నిసార్లు వచ్చావిక్కడికి?"

"రెండుసార్లు. అసలు నేనే వాడి అంతు చూసేద్దామను కున్నాను. కాని ఆ సరదా తీరలేదు."

"పోనీ, యీసారి చూస్తావా?"

"ఎందుకు సార్, మీరున్నారుగా! నాకా శ్రమ లేదు."

"వాడ్ని చంపి ఆనందిద్దామని కోరికగా వుందా?"

"కోరికయితే వుంది, ధైర్యమే లేదు."

"నీ కోరిక తీరే ఏర్పాటు చెయ్యనా?"

"ఎలా?"

"నీ చేతికో కత్తి యిస్తాను. నేను సుధాకర్‌ని నాలుగు పోట్లు పొడిచి చంపేస్తాను. నీ చేతిలోని కత్తితో నువ్వో మరో రెండు పోట్లు లేదా నాలుగుపోట్లు—నీ కసితీరేవరకు పొడిచెయ్యి. ఎలాగూ నా చేతిలోనే చస్తాడుకదా, యిక నిన్నేం చెయ్యలేడు."

"అమ్మో, గుండె దడగా వుంది."

"అంత భయంగా వున్నవాడివి ప్రతీకారం ఎలా తీర్చు కోవాలనుకున్నావు? పిరికివాడివి."

"కాదు, నేను పిరికివాడ్ని కాదు."

"అయితే కత్తి యివ్వవా?"

"ఇవ్వండి."

"ఇదిగో యిది నీ చేతిలో వాటంగా పట్టుకో—ఈ కత్తి నేను పట్టుకొంటాను. నేను లోపలికి ప్రవేశించి అదును చూసుకుని చంపుతాను. వాడు చచ్చేలోపల యీ ప్రతీకారం నువ్వే తీర్చుకున్నట్టు వాడికి తెలిసి కుళ్ళి కుళ్ళి చావాలి. అదేకదా నీ కోరిక!"

"అవును. ఈ ప్రతీకారం తీర్చుకున్నది నేనేనని

వాడికి తెలియాలి. సొంతం చంపెయ్యకు. కొన ప్రాణం వుంచు. వాడికి నేను కనిపించి, పాత కథ గుర్తుచేసి మరీ చంపుతాను. వాడి ప్రాణాలు నా చేతిలోనే పోవాలి!"

"గుడ్! అదీ ధైర్యమంటే. నేను ముందు లోపలికి వెళ్తాను. నా వెనుకనే రా!"

సూర్యం బంగళాని సమీపించాడు. వెనుకనే సుబ్బారావు నక్కి నక్కి అనుసరిస్తున్నాడు.

సూర్యం బంగళా వెనకపక్క నించి ఓ చుట్టు చుట్టి వచ్చాడు.

"ఉన్నాడా?" అడిగాడు సుబ్బారావు గుసగుసగా.

"ఆఁ! వాడితోబాటు ఎవరో అమ్మాయి వుంది. ఈ ప్రోగ్రాం రోజూ సాగేదే! ఆ అమ్మాయి కాసేపట్లో వెళ్ళి వెళ్ళిపోతుంది. వాడు ఒక్కడే ఒంటరిగా వుంటాడు. అప్పుడు సమయం చూసి సఫాచేద్దాం!"

* * *

పదిన్నరయింది.

బంగళా తలుపు తెరుచుకుంది.

ఎవరో అమ్మాయి బయటికొచ్చింది. వెనకనే ఓ మొగాడు—లుంగీమీదున్నవాడు—వచ్చి ఆమెకు వీడ్కోలు యిస్తున్నాడు. ఆ అమ్మాయి చీకట్లో కలిసిపోయింది.

"వాడే, వాడే!" అన్నాడు సుబ్బారావి గుసగుసగా కసి కసిగా.

"అల్లరి చెయ్యకు. నాకు తెలుసు" అన్నాడు సూర్యం.

ఆ వ్యక్తి లోపలికి వెళ్తున్నాడు.

సూర్యం రెండంగల్లో వాణ్ని సమీపించి వెనకనించి అమాంతం వాటేసుకుని, నోరు గట్టిగా అదిమి వెన్నులో రెండు పోట్లు పొడిచాడు.

ఆ వ్యక్తి కుప్పలా కూలిపోయాడు.

సుబ్బారావు చటుక్కున లోపలికి వచ్చాడు. ఆ వ్యక్తి బాధతో గిలగిల తన్నుకొంటున్నాడు.

కళ్ళుతెరిచి చూస్తున్నాడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు హీనస్వరంతో.

సుబ్బారావు కత్తి పట్టుకుని అతని కెదురుగా వచ్చాడు. "నేను సుబ్బారావుని. రజని మేనమామను" అన్నాడు.

అతని కర్థమయింది.

సుబ్బారావు కత్తితో సుధాకర్ అనబడే ఆ వ్యక్తి గుండెల్లోను కడుపులోను కసిగా పొడిచేస్తున్నాడు.

సూర్యం చప్పుడు చెయ్యకుండా బయటికి వచ్చి తలుపు బయటి నుంచి గొళ్ళెం పెట్టేశాడు. సుబ్బారావుకి జరిగిం దేమిటో తెలీదు.

సూర్యం వెనకపక్క నుంచి దొడ్డితలుపుకూడా బంధిం చేశాడు. గర్వంగా నవ్వుకున్నాడు. కత్తిని బొడ్లో పెట్టు కున్నాడు.

కాసేపట్లో పోలీసులు వస్తారు. సుధాకర్‌ని హత్యచేసిన నేరానికి సుబ్బారావుని ఉరికంబం ఎక్కిస్తారు. లేదా జీవి తాంతం జైల్లో మగ్గి చస్తాడు —— కసిగా నవ్వుకున్నాడు సూర్యం. తన పగ చల్లారింది!

నాలుగేళ్ళ క్రితం సూర్యం చెల్లెల్ని అనుభవించి, ఆమె ఆత్మహత్యకు కారణమైన సుబ్బారావుకి, సూర్యమే ఆ చెల్లెలి అన్నని, పాపం తెలియదు! నిజానికి, సూర్యానికీ ఆ సుబ్బారావే ఇతనని ముందుగా తెలియదు. సుధాకర్ విషయం ఎంక్వయిరీ చేస్తుంటె, నాలుగేళ్ళుగా తను వెతుకు తున్న సుబ్బారావు ఇతనేనన్న విషయంకూడా బయట పడిడిది. దాంతో సుబ్బారావుకూ మూడింది. □

భమిడిపాటి భాస్కర రామారావు

అష్టగీత-భగవద్గీత



గణగణ మ్రోగింది బల్లమీది టెలిఫోన్.

డిటెక్టివ్ అసిస్టెంట్ హరి రిసీవరందుకున్నాడు. ఒక్కక్షణం విని, "యస్! ఉన్నారు" అని మౌత్ పీస్ చేత్తో మూసి, డిటెక్టివ్ ప్రభాకర్ వంక చూశాడు.

"బాస్? ట్రంక్ కాల్ ఫ్రం ఢిల్లీ. రక్షణ మంత్రి రఘు

రామ్‌జీ మీతో మాట్లాడుతారట" అని, "బాస్! ఇన్శాట్ ఉపగ్రహంద్వారా కనెక్ట్ చెయ్యడంవల్లననుకుంటాను. చాలా క్లియర్‌గా వుంది వాయిస్" అన్నాడు.

తన బల్లమీద వున్న ఎక్స్‌టెన్షన్ ఫోన్ ఎత్తాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"హలో! రఘురామ్‌జీ! మీరే స్వయంగా పిలిచారంటే ఏదో పెద్ద విశేషమే అయి వుండాలి."

"పెద్ద క్లిష్ట సమస్యే ప్రభాకర్‌జీ!" అని నిట్టూర్చి, "మన పొరుగుదేశం ఏ విధంగానైనా అణుబాంబు తయారు చెయ్యాలనే దృఢ సంకల్పంతో వుందన్న విషయం మీకూ తెలుసు. అందు కవసరమైన ఇంధనం సంపాదించడానికి ఏ మార్గం తొక్కడానికయినా సిద్ధంగా వుందని గూఢచారి వార్తల సారాంశం" కొద్దిసేపు ఆగారు రామ్‌జీ.

డిటెక్టివ్ ప్రభాకర్ సావధానంగా వినసాగాడు. అసిస్టెంట్ హరి రఘురామ్‌జీ చెప్పే ప్రతి మాటా శ్రద్ధగా నోట్ చేస్తున్నాడు.

"దేవదారు చెక్కపెట్టెలలో ప్యాక్‌చేసిన యు-235 ధాతువు మూడు లారీల సరకు నిన్న న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్‌కు బయలుదేరింది. మూడు లారీలు ఒకేమారు బయలుదేరి కలిసి కట్టుగానే ప్రయాణం సాగించాయి. హైదరాబాద్‌కు సుమారు ఇరవై కిలోమీటర్ల దూరం వరకూ అలాగే వచ్చాయి.

అయితే అక్కడ పశువుల మందలు అడ్డురావడంతో ఒక లారీ వెనకపడింది. నగర పొలిమేరలలోకి ప్రవేశించగానే ముందు వచ్చిన రెండు లారీలు దగ్గరలో వున్న హోటల్ దగ్గర ఆగాయి వెనుక లారీకోసం. ఎంతసేపైనా వెనుక లారీ జాడలేదు. తాము కాఫీలు తాగే సమయంలో

తమను దాటి వెళ్ళిందేమో ననుకున్న డ్రయివర్లు కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. కానీ లారీ అక్కడకూ రాలేదు.

డ్రయివర్ల ద్వారా విషయం తెలుసుకున్న కాంప్లెక్స్ అధికారులు పోలీసులకు తెలియచేశారు. పోలీసులు రంగం లోకి దిగారు. నగరానికి ఇరవై కిలోమీటర్ల ఆవల జాతీయ రహదారి కీవైపు ఆపైపు అరణ్యప్రాంతం వుంది. అక్కడ చెట్లమాటున దొరికింది మిస్సయిన మూడవ లారీ. డ్రయివరు కట్టివేయబడి వున్నాడు. లారీ అంతా ఖాళీ.

ట్రాఫిక్ జామ్ కావడంతో ఆగిన తనను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అటకాయించి లారీని మాటుకు లాగి తనకంటి ముందే లారీలోని సరుకు వ్యాన్‌లలోకి తరలించుకుని పోయారని చెప్పాడు డ్రయివరు" రాఘురామ్‌జీ చెప్పడం ఆపారు.

"మరేమైనా వివరాలు తెలిశాయా?" అడిగాడు ప్రభాకర్.

"ఆ సరుకు విశాఖపట్టణానికి చేరిందని మా గూఢచారి వర్గాల అనుమానం."

"ఎందుచేత అలా అనుమానిస్తున్నారు?"

"పక్కింస్థాన్ గూఢచారి అజ్మద్, ఈ సరుకు గల్లంతు తరువాత ఇప్పటికప్పుడే రెండు మూడుసార్లు విశాఖలో మా గూఢచారుల కంటబడ్డాడు."

"అజ్మద్ ఇక్కడ ఎవరెవరిని కలుసుకుంటున్నాడో తెలిసిందా?"

"ఇంతవరకు మా వాళ్ళు ఆ సంగతి కనిపెట్టలేక పోయారు. ఇదే పనిమీద మా ఏజంట్ భాస్కర్ అక్కడే

వున్నాడు. మిమ్మల్ని వెంటనే కలియమని అతడికి టెలి గ్రఫిక్ ఆర్డర్స్ యిచ్చాము. అతడు మీకు కొన్ని వివరా లివ్వగలడని ఆశిస్తున్నాను. మీరు మాత్రం ఈ విషయంలో వెంటనే కలుగజేసుకోవాలి. సరుకు మనగడ్డ దాటకుండా చూడాలంటే అందుకు మీరే సమర్థులు.

ఈ కేసు విషయంలో సర్వాధికారాలూ మీకు దత్తం చేస్తున్నట్టు హోమ్ మినిస్ట్రీ నుండి ఆర్డర్స్ ఈ సాయం కాలం లోగానే మీకు అందుతాయి" చెప్పారు రఘురామ్‌జీ.

"ఇప్పటకే మనచేయి దాటివుండకపోతే ఏ పరిస్థితుల లోనూ దానిని మనగడ్డ దాటనీయను" దృఢంగా వుంది ప్రభాకర్ స్వరం.

"విష్ యూ ఆల్ ద బెస్ట్!" భారంగా నవ్వుతూ లైన్ కట్ చేశారు రక్షణ మంత్రి రఘురామ్‌జీ.

2

శివాజీ నగర్‌లోని డిటెక్టివ్ ప్రభాకర్ యిల్లు. డోర్ బెల్ మ్రోగింది. తలుపు తెరిచాడు అసిస్టెంట్ హరి. గుమ్మానికి యెదుట ఒక మధ్య వయస్కుడు నిలబడి వున్నాడు.

"డిటెక్టివ్ ప్రభాకర్‌ను చూడాలని వచ్చాను" చెప్పాడు మధ్యవయస్కుడు.

హరి అతడిని వెంటపెట్టుకుని లోపలకు వెళ్ళాడు. హరితో కూడా వచ్చిన వ్యక్తి ఏజంట్ భాస్కర్ కావచ్చని వూహించాడు డిటెక్టివ్ ప్రభాకర్. "ప్లీజ్ బి సీటెడ్!" అన్నాడు.

మధ్య వయస్కుడు కూచుంటూ, తన పాకెట్ నుండి ఒక ఫోల్డర్ తీసి ప్రభాకర్ కందించాడు. ప్రభాకర్ దానిని తెరచి వివరాలు చదివి, "సో యూ ఆర్ ఏజెంట్ భాస్కర్!

గ్లాడ్ టు సీ యూ!" అంటూ లేచి కరచాలనం చేశాడు.

అసిస్టెంట్ హరి అప్పటికే వంటమనిషి చేత కాఫీలు తెప్పించాడు. ముగ్గురూ మౌనంగా కాఫీలు ముగించారు.

"ఇప్పుడు చెప్పండి, మీ పరిశోధనా వివరాలు" భాస్కర్ నుద్దేశించి అడిగాడు ప్రభాకర్.

"పక్కిస్తాన్ గూఢచారి అహ్మద్ యిక్కడ తిరుగుకున్నాడని తెలిసి నేను వచ్చాను. అహ్మద్ రెండు మూడు పర్యాయాలు పట్టాభిరోడ్‌లో వున్న ఒక యింటికి పోయి రావడం కనిపెట్టాను."

"ఎవరిదా యిల్లు?"

"ఆ యింటి యజమాని పేరు పురుషోత్తమరావట."

"పురుషోత్తమరావా? అంటే...." అని ప్రభాకర్ ఏదో అనబోతూ వుండగా హరి మధ్యలో కలుగజేసుకుని, "యస్ బాస్! 'సదాశివ అండ్ కంపెనీ' పార్ట్నర్ పురుషోత్తమరావు. ఆయన పార్ట్‌నర్ పేరు సదాశివ శాస్త్రి" అన్నాడు.

"అతడా!" అని భాస్కర్ వైపు తిరిగి, "మరేమైనా వివరాలు తెలిశాయా?" అని అడిగాడు.

"ఓ రాత్రి ఆ యిల్లంతా శోధించాను రహస్యంగా. పనికివచ్చే వివరాలేమీ తెలియలేదు."

ఇంతలో ఇనస్పెక్టర్ మూర్తి లోపల కడుగుపెట్టాడు. ప్రభాకర్ కూచున్న చోటుకు వచ్చి చేతిలో స్టిక్ ఎడమ చంకన యిరికించి కుడికాలు నేలకు ఠక్కున కొట్టి, అటెన్షన్‌లో సెల్యూట్ చేస్తూ రాతిబొమ్మలా నిలబడిపోయాడు ప్రభాకర్ ముందు.

ప్రభాకర్ అది చూచి చిరునవ్వు నవ్వుతూ, "ఏమిటిది మూర్తీ! కొత్త లాంఛనాలు ప్రదర్శిస్తున్నావు!" అన్నాడు

కూచోమంటూ.

ఇనస్పెక్టర్ మూర్తి జేబునుండొక కాగితం తీసి అందించాడు. ప్రభాకర్ అందుకుని చూచాడు. యు-235 మిస్సింగుకి సంబంధించి సర్వాధికారాలూ తనకు దత్తం చేస్తూ హోమ్ మినిస్ట్రీ నుండి వచ్చిన ఆర్డర్ గుర్తించి, మూర్తి వైపు తిరిగి "దీనికోసమా ఈ హడావిడి. బాగుంది" అన్నాడు.

"ఆర్డరంటే ఆర్డరే!" అంటూ కూచున్నాడు మూర్తి.

ఏజంట్ భాస్కర్ తనకు చెప్పిన విషయాలన్నీ మూర్తికి చెప్పి, "మూర్తీ! పై విషయాలనుబట్టి పురుషోత్తమరావుకు ఈ నేరంలో భాగం వుందా అని అనుమానించాల్సి వస్తోంది" అన్నాడు.

"నీ వూహ సాధారణంగా తప్పదు. అయినా అతడి యింట అనుమానించదగినదేదీ దొరకలేదని భాస్కర్‌గారు చెప్పినదానిబట్టి తేలుతోంది. ఏ పద్ధతినయినా ముందుకు పోదామంటే పురుషోత్తమరావు కోటీశ్వరుడు. సంఘంలో పేరు ప్రతిష్టలు కలవాడు."

"అతడి వ్యాపారమేమిటి?" అడిగాడు ప్రభాకర్.

"ఇనుము, అల్యూమినియమ్ మొదలైన లోహాల స్క్రాప్ కొని అమ్ముతాడు."

"కేవలం స్క్రాప్ వ్యాపారంలోనే కోట్లు గడించాడంటావా?"

"అసంభవం. స్మగ్లింగ్ కూడా ఉండివుండాలని నా అనుమానం."

"నీ అనుమానానికి ఆధారం?"

"రెండు మూడు పర్యాయాలు రాష్ట్రాల సరిహద్దులలో వాళ్ళ లారీలలో స్క్రాప్ అడుగున రక్తచందనం, మంచి

గంధం దుంగలు దొరికాయి. అయినా చట్టం వాళ్ళనేమీ చేయలేకపోయింది."

"ఎందుచేత?"

"లారీ డ్రయివర్లు నేరం తమనెత్తిన వేసుకోవడంవల్ల. అయినా ఆ దొంగవ్యాపారం యజమానులు మాత్రం సదాశివ అండ్ కంపెనీ వారేనని నేను ఘంటాపథంగా చెప్పగలను."

"ఎలా?"

"జయిల్లో వున్న డ్రయివర్ల కుటుంబాలకు మామూలుగానే జీతనాతాలు ముట్టచెప్పాడు సదాశివ శాస్త్రి."

"అంతమాత్రానే అనుమానించగలమా? సదాశివశాస్త్రి పరమ నైష్ఠికుడనీ, గీతాపారాయణ చెయ్యనిదే పచ్చి మంచినీరైనా ముట్టడనీ పైగా ధర్మదాత అని పేరు పొందాడు తెలుసుగా?" చిరునవ్వుతో అన్నాడు ప్రభాకర్.

"దొరకనంతకాలం ఎవడైనా దొరే కదా?" నిరసనగా అన్నాడు మూర్తి.

"సరే! ప్రస్తుతం మన ముందున్న సమాచారాన్నిబట్టి ఒక లారీలోడ్ యు-235 ధాతువు మన ఊరు చేరింది. దానికి సూత్రధారులు పురుషోత్తమరావు ఒక్కడుకాని, సదాశివ అండ్ కంపెనీ మొత్తంకాని బాధ్యులేమోనని అనుమానించడానికి సరిపోయిన ఆధారాలు మన ముందున్నాయని చెప్పవచ్చు. ఆ సరుకు ఇంకా మన భారతగడ్డ దాటిపోలేదని కూడా చెప్పవచ్చు. కాని మనం ఏ మాత్రం ఏమరుపాటుపడ్డా అది మన గడ్డ దాటడం ఖాయం. అందుచేత సరుకు గడ్డదాటే అవకాశం లేకుండా చూడడం మన తక్షణ కర్తవ్యం" అన్నాడు ప్రభాకర్.

"నువ్వేమీ కంగారుపడకు. విమానం ద్వారా తరలించే

అవకాశం ఎలాగూ లేదు. ఇకపోతే 'స్క్రాప్' ముసుగులో లారీలలోనే తరలించాలి. వెళ్ళే ఏ లారీని పరీక్షించకుండా వెళ్ళడానికి వీలులేని ఏర్పాట్లు చేసే వస్తున్నాను" ధీమాగా చెప్పాడు మూర్తి.

"లారీల ద్వారా తరలించాలనుకునేవాళ్ళు సరుకు ఇక్కడకు చేర్చరు. సరిహద్దులకు దగ్గరగా వుండే ప్రాంతాలకు తరలిస్తారు."

"ఇంకెలా తరలించవచ్చునంటావు?" అడిగాడు మూర్తి.

"సముద్రం గుండా తరలిస్తే?"

"సముద్రం గుండానా? అదెలా?"

"ఇక్కడకు స్మగుల్డ్ గూడ్స్ ఎలా వస్తున్నాయి?"

ఇనస్పెక్టర్ మూర్తి చిరునవ్వు నవ్వుతున్న డిటెక్టివ్ ప్రభాకర్ ముఖంవైపు ఒక్కక్షణం దీక్షగా చూచి, "ఓ! అదా నువ్వు చెప్పేది! హై సీ మీద ఆగిన వాళ్ళ షిప్ దగ్గరకు నాటు పడవలమీద చేరవేయవచ్చుననా? అవును సుమా! అందుకూ అవకాశము లేకపోలేదు. సరే! ఆ ఏర్పాటు కూడా చూస్తాను" అని, "అయినా దొంగిలించిన సరుకు ఎక్కడ దాచారో తెలుసుకోవడం మన ప్రథమ కర్తవ్యం" అన్నాడు.

"అది సరే! కాని సరుకు చేయి దాటిపోకుండా ఉండడానికి మార్గాలు బంధించు. ఆ తరువాత సప్తపాతాళాల అడుగున దాచినా త్రవ్వి బయటకెలాగూ తీస్తాము...." అని ప్రభాకర్ అంటున్నంతలో బల్లమీది టెలిఫోన్ మ్రోగింది. చెబుతున్నదాపి రిసీవర్ అందుకున్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"యస్! దిసీజ్ ప్రభాకర్ స్పీకింగ్! చెప్పండి" ఫోన్‌లో అని కొద్ది నిముషాలు దీక్షగా విన్నాడు ప్రభాకర్. మధ్యంతరంగా అవతలవైపు ఫోన్ క్రెడిల్ చేసినట్టు చప్పుడవడంతో తనే మరలా రింగ్ చేశాడు. జవాబు లేదు. ఫోన్ పెట్టేశాడు ప్రభాకర్.

ప్రభాకర్ ముఖంలోని విస్మయాన్ని గమనించి, "ఏమిటి? ఇంతకూ ఫోన్ చేసినదెవరు?" అని అడిగాడు ఇనస్పెక్టర్ మూర్తి.

"సదాశివశాస్త్రి ఫోన్ చేశాడు."

"సదాశివశాస్త్రా? ఏమని?"

"ఏమో, విషయం విపులంగా చెప్పలేదు. రాత్రి తొమ్మిది గంటలకు కలుసుకుందుకు వీలుంటుందా ఒక ముఖ్య విషయం చెప్పాలి. చాలా రహస్యం. ఫోన్‌మీద చెప్పేందుకు వీలులేదు అన్నాడు. వెనుక నుండి యెవరో తరుముతున్నవాడిలా వుంది అతడి మాట. నేను జవాబు చెప్పేలోగానే చటుక్కున ఫోన్ పెట్టేశాడ. ఎందుచేతనో మరి?" అన్నాడు ప్రభాకర్ సాలోచనగా.

"ఆశ్చర్యంగా వుందే! సరే! మరలా ఫోన్ చేస్తాడేమో? అసలు తాను చెప్పదలచినదేమిటో?" అని స్వగతంలా అంటూ, "నువ్వు చెప్పినట్లు నాటుపడవల ద్వారా సరుకు దాటకుండా వుండే యేర్పాట్లు చూస్తాను" అని చెప్పి లేచాడు ఇనస్పెక్టర్ మూర్తి.

ఇనస్పెక్టర్ మూర్తి వెళ్ళాక, "మిష్టర్ భాస్కర్ మన ప్రయత్నం మనం చేద్దాం. ఈ లోగా మీ దారిన మీ పరిశోధన కానివ్వండి. మీ మకాం వివరాలు మా హరి కివ్వండి. అవసరమైతే కాంటాక్ట్ చేస్తాను" అని చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

3

"వాట్ మూర్తి? సదాశివశాస్త్రి హత్య చెయ్యబడ్డాడా? ఎక్కడ?" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"..........."

"సరే! వెంటనే వస్తున్నాను" అని ఫోన్ పెట్టి, "హరీ! హరియప్! సదాశివశాస్త్రి యింటికి వెళ్ళాలి" అన్నాడు.

ప్రభాకర్, హరి మరో అరగంటలో సదాశివశాస్త్రి ఇంటి ఆవరణలో కారు దిగారు.

అప్పటికే ఇనస్పెక్టర్ మూర్తి తన పరివారంతో చేరుకుని వున్నాడు అక్కడికి. కారు దిగుతున్న ప్రభాకర్‌కు ఎదురేగి, "నడు! నడు! ఇంకా కొన వూపిరి వుంది శాస్త్రికి" అంటూ శాస్త్రి గదివైపు బయలుదేరాడు ఇనస్పెక్టర్ మూర్తి.

వాళ్ళు శాస్త్రి గదిలోకి అడుగుపెట్టారు. కుర్చీలో పడి వున్న శాస్త్రిమీద వంగి పరిశీలిస్తున్నాడు డాక్టర్ జగదీష్. డిటెక్టివ్ ప్రభాకర్ గబగబా చేరుకున్నాడు సదాశివశాస్త్రి దగ్గరకు. డాక్టర్ జగదీష్ ప్రభాకర్ వైపు చూచాడు. ప్రభాకర్ కళ్ళతోనే అడిగిన ప్రశ్నకు కళ్ళతోనే జవాబు చెప్పాడు జగదీష్ లాభం లేదన్నట్టు.

తన దగ్గరకు వచ్చిన ప్రభాకర్ వైపు విస్ఫారిత నేత్రాలతో చూస్తూ, "ప్ర....భా....క....ర్" అని అతికష్టం మీద అని తన కుడిచేయి ఎదుట వున్న టేబుల్ మీదకు చాపి తల వాల్చేశాడు సదాశివశాస్త్రి.

ప్రభాకర్ అటువైపు చూశాడు. సదాశివశాస్త్రి చాపిన చేతిక్రింద గీతోపదేశం చేస్తున్న కృష్ణుడి బొమ్మ టేబుల్ మీద అద్దం క్రింద నుండి సగంవరకు బయటకు లాగి

వుంది. చాచి వున్న చూపుడు వ్రేలు ఎంగేజ్‌మెంట్స్ ప్యాడ్‌ను చూస్తోంది.

ప్రభాకర్ సూచనమేరకు శవాన్ని మార్చ్యురీకి తరలించారు. గది నలుమూలలా పరికించాడు డిటెక్టివ్ ప్రభాకర్. టేబుల్‌కు అవలగా ఒక సింగిల్ బెడ్, పైన సీలింగ్ ఫ్యాన్ వున్నాయి. గదిలో కాయర్ మేట్ పరచి వుంది.

టేబుల్‌మీద అద్దం క్రింద సగం వరకూ బయటకు లాగివున్న గీతాచార్యుడి బొమ్మను పూర్తిగా బయటకు లాగాడు ప్రభాకర్. దానిని అటూ ఇటూ త్రిప్పి చూచాడు. ఆ బొమ్మకు వెనుక వైపున తొమ్మిది బై ఇరవై (9/20) అని అంకె దానిచుట్టూ ఎర్రని స్కెచ్ పెన్‌తో సున్నా చుట్టి వున్నట్టు గమనించాడు. ఆలోచనా పూర్వకంగా నొసలు ముడిచి ఆ బొమ్మను ప్రక్కనున్న హరి కందించాడు ప్రభాకర్.

ఆ పైన అతడి దృష్టి ముందున్న ఎంగేజ్‌మెంట్స్ ప్యాడ్ పైన పడింది. దానిమీద పై భాగంలో అడ్డంగా ఒక చిన్న గీత(—). ఆ గీతకు క్రింద నాలుగంకె, దాని క్రింద పదిహేను అంకె వ్రాసివున్నట్టు చూశాడు. క్యాప్ మూయని పెన్ను ప్యాడ్ ప్రక్కనే పడి వుంది. ప్యాడ్‌మీద వున్నది ఆ రోజు తారీకు. ప్యాడ్ వెనుక పేజీలు త్రిపాడు. అవి ఖాళీగా ఉన్నాయి. ఆ కాగితం కూడా హరి కందించాడు. మిగిలిన తంతు పరివారానికి పురమాయించి ప్రభాకర్‌తో బయటకు వచ్చాడు మూర్తి.

"ఇంతకూ ఇదెలా జరిగింది?" అడిగాడు ప్రభాకర్.

"ఇఫ్‌యూ డోంట్ మైండ్.... నేను చెబుతాను" వెనుక నున్న భాస్కర్ అన్నాడు.

చెప్పమన్నట్టు చూశాడు ప్రభాకర్.

"నా పద్ధతిలో నేను పరిశోధన చేస్తూ, కేవలం పురుషోత్తమరావే కాక, సదాశివశాస్త్రికి కూడా యిందులో ప్రమేయం వుందా అన్న అనుమానం తేల్చుకోవాలనుకున్నాను. దక్షిణంవైపు నుండే గదిలోనే సదాశివశాస్త్రి వుంటాడని తెలుసుకున్నాను. ఇంటి కాంపౌండు కావైపంతా బంగన్న బయలు. చీకటిపడ్డాక అటు వచ్చాను. గేటుకు కొంచెం దూరంలో ఒక కారు ఆగివుంది. ఆపరణలో లైటు వెలుగుతోంది. నేను క్రోటన్స్‌వార నక్కి కూచున్నాను. ఆ గదిలో యెవరో మాటాడుతున్నారు. అతి నెమ్మదిగానే. అయినా నాకు వినిపించాయి కొన్ని మాటలు.

'అనుకున్న ప్రకారం జరక్కపోతే సర్వనాశనం అవుతాం. ఎక్కడ దాచావో చెప్పు!' ప్రశ్న.

'ముందేదో అనుకున్నాను. ఇప్పుడేం జరిగినా జంకను. దేశద్రోహం చెయ్యలేను' జవాబు.

రెండు క్షణాల తర్వాత 'కెవ్వు' మని వినిపించిన బాధామయమైన కేక ఆ నిశ్శబ్దాన్ని భంగపరిచింది. నేను దాక్కొన్న చోటునుండి చటుక్కున లేచి గదివైపు పరుగెత్తాను. తలుపు నెట్టాను. ఆ అలికిడికి ఇరువురు వ్యక్తులు ఆ వైపు మరో ద్వారం గుండా మెరుపులా మాయమయ్యారు.

హతుడివైపు చూచాను, చేతిలో పెన్ను ప్రక్కన పెట్టి అద్దం క్రింది బొమ్మను లాగడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. నేనేమైనా చేయడం కంటె పోలీసులకు తెలియచెయ్యడమే మంచిదనుకున్నాను" ముగించాడు భాస్కర్.

4

"యు-255 అపహరణకు 'సదాశివ అండ్ కో' యే కారణం అని అనుకునేందుకు తగిన ఆధారాలు కనిపిస్తున్నాయి. విదేశాలకు దానిని అమ్మడం విషయంలో చిట్ట చివరకు అభిప్రాయభేదం వచ్చి సదాశివశాస్త్రిని దారి తొలగించారని అనుకోవచ్చు. సరుకు హంతకుల చేతికి చిక్కి వుంటుందంటావా?" అడిగాడు ఇన్స్పెక్టర్ మూర్తి.

"సరుకు హంతకుల చేతికి చిక్కలేదని ఖచ్చితంగా చెప్పగలను బాస్!" దృఢంగా చెప్పాడు హరి.

ప్రభాకర్ చిరునవ్వు నవి, "అలా చెప్పినంత మాత్రాన చాలదు. కారణం కూడా చెప్పాలి" అన్నాడు.

"డిటెక్టివ్ ఆంజనేయులు మనమీద నిఘావేసి తిరుగుతున్నాడు."

"వాడో బాస్టర్డ్. స్మగ్లర్స్‌కు సాయపడుతున్నాడని యింతకు మునుపే రిపోర్టులు వచ్చాయి నాకు. తెలివిగా తప్పించుకుంటున్నాడు. ఈసారెలాగైనా వాణ్ణి శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపాలి" కసిగా పళ్ళు నూరుతూ అన్నాడు మూర్తి.

"ఆంజనేయులు అంత తెలివి తక్కువవాడు కాడులే!" నవ్వుతూ అన్నాడు ప్రభాకర్.

"నీకు నవ్వులాటగానే వుంటుంది. గల్లంతయిన సరుకు ఆచూకీ యింకా తెలియలేదని నన్ను గుటాయిస్తున్నారు మా మొగుళ్ళు."

"దానితోబాటు సదాశివశాస్త్రి హంతకుల జాడ కూడా కావాలి నాకు."

"దాని కేముంది. పురుషోత్తమరావుని పట్టుకుంటే సరి, ఖేలా?"

"కాని ఆ రాత్రి యిద్దరు పారిపోయినట్టు చెప్పాడు కదా భాస్కర్."

"అప్పుడు జ్ఞానేశ్వరరావును కూడా పట్టుకుంటే సరి."

"లాభమేమిటి? రుజువు చెయ్యాలి."

"ఆ రాత్రి బల్లమీద దొరికిన కాగితాలలో విషయం యేమిటి?" సంభాషణా విధానం మారుస్తూ అడిగాడు మూర్తి.

"చూడు" డ్రాయరు నుండి అందించాడు ప్రభాకర్.

మూర్తి వాటిని పైకీ క్రిందకీ దీక్షగా చూచి, "ఏమిటో, అంతా గందరగోళంగా వుంది" అని భాస్కర్‌వైపు తిరిగి, "ఇది ఏదో కోడ్‌లా కనిపిస్తోంది. మీకు రకరకాల కోడ్స్‌ను డీకోడ్ చెయ్యడంలో శిక్షణ యిస్తారు కదా? మీ కేసుయినా కొరకబడుతుందేమో చూడండి" అన్నాడు.

"నే నింతకుముందే చూచాను. దాని రహస్యం నాకూ తెలియలేదు" చెప్పాడు భాస్కర్.

అంతవరకూ మౌనంగా కూచున్న హరి వుత్సాహంగా ముందుకు వంగి "బాస్!" అన్నాడు.

డిటెక్టివ్ ప్రభాకర్ హరి ముఖంలోని వెలుగు చూచి, "నీ ఊహ అర్థం అయింది. సదాశివశాస్త్రి నిత్యం గీతా పారాయణ చేస్తాడు కాబట్టి గీత ద్వారానే మనకు సందేశం అందజేశాడేమో నని కదా నీ ఊహ?" అని అడిగాడు.

"ఔను బాస్! సదాశివశాస్త్రి వ్రాసిన అడ్డుగీత, భగవద్గీతకు సంకేతం అని ఎందు కనుకోకూడదు?"

"గీతా మకరందం తీసుకురా!"

5

"ఓహో డిటెక్టివ్ ప్రభాకరా? ఏమిటిలా దయచేశారు?" సాదరంగా ఆహ్వానిస్తూ ప్రశ్నించాడు గుడ్‌విల్ బ్యాంక్

మేనేజర్ గుణవర్ధన్.

"మీ బ్యాంక్‌లో ఇరవయ్యవ నంబర్ లాకర్ సదాశివ శాస్త్రిగారి పేర వుంది. అది తెరిచి చూడాలి" చెప్పాడు ప్రభాకర్.

"యూసీ" అందుకున్నాడు గుణవర్ధన్. "మా బ్యాంక్ పేరే గుడ్‌విల్ బ్యాంక్. మా కస్టమర్స్‌కు సంబంధించిన రహస్యాలు తెలియబరచి మా గుడ్‌విల్ చెడగొట్టుకుంటామా? అయామ్ సారీ! మీ రంటే నాకెంత గౌరవం వున్నా ఆ పని మాత్రం చెయ్యలేను. అయామ్ సారీ!"

డిటెక్టివ్ ప్రభాకర్ తన జేబునుండి ఒక కవరు తీసి గుణవర్ధన్ కందించాడు. గుణవర్ధన్ కవరులోని కాగితం చదివి, "అయామ్ సారీ! ప్రభుత్వంతో సహకరించడం మనందరి విధి. ముందుగానే మీ రిది చూపి వుంటే, నేను మీ మనసుకు కష్టం కలిగించటం జరిగేది కాదు కదా!" అని లాకర్ రూమ్‌వైపు నడిచి, లాకర్‌లో ఒక తాళంపెట్టి తిప్పి బయటకు నడిచాడు గుణవర్ధన్.

తన ఊహాశక్తి సాయంతో సదాశివశాస్త్రి ఉపయోగించిన కోడ్‌ను డీకోడ్ చేశాక సదాశివశాస్త్రి డ్రాయరులోని రహస్యపుటర నుండి సేకరించిన తాళంచెవితో ప్రయత్నించి లాకర్ తెరిచాడు ప్రభాకర్.

లాకర్‌లో ఒక తెల్లటి కవరు మాత్రమే వుంది. కవరు బయటకు తీశాడు ప్రభాకర్! తెరచిచూడగా అందులో పోస్టు కార్డుసైజు తెల్లని అట్ట మాత్రమే వున్నట్టు గ్రహించాడు ప్రభాకర్. కార్డు బయటకు తీశాడు. ఆ కార్డు పై భాగంలో మధ్యగా ఎర్రని అక్షరాలతో 'అణోరణీయాన్' అని వ్రాసి వుంది. దానిక్రింద ఒక మంచంబొమ్మ, ఆ మంచం తలగడ దిక్కున ఒక విసనకర్ర బొమ్మ చిత్రించి వుంది.

ఒక్క క్షణం కళ్ళు మూసుకుని ఆలోచించి, తలపంకించి బయటకు వచ్చాడు.

* *

డిటెక్టివ్ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ మూర్తికి కొన్ని సూచనలిచ్చి, హరిని వెంటపెట్టుకుని సదాశివశాస్త్రి ఇంటికి బయలుదేరాడు.

"బాస్! ఆంజనేయులు వెంటాడుతున్నాడు."

మోటార్‌సైకిల్‌పై వెంటాడే ఆంజనేయులును రియర్ వ్యూ మిర్రర్‌లో చూచి, చిరునవ్వు నవ్వుకున్నాడు ప్రభాకర్.

ప్రభాకర్ హరిని వెంటపెట్టుకుని సదాశివశాస్త్రి రూమ్‌లో అడుగుపెట్టాడు. ప్రభాకర్ తను బ్యాంక్ లాకర్ నుండి తెచ్చిన కార్డు బల్లమీద పెట్టాడు. హరి దానివైపు చూచి, "బాస్! మంచం తలగడ దిక్కున విసనకర్ర బొమ్మ గీచి వుంది ఈ చిత్రంలో. ఈ గదిలో మంచం పై భాగంలో సీలింగ్ ఫ్యాన్ వుంది. అంటే యేదయినా రహస్య సంకేతం ఫ్యాన్‌లో వుందనుకోవాలా?" అని అడిగాడు.

"బొమ్మలో ఫ్యాన్ (విసనకర్ర) ఎక్కడ వుంది? తలగడ దిక్కున వుంది" అని సమాధానం చెప్పి, "ఈ మంచానికి తలగడ దిక్కున యేంవుంది?" అని అడిగాడు.

"ఫ్యాన్ రెగ్యులేటర్" చటుక్కున జవాబు చెప్పాడు హరి.

"మనం దానిని పరిశోధించాలనుకుంటాను."

"కూడా టూల్స్ ఏమీ తేలేదే మనం?" అయోమయంగా అన్నాడు హరి.

ప్రభాకర్ కోట్‌పాకెట్ నుండి చిన్న టూల్‌కిట్ బయటకు తీశాడు. హరి వాటి సాయంతో రెగ్యులేటర్ పై రేకు వూడదీశాడు. రెగ్యులేటర్ లోపలి భాగం చూచి, "బాస్!

ఒక ఎర్ర బటన్, ఒక పచ్చ బటన్ వున్నాయి. పచ్చ బటన్ లోపలకు ఎర్ర బటన్ పైకి చొచ్చుకుని ఉన్నాయి'' అన్నాడు.

"స్క్రూడ్రయివర్‌తో ఎర్ర బటన్ నొక్కి చూడు" చెప్పాడు ప్రభాకర్.

హరి కుతూహలంగా ఎర్ర బటన్ నొక్కాడు. 'చర్!' మని చప్పుడుకావడంతో అదిరిపడి వెనక్కి తిరిగిచూచాడు.

మంచం, దానిక్రింద పరచివున్న కాయిర్ మ్యాట్‌తో సహా ఒకప్రక్కకు జరిగిపోయింది.

హరి కళ్ళనిండా ఆశ్చర్యం తాండవిస్తోంది. చటుక్కున మంచం జరిగినచోటుకు వచ్చాడు. ప్రభాకర్ అప్పటికే క్రిందకు వంగి పరిశీలిస్తున్నాడు.

"ఇంతకు ముందు మనం ఎంత ప్రయత్నించీ యీ మంచాన్ని ఒక్క అంగుళం కూడా కదపలేకపోయాం. ఇదన్నమాట సంగతి'' అన్నాడు హరి.

నేలమీద తలుపులా అమర్చిన చెక్కను మీదకు లేవనెత్తాడు హరి. తలుపుక్రింద చెక్కమెట్లు కనిపించాయి. ఇరువురూ వాటిగుండా క్రిందకు దిగారు. కాళ్ళు నేలకు ఆనగానే ఆ చీకటిలో ఒక్కక్షణం నిలబడి గోడలు తడిమాడు ప్రభాకర్. చేతికి తగిలిన స్విచ్చిలు చక చక నొక్కాడు. నేల మాళిగలో లైట్లు వెలగడంతో పాటు ఒక చివర ఎక్జాస్టు ఫ్యాన్ తిరుగుతున్న చప్పుడు విన్నారిద్దరూ.

నేలమాళిగ చాలా విశాలంగా వుంది. రక్తచందనం, మంచిగంధం దుంగలు ఒక వారగా లాట్లు లాట్లుగా పేర్చివున్నాయి. మరొకవార దేవదారు పెట్టెలు ఒకదానిపై ఒకటి పేర్చివున్నాయి. ఆ పెట్టెలమీది గుర్తులనుబట్టి అవి మిస్సయిన యు-235 వున్న పెట్టెలని గుర్తించాడు ప్రభా

కర్. చూడవలసినది పూర్తి కావడంతో యిరువురూ పైకి బయలుదేరారు. మెట్లమీద ప్రభాకర్ ముందున్నాడు

పైన గదిలో చటుక్కున లైటారిపోయింది. గదిలో ఎవరో ప్రవేశించారనుకున్నాడు. అతడి మనసు అపాయం శంకించింది. చటుక్కున క్రిందకు వంగాడు. 'ఢాం' మంటూ దూసుకు పోయిందొక రివాల్వర్ గుండు నెత్తి మీదుగా.

క్షణం వృధా పోనివ్వకుండా తన సైలెన్సర్ తీసి గుండు వచ్చిన దిశగా కాల్చాడు. 'అబ్బా!' అన్న కేకతో దబ్బున పడ్డ శబ్దమైంది. ఒక్క ఊపున మీదకెగిరి క్రింద పడ్డ మనిషివైపు దూకాడు.

ప్రభాకర్ అటు దూకినట్టు పసికట్టి అటువైపు రివాల్వర్ కాల్చాడు మరొక వ్యక్తి. మరుక్షణం మెరుపులా మీదకు దూకి ఆ వ్యక్తిని నేలకూల్చాడు డిటెక్టివ్ ప్రభాకర్. అదే సందడిలో హరి గదిలోకి ఎక్కి లైటు స్విచ్చి ఆన్ చేశాడు.

డిటెక్టివ్ ఆంజనేయులు నేలమీద పడివున్నాడు. అక్కడికి కొద్దిదూరంలో పురుషోత్తమరావు స్పృహతప్పి పడివున్నాడు. చీకట్లో తన బాస్ దెబ్బతీసినది పురుషోత్తమరావునే నని గ్రహించాడు హరి.

జ్ఞానేశ్వరరావు ఒణుకుతున్న చేత్తో ప్రభాకర్‌ను కాల్చడానికి పొజిషన్ చూచుకుంటున్నట్టు గమనించాడు హరి. క్షణం ఆలస్యం కానివ్వలేదు హరి. కాలనాగులా నిశ్శబ్దంగా దూసుకువచ్చింది హరి బులెట్—కెవ్వున కేక ఖణేల్ మని శబ్దం అయ్యాయి. తోటకూర కాడలా వ్రేలాడిపోతున్న కుడిచెయ్యిని ఎడమచేత్తో పట్టుకుని క్రింద కూలబడ్డాడు జ్ఞానేశ్వరరావు.

సరిగ్గా అదే సమయానికి బిలబిలమంటూ లోపల కడుగు పెట్టారు ఇన్‌స్పెక్టర్ మూర్తి అతడి పరివారం.

"సదాశివశాస్త్రి సదా గీతాపారాయణం చేస్తాడని నాకు తెలుసు. అతడు గీతద్వారానే తన సందేశం మనకు తెలియజేస్తున్నాడేమోనని అనుమానించాను. అతడు ఎంగేజ్‌మెంట్స్ ప్యాడ్ మీద గీసిన అడ్డుగీత భగవద్గీత అనుకుంటే క్రింద వ్రాసిన అంకెలు అధ్యాయాల సంఖ్యలు కావాలి. ఆ ఊహతో చూచాను. నాలుగు జ్ఞానయోగం. పదిహేను పురుషోత్తమయోగం.

ఆ అధ్యాయాల పేర్లనుబట్టి హంతకులు జ్ఞానేశ్వరరావు, పురుషోత్తమరావులని సూచిస్తున్నాడా అనుకున్నాను. ఇక గీతాచార్య చిత్రం వెనుక తొమ్మిది బై ఇరవై, దాని చుట్టూ పూర్ణవలయం. ఈ తొమ్మిదిని కూడా అధ్యాయం సంఖ్యగా తీసుకుంటే అది రాజ విద్యా రాజ గుహ్య యోగం అవుతుంది. ఇందులో రాజ గుహ్యశబ్దం తీసుకుందాం. రాజ్య సంబంధమైన గుహ్యప్రదేశం అని అర్థం చెప్పుకుంటే 'బ్యాంకు'ను సూచిస్తుందని ఊహించాను. ఆ అంకెకు చుట్టూ ఉన్న వలయం ఆ ఊహను మరింత బలపరుస్తుంది.

ఇక మిగిలినదల్లా ఇరవై అన్న అంకె. భగవద్గీతలో అధ్యాయాలు పద్దెనిమిదే. మరి యిదేమిటి? తొమ్మిది కర్థం బ్యాంకుగా చెప్పుకుంటే ఇరవైది లాకర్‌గా ఎందుకు చెప్పుకోకూడదు అనిపించింది. ఆరాలు తీశాను. నా ఊహ వృథాపోలేదు. చివరకు బ్యాంక్ లాకర్‌లో దొరికిన కాగితం ఆధారంగా, అది అణుపదార్థ రహస్యానికి సంబంధించినదేనని దృఢపడింది" చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్, మూర్తి సందేహాలను తీరుస్తూ. □

నేరం ఒకరిది శిక్ష మరొకరిది!

ఎమ్.వి.వి. సత్యనారాయణ

సాయంకాలమయింది.

గాంధీనకర్ బ్రిడ్జి దగ్గర నిలబడ్డాను. వాతావరణంలో ఎండ వేడిమి తగ్గింది. ఎండకు భయపడి ఆగిన జనం రోడ్డ మీదకు తిరిగి వస్తున్నారు. కృష్ణ కాలువమీద నుండి గాలి చల్లదనాన్ని పులుముకు వస్తోంది.

నా కళ్ళు జనాన్ని వెతుకుతున్నాయి.

నాకు డబ్బు కావాలి. డబ్బు సంపాదించడానికి నేను ఏ మార్గమయినా సరే ఎన్నుకుంటాను. నాకు కొంత అండర్ గ్రవుండ్ చరిత్ర వుంది. ఇంతవరకూ మూడు హత్యలు చేశాను. ఇద్దరు మగాళ్ళనూ ఒక ఆడదాన్నీ హత్య చేశాను.

ముగ్గురూ మూడు కుటుంబాల మనుషులు. ముగ్గురి హత్యలలో నాకు బాగా కలిసివచ్చింది. మూడు హత్యలకూ అనుమానితులు వేరే వున్నారు. వాళ్ళు ఇంకా క్రిమినల్ కోర్టుల వెంట తిరుగుతున్నారు.

నవ్వుకున్నాను. అసలు నేరం ఒక చోటా అనుమానం వేరొకచోటా.

నా ముందు మోటారుసైకిల్ ఆగింది.

"ఏంరా! యిక్కడ నిలబడ్డావు?"

నా కళ్ళకు కాకీ యూనిఫాం కనిపించింది. చెట్టంత పెర్సనాలిటీ. అతను క్రయిమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కుమార్.

"ఏం లేదు సార్?" అన్నాను తడబడుతూ.

"జేబు దొంగతనాలు యింకా చేస్తున్నావా?"

"లేదు సార్!"

"ఉదయం గవర్నర్ పేటలో దొంగతనం జరిగింది" కుమార్ నా మొహంలోకి చూస్తున్నాడు. అతడి కళ్ళు డేగ కళ్ళలాగా నా చూపుల్లోకి చొచ్చుకుపోతున్నాయి.

"నాకు తెలియదు సార్!"

"వూ! ముసలావిడది బంగారు గొలుసు పోయింది."

"........"

"వీరభద్రం కనిపిస్తే చెప్పు."

"తప్పకుండా సార్!"

"గవర్నర్ పేటలో దొంగతనాలు చేసేది వాడేకదా!"

"...... ......" నా కెందుకు చెప్పడం? ఏ ఏరియాలో ఎవడు ఎలాంటి నేరం చేస్తాడో అతడికి తెలియదా?

"నీకు ఆ దొంగతనంలో వాటా వున్నట్టు రుజువైతే కీళ్ళు విరుస్తాను!"

మోటార్ సైకిల్ స్టార్టయింది.

'అమ్మయ్య! వదిలాడు!' నిట్టూర్చాను.

కుమార్ తలెగరేసి వెళ్ళిపోయాడు.

మొహాన పట్టిన చెమట తుడుచుకున్నాను. గజీతగాడు నీటిలో ఈది ఒడ్డుకు వచ్చి చచ్చాడట! అలా వుంది నా పరిస్థితి! హత్యలు చేశాను. దొరకలేదు. ఒకసారి ఈ గాంధీనగర్ సెంటర్‌లో పర్స్ అపహరించబోయాను. పట్టుబడ్డాను.

ఇన్‌స్పెక్టర్ కుమార్ నన్ను చితకగొట్టి వదిలాడు.

కృష్ణ కాలువవైపు చూశాను. నిశ్చలంగా పారుతోన్నాయి నీళ్ళు. నాలుగడుగులు నడిచి పేవ్‌మెంట్ మీద ఆగాను. అక్కడ పండ్లు అమ్మే తోపుడు బండి వుంది.

బండివైపు చూశాను. నా కళ్ళు జిగేల్‌మన్నాయి. పండ్లు బేరమాడుతోన్నారు ముసలి దంపతులు. ముసలావిడ మెడలో నాలుగు పేటల బంగారు గొలుసు వుంది. చెవులకు విలువయిన రాళ్ళు పొదిగిన దుద్దులున్నాయి. ముసలాయన చేతికి బంగారు రిస్టువాచీ, మెడలో బంగారు గొలుసూ వున్నాయి.

ముసలివాళ్ళయితే ఏంగాక? ఖరీదయిన జంట!

"ప్రయాణంలో నిద్రపోవుగదా?" అంటున్నాడు భర్త బేరం మధ్యలో.

ఆమె తల అడ్డంగా త్రిప్పింది. తలత్రిప్పినపుడు చెవి దుద్దులు మిలమిల లాడాయి.

తోపుడు బండివాడు సంచిలో పండ్లు వేశాడు.

ముసలాయన డబ్బు చెల్లించి బయలుదేరాడు. ఆమె అతడి ప్రక్కగా నడుస్తోంది.

ఆమె ప్రయాణం చేస్తోంది ఒంటరిగా....

నా మనసు ఎగిరి గంతేసింది. ఎంత లేదనుకున్నా ఆమె వంటిన ముప్పైవేల రూపాయల విలువైన బంగారం వుంది. ప్రయాణంలో ఎక్కడో ఆమెను అంతం చేయ వచ్చును.

వాళ్ళిద్దరూ స్టేషన్ రోడ్లో నడుస్తోన్నారు.

వాళ్ళకూ నాకూ మధ్య కొంతమంది పాదచారు లుండే లాగా జాగ్రత్తపడుతున్నాను.

ముసలి దంపతులు రైల్వే స్టేషన్లో ప్రవేశించారు.

ముసలాయన మద్రాసు పోయే మెయిలుకు టికట్ కొన్నాడు. నేను ముసలావిడ ప్రక్కకు చేరాను. ముస లావిడకూ నాకూ మధ్య ఇద్దరు ఆడవాళ్ళున్నారు. ముస లావిడ వాళ్ళతో మాటల్లోపడింది.

"గొలుసు ఎక్కడ చేయించారో కాని చేత బాగుంది!" అంది ఇద్దరిలో ఒకావిడ.

ముసలావిడ వాళ్ళకు తన మెడలో గొలుసు చూపించి మాట్లాడుతోంది.

"పమిట కప్పుకోండి. దొంగె వెధవలుంటారు" అంది రెండో ఆవిడ.

ముసలావిడ ఆమె సలహాను అక్షరాలా పాటించింది.

"బండి కరెక్టు టైముకే వస్తోందట. రా. ప్లాట్ఫాం మీదకు వెళ్దాం" అన్నాడు ముసలాయన.

ముసలావిడ కదిలింది. ఆమె మెడలోని నగను ఎలా అపహరించాలి? స్టేషన్ భవనం చాలా రద్దీగా వుంది. అతి కష్టంమీద ఆమె ప్రక్కకు చేరుకున్నాను. చేతులలోనికి విపరీతమైన శక్తి తెచ్చుకుంటున్నాను.

నా మనసు వద్దని హెచ్చరిస్తోంది.

అంత రద్దీలో నా కంటికి నాలాంటి దొంగలు కనిపిస్తున్నారు. వాళ్ళ కళ్ళు కుటిలంగా వెతుకుతున్నాయి. ప్లాట్ ఫాం పోలీసులు ప్రయాణీకుల మధ్య తిరుగుతోన్నారు. ఎక్కడో గొడవ జరుగుతోంది.

ఎవరి జేబో కత్తిరించి వుంటాడు సోదరుడెవడో.

"మెడ జాగ్రత్త! వద్దంటే వినవే!" అంటున్నాడు ముసలాయన. ఆయన కళ్ళు నామీద పడ్డాయి. నేను దిక్కులు చూస్తున్నాను.

"తేకపోతే దాని మొహాన కొడతారని!" మురిపెంగా చూచింది ఆమె.

"దాని మొహాన కొట్టాలంటే డబ్బు లేదా?"

"ఆ డబ్బు మీ పెన్షన్ డబ్బు! ఆ డబ్బును అనవసరంగా ఆ దెష్ట మొహాన కొట్టలేరు!"

"బాంకులో వేయనిచ్చావు కాదు!"

"వద్దాం. నేను రేపులేదు ఎల్లుండి వచ్చేస్తాను కదా!"

ముసలావిడ సిమెంటు బల్లమీద కూర్చుంది. ఆమె భర్త ఆమెకు అంగరక్షకుడిలాగా వెనక్కి చేరాడు.

నాకు ప్రాణం వూసూరుమంటోంది.

"టూటయర్ కంపార్ట్మెంటులో సీటు సంపాదించరాదా?" అంది ముసలావిడ.

"అలాగే. నువు జాగ్రత్తగా వుండు!" ముసలాయన

భార్య వెనకనుండి కదిలి వెళ్ళిపోయాడు. నాలో ఆశ తిరిగి బతికింది.

నేను జనాన్ని ఒత్తిగించుకుని ఆమె వెనక్కి చేరాను. ఆమె పరాకుగా వుందో ఏమో మెడమీద నుండి నగ కనిపిస్తోంది. నగ కొక్కెం వదులుగా కనిపిస్తోంది.

కండరాల్లోకి శక్తినీ, కాళ్ళలోకి మెలకువనూ తెచ్చుకున్నాను. చటుక్కున గొలుసును వ్రేళ్ళతో లాగాను.

ముసలావిడ వులిక్కిపడి యిటు తిరగబోయింది. గొలుసును బనీను వెనక్కి జార్చి రెండడుగులు వెనక్కి వేశాను రద్దీలో కలసిపోయాను.

ముసలావిడ సన్నగా అరుస్తోంది.

నేను ప్లాట్ఫాం మారి రద్దీలేని చోటకు జేరుకున్నాను. ముసలావిడ వున్న ప్లాట్ఫాం మీద గందరగోళం రేగుతోంది. చుట్టూ చూశాను. ఈ ప్లాట్ఫాంమీద బండి వచ్చి ఆగింది. జనం ఎవరి గొడవలో వాళ్ళున్నారు.

నేను బాత్రూంలో దూరి తలుపు వేసుకున్నాను.

బాత్రూంలో వున్నంతసేపూ మన రైల్వేల దుస్థితి గుర్తుకు వస్తోంది.

బంగారు గొలుసును బయిటికి తీసి చూశాను. అది తళతళలాడుతోంది. వెనక్కి త్రిప్పి చూశాను. వెనుకభాగం డొల్లగా వుంది. డొల్లగా వున్న భాగంలో నల్లటి మరకలు.

పళ్ళు బిగించాను. ఇది నకిలీ బంగారు గొలుసు. ఛీ! నా ప్రయత్నం వృధా అయింది. నకిలీ నగ అని తెలిసే ముసలిది అరుస్తోందో, తెలియక అరుస్తోందో! తెలిసి వుంటే ఆమె నకిలీ నగను అసలు బంగారు నగగా తన లాంటి వాళ్ళను భ్రమపెట్టింది. నకిలీనగ అని తెలియక

పెట్టివుంటే అది ఆ ముసలాడి పనయివుండాలి.

ముసలాడు నరాంతకుడు!

తన భార్య మెడలోని నగకు రక్షణ వున్నట్టే వుండి తప్పుకున్నాడు. ఎందుకు? ఈ నగను ఎవరో ఎత్తుకుపోవాలనా? అసలు నగను ఇన్స్యూర్ చేసి వుంటాడు. అసలు నగను అమ్మకు తినేసి వుంటాడు. దాని స్థానంలో నకిలీ నగను అలంకరించాడు. ఇప్పుడు ఆ నకిలీ నగను తాను దొంగిలించాడు. ముసలి దంపతులకు ఈ నగమీది భీమా సొమ్ము వచ్చేస్తుంది.

నుదురు చిట్లించాను. అంటే ముసలాడు నా లాంటి దొంగ కోసమే ఎదురు చూస్తున్నాడన్న మాట! ఛీ ఛీ వాడికి భీమా సొమ్ము అందరాదు.

నగను జేబులో వేసుకున్నాను. జేబులోంచి దువ్వెన తీసి పాపిడి మార్చాను. కళ్ళకు అద్దాలు తగిలించాను. చొక్కా తిరగవేసి తొడుక్కున్నాను. చొక్కా డిజైన్ మారింది. బాత్ రూంలోంచి బయటకు నడిచాను.

ముసలిదంపతుల చుట్టూ పోలీసులు చేరారు.

ముసలతను తనని తాను పరిచయం చేసుకుంటున్నాడు. ఇన్స్పెక్టర్ కుమార్ వింటున్నాడు.

"నా పేరు రాఘవయ్య సార్. నా భార్య కాంతం. నేనూ మా ఆవిడ కలిసి మద్రాసు వెళ్తున్నాం సార్! మధ్యలో యిలా దొంగతనం జరుగుతుందని ఊహించలేదు సార్!" కాంతం అతని మాటలకు తలూపుతోంది.

"రాఘవయ్య అబద్ధ మాడుతున్నాడు!" అరవాలనిపిస్తోంది నాకు. మద్రాసుకు అతడు ఒకటే టికెట్టు కొన్నాడు. కాంతం ఒకత్తెకే అతడు ధైర్యం చెప్పి మరీ మద్రాసు పంపిస్తున్నాడు.

రాఘవయ్య నకిలీ నగను అసలు బంగారు నగగా చలామణీ చేశాడు. తామిద్దరూ కలిసి మద్రాసు వెళ్తున్నట్టు రాఘవయ్య దంపతులు అబద్ధం చెపుతున్నారు.

"నగ ఎక్కడ చేయించారు? ఎన్ని తులాల బరువు నగ; నగ వెనుక గుర్తులు ఏమైనా పెట్టారా?" కుమార్ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు.

రాఘవయ్య చాలా నిదానంగా సమాధానాలు చెబుతున్నాడు. అతడి దగ్గర కుమార్ స్టేట్‌మెంట్ తీసుకున్నాడు. ప్లాట్‌ఫాంమీద మద్రాసుపోయే మెయిలు వచ్చి ఆగింది.

"ఆల్‌రైట్! మీరు నిశ్చింతగా మద్రాసు వెళ్ళిరండి. నగ ఎక్కడకూ పోదు" పచ్చజెండా చూపించాడు కుమార్.

నవ్వుకున్నాను. నగ ఎక్కడికి పోతుంది? నా దగ్గరే వుంది. గిల్టునగ!

భార్య చెయ్యి పట్టుకుని రాఘవయ్య మెయిల్‌వైపు నడిపించాడు.

రాత్రి పదయింది. అయినా నేను రాఘవయ్యను వదలదల్చుకోలేదు.

ప్లాట్‌ఫాం మీద నుండి పోలీసులు వెళ్ళిపోయారు. నేను స్తంభం చాటుకు చేరాను. రాఘవయ్య దంపతులు కంపార్ట్‌మెంటులోంచి కనిపిస్తున్నారు. మెయిలు బయలుదేరే సమయమయింది.

రాఘవయ్య తన భార్యతో చెప్పాడు. మెయిలు కదలబోయేముందు ప్లాట్‌ఫాం మీదకు దిగిపోయాడు. నా ఊహ నిజమవుతోంది.

రాఘవయ్య రైల్వేస్టేషన్ లోంచి బయటకు వచ్చాడు. నేను అతడిని అనుసరిస్తున్నాను.

పూర్ణానందం పేట మలుపు తిరిగాడు రాఘవయ్య. ఆగి

చుట్ట వెలిగించుకున్నాడు. ప్రక్క జేబులు తడిమి చిన్న అట్టముక్క రోడ్డువార వేశాడు. పది గజాలు నడిచాడు. హేమకుంజ్ ఫ్లాట్స్ ముందు ఆగాడు. నేను చిన్న అట్ట ముక్కను చేతిలోకి తీసుకున్నాను.

ప్లాట్‌ఫాం టికట్!

రాఘవయ్య ఫ్లాట్స్‌లోకి నడిచాడు.

2

హేమకుంజ్ ఫ్లాట్స్ మూడంతస్థుల భవన సముదాయం. ఒక్కో అంతస్థులో పది చొప్పున ఫ్లాట్స్ వున్నాయి. మొత్తం ముప్ఫయి ఫ్లాట్స్. ముప్ఫయి ఫ్లాట్స్‌లో రాఘవయ్య ఏ ఫ్లాట్‌కి వెళ్ళినట్టు. నేను చురుకుగా భవనంలోకి నడిచాను.

రాఘవయ్య పై అంతస్థు వరండాలో నడుస్తూ కనిపించాడు. నేను చకచక పై అంతస్థుకు చేరుకున్నాను. గోడచాటు నుండి అతడిని గమనించసాగాను. ఇరవైయో ఫ్లాట్ ముందు కుర్చీలో రాఘవయ్య కూర్చున్నాడు. చివరి ఫ్లాట్ కావడం వలన ఇక అటుప్రక్కకు వెళ్ళడానికి వీలు లేదు. అడ్డుగోడ వుంది. గోడకు దగ్గరగా వున్న కుర్చీలో మరో యువతి కూర్చుంది. ఆమెకు పాతిక సంవత్సరాలుంటాయి. దీపం వెలుగులో ఆమె మిలమిలలాడుతోంది.

"మంజూ! నీ కోసం నా ప్రాణం యిస్తాను" అంటున్నాడు రాఘవయ్య.

ఆమె కిలకిల నవ్వింది. "ఇంత లేటువయసులో...." నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుంది.

"ఏం. తప్పా?"

"అబ్బే తప్పుకాదు!"

"కాంతం ఒప్పుకుంది."

"ఊహూఁ;"

"ఆమెను మద్రాసు పంపించాను."

"ఎందుకు?"

"బంగారు బిస్కట్లు!"

"హూష్! ఎన్ని రూపాయలవి?"

"అయిదు లక్షలు!"

"లోపలకు వెళ్ళి మాట్లాడుకుందాం!" ఆమె లేచింది.

ఇద్దరూ లోపల కుర్చీలు వేసుకున్నారు. వరండాలో దీపం వెలుతురు పడుతోంది. కొన్ని క్షణాల్లో వెలుతురు మాయమయింది. మంజు తలుపు మూసింది.

మెట్లమీద ఎవరో వస్తోన్న చప్పుడయింది. నేను చప్పున మెట్లు దిగాను. భవనం వెనుక వైపు నడిచాను. వెనుకభాగంలో పిట్టగోడలతో చిన్న బాల్కనీలు వున్నాయి. ఇరవైయో నెంబర్ ఫ్లాట్‌కి సంబంధించిన బాల్కనీని గుర్తించాను.

రాఘవయ్య ఈమె దగ్గర ఎంతసేపు వుంటాడు? రాఘవయ్య వుండే యిల్లు ఎక్కడ? సీటిగొట్టం పట్టుకు పైకి ఏగబాకాను. బాల్కనీలో దిగాను.

"ఇంటికి వెళ్ళవా?" అడుగుతోంది మంజు.

"ఊహూఁ!"

"ఏం?"

"ఈ రాత్రికి ఇక్కడే మన స్వర్గం!"

"ఇంట్లో మీ పెన్షన్ డబ్బు వుంది."

"ఉండనీయి. ఎవడికి తెలుస్తుంది?"

ఆమె నవ్వింది.

ఈ రాఘవయ్యను వదలకూడదు. అవతల పెన్షన్ డబ్బూ .... మద్రాసు నుండి కాంతం తీసుకురాపోయే

బంగారు బిస్కట్లూ. నాకు కడుపులో ఆకలి దంచుతోంది. రాఘవయ్య ఎక్కడికీ పోడు! అందమైన నవ్వుల పిల్ల దొరికింది.

నేను ముందు భోజనం చేసిరావాలి! బాల్కనీ దిగాను.

రోడ్డుమీద పోలీస్ జీపు వెళ్తోంది.

3

రాత్రి పదకొండయింది.

బాల్కనీలో కూర్చున్నాను. భోజనం ముగించుకువచ్చానేమో నిద్ర ముంచుకు వస్తోంది.

అటునుండి కానీ యిటునుండి కానీ ఇరవయ్యో ఫ్లాట్ లోపలకు వెళ్ళడానికి లేదు. లోపల మంజు నిద్రపోతోంది. కాని రాఘవయ్య యింకా కదులుతున్నాడు. గదిలోంచి జీరోవాట్ బల్బు వెలుగులో వాళ్ళిద్దరూ కనిపిస్తున్నారు.

క్రింగ్....క్రింగ్....

మంచానికి అవతల టీపాయ్. దానిమీద టెలిఫోన్ వుంది. రాఘవయ్య మంచం దిగి రిసీవర్ అందుకున్నాడు. అవతల నుండి విన్నాడు.

"హలో కాంతం!" అన్నాడు.

"అవునండి!"

"సక్సెసా!"

"వూఁ!"

"ఎక్కడినుండి మాట్లాడుతున్నావు?"

"తర్వాతి స్టేషన్‌లో దిగిపోయాను. అతడు రెడీగా అందించాడు. టాక్సీలో వచ్చేశాను."

"ఇక్కడ నా పని ముగించేశాను?"

"నగలు లాకర్‌లోంచి తీసుకువచ్చిందా?"

"ఆఁ."

"ఫ్లాట్స్‌కి వస్తాను."

"టాక్సీ మారి ఆటోలో రా" రాఘవయ్య రిసీవర్ పెట్టేశాడు. తలుపు తెరచి అవతల వరండాలోకి నడిచాడు.

చటుక్కున నేల మీదకు దిగాను. ఫ్లాట్స్‌లోకి నడిచాను.

రాఘవయ్య నాకు ఎక్కడా కనిపించలేదు. కాంతం ఫ్లాట్స్‌కి వస్తానంది. రాఘవయ్య ఎక్కడకు వెళ్ళాడు? ఈ ఫ్లాట్స్‌లోనే ఒక ఫ్లాట్ తీసుకున్నాడా? మంజును రాఘవయ్య మోసం చేశాడా? ఆమె దాచుకున్న నగలు రాఘవయ్య పాల బడ్డాయా? కాంతం మధ్యలో మెయిలు దిగడమేమిటి?

నేను భోజనానికి వెళ్ళినపుడు రాఘవయ్య నగలు దాచాడా?

మెట్లు దిగి ఇరవై యో నంబర్ ఫ్లాట్ ముందుకు నడిచాను. తలుపు దగ్గరకు చేరవేసి వుంది. మంజును హెచ్చరించాలి. రాఘవయ్య మోసం బయటపెట్టాలి.

తలుపు తెరచుకుని లోపలకు నడిచాను.

మంజు యింకా నిద్ర పోతోంది. ఆమెను తట్టి లేపాను.

మంజు నన్ను చూచి వులిక్కిపడింది.

"ఎవరు మీరు? యెలా రాగలిగారు?" అడిగింది.

"రాఘవయ్య నిన్ను మోసం చేశాడు. నీ నగలు ఎత్తుకుపోయాడు" అన్నాను.

మంజు కళ్ళు పెద్దవి చేసింది.

"అతడు ఏ ఫ్లాట్‌లో వుంటాడు?" పాపం ఆడకూతురు. జీవితంలో పండిపోయిన మగాడి చేతిలో పడింది.

బయట ఆటో ఆగింది. పిట్టగోడవద్దకు నడిచాను.

ఆటోలోంచి కాంతం దిగింది. వీధి దీపం వెలుగులో ఆమెను గుర్తించగలిగాను. కాంతం చేతిలో బ్రీఫ్‌కేసు వుంది. ఆటోను పంపించేసి కాంతం భవనంలోకి నడిచింది.

"క్రింది అంతస్థులో అయిదో ఫ్లాట్!" అంది మంజు. ఆమె ఆయాసంతో వగరుస్తోంది. కోపం, ఉక్రోషం ఆమె మొహంలో నాట్యం చేస్తున్నాయి. ఆమె టెలిఫోన్‌ను చూస్తోంది. ఎవరికయినా ఫోన్ చేస్తుందా? నేను ఆమెను సముదాయించాను. ఆమెనూ ఆమె అందాన్ని వదలి వెళ్ళ బుద్ధికావడంలేదు.

"నువ్వు జాగ్రత్తగా వుండు!" ఆమెకు ధైర్యంచెప్పి మెట్లు దిగాను.

అయిదో నెంబర్ ఫ్లాట్ ముందుకు నడిచాను.

ఫ్లాట్‌లో నిశ్శబ్దంగా వుంది. అకస్మాత్తుగా అయిదో నెంబర్ ఫ్లాట్‌లో టెలిఫోన్ గోల మొదలుపెట్టింది.

గదిలోకి చూశాను.

రాఘవయ్య రిసీవర్ ఎత్తి మాట్లాడాడు. చివరగా "మంజూ!" అని పిలిచి రిసీవర్‌ను ప్చ్ అని శబ్దం వచ్చే లాగా ముద్దు పెట్టుకున్నాడు.

రాఘవయ్య డబుల్ ప్లే చేస్తున్నాడు. శృంగారం వెలగబెడుతున్నాడు. చటుక్కున తల త్రిప్పి నన్ను చూశాడు. ఎవరన్నట్టు కళ్ళెగరేసి రిసీవర్‌ను క్రెడిల్ చేశాడు.

"కాంతం. బంగారు బిస్కట్లు జాగ్రత్త!" అరిచాడు.

నేను చటుక్కున రాఘవయ్యను త్రోసి లోపలి గదిలోకి నడిచాను. ఆ గదిలో కాంతంలేదు. మంచం క్రింద చూశాను. అక్కడ కూడా ఆమె లేదు. నా వెనుక క్లిక్ మని శబ్దమయింది. వెనక్కి తిరిగిచూశాను.

తలుపు మూసివుంది. రాఘవయ్య తలుపు మూశాడన్న మాట! ఎందుకు? నేను అతడి యింట్లో అక్రమ ప్రవేశం చేసినందుకు పోలీసులకు ఒప్పచెబుతాడా? పోలీసులకు ఒప్ప చెప్పే ధైర్యం అతడికి వుండకపోవచ్చు.

మంజు నగలు దొంగిలించాడు. కాంతం బంగారు బిస్కట్లు తీసుకువచ్చింది.

గదిలోంచి బయటపడాలి. బయట పడేముందు యీ గదిలో వుండవలసిన బంగారు బిస్కట్లు ఎక్కడున్నాయో చూడాలి. రాఘవయ్య, "కాంతం" అని పిలిచాడు. ఆమె గదిలో మాయమయిందా?

గది బయట పక పక నవ్వు వినిపించింది. ఆడా మగా కలసి నవ్విన నవ్వు అది!

"మంజూ! ఎలుక బోనులో చిక్కింది" అంటున్నాడు రాఘవయ్య.

నాకు వెన్నుమీద చరచినట్టయింది. రాఘవయ్యతో నవ్వులపిల్ల చెయ్యి కలిపిందా? మరి కాంతం విషయం ఏమిటి? కాంతంతో కలసి మంజూవద్ద నగలు అపహరించి నట్టు రాఘవయ్య ఫోనులో ఎందుకు చెప్పాడు?

అన్నట్టు కాంతాన్ని వాళ్ళు ఏం చేశారు?

గదిలో నిలువెత్తు బీరువా వుంది. కాంతం ఈ గదిలో లేదు. రాఘవయ్య ఎవరినో కాంతం అని సంబోధించి నాటకమాడాడు. బీరువా పిడిమీద చెయ్యి వేశాను. తలుపులు బార్లా తెరచుకుని వున్నాయి.

బీరువాలోకి చూశాను.

బీరువాలోంచి నామీదకు ఏదో పడింది. నేను వెల్లకితలా పడ్డాను. నామీద ఆమె పడింది. నా పొట్టలో ఏదో కొయ్య ముక్క గుచ్చుకుంటోంది. నేలమీద జిగటగా అంటుకుం

టోంది. ఆమె కళ్ళు పత్తికాయల్లాగా తెరుచుకునివున్నాయి.

నాకు ఒళ్ళు గగుర్పొడుస్తోంది. ఆమె కాంతం. ఆమె కళ్ళలో జీవం లేదు. కాంతంను రాఘవయ్య చంపేశాడు. కాంతం నిజంగానే బంగారు బిస్కట్లతో వచ్చింది. రాఘవయ్య ఆమెను మోసగించి మంజూ పక్షం చేరాడు. మంజూ అతడూ కలిపి కాంతాన్ని డబుల్ క్రాస్ చేశారు.

నేను అతి కష్టంమీద చేతులను స్వాధీనంలోకి తెచ్చుకున్నాను. కాంతం శవాన్ని ప్రక్కకు నెట్టాను. నా బట్టల నిండా వెచ్చటి రక్తం అంటుకుంటోంది. నేలమీద చేతి ముద్రలు రక్తంలో అచ్చుపడ్డాయి.

కాంతం వెల్లకితలా పడివుంది. ఆమె పొట్టలో కత్తి, పిడివరకూ దిగివుంది. ఆమె మొహంలో ఆశ్చర్యం!

గదిలో నిలువుటద్దం వుంది. అద్దంలో నా రూపం భయంకరంగా వుంది. తలుపు తెరచుకుని ఎలా బయట పడను?

గదిలో ఆయుధం కోసం వెతకసాగాను. గదిలో ఏమీ వుంచలేదు రాఘవయ్య. దిగులుగా శవాన్ని చూశాను. పాపం! కాంతం! ఆమె ఎటూ చచ్చింది? నన్ను అనవసరంగా యిరికిస్తోంది.

చచ్చిపోయిన కాంతం ఏం చేయగలదు?

నా తలలో ఆలోచన తళుక్కుమంది. చటుక్కున వంగి శవం కడుపులోంచి కత్తి లాగాను. కత్తి ఎర్రగా లక్కపూసినట్టుంది. తలుపువద్దకు నడిగాను. కత్తితో తాళంవద్ద నరకసాగాను. చెక్క కొంచెం కొంచెంగా తరిగినట్టుగా అవుతోంది. తాళం చుట్టూ నరుక్కుంటూ వచ్చాను. తాళం సెట్టు వూడి వచ్చింది. తలుపు తెరచుకుంది.

ముందుగదిలో ఎవరూ లేరు.

పిట్టలు పారిపోయాయి.

గదిలోంచి బయటకు రాబోయాను. వరండాలో బూట్ల టకటకలు వినిపించాయి. వెనక్కి చూశాను. అయిదో ఫ్లాట్ ఒక మూలది కావడం వలన పారిపోవడానికి గోడలు అడ్డం వచ్చాయి.

పోలీసులు నావైపు పరుగెత్తుకు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ కుమార్ నన్ను అదుపులోకి తీసుకున్నాడు. శవాన్ని స్వాధీనం చేసుకున్నారు.

"రాఘవయ్య ఒక్కడే మద్రాసు వెళ్ళాడు. నువ్వు కాంతంమీద పగబట్టావు. మాకు నీ విషయం అయిదు నిమిషాల క్రితం ఫోన్‌లో తెలిసింది. స్టేషన్ నుండి వస్తోన్న కాంతాన్ని వెంబడించావు. వీలు దొరకగానే హత్యచేశావు" అన్నాడు కుమార్.

"అబద్ధం! ఇరవైయో నెంబర్ ఫ్లాట్‌లో మంజూ వుంది. మంజూతో కలసి రాఘవయ్య ఈ నాటకమాడాడు" అరిచాను.

నా దగ్గర ప్లాట్‌ఫాం టికట్టు దొరికింది.

కుమార్ ఇరవయ్యో నెంబర్ ఫ్లాట్‌లోకి దారితీశాడు. ఇరవైయో నెంబర్ ఫ్లాట్ పాడుపెట్టి వుంది. నాకు తల తిరిగిపోయింది. ఫ్లాట్ అసలు కొంతకాలంగా ఎవరూ లేనట్టుగా వుంది.

"బాల్కనీలో నా అడుగుజాడలూ, గదిలో మంజూ, రాఘవయ్యల వ్రేలిముద్రలూ...." అరిచాను.

వ్రేలిముద్రల నిపుణుడు పరీక్షించి పెదవి విరిచాడు.

నవ్వులపిల్లా, రాఘవయ్యా గొప్ప తెలివైనవాళ్ళు.

జైలు కటకటాలకు తల ఆన్చాను-చేయని నేరానికి! □

సీరియల్



వాణిశ్రీ
కాంచన గ్రహం

(గత సంచిక తరువాయి)

"ఐ విష్ యూ స్వీట్ డ్రీమ్స్. గుడ్‌నైట్."

తెరమీద అరుణతార నవ్వుతూ టా....టా....చెప్తూ మాయమైంది. ఆ తర్వాత తెర తెల్లగా వుండిపోయింది. అతను స్విచ్ ఆఫ్‌చేసి మళ్ళీ ఆన్ చేశాడు.

తెరమీద అరుణతార ప్రత్యక్షమయింది.

"డియర్ చైతన్యా! గుడ్ ఈవెనింగ్!"

అంతా రిపీట్ అయింది. అలాగే నాలుగయిదు సార్లు రిపీట్ చేస్తూ వుండిపోయాడు అతను.

కాలింగ్‌బెల్ మ్రోగింది.

"యస్. ఎవరు?" అన్నాడు.

"ఐ యామ్ కాథరిన్" స్పీకర్‌లో నుంచి మాటలు వినిపించాయి.

"కమిన్ ప్లీజ్!" అన్నాడు చైతన్య.

కాథరిన్ తలుపు నెట్టుకుని వచ్చింది.

"హౌ ఆర్ యు కాథరిన్?" అంటూ అతను ఆమెకు స్వాగతం చెపుతూ చెయ్యి అందించాడు.

"ఐ యామ్ ఆల్ రైట్ చైతన్యా!" అంటూ ఆమె సోఫాలో కూర్చుంది.

"అరుణతార ఎక్కడ?"

"థర్డ్ షిప్టు" అన్నాడు.

"ఏమిటి అలా వున్నావు?"

"కొంచెం అలసటగా వుంది కాథరిన్" అన్నాడు.

"నీ అలసటకు కారణం నాకు తెలుసు. ఆమె లేకపోవడమే" అంటూ గల గలా నవ్వింది కాథరిన్.

అతనూ నవ్వాడు.

కాథరిన్ నవ్వుతూ వుంటే ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి. కన్నీళ్ళు తుడుచుకుంటూ "నవ్వినా నాకు నీళ్ళు వస్తాయి" అందామె.

"కొందరికి అంతే" అన్నాడు అతను ఆమె వంక తదేకంగా చూస్తూ.

కాథరిన్ పొడుగ్గా తెల్లగా పిల్లి కళ్ళతో అందంగా వుంటుంది. ఎత్తుకు తగ్గ లావు అయింది ఈ మధ్య. ఆమెలో ఆకర్షణ యినుమడించింది. చైతన్య ఆమెలో

వచ్చిన మార్పుని గమనిస్తున్నాడు.

డార్క్ బ్లూ గౌనులో ఆమె వక్షం ఎత్తుగా కదుల్తూ అతని దృష్టిని మాటి మాటికీ ఆకర్షిస్తున్నవి. నున్నగా, వెన్న రాసినట్లుగా ఆమె తెల్లటి తొడలు మిలమిల మెరుస్తూ అతని నిగ్రహాన్ని టెస్టు చేస్తున్నాయి. రాగిరంగుజుట్టులో గోల్డ్ కలర్ గులాబీ పువ్వు ఆమె అందంతో పోటీపడు తున్నట్లుగా కనిపిస్తోంది. ఆమె నవ్వుతున్నప్పుడు వల్చటి పెదవులు, చక్కటి పలు వరస చూస్తూ అతను నిట్టూర్చాడు.

"నువ్వు కొంచెం మారినట్లు కనిపిస్తున్నావు కాథరిన్" అన్నాడు అతను మందహాసం చేస్తూ.

"అవును. ఈ మధ్య బీర్ తీసుకోవడం అలవాటు చేసుకున్నాను. రొయ్యలు, పీతలు కూడా తింటున్నాను. అందువల్ల కొంచెం వెయిట్ పెరిగింది" అంది కాథరిన్ కొంచెం సిగ్గుపడుతున్నట్లుగా తల వంచుకుని.

"అదీ సంగతి. ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది" అన్నాడు సంతోషం వ్యక్తపరుస్తూ.

"నా సంగతి కేమి! నువ్వూ కొంచెం లావయ్యావు!" అంది ఆమె.

"అవును.... అవును...." అన్నాడు అతను గొణిగినట్లుగా.

"నీ ప్రోగ్రామ్ ఏమిటి?"

"ఏమీ లేదు. గొంతు వరకూ తిని పడుకోవడం" నవ్వుతూ అన్నాడు.

"నాకు సముద్రస్నానం చేయాలని కోరిక కలిగింది. బీచ్‌కి వెళుతూవుంటే నువ్వు జ్ఞాపకం వచ్చావు" అంది.

"థాంక్స్!" అన్నాడు.

"పనేమీ లేకపోతే నాకు కంపెనీ యివ్వకూడదా?" అభ్యర్థించింది కాథరిన్.

"ఓ.కె." అన్నాడు అతను.

ఇద్దరూ కాటేజీ బయటకు వచ్చారు. రోడ్డుమీద తెల్ల కారు మిలమిల మెరుస్తూ వుంది.

కాథరిన్ డోర్ తీసి అతన్ని ఆహ్వానించింది. అతను ఎక్కి కూర్చుని డోర్ మూశాడు.

కారు రయ్ మని దూకింది. రెండువందల మైళ్ళ వేగంతో గాలిలో తేలిపోతున్నట్లుగా సముద్రతీరం వెంట వున్న రోడ్డుమీద పోతూ వుంది.

బీచ్ దూరంగా కనిపిస్తూ వుండగా కారులో టెలిఫోన్ శబ్దం చేసింది. టెలిఫోన్ ప్రక్కన తెల్లటి గ్లాస్ కర్టెన్ ఎర్రగా మారిపోయింది.

కాథరిన్ టెలిఫోన్ రిసీవర్ ఎత్తింది. ఎర్రటి కర్టెన్ మీద ఛీఫ్ కమాండర్ కనిపించాడు.

"సర్!" అంది ఆమె ఎంతో వినయంగా.

"కాథరిన్!"

"సర్!"

"సెక్యూరిటీ స్టేషన్‌కి వెంటనే వెళ్ళు."

"సర్!"

"ఉపగ్రహం ఒకటి వెయ్యి కిలోమీటర్ల పైన రౌండ్స్ తిరుగుతూ వుంది. అదింకా క్రిందకు దిగే సూచనలు కనిపిస్తున్నాయి. బహుశా మన ఐలెండ్‌ని ఫొటోలు తీసేందుకు కావచ్చు. వెంటనే దాని పని పట్టు."

"సర్!"

కాథరిన్ సడన్ బ్రేక్‌తో కారు ఆపింది.

"సారీ మిష్టర్ చైతన్యా! వెంటనే వెళ్ళాలి. ఛీఫ్

కమాండర్ సామాన్యంగా యిటువంటి సమయంలో పిలి పించరు సెక్యూరిటీ స్టేషన్లో ఆపరేటర్స్ షార్టు వున్నారేమో!" అంది.

"దట్సాల్ రైట్! ఫొటోలు తియ్యడానికి వస్తున్న శాటిలైట్ని పడగొట్టాలి. అంతే గదా! పద నేనూ వస్తాను!" అన్నాడు.

కారు బయలుదేరింది. పది నిముషాల్లో సెక్యూరిటీ స్టేషన్ చేరుకున్నారు.

రాగి రంగులో మెరుస్తున్న గోళాకారపు సెక్యూరిటీ స్పేస్ రాకెట్ సిద్ధంగా వుంది. కాథరిన్ రాగానే గార్డు ఆమె దాన్ని వుపయోగించాలని చెప్పాడు.

రాడార్ ఇండికేషన్ కోసం ఎదురు చూసింది. గంట వరకూ ఎటువంటి సమాచారం రాలేదు. తర్వాత సమాచారం వచ్చింది. ఉపగ్రహం మరొక వందమైళ్ళ క్రిందకు దిగి ప్రదక్షిణాలు చేస్తూ వుంది.

"సందేహం లేదు. అది ఫొటోల కోసం దిగుతున్న ఉపగ్రహమే" అన్నాడు చైతన్య.

"కరెక్టు!" అంది.

"చంద్రలోక యాత్ర వ్యాపారం అందర్నీ కలవర పెడుతోంది. మన ఐలాండ్ని ఫొటోలు తీసి విషయం తెలుసుకోవాలనే ఉబలాటంలో వున్నాయి అగ్రరాజ్యాలు!" అన్నాడు.

"లేకపోతే వాళ్ళ దృష్టి యిక్కడ పడేది కాదు" అంది ఆమె.

"ఇప్పటికైనా ఏం భయం లేదు. మనంత అభివృద్ధిలోకి వాళ్ళు రావాలంటే మరొక పాతికేళ్ళు గడవాలేమో?"

అన్నాడు.

ఇద్దరూ సెక్యూరిటీ రాకెట్‌లోకి ఎక్కి కూర్చున్నారు. మరుక్షణం ఒక్క కుదుపుతో ఆకాశంలోకి ఎగిరింది.

ఛీఫ్ కమాండర్ అనుమానించినట్లే అది గూఢచారి ఉపగ్రహమే. భూమికి మూడువందల కిలోమీటర్లు పైనుంచి ఫొటోలు తీస్తుంది. తిరిగి వాటిని తమ స్థావరాలకు ప్రసారం చేస్తుంది. ఆ ఫొటోలను పరిశీలించి శత్రురాజ్యాలలో ఎటువంటి కార్యకలాపాలు జరుగుతున్నాయో తెలుసుకుంటారు.

గూఢచారి ఉపగ్రహం క్రమంగా క్రిందకు దిగుతూ వున్నదనీ, యిప్పుడు ఐదువందల కిలోమీటర్లు ఎత్తున వుందనీ సెక్యూరిటీ స్టేషన్‌కి తెలియజేశారు. దాన్ని వెంటనే పేల్చివేయమని ఆదేశం వచ్చింది. మరుక్షణంలో గూఢచారి ఉపగ్రహం తునాతునకలై పోయింది.

అంతరిక్షం నుంచి భూమికి దిగివచ్చాక కాథరిన్ అంది "ఐ యామ్ సారీ చైతన్యా! నీకు చాలా శ్రమ ఇచ్చాను."

"నో....నాట్ టాల్" అన్నాడు.

"చాలా టైమయింది. పది కావొచ్చింది. ఇక ఈ రోజు సముద్ర స్నానం చేసేది లేదు" అంది.

"అయితే ఏం? పద నాకూ స్నానం చేయాలనే వుంది. ఎంతసేపు? ఒక అరగంట ఈతకొడితే ప్రాణానికి హాయిగా వుంటుంది" అన్నాడు.

తెల్ల కారు సముద్రతీరం వైపు పరుగుతీసింది.

40

సముద్ర స్నానం తర్వాత యిద్దరూ కాటేజీకి వెళ్ళారు.

"బీర్ తీసుకుంటావా?"

తల వూపింది కాథరిన్.

చైతన్య కాంటీన్ అని రాసివున్న బటన్ నొక్కాడు. తెరమీద బేరర్ నవ్వుతూ కనిపించాడు.

"హలో బేరర్. నాలుగు సీసాలు బీర్. రెండు నాన్-వెజ్ డిష్‌లు" అన్నాడు.

"యస్సార్!" అన్నాడు బేరర్.

"థాంక్స్!" అన్నాడు చైతన్య బటన్ ఆఫ్ చేసి.

కాథరిన్ వంటికి టవల్ చుట్టుకుని హీటర్ దగ్గరగా నిల్చుని తల వెంట్రుకలు ఆరబెట్టుకుంటూ వుంది.

ఆమె బలిష్టమైన పిక్కలు, నిగ నిగ లాడుతున్న తొడలు, జబ్బల కదలిక చంచలమైన కళ్ళు అతని నిగ్రహాన్ని హరిస్తున్నాయి.

'జాన్ పోయాక కాథరిన్ పాపం ఒంటరిదై పోయింది' అనుకున్నాడు. అడవి కాచిన వెన్నెల్లా ఆమె యవ్వనం వృధా అవుతున్నందుకు విచారం వేసింది.

ఇన్నేళ్ళయినా ఆమెకు నచ్చిన స్నేహితుడు యెవరూ దొరకలేదు. అందుకే ఒంటరిగా కాలం గడుపుతోంది. విచారం నుంచి తప్పుకునేందుకు ఇరవై నాలుగు గంటలూ పనిలో నిమగ్నమై పోతుంది. ఆమె సిన్సియారిటీ చూసి ప్రొఫెసర్ సైరన్ గూడా స్వయంగా ఆమెను మెచ్చుకున్నాడు. ముఖ్యమైన సెక్యూరిటీ సిబ్బందిలో ఆమెకు ముఖ్యమైన స్థానం లభించింది.

కాథరిన్ ఆ రాత్రికి అక్కడే వుండిపోయింది.

మర్నాడు—

చైతన్యకు మెలకువ వచ్చింది. కళ్ళు విప్పి చూశాడు. తెల్లవారి పోయింది. కంగారుగా లేచాడు. బెడ్‌మీద కాథరిన్ నగ్నంగా నిద్రపోతూ వుంది.

జైమ్ చూశాడు.

ఆరున్నరయింది.

ఒక అరగంటలో అరుణతార వచ్చేస్తుంది అనుకున్నాడు.

కాథరిన్‌ని నిద్ర లేపాడు. కాథరిన్ కళ్ళు తెరిచి మత్తుగా అతన్ని చూసి నవ్వింది. అతని మెడపైన చేతులూ వేసి ముఖాన్ని దగ్గరకు లాక్కుంది.

"కాథరిన్. ప్లీజ్! తార వచ్చే వేళయింది. లేచి కాల కృత్యాలు తీర్చుకో. నువ్వు ఇక్కడేవుంటే ఆమె అనుమానిస్తుంది" అన్నాడు.

"ఎంత భయం...." అని ఆమె కొంటెగా నవ్వి లేచి బాత్ రూమ్‌లోకి వెళ్ళింది.

అతను 'హమ్మయ్య' అనుకుని బెడ్‌రూమ్ తలుపులు తెరచి హాల్లోకి వెళ్ళాడు. ఒక సోఫాలో అరుణతార పడుకుని వుంది. ఆమెను చూసి షాక్ తిన్నాడు.

"ఎంత సేపైంది వచ్చి?" అడిగాడు యిబ్బందిగా చూస్తూ.

ఆమె సమాధానం చెప్పకుండా తల తిప్పుకుంది. ఆమె ముఖం ఎర్రగా మండిపోతున్నట్లు వుంది.

"చెప్పవేం?..." అన్నాడు దగ్గరగా వస్తూ.

"నాతో మాట్లాడకు...." తీవ్రంగాను కఠినంగాను వచ్చాయి మాటలు.

11

న్యూటన్ స్పేస్ పోర్ట్ చాలా చాలా హడావుడిగా వుంది.

చంద్రలోక యాత్రకు సిద్ధమై వచ్చిన యాత్రీకులు తమ 15 రోజుల ట్రైనింగ్ పూర్తిచేసి వుత్సాహంతో వున్నారు.

ప్రపంచంలోని నలుమూలల నుంచి వచ్చిన వాళ్ళయినా పది హేను రోజులు కలిసి మెలిసి వుండడంతో పరిచయాలు, స్నేహాలు ఏర్పడి పెరుకు పోగొట్టుకున్నారు. అంతా ఏభై, అరవై ఏళ్ళు దాటినవాళ్ళే.

రక రకాల వ్యాపారాలు చేస్తూ వర్షంలా వచ్చి పడు తున్న డబ్బును ఏం చేసుకోవాలో తెలియక తికమక పడే వాళ్ళే అందులో యెక్కువగా వున్నారు ఇప్పుడున్న చార్జీ తక్కువేననీ, లక్ష డాలర్లయినా ఫరవాలేదనీ కామెంట్ చేస్తున్నారు. పదిహేను రోజులపాటు గలీలి ఐలాండ్ లో చేసిన అతిథి మర్యాదలు ప్రపంచంలో ఏ స్టార్ హోటలు వాళ్ళూ సమకూర్చలేవని కొందరు మెచ్చుకున్నారు.

విశాలమైన న్యూటన్ స్పేస్‌పోర్టులో ఆఫీసు భవనాలకు దూరంగా రెండు ఫర్లాంగుల దూరంలో వున్నత శిఖరంలా, ఎత్తుగా వెండికొండలా నిలబడి వుంది స్పేస్ బస్. దాదాపు అరవై అడుగుల ఎత్తుగా కాస్త కళ్ళు మసకగా వున్న వాళ్ళకు అదొక మేడలా కనిపిస్తూ వుంది. 'సిలీని సూపర్ స్పేస్ బస్' అనే అక్షరాలు ఎర్రగా కెంపుల్లాగా మెరుస్తు న్నాయి. ఆ అక్షరాలు బస్ పొడుగ్గా పేర్చి వెలుగుతూ ఆరుతూ వున్నాయి.

అందులో యెక్కి కూర్చుని యెప్పుడెప్పుడు చంద్రుడి మీద దిగుతామా? అని ప్రయాణీకులు ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు.

మైక్ లో ప్రయాణీకులకు హెచ్చరికలు వినిపిస్తున్నాయి. బస్ ఎక్కబోయే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తూ వుంది ఒక తియ్యని కంఠం గల అమ్మాయి.

ప్రయాణీకులు టెన్షన్ ఫీలవుతూ వున్నారు. చంద్రలోక యాత్ర అనుభవం ఎలా వుంటుందో అనుకుంటూ తన్మ

యత్వంలో మునిగి వున్నారు.

స్పేస్‌పోర్టు సిబ్బంది హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

గోవిందరాయుడు మాత్రం ఒంటరిగా ఒక సోఫాలో కూర్చుని దిక్కులు చూస్తున్నాడు. అతను యెవరితోనూ కలవడం లేదు. అతని కళ్ళు అరుణతార కోసం వెతుకుతున్నాయి.

పదిహేను రోజుల్నుంచి అతను అరుణతార, చైతన్యలు కనిపిస్తారేమో నని ప్రతిక్షణం యెదురు చూశాడు. ఐలెండ్‌లో యెవరు కనిపించినా వాళ్ళేమో నని అనిపించేది.

అరుణతార, చైతన్యల గురించి కొందర్ని అడిగి చూశాడు. ఎవరూ సమాధానం చెప్పలేదు. ఇక్కడ సిబ్బంది గురించి యెవరూ యెంక్వయిరీ చెయ్యగూడదని ఒక అమ్మాయి చెప్పింది. నువ్వేమైనా విదేశీ గూఢచారివా? అని గూడా అడిగింది.

పదిహేనురోజుల అనుభవంలో అతనికి ఒక సంగతి తెలిసింది. ఇక్కడ వున్నవాళ్ళంతా చాలా క్రమశిక్షణతో మెలుగుతున్నారని: వాళ్ళు యే ప్రశ్నకూ సమాధానం చెప్పరు.

గోవిందరాయుడు నిరాశతో నిట్టూర్చాడు. తన కూతురు కనిపిస్తుందనే ఆశ సన్నగిల్లింది. తను అనవసరంగా శ్రమ పడుతున్నాడు గాని వాళ్ళు ఇక్కడ వుంటారని నమ్మకం ఏముంది? అనుకున్నాడు.

స్పేస్‌బస్ బయల్దేరే సమయం దగ్గర పడింది. ఒక అరగంటలో బయల్దేరుతుందని మైక్‌లో వినపడింది. ప్రయాణీకుల్లో కోలాహలం హెచ్చింది.

బస్ దగ్గరకు చేర వెయ్యడానికి రెండు తెల్లటి వ్యాన్‌లు వచ్చి ఆగాయి. అంతా ఎక్కి కూర్చున్నారు. ఒక్క వూపులో వ్యాన్‌లు సూపర్ స్పేస్ బస్ దగ్గర ఆగాయి.

అప్సరసల్లా వున్న ఇద్దరు అమ్మాయిలు ప్రయాణీకులకు స్వాగతం చెప్పారు. మొత్తం వందమంది. ఒక్కొక్కరికీ ఒక్కొక్క నెంబర్ వుంది. మిష్టర్ వన్, టూ, త్రీ అని పిలుస్తుంటే ప్రయాణీకులు క్యూలో నిల్చుని బస్‌లోకి ప్రవేశిస్తున్నారు.

బస్సులో చల్లగా ఏ.సి. థియేటర్లోకి ప్రవేశించినట్లుగా వుంది. మొత్తం నాలుగు అంతస్థులు వున్నాయి. ఒక్కొక్క అంతస్థులో ఇరవైఅయిదు సీట్లు. వాటకి నెంబర్లు వేశారు. సీటు విశాలంగా మెత్త కుషన్‌తో చేయబడింది. కూర్చోవడానికి, అవసరమైతే పడుకుని నిద్ర పోవడానికి వీలుగా వుంది.

గోడలకు రాక్స్, వాటి నిండా పుస్తకాలు, మాగ్జయిన్స్ పేర్చి వున్నాయి. కూర్చున్న వాళ్ళందరికీ కనిపించేటట్లుగా టెలివిజన్ సెట్ వుంది.

"జంటిల్‌మెన్! మరొక పది నిముషాల్లో సూపర్ స్పేస్ స్పేస్ బస్ బయల్దేరుతుంది. దయచేసి మీ సీట్లకు అమర్చిన బెల్టులు బిగించి కట్టుకోండి. స్టార్టింగ్‌లో జాగ్రత్త అవసరం. బస్ బయల్దేరిన తర్వాత బెల్టు విప్పి ఫ్రీగా వుండవచ్చును."

స్పీకర్‌లో నుంచి వచ్చిన హెచ్చరికను పాటించి అంతా తమ నడుములకు బెల్టులు బిగించుకున్నారు. బస్ తలుపులు పెద్ద శబ్దంచేస్తూ మూసుకున్నాయి. తెల్లటి వెలుగు మాయమై చీకటి ముసురుకుంది.

"కంగారు పడకండి. బస్ బయల్దేరేటప్పుడు లైట్లు ఆర్పివేశాము" స్పీకర్‌లో నుంచి వివరణ వచ్చింది.

మరుక్షణంలో ఒక పెద్ద కుదుపు. సీట్లు కదిలిపోయిన ట్లనిపించింది. బైట పెద్ద ప్రేలుడు సంభవించి పెద్ద ధ్వని వినిపించినా లోపల కూర్చున్నవాళ్ళకి మామూలుగా వినిపించింది. లోపల వాతావరణం ప్రెషరైజ్ చేసి వుండడం, సౌండ్‌ప్రూఫ్, వల్ల బైట ప్రపంచంతో సంబంధం లేకుండా వుంది.

కొంచెం సేపటికి లైట్లు వెలిగాయి. సన్నగా ఏదో ఇంజన్ నడుస్తున్నట్లు మాత్రమే శబ్దం వస్తోంది. స్పేస్ బస్ బయల్దేరిందా లేదా? అనే విషయం ప్రయాణీకులకు యిదమిద్ధంగా తెలియడంలేదు. ప్రక్కవాళ్ళతో డిస్కస్ చేశారు. కాని యెవరూ చెప్పలేక పోతున్నారు ఆ విషయం.

"మన స్పేస్‌బస్ బయల్దేరింది. ఇప్పుడు మనం భూమి నుంచి బయల్దేరి వందమైళ్ళు ప్రయాణం చేశాం. గంటకు మూడువేల మైళ్ళ వేగంతో అంతరిక్షంలో ప్రయాణం చేస్తున్నాం.

అంతరిక్షయానం చేస్తున్న అదృష్టవంతులు మీరు. ఈ ప్రయాణంలో సుందరమైన, రమణీయమైన, మామూలు మానవులకు కలలో గూడా వూహించలేని అరుదైన దృశ్యాలను మీరు అవలోకించబోతున్నారు.

మీ సౌకర్యం కోసం గ్లాస్ డెక్‌లు నిర్మించబడి వున్నాయి. నిర్భయంగా వెళ్ళి అద్భుతమైన ప్రకృతి అందాలను చూడండి. మీకు కనిపించే దృశ్యాలను వివరిస్తూ కామెంటరీ గూడా ప్రసారం చేస్తున్నాం...." స్పీకర్ లోంచి వినిపిస్తోంది.

ప్రయాణీకులు సీట్లలో నుంచి లేచి ఒక్కొక్కరే గ్లాస్ డెక్ పై కెళ్ళి నిల్చున్నారు.

కాళ్ళు నొప్పులు పుడుతున్నా వాళ్ళు గంటలకొద్దీ గ్లాస్ డెక్ పైకి వెళ్ళి నిల్చుని అంతరిక్షంలో విహరిస్తున్న అను భూతి పొందుతున్నారు.

స్పేస్‌బస్ విశ్వాంతరాళంలోకి చొచ్చుకొని పోతున్నది. భూమికి కొన్ని వేలమైళ్ళ దూరం వెళ్ళింది. అక్కడ్నుంచి చూస్తే భూమి నారింజపండు రంగులో మిలమిల మెరిసి పోతున్నది. ఆ సుందర, అద్భుత దృశ్యాన్ని కళ్ళార్ప కుండా చూస్తున్నారు ప్రయాణీకులు.

కామెంటరీ తియ్యగా చెవులకు సోకుతూ వుంది.

"మనం జన్మించిన భూగోళం మీరు కళ్ళారా చూసి ఆనందిస్తున్నారు. ఎంత అందంగా, సుందరంగా అద్భు తంగా కనిపిస్తున్నదో చూస్తున్నారు గదా!

కాని భూగోళం గురించి మీరేమి తెలుసుకున్నారు! ఎవరూ తెలుసుకుని వుండరు. ఏమైనా తెలుసుకుని వుంటే మా ఐలెండ్‌లోనే తెలుసుకుని వుంటారు.

నిత్యమూ మన కాళ్ళ క్రిందే వుంటుంది గనుక భూమి అంటే మనకు చులకన, ఆకాశంలో వుంటుంది గనుక చంద్రుడు అంటే ఆరాధన. దూరపు కొండలు నునుపు అంటారు. నిజమే. చంద్రుడి కంటే భూమి ఎన్నో రెట్లు అద్భుతమైన గ్రహం.

సూర్యుడి కుటుంబంలో భూమి మూడో గ్రహం. భూమి పుట్టి 450 కోట్ల సంవత్సరాలు అని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు.

కొన్ని వేల సంవత్సరాల క్రితం భూమి బల్లపరుపుగా వుందని కొందరూ, గుండ్రంగా వుందని కొందరూ

వాదోపవాదాలు చేసుకునేవారు. తర్వాత గోళాకారం అని నిర్ధారణ అయిందన్న విషయం మీకు తెలిసిందే. ఇప్పుడు మనకు ఏమాత్రం సందేహం లేదు. అదుగో భూమి మీకు కనువిందు చేస్తూ గోళాకారంలో మెరిసిపోతూ వుంది. దాని చుట్టుకొలత 21,897 మైళ్ళు.

ఇప్పుడు మనకి కనిపిస్తున్న భూమి కదలకుండా నిశ్చలంగా వున్నట్లు మీరు గమనిస్తున్నారు. కాని అది తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నది. భూమి తనచుట్టూ తాను తిరగడంవల్లనే మనకు రాత్రి, పగలు కలుగుతున్నాయి. లేకపోతే భూమికి ఎప్పుడూ ఒక వైపు పగలు, మరొకవైపు రాత్రి వుండేవి.

భూమి పడమటి నుంచి తూర్పుకు తిరుగుతున్నది. అందుకే సూర్య, చంద్రులు తూర్పున వుదయించి పడమట అస్తమిస్తున్నట్లు మనకు కనిపిస్తున్నది. భూమి తనచుట్టూ తను ఎంత వేగంతో తిరుగుతూ సూర్యునిచుట్టూ పరిభ్రమిస్తున్నది అంటే సెకండుకి 18½ మైళ్ళ వేగంతో. దాని కక్ష్య పొడవు 58 కోట్ల 37 లక్షల 25 వేల 765 మైళ్ళు. అదే ఒక సంవత్సర కాలం.

భూమి ఏ ఆధారం లేకుండా బంతిలా మనకు కనిపిస్తున్నది కదా? అది యెలా వుండగలిగింది? ఆ మాటకు వస్తే భూమి మాత్రమే కాదు, చంద్రుడు, సూర్యుడు కోటానుకోట్ల నక్షత్రాలు గూడా ఏ ఆధారం లేకుండా నిలబడి వున్నాయి. దీనికి కారణం యేమిటి? దీనికి కారణం వాటిల్లో వుండే అయస్కాంత శక్తి అని చెప్తున్నారు శాస్త్రజ్ఞులు.

ఇప్పుడు ముఖ్యంగా తెలుసుకోవలసింది ఏమిటంటే మీరు చంద్రలోకాన్ని సందర్శించబోతున్నారు. అక్కడ మీరు కనీసం వారం రోజులు గడుపుతారు కాబట్టి భూమికి,

చంద్రుడికి తేడా ఏమిటి? అనేది తెలుసుకోవాలి. లేకపోతే మీకు అంతా అయోమయంగా వుంటుంది.

మీరు చాలా ఆశ్చర్యపోతున్నారని మాకు తెలుసు! ఎందుకంటే మీకు కనిపించే ఆకాశం అంతా నల్లగా వుంది. అసలు ఆకాశానికి రంగు లేదనే సంగతి మీకు తెలీదు. మరి మనం భూమిమీద వున్నప్పుడు ఆకాశం నీలంగా కన్పించేది గదా అని మీకు సందేహం కలుగుతోంది కదూ! అదే మీ రిప్పుడు తెలుసుకోబోతున్నారు.

భూమిచుట్టూ షుమారు వెయ్యి మైళ్ళ ఎత్తు వరకూ వాతావరణం ఆవరించుకుని వుంది. వాతావరణం అంటే వాయువులు. అందువల్లనే మనం భూమిమీద జీవిస్తున్నాం. భూమి నుంచి ఎత్తుకు పోయేకొలదీ ప్రాణవాయువు తగ్గి పోతుంది.

అందుకే హిమాలయ పర్వతాల వంటివి ఎక్కేటప్పుడు మనుషులు ఆక్సిజన్ మాస్కులు తగిలించుకుంటారు. లేక పోతే వూపిరాడక చనిపోయే ప్రమాదం వుంది. ఎత్తుకు పోయేకొద్దీ గాలి పల్చగా వుంటుంది.

భూమికి గల వాతావరణం మొత్తంలో 75 వంతులు తొమ్మిదిమైళ్ళ లోపునే వుంది. దీనిని ట్రోపోస్ఫియర్ అంటారు. ఇందులోనే మేఘాలు తిరుగుతుంటాయి. తుఫా నులు వచ్చేది ఇందులోనే. అది దాటితే మేఘాలు, తుఫా నులు యేమీ వుండవు.

ఆ వాతావరణంవల్లనే మనకు ఆకాశం నీలం రంగులో కనిపిస్తుంది, సంధ్యాసమయంలో పంచరంగుల దృశ్యాలు చూడగలుగుతున్నాము. పట్టపగలు మనకు నక్షత్రాలు కన్పించనిది గూడా ఈ వాతావరణం వల్లనే.

సూర్యుడు మీకు కనిపిస్తూనే వున్నాడు. అయినా అశేష

మైన నక్షత్రాలను మీరు చూస్తూనే వున్నారు. సంపూర్ణ సూర్యగ్రహణంనాడు మాత్రం అదీ సూర్యుడుదాక్కున్నంత సేపు కొన్ని నక్షత్రాలు మనం చూడగలుగుతాము. కాని ఇక్కడః అటు సూర్యుడు ధగ ధగ ప్రకాశిస్తున్నాడు. ఆకాశం నిండా నక్షత్రాలు మీరు చూడగలుగుతున్నారు.

డియర్ జంటిల్‌మెన్. మీరు యెంతో అదృష్టవంతులు. కాబట్టే ఈ అద్భుతమైన అరుదైన దృశ్యాలను అవలోకించ గలుగుతున్నారు. దీనికి కారణం యిక్కడ యెటువంటి వాతావరణం లేకపోవడమే. మనచుట్టూ శూన్యం ఆవరించు కొని వుంది. యెవరయినా పొరపాటున తలుపు తెరుచు కొని వెళ్తే ఒక క్షణంలో వూపిరాడక చనిపోవడం ఖాయం.

భూమి ఉపరితలాన్ని ఆవరించుకుని వున్న వాతావరణం చంద్రుడి పైన లేదు. భూమికి చంద్రుడికి ముఖ్యమయిన తేడా అదే. అక్కడ వాతావరణం లేకపోతే మనం వెళ్ళి ఎలా జీవిస్తాం - అని సందేహపడకండి. మన సైంటిస్టులు అద్భుతమయిన వాతావరణం మన కోసం సృష్టించారు. మనదే ఆలస్యం మరి...."

42

పిలీని సూపర్ స్పేస్ బస్ నెమ్మదిగా దిగసాగింది.

ప్రయాణీకులు గ్లాస్ డెక్‌లో నిల్చుని కళ్ళార్పకుండా చూస్తున్నారు. కొంతసేపు నల్లటి మబ్బుపొర తప్ప ఏమీ కనిపించలేదు. దాదాపు రెండు మైళ్ళ మందపు నల్లమబ్బు పొరను చీల్చుకుని స్పేస్ బస్ చంద్రుడిపై దిగడానికి సిద్ధ పడింది.

మబ్బుపొరలో నుంచి బయటపడిన తర్వాత ప్రయాణీ కుల కళ్ళు మిరిమిట్లు గొల్పుతూ సైరన్ మూన్ సిటీ

ప్రత్యక్షమయింది.

దాదాపు వెయ్యి అడుగుల ఎత్తయిన కొండమీద రంగు రంగుల నియోన్ లైట్లతో 'సైరన్ మూన్ సిటీ' అనే అక్షరాలు మెరుస్తూ కనిపించాయి. స్పేస్ బస్ నెమ్మదిగా జారుతున్నట్లు దిగుతూ ఒక పెద్ద కుదుపుతో ఆగింది.

ప్రయాణీకులు సంతోషంతో బిలబిలమంటూ బస్సులో నుంచి దిగారు. మెట్లపై నుంచి దిగుతున్న వారికి తెల్లటి గౌన్లు వేసుకున్న దేవకన్యల్లాంటి అందమయిన యువతులు స్వాగతం చెప్పారు. ప్రయాణం యెలా జరిగింది? మీరు ప్రయాణంలో యెలాంటి అనుభూతి పొందారు? అంటూ కుశల ప్రశ్నలు వేశారు.

చుట్టూ కొండలు, యెటు చూసినా నల్లగా మెరుస్తూ కోట కోడల్లా కనిపిస్తున్న పర్వతశ్రేణి. ఆ లోయలో బొమ్మరిల్లులా తీర్చిదిద్దినట్లు కట్టిన భవంతులలో అందంగా కనిపిస్తోంది చంద్రలోక నగరం.

ఆకాశంలో చంద్రుడి కన్న రెట్టింపు సైజులో ధగధగ మెరిసిపోతున్న పూర్ణబింబం చూస్తూ తన్మయులై పోయారు అంతా.

"అదేమిటి శుక్ర గ్రహమా?" అని యెవరో అడిగారు.

ఒక అమ్మాయి నవ్వుతూ, "సార్! అది మన మాతృ గ్రహం. భూమి" అంది నవ్వుతూ.

అంతా షాక్ తిన్న వాళ్ళలా నివ్వెరపోయారు.

"మనం భూమి నుంచి పైకి చంద్రుడిమీదకు వచ్చాం గదా! భూమి మన క్రింద వుండాల్సింది, పైకి యెలా వచ్చింది?" ఎవరో అడిగారు.

ఆమె కిల కిలా నవ్వింది.

"సార్! భూమిపై మనం వున్నంత సేపే క్రిందా

పైనా అనే భేదం. ఆకాశంలోకి వచ్చాక ఆ భేదం లేదు. మనం భూమిమీద వున్నప్పుడు చంద్రుడు వెన్నెల ప్రసాదిస్తాడు. చంద్రుడి పైన భూమినుంచి కాంతి వచ్చి ఇక్కడ వెలుగు నింపుతుంది'' అంది ఆమె.

కొంచెంసేపు భూమి పూర్ణబింబంవైపు తనివితీరా చూస్తూ కబుర్లు చెప్పుకున్నారు భూమిమీద చంద్రకాంతి కన్నా, చంద్రుడిపైన భూమి కాంతి ఎంతో వెలుగు నిస్తోంది. వెండి కిరణాల్లా వచ్చి పడుతున్నాయి. ట్యూబ్ లైటు వెలుగులా వుంది.

ఆ వెలుగులో కొందరు పుస్తకాలు తీసి చదవసాగారు. అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"అబ్బ ఎంత కాంతి? భూమి మీద చంద్రకాంతిలో ఇంత వెలుగు వుండదు ఎందుకని?'' ఒకాయన సందేహం వ్యక్తపరిచాడు.

గైడ్‌లా పని చేస్తున్న అమ్మాయి అతని సందేహం తీర్చింది.

"సూర్యుడి నుంచి వచ్చే కాంతిలో నూటికి 93 వంతులు చంద్రగోళం విలీనం చేసుకుని 7 వంతుల కాంతిని మాత్రమే ప్రతిఫలిస్తుంది. చంద్రుడిలో సముద్రాలు లేనందువల్ల సూర్యకాంతిని ఎక్కువగా ప్రతిఫలింప చేయలేదు. భూమి మీద ఎక్కువ భాగం సముద్రమే. సముద్రం అద్దంలా పనిచేసి సూర్యకాంతిని ప్రతిఫలిస్తున్నది. అందుకే భూమి నుంచి ఎక్కువ వెలుగు వస్తోంది.''

దూరంగా కొండల మీద కరెంట్ సరఫరా చేసే ఎత్తైన టవర్స్, అక్కడక్కడా కనిపిస్తూ ఆకాశంలోకి దూసుకుని పోయిన గొట్టాలు కనిపిస్తున్నాయి.

"అవి ఏమిటి? ఏవైనా ఫ్యాక్టరీలా?''

"కాదు. అవి ఎట్మాస్ఫియర్ కంట్రోల్ టవర్స్. చంద్రుడిపైన వాతావరణం లేని విషయం మీకు తెలిసిందే గదా! ఆ టవర్స్‌లో నుంచి వాయువులు వెలువడుతూ వుంటాయి. ఇక్కడ మనం జీవించడానికి కావలసిన వాతావరణం అవి సృష్టిస్తుంటాయి. ఈ విశాలమైన లోయ రెండువందల మైళ్ళు వుంటుంది. ప్రస్తుతం ఈ పరిధిలోనే వాతావరణం సృష్టించబడింది. అది దాటితే మనం వూపిరి ఆడక వెంటనే మరణిస్తాం."

గైడ్ చెప్పిందంతా శ్రద్ధగా విన్నారు.

"సార్! మీ కోసం బస్సులు రెడీగా వున్నాయి. డిన్నర్ తీసుకుని విశ్రాంతి పొందండి. మొత్తం 170 గంటలు మీ రిక్కడ గడపడానికి వీలుంది. ప్రస్తుతం ఐదుగంటల తర్వాత మీకు యిక్కడ చూడవలసిన ప్రదేశాలకు వెళ్ళే ఏర్పాట్లు చేస్తాం."

"170 గంటలు ఏమిటి?....వారం రోజులు గదా!"

"ఎలాగైనా ఒకటే!" అని చెప్పింది గైడ్.

బస్సుల్లో ఎక్కాక బయల్దేరాయి. విశాలమైన రోడ్ల ప్రక్కన కూరగాయల తోటలు, పొలాలు, కనిపిస్తున్నాయి.

ప్రయాణీకుల మనస్సులో ఎన్నో సందేహాలు తలెత్తుతున్నాయి. చంద్రుడిలో నీళ్ళులేవు గదా! వీటికి యెలా నీరు పెడుతున్నారు? ఎలా జీవిస్తున్నాయి? వగైరా!

హేలీ డయానా హోటల్ మూడంతస్తుల మేడ రెండు వందల గదులున్నాయి. అతిథు లందరికీ తలా ఒక గది ఏర్పాటు చేశారు. రూమ్‌లో అన్ని సౌకర్యాలు వున్నాయి. ఎయిర్ కండిషన్ చేయబడింది. అన్ని గదుల్లో టెలిఫోన్లు, టెలివిజన్స్ వున్నాయి. కాలింగ్ బెల్ నొక్కగానే తెల్లటి

యూనిఫారంలో మెరుపు తీగల్లాంటి అమ్మాయి ప్రత్యక్ష మౌతుంది. డైనింగ్ హాల్లోను, సెలూన్‌లోను గూడా అమ్మాయిలే సర్వీస్ చేస్తున్నారు.

"చంద్రలోకంలో అంతా అమ్మాయిలే కనిపిస్తున్నారే. మగవాళ్ళు లేరా?" అని ఒక పెద్ద మనిషి జోక్ చేశాడు డైనింగ్ హాల్లో.

"మగవాళ్ళు లేకేమి? వున్నారు. వాళ్ళంతా ఎగ్జిక్యూషన్ వర్కుల్లో వుంటారు. ముఖ్యంగా ఫ్యాక్టరీలలో వుంటారు. ఆఫీసుల్లోను, హోటల్, థియేటర్స్, హాస్పిటల్లోఆడవాళ్ళు పని చేస్తున్నారు" అన్నది సర్వ్ చేస్తున్న అమ్మాయి.

"ఇక్కడ ఫ్యాక్టరీలు గూడా వున్నాయా?" ఆశ్చర్య పోతూ ప్రశ్నించాడు ఒకాయన.

"లేకపోతే ఎలా? బిల్డింగ్స్ కట్టడానికి సిమెంట్ పేస్ట్ ఫ్యాక్టరీ, కరెంట్ వుత్పత్తికి సోలార్ థర్మల్ స్టేషన్, పవర్ డిస్ట్రిబ్యూషన్ సెంటరు, స్టీల్ ఫ్యాక్టరీ, ఆయిల్ రిఫైనరీస్....అన్నీ వున్నాయి."

అంతా ఆశ్చర్యపోతూ విన్నారు.

తర్వాత తమ తమ గదుల్లోకి వెళ్ళి నిద్రకు వుపక్ర మించారు. మూడు రోజుల ప్రయాణంలో సరిగా నిద్ర పట్టలేదు. మర్నాడు కలుద్దాం అని గుడ్‌నైట్ చెప్పు కున్నారు.

43

గోవిందరాయుడికి మెలకువ వచ్చింది.

చేతి వాచీవంక చూసుకున్నాడు.

మంగళవారం. ఉదయం ఏడు గంటలు చూపిస్తోంది. తేదీ సెప్టెంబర్ 19.

భూలోకంలో స్పేస్‌బస్ సెప్టెంబర్ 15న రాత్రి బయ

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 48: నీరజ, నర్మద లిద్దరూ కలిసి అయిదు వేల రూపాయలు వాసంతి దగ్గర అప్పుచేశారు. నీరజ, నర్మద లకు పద్మావతి హామీదారుగా ఉంది. ఈ ముగ్గురూ కలిసి ప్రామిసరీ నోటు వ్రాశారు. ఆ డబ్బులో నీరజ, మూడు వేలు, నర్మద రెండువేలు తీసుకున్నారు.

కొంత కాలమయాక నర్మద ఒక ఆక్సిడెంట్‌లో చని పోయింది. అప్పు మొత్తం వాసంతి, నీరజ దగ్గర వసూలు చేసింది.

నీరజ తర్వాత, నర్మద వంతు డబ్బును హామీదారుగా ఉన్న పద్మావతిని చెల్లించమని కోరింది. పద్మావతి అందుకు నిరాక రించటంతో కోర్టు కెక్కింది నీరజ

మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-9-'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమ మైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు నవంబరు '82 నెల సంచికలో చూడండి.—ఎడిటర్]

కేసు నెం. 46 (తీర్పు)

అనంతరావు నియామకం చెల్లదు.

కంపెనీ డైరెక్టర్ల నియామకం అసంబద్ధమైనపుడు వారిచేత నియమించబడ్డ అనంతరావు నియామకం కూడా అసంబద్ధమే అవుతుంది. అతని ఉద్యోగపు కాంట్రాక్టు చెల్లదు. అయితే అతను ఉద్యోగంలో వున్నన్ని రోజులకు మాత్రం జీతం లభి స్తుంది.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ తొంటెపు గౌరీ శంకర రావు, బి. కాం., c/o తొంటెపు సత్యనారాయణ మూర్తి, 7-30-21, మెయిన్ రోడ్, రాజమండ్రి-1.

ద్దేరి 18 వ తేదీ రాత్రి చంద్రలోకం చేరింది. డిన్నర్ తీసు కుని నిద్రపోయేసరికి పదిన్నర దాటింది.

చంద్రలోకంలో చూడవలసిన ప్రదేశాలు చూడడానికి తొమ్మిదింటికి సిద్ధంగా వుండవలసిందికా గైడ్ చెప్పింది.

గోవిందరాయుడు బెడ్‌పై నుంచి లేచాడు. కిటికీ బోట్లులు తీసి తెరలు తొలగించాడు. అంతా చీకటిగా వుంది. తెల్లవారిన సూచనలేవీ కానరాలేదు.

హోటల్ వరండాలో జనం తిరుగుతోన్న చప్పుడు, మాటలు వినివిస్తున్నాయి. ఏడు దాటినా తెల్లవారక పోవడం ఏమిటి? సూర్యోదయం యెందుకు కాలేదు? అను కుంటూ అతను రూం తలుపులు తీసుకుని వరండాలోకి వచ్చాడు.

అక్కడ ప్రక్కరూముల వాళ్ళు కుర్చీలలో కూర్చుని టీ, కాఫీ సేవిస్తూ, సిగిరెట్లు కాలుస్తూ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

గోవిందరాయుడు వచ్చి "గుడ్‌మానింగ్ జంటిల్ మెన్" అన్నాడు నవ్వుతూ.

"గుడ్ మానింగ్....ప్లీజ్ టేక్ యువర్ సీట్" అంటూ అతన్ని ఆహ్వానించారు.

"సర్! వాడ్డూయూ వాంట్" అంటూ ఒకమ్మాయి వచ్చి అడిగింది.

అతను 'టీ' తెమ్మన్నాడు.

"ఇంకా తెల్లవారలేదేమిటి? ఏడు దాటుతోంది. చంద్ర లోకంలో సూర్యుడు లేటుగా ఉదయిస్తాడా?" అని గోవిందరాయుడు అక్కడున్న వాళ్ళని అడిగాడు.

అక్కడున్న వాళ్ళు నవ్వారు.

"మేమూ అలాగే అనుకున్నాం. కాని యిక్కడ

అపరాధ పరిశోధన పోటీ-170

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-9-82 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవంబరు '82 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. దేశంలో వీటికోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది—?

(ఆర్థిక నేరాలకు, మహిళలపై అత్యాచారాలకు)

2. తెలంగాణా గ్రామీణులలో ఇది కూడా ఒక ముఖ్యమైన పండుగ—?

(బోనాలు, బతుకమ్మ)

3. ఇది త్రాగటం ఆరోగ్యానికి హానికరమంటారు—?

(పొగ, మత్తుపానీయాలు)

4. కొందరికి ఇది అలవాటు....పరులకు అది గ్రహపాటు—?

(నోటిదురుసు, అధికారదర్పం)

5. ఇప్పటి తరం వారిలో ఇది లోపించింది—?

(ముందుచూపు, మంచితనం)

సూర్యుడు రెండు వారాల కొకసారి ఉదయించి వుండి పోతాడట."

గోవిందరాయుడుకి నోటివెంట మాటరాలేదు.

"అవును జంటిల్‌మాన్. చంద్రలోకంలో పద్నాలుగు రోజులు పగలు, పద్నాలుగు రోజులు రాత్రి. మన ఇరవై ఎనిమిది రోజులు యిక్కడొక రోజు."

అదంతా విని అతనికి మతిపోయింది.

ఆకాశంలో భూమి రాత్రి తనకు కనిపించిన చోటే దివ్యంగా ప్రకాశిస్తోంచి.

సప్లయర్ అమ్మాయి టీ కప్పు తెచ్చి ఇచ్చేవరకూ అతను భూమిని చూస్తూ వుండిపోయాడు. తర్వాత 'టీ' గుటకలు వేస్తూ కూర్చున్నాడు.

స్పీకర్‌లోంచి 'ఎనౌన్స్‌మెంట్ ప్లీజ్' అంటూ మాటలు వినిపించాయి.

'జంటిల్‌మెన్! సైరన్ మూన్ సిటీలో కొంత భాగం ఈ రోజు మీరు సందర్శించటానికి ఏర్పాట్లు జరిగాయి. కాని మొదట చెప్పినట్లుగా తొమ్మిది గంటలకు కాదు. పదిన్నరకు. అంతా బ్రేక్‌ఫాస్ట్ చేసి సిద్ధంగా వుండమని మనవి. ఈ రోజు ఎనిమిది గంటల నుంచి పదిగంటల వరకూ వర్షం కురవవలసిన షెడ్యూల్ వుంది కాబట్టి ఈ స్వల్పమైన మార్పు జరిగింది.'

స్పీకర్‌లో రెండు, మూడుసార్లు ఇదే ఎనౌన్స్‌మెంటు వచ్చింది.

"ఎనిమిదింటికి వర్షం కురుస్తుందని ఈమె ముందే చెప్తుందేమిటి? వాన రాకడ ప్రాణం పోకడ ఎవరికి తెలుసు?" అన్నాడు గోవిందరాయుడు.

"అదంతా భూలోకంలో. ఇక్కడ కాదు. వీళ్ళు కృత్రి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు.100-00 లు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—9—'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్ల కాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు నగదు బహుమతితోపాటు, ఐదు నెలలు పత్రికను కూడా పంపుతాము. ఫలితాలు నవంబరు '82 నెల సంచికలో చూడండి.

జూలై '82 పోటీ ఫలితాలు

(1) జూలై '82 నెల "అపరాధపరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

కళ్ళెం లేని గుఱ్ఱం!
అదుపు లేని యవ్వనం!!

పంపినవారు: శ్రీమతి ఏ. వీ. సుబ్బలక్ష్మి, 1-8-499/2, చిక్కడపల్లి. హైదరాబాదు-500 020.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఆగింది ఎవరి కోసం?
తీసేది ఎవరి ప్రాణం?

పంపినవారు: శ్రీ బి. రాజేశ్వరమూర్తి. బి. ఏ., బి. కాం. కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్, 20/34, నరసింహా నగర్, మచిలీపట్టణం-521 002.

మంగా కురిపిస్తారు వర్షం" ప్రక్కగది అతను చెప్పాడు.

"ఓహో, అలాగా!" అన్నాడు గోవిందరాయుడు.

టీ త్రాగాక రూమ్‌లోకి వెళ్ళి బాత్‌రూమ్‌లో కాల కృత్యాలు తీర్చుకుని స్నానంచేసి డ్రెస్ చేసుకున్నాడు. బెల్ కొట్టగానే రూమ్ గరల్ వచ్చింది బ్రేక్‌ఫాస్ట్ తెమ్మన్నాడు. క్షణాలలో బ్రేక్‌ఫాస్ట్ అరేంజ్ చేసింది.

సరిగ్గా ఎనిమిదింటికి అకాశంలో రెండు విమానాలు చప్పుడు చేశాయి. కొన్ని క్షణాలలో వాతావరణం మారిపోయింది. మబ్బు దట్టంగా క్రమ్ముకుంది. భూమి కనిపించకుండా పోయింది. ఉరుములు మెరుపులు ఆ తర్వాత కుండపోతగా వర్షం అచ్చు భూలోకంలో లాగానే.

భూలోకవాసులు వర్షం పడుతున్నంతసేపూ గుడ్లప్పగించి చూస్తూ హోటల్ వరండాలోనే కాలక్షేపం చేశారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వర్షం! చలిగాలులు. ఎంత హాయి. ఈ లోకంలోనే వుండిపోతే బాగుండునే అనుకున్నారు కొందరు.

రూమ్ గరల్ దూరంగా నిల్చుని వుంది.

గోవిందరాయుడు ఆమెను పిలిచాడు రమ్మని.

"సార్! ఏం కావాలి?" అంటూ వచ్చింది.

"నీ పేరేమిటి?"

"సోఫియా!"

"నీకు పెళ్ళయిందా?"

"ఊఁ...." కొంచెం సిగ్గుపడింది ఆమె.

"నీ భర్త ఏం చేస్తాడు?"

"సిమెంట్ పేస్ట్ ఫ్యాక్టరీలో పని." అన్నది.

"సిమెంట్ పేస్ట్ ఏమిటి?"

"ఇక్కడ అంతే. భూలోకంలోలా పొడిగా వుండదు.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి !

టూత్ పేస్ట్‌లా ట్యూబ్స్‌లో ప్యాక్ చేస్తారు. దీనికి నీళ్ళు కలప నవసరంలేదు. రాయికి రాయికీ మధ్య అతికిస్తారు. కొన్ని వేల సంవత్సరాలయినా ఆ అతుకు వూడదు. ఇక్కడ భవనాలన్నీ పిమెంట్ పేస్టుతోనే కట్టారు" అంది సోఫియా.

"ఐ. సీ." అన్నాడు గోవిందరాయుడు.

"మీరేమయినా పుచ్చుకుంటారా? ఎనీ కూల్ డ్రింక్."

"నాకేమీ వద్దు. అసలే చల్లగా వుందిగదా? మీకు పిల్లలున్నారా?"

"లేరు. అసలు యీ లోకంలో పిల్లలు పుట్టడానికి వీల్లేదు. పిల్లాపాపలు కావాలనుకునేవాళ్ళు భూలోకం వెళ్ళిపోవాలి. అందుకు అనుమతి యిస్తారు."

"అలాగా!....మిసెస్ సోఫియా! నీకు అరుణతార అనే యిండియన్ అమ్మాయి తెలుసా?" ప్రశ్నించాడు గోవిందరాయుడు.

సోఫియా ముఖం సీరియస్‌గా మారిపోయింది.

"నో సర్. మీకేమైనా కావాలా?" అంది మళ్ళీ.

ఆమె చెప్పదని అతనికి తెలుసు. అయినా ఆశ చావక అడిగాడు.

"నో....నాకేమీ అవసరం లేదు" నీరసంగా చెప్పాడు గోవిందరాయుడు.

సోఫియా వెళ్ళిపోయింది.

ఇక్కడ ఎవర్ని ఏమి అడిగినా యెందుకు చెప్పరో అతనికి వచ్చినా అర్థం కాలేదు. " 'నో' తప్ప నోరు మెద పరు" గొణుక్కున్నాడు. —(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page

Regd.no: H/HD-48
PRABHAKAR